
'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 290

గురువారం 10-1-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రాష్ట్రంలోని ప్రతి సమస్య మీదా ఇవాళ నేను పూర్తి అవగాహనతో ఉన్నానని మీ అందరికీ చెప్పగలుగుతున్నాను. అందుకే ప్రతి పేదవాడికీ మంచి చేయాలనే తపన, ఆలోచన నాలో ఉంది. అందుకే నేను మీ అందరినీ ఒకటే కోరుతున్నాను.
ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మారుద్దామని మీ అందరికీ పిలుపు నిస్తున్నాను. తోడుగా కలిసి రమ్మని, మీ బిడ్డను ఆశీర్వదించాలని మిమ్మల్ని అడుగుతున్నాను. మీ అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అందరినీ కోరుకుంటూ నా ఈ ప్రజా సంకల్ప యాత్రను ఇంతటితో ముగిస్తున్నా. ఈ దుర్మార్గపు ప్రభుత్వంపై పోరాటం ఇంతటితో ఆగదు. ఇంకా కొనసాగుతుంది. మరో మూడు నెలల్లో ఎన్నికలు రానున్నాయి. ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని మనందరం కలిసి సాగనంపుదాం.

- ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

బుధవారం పాదయాత్ర ముగింపు సందర్భంగా ఇచ్ఛాపురంలో వైఎస్ జగన్ ఆవిష్కరించిన విజయ సంకల్ప పైలాన్ ఇదే

ఆకాశమంత అభిమానం..

ప్రజాసంకల్ప యాత్ర ఆఖరి ఘట్టానికి పోటెత్తిన జనం

- 'జై జగన్' నినాదాలతో హోరెత్తిన ఇచ్ఛాపురం
- జాతరను తలపించిన దారులు
- ఎటు చూసినా వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలు
- ఇక సమరానికి సిద్ధమంటూ సంకేతాలు

- వివరాలు 5లో

పేదల కోటాకు 'పెద్దల' ఆమోదం

124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం



అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా 165, వ్యతిరేకంగా 7 ఓట్లు

- ఎగువసభలోనూ బిల్లుపై తొలుత అభ్యంతరాలు లేవనెత్తిన విపక్షాలు
- సెలెక్ట్ కమిటీకి పంపాలని పట్టుబట్టడంతో సభలో కాసేపు గందరగోళం
- బిల్లుకు అనుకూలమే కానీ ప్రవేశపెట్టిన విధానంపై అభ్యంతరమని వెల్లడి
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ ఎంపీల నినాదాలు
- అంతిమంగా బిల్లుకు మద్దతు పలికిన విపక్ష సభ్యులు
- రాష్ట్రపతి సంతకంతో బిల్లుకు లభించనున్న చట్టరూపం

13లో

దేశం మార్పువైపు పయనిస్తున్న తరుణంలో ఈ బిల్లు వల్ల యువత అందులో భాగమై అభివృద్ధికి దోహదపడగలరు. ఈ బిల్లుకు ఇంతటి మద్దతు లభించడం నాకు ఆనందం కలిగించింది. బిల్లును ఆమోదించడం ద్వారా రాజ్యాంగ నిర్మాతలకు, స్వాతంత్ర్య సమరయోధులకు పార్లమెంటు నివాళి అర్పించింది.

– ట్విట్టర్‌లో ప్రధాని మోదీ

అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం శ్రద్ధ పెట్టకుండా తీసుకొచ్చింది. బిల్లుకు న్యాయపర అడ్డంకులు తప్పవు. ఇది పార్లమెంటు ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తరువాత కూడా నోట్ల రద్దు మాదిరిగా అమల్లో ఇబ్బందులు తప్పవు. అగ్రవర్ణ పేదలకు సంబంధించిన కచ్చితమైన సమాచారం ప్రభుత్వం వద్ద లేకపోవడమే ఇందుకు కారణం.

– కపిల్ సిబల్



బుధవారం రాత్రి పార్లమెంటు వెలుపల విజయ సంకేతం చూపుతున్న కేంద్ర మంత్రులు విజయ్ గోయెల్, థావర్‌చంద్ గహ్లోత్ తదితరులు

అధర్మంపై యుద్ధమిది

ఇచ్ఛాపురంలో పాదయాత్ర ముగింపు సభలో ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- మరో మూడు నెలల్లో మంచి రోజులొస్తాయి
- ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైంది
- చంద్రబాబు ఓ జిత్తుల మారి, ఓ మాయావి
- ఆయన మోసాలు, ఎల్లో మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి
- వీరితో జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజలు నాకు తోడుగా నిలవాలి
- ప్రజా సంకల్ప యాత్ర ముగింపుతో పోరాటం ఆగదు
- రాజకీయ వ్యవస్థలో మార్పుతెచ్చే వరకూ పోరుబాటే..
- మన ప్రభుత్వం రాగానే పేదలందరికీ మంచి చేస్తాం
- రైతుల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది..
- నవరత్నాలతో అన్ని వర్గాల వారినీ ఆదుకుంటాం

5లో



బుధవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పాదయాత్ర ముగింపు సభలో ప్రసంగిస్తున్న ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



బడ్జెట్ సమావేశాలు 31 నుంచి..

- పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు 2019, జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకూ జరగనున్నాయి. హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం నాడిక్కడ సమావేశమైన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 13లో

ఇంజనీరింగ్ 2.0

భారీ సంస్కరణలకు ఏఐసీటీఈ శ్రీకారం

- నాణ్యతా ప్రమాణాలు, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా చర్యలు
- కాలేజీల అప్రూవల్ పాలసీకి కొత్తగా ఆరు నిబంధనలు
- గతంలో కంటే ఈసారి వినూత్నంగా కాలేజీల అప్రూవల్ విధానం
- ఈనెల 14 నుంచి వచ్చే నెల 3 వరకు కాలేజీల నుంచి దరఖాస్తులు

ఈసారి విద్యార్థుల ఇంటర్న్‌షిప్, టీచర్ ట్రైనింగ్

5 కంపెనీలతో ఒప్పందాలు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ విద్యలో సంస్కరణలకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) శ్రీకారం చుట్టింది. నాణ్యతా ప్రమాణాల పెంపు, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ఇంజనీరింగ్ విద్యలో సమూల మార్పులకు చర్యలు చేపట్టింది. గతంలో ఉన్న నిబంధనలతోపాటు కొత్తగా 6 నిబంధనలను 2019–20 విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తామని ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని పేర్కొంది. ఈ నిబంధనలను అమలుపరిచే కాలేజీలకే వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలు చేపట్టేందుకు గుర్తింపును (అప్రూవల్) ఇస్తామని వెల్లడించింది. దేశవ్యాప్తంగా బీఈ/బీటెక్ కోర్సును నిర్వహించే 3,124 ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు పీజీ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ తదితర 10,400 కాలేజీలన్నీ ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఆయా ఇంజనీరింగ్ కాలేజీలన్నీ ఈనెల 14వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించింది. ఆలస్య రుసుముతో వచ్చే నెల 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించింది.

ఆరు ప్రధానాంశాలపై ప్రత్యేక దృష్టి

ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇప్పటివరకు తగిన ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ, సదుపాయాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఏఐసీటీఈ ఇకపై వాటితోపాటు నాణ్యతా ప్రమాణాలు, ఉపాధి అవకాశాల పెంపుపై ప్రత్యేక దృష్టిసారించింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి చేపట్టే ప్రవేశాల్లో ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఆదేశించింది. విద్యార్థుల ఇంటర్న్‌షిప్,

మిగతా 2వ పేజీలో ▶



సెన్సెక్స్ @ 36,213

లాభాల్లో ప్రపంచ మార్కెట్లు

- క్యూ3 ఫలితాలపై ఆశావహ అంచనాలు
- 232 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 53 పాయింట్లు ఎగసి 10,855 వద్ద ముగిసిన నిఫ్టీ

- వివరాలు 15లో

భళా.. కుంభమేళా...

- ఏర్పాట్లు పూర్తిచేసిన యోగి సర్కార్
- ఇది ప్రపంచంలోనే అతి పెద్దది: ప్రభుత్వం
- 1.25 లక్షల టాయిలెట్లు, 11 తాత్కాలిక ఆసుపత్రులు
- 24 వేల మంది పారామిలటరీ బలగాలతో భద్రత కట్టుదిట్టం

- వివరాలు 2లో

ఇదండీ సంగతి



కంగ్రాట్స్! మీ పొత్తు.. మీ ప్రతిపక్ష పార్టీలన్నీ ఎంతో సంతోషంగా ఆహ్వానిస్తున్నాయ్ సార్!



ఏకగ్రీవం 300+

ముగిసిన తొలి విడత పంచాయతీ నామినేషన్ల ఉపసంహరణ

సాక్షి, హైదరాబాద్: తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 300కుపైగా ఏకగ్రీవం అయినట్లు తెలుస్తోంది. బుధవారంతో ముగిసిన నామినేషన్ల ప్రక్రియ ఆధారంగా.. కడపటి వార్తలందేసరికి 300కుపైగా పంచాయతీల్లో ఒకే నామినేషన్ దాఖలైంది. తొలి విడతలో భాగంగా 4,480 పంచాయతీలు, 39,832 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ప్రక్రియ బుధవారం సాయంత్రం 5 గంటలకే ముగిసినా జిల్లాల నుంచి పూర్తి వివరాలు అందకపోవడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. తొలి దశలో వచ్చిన నామినేషన్ల గణాంకాలను గురువారం వెల్లడిస్తామని అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, వచ్చిన నామినేషన్లను గురువారం పరిశీలించి అర్హులైన అభ్యర్థుల జాబితాలను ప్రకటించనున్నారు. ఏకగ్రీవ పంచాయతీల సంఖ్యపై అదే రోజు స్పష్టత రానుంది. నామినేషన్ల పరిశీలన నిర్ణయాలపై శుక్రవారం అప్పీళ్లను స్వీకరించనున్నారు. ఈ అప్పీళ్లను శనివారం పరిష్కరించనున్నారు. ఆదివారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. అదే రోజు ఎన్నికల పోటీలో మిగిలే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. ఈ నెల 21న తొలి విడత పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

టీడీపీ కథ కంచికే!



టీఆర్ఎస్‌లో విలీనానికి కసరత్తు

- అసెంబ్లీ సమావేశాల్లోపే పనిపూర్తయ్యే చాన్స్
- సండ్ర, మెచ్చాలకు భగీరథ, ట్రైకార్ పదవుల ఆఫర్
- మెచ్చాను ఆపేందుకు చంద్రబాబు ప్రయత్నం
- ఆ తర్వాత కాంగ్రెస్‌పైనే కన్ను
- 13 మంది ఎమ్మెల్యేలను చేర్చుకునేందుకు వ్యూహం
- టచ్‌లో 8 మంది హస్తం పార్టీ శాసనసభ్యులు
- 16 పార్లమెంటు సీట్ల వ్యూహంలో భాగంగానే..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో తెలుగుదేశం పార్టీ కథ కంచికి చేరడం ఖాయమైంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లోపే టీడీపీ అడ్రస్ గల్లంతు చేసేందుకు అధికార టీఆర్ఎస్ వ్యూహం రూపొందించింది. ఆపరేషన్ ఆకర్ష్‌ను మళ్లీ మొదలుపెడుతోంది. ముందుగా టీడీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను చేర్చుకుని ఆ తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై నజర్ పెట్టాలని భావిస్తోంది. ఇప్పటికే ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలను చేర్చుకున్న టీఆర్ఎస్ మిగిలిన పార్టీల వారిని చేర్చుకునే విషయంలోనూ వేగంగానే నిర్ణయాలు తీసుకోనుంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో టీఆర్ఎస్ 88 స్థానాల్లో విజయం సాధించింది. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున గెలిచిన కోరుకంటి చందర్ (రామగుండం), స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన లావుడ్య రాములునాయక్ (వైరా) ఎమ్మెల్యేలు ఇప్పటికే టీఆర్ఎస్‌లో చేరారు. ఆకర్ష్‌లో భాగంగా మొదట టీడీపీ నుంచి గెలిచిన సండ్ర వెంకటవీరయ్య (సత్తుపల్లి), మెచ్చా నాగేశ్వర్‌రావు (అశ్వారావుపేట)లను ఒకేసారి పార్టీలో చేర్చుకోవాలని యోచిస్తోంది. గత అసెంబ్లీలో చేసినట్లుగా ఈసారి టీడీపీ శాసనసభా పక్షాన్ని అధికార పక్షంలో విలీనం చేసేలా వ్యూహం రచించింది. సండ్రకు మిషన్ భగీరథ వైస్ చైర్మన్, మెచ్చాకు గిరిజన ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) చైర్మన్ పదవులు ఇచ్చేందుకు అవకాశముందని సమాచారం.

ఉత్సాహం.. ఊగిసలాట

వాస్తవానికి, తెలంగాణలో టీడీపీ లేకుండా చేయాలనే వ్యూహంతోనే మొదట్నుంచీ టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పావులు కదిపారు. తాజా ఎన్నికల్లో మహాకూటమితో కలిసి 13 చోట్ల పోటీ చేసి రెండు స్థానాల్లో గెలుపొందింది. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరిని పార్టీలో చేర్చుకుంటే అసెంబ్లీ నిబంధనల ప్రకారం కూడా అధికారికంగా టీడీపీ పక్షం టీఆర్ఎస్‌లో విలీనం అవుతుంది. అందుకే ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే అధికార పార్టీ రంగంలోకి దిగి చర్చలు ప్రారంభించింది. దీంతో సండ్ర వెంకటవీరయ్య టీఆర్ఎస్‌లో చేరడం

మిగతా 2వ పేజీలో ▶

'మిషెల్ మామ'తో బంధమేంటి?

కాంగ్రెస్ వివరించాలి

- రఫేల్ డీల్‌లో డసో ప్రత్యర్థి కంపెనీ తరపున మిషెల్ లాబీయింగ్
- కాంగ్రెస్ నిజాలు బయటపెట్టాలని మోదీ డిమాండ్.. షోలాపూర్‌లో పలు ప్రాజెక్టులు ప్రారంభం

- వివరాలు 13లో



కోహ్లి ప్రశంసలే పది వేలు!

- గొప్ప విజయంలో భాగం కావడం గర్వకారణంగా ఉంది: విహారి

స్పోర్ట్స్‌లో

భళా.. కుంభమేళా...

అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన యోగి సర్కార్ • ఫైవ్‌స్టార్ హోటల్స్‌ని తలపించేలా టెంట్ సిటీ

ఇది ప్రపంచంలోనే అతి పెద్దదన్న ప్రభుత్వం

1.25లక్షల టాయిలెట్లు, 11 తాత్కాలిక ఆసుపత్రులు

24వేల మంది పారామిలటరీ బలగాలతో భద్రత కట్టుదిట్టం

ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ అర్ధ కుంభమేళాకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మకర సంక్రాంతి నుంచి మహా శివరాత్రి వరకు సాగే ఈ కుంభమేళాకు కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశారు. జనవరి 15 నుంచి మార్చి 4 వరకు జరిగే ఈ అర్ధ కుంభమేళాలో సాధారణ భక్తులతోపాటు వీఐపీలు, వీవీఐపీలు, ఎన్నారైల కోసం వేర్వేరుగా ఏర్పాట్లు చేసినట్లు ఉత్తరప్రదేశ్ సర్కారు ప్రకటించింది. అలహాబాద్‌ను పేరును ప్రయాగ్‌రాజ్‌గా మార్చిన తర్వాత జరిగే తొలి అర్ధ కుంభమేళా ఇదే. దీంతో యోగి ఆదిత్యనాథ్ సర్కారు కూడా ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసింది. ఈ వేడుకలకు పూర్తిగా కార్పొరేట్ కళను అద్దింది. గంగ, యమున నది ఒడ్డున 100 హెక్టార్ల స్థలంలో అత్యంత ఆధునిక సౌకర్యాలతో 'టెంట్ సిటీ'ని నిర్మించింది. 250 కిలోమీటర్ల పొడవైన రోడ్లు, 22 తాత్కాలిక వంతెనలు, 40 వేల ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసింది. ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్లు వెలిశాయి. కుంభమేళా భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా 1.25 లక్షల టాయిలెట్స్‌ను నిర్మించారు. కుంభమేళా జరిగే ప్రాంతం పరిశుభ్రంగా ఉండటం కోసం 20వేల చెత్తడబ్బాలను ఏర్పాటు చేశారు. ఈ పండుగను అపురూపమైన సాంస్కృతిక వారసత్వ ప్రతీకగా ఇప్పటికే యునెస్కో గుర్తించింది. దేశవ్యాప్తంగా 6 లక్షల గ్రామాలున్నాయని.. ఈ గ్రామాల నుంచి కనీసం ఒక్కొక్కరైనా ఈసారి అర్ధ కుంభమేళాకు హాజరవ్వాలని యోగి సర్కార్ పిలుపునిచ్చింది. మొత్తంగా 71 దేశాల ప్రభుత్వ ప్రతినిధులు ఇప్పటికే త్రివేణి సంగమాన్ని సందర్శించి గంగానదీ తీరంలో తమ దేశాల జెండాలను ఎగురవేశారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులే కాకుండా, పర్యాటకుల్ని కూడా ఆకర్షించేలా ఫైవ్‌స్టార్ హోటల్స్ ఉండే సదుపాయాలతో 2 వేల గుడారాలను ఏర్పాటు చేశారు. ఎన్నారైలు బస చేయడానికి విల్లాలు, మధ్యతరగతి వారికి కాటేజీలు, సామాన్య భక్తుల కోసం డార్మెటరీలు ఇలా అన్ని తరగతుల వారు బస చేసేలా టెంట్ సిటీని రూపొందించారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్



మొత్తం బడ్జెట్ రూ. 4,200 కోట్లు

కుంభమేళా జరిగే గ్రౌండ్ 3,200 హెక్టార్లు

భద్రత కోసం మోహరించే పోలీసులు 20 వేలు

హాజరయ్యే భక్తుల సంఖ్య 15 కోట్లుగా అంచనా

1,100 లైఫ్ గార్డులు

తాత్కాలిక ఆసుపత్రులు 11

ప్రత్యేక ఆకర్షణ: ప్రతీరోజూ లేజర్ లైట్ అండ్ సౌండ్ షో

టెంట్ సిటీ నిర్మాణం: 100 హెక్టార్ల స్థలం, 250 కి.మీ. పొడవైన రహదారులు, 2 వేల గుడారాలు

పుణ్యస్నానాలు ఎప్పుడెప్పుడు

- జనవరి 15 మకరసంక్రాంతి
- జనవరి 21 పుష్య పౌర్ణమి
- ఫిబ్రవరి 4 మౌని అమావాస్య
- ఫిబ్రవరి 10 వసంత పంచమి
- ఫిబ్రవరి 19 మాఘ పౌర్ణమి
- మార్చి 4, మహాశివరాత్రి

రోజుల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

అడుగడుగునా భద్రత



ప్రతీరోజూ లక్షల్లో భక్తులు వస్తారు కాబట్టి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. 1,150 సీసీకెమెరాలు, 40 పోలీసు స్టేషన్లు, 62 పోలీసు పోస్టులు ఏర్పాటు చేశారు. 22,000– 24,000 మంది పారామిలటరీ జవాన్లు పహారా కాస్తారు.

11 తాత్కాలిక ఆసుపత్రులు




భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా.. ఇబ్బందులు ఎదురుకాకుండా 11 తాత్కాలిక ఆసుపత్రులు నిర్మించారు. 100 పడకల ఆసుపత్రి, 30 పడకల ఆసుపత్రులు ఇందులో ఉన్నాయి. 170 మంది వైద్యులు, 100మంది నర్సులు సేవలందిస్తారు. 100 అంబులెన్స్‌లు, 4 ఎయిర్ అంబులెన్స్‌లు 24 గంటలు అందుబాటులో ఉంటాయి.

కుంభమేళా అంటే!

ప్రతీ పన్నెండేళ్లకు ఒకసారి భక్తులంతా త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించే పుణ్య కార్యక్రమమిది. కుంభరాశిలో ఈ ఉత్సవం జరుగుతుంది. అందుకే దీనిని కుంభమేళా అని పిలుస్తారు. ప్రతీమూడేళ్లకి ఒకసారి హరిద్వార్, ప్రయాగరాజ్, ఉజ్జయిని, నాసిక్‌లలో కుంభమేళా జరుగుతుంది. అంటే పన్నెండేళ్లకి ఒకసారి ఒక్కో పట్టణంలో నిర్వహించడానికి అవకాశం వస్తుంది. ఆరేళ్లకోసారి జరిగే వేడుకని అర్ధ కుంభమేళా అని, పన్నెండేళ్లకు ఒకసారి జరిగే ఉత్సవాన్ని పూర్ణ కుంభమేళా అని, 144 ఏళ్లకు ఒకసారి జరిగే వేడుకల్ని మహా కుంభమేళా అని పిలుస్తారు. సూర్యుడు, బృహస్పతుల గతుల ఆధారంగా ఈ వేడుకలు నిర్వహిస్తారు. మేషరాశిలో బృహస్పతి, మాఘమాసంలో మకరరాశిలోకి సూర్యుడు, చంద్రుడు ప్రవేశించినప్పుడు ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా జరుగుతుంది. ఇప్పుడు నిర్వహిస్తున్నది ఆరేళ్లకి ఒకసారి జరిగే అర్ధకుంభమేళా. కుంభమేళా జరిగే సమయంలో మకర సంక్రాంతి, మాఘ పుష్య పౌర్ణమి, మహాశివరాత్రి వంటి పర్వదినాల్లో గంగ, యమున, సరస్వతి సంగమించే త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తే సర్వపాపాలు తొలగిపోతాయని, పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. సంక్రాంతి, వసంత పంచమి, మాఘ పౌర్ణమి, మహాశివరాత్రి వంటి కొన్ని ప్రత్యేకమైన దినాల్లోనే భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు.



ఒక రాత్రి బసకే రూ. 40 వేలు



కుంభమేళా కోసం వచ్చే భక్తులు బస చేయడం కోసం ఇంద్రప్రస్థం, కల్పవృక్ష, కుంభ కాన్వాస్, వేదిక్ టెంట్‌సిటీ పేరుతో గుడారాలు నిర్మించారు. ఇంద్రప్రస్థం విల్లాలో ఒక రాత్రి బసకే రూ.40 వేలు వసూలు చేయనున్నారు. రెండు బెడ్‌రూమ్‌లు, ఒక లివింగ్ రూమ్, అటాచ్డ్ బాత్‌రూం సౌకర్యం ఉండే ఈ విల్లాల నుంచి గంగానది అందాలను వీక్షించవచ్చు. ఈ టెంట్ సిటీలో 200 లగ్జరీ టెంట్స్, 250 డీలక్స్ టెంట్స్ కూడా ఉన్నాయి. లగ్జరీ టెంట్స్‌లో ఒక రాత్రి బసకి రూ.16వేలు, డీలక్స్ టెంట్స్ రూ.12 వేలు వసూలు చేస్తారు. ఇక డార్మెటరీల్లో 650 రూపాయల నుంచి ఉన్నాయి.

లాహిరి లాహిరిలో..

పర్యాటకరంగాన్ని ప్రోత్సహించేందుకు యోగి సర్కార్ ఈసారి కుంభమేళాలో ప్రత్యేకంగా పడవ ప్రయాణాన్ని ఏర్పాటు చేసింది. కాశీ నుంచి త్రివేణీ సంగమానికి భక్తులు పడవల్లోనే చేరుకోవచ్చు. గంగానదీ అందాలను ఆస్వాదిస్తూ 60 కిలోమీటర్ల దూరాన్ని గంటలోపే చేరుకోవచ్చు. ఇందుకోసం గంటకి 80 కిలోమీటర్ల వేగంతో నడిచే ఎయిర్‌బోట్లను ఏర్పాటు చేసింది. ఈ పడవల కోసం కాశీలో కాళీఘాట్, సరస్వతి ఘాట్, నైని బ్రిడ్జ్, సుజావన్ ఘాట్‌లను సిద్ధం చేసింది. సీఎల్ కస్తూర్బా, ఎస్ఎల్ కమ్లా అనే పెద్ద పడవలతో పాటు భక్తుల రద్దీని బట్టి పలు చిన్న పడవలు రెండు పుణ్యక్షేత్రాల మధ్య తిరుగుతాయి.

తెలంగాణ ఈఆర్సీ ఖాళీ

బుధవారం పదవీ విరమణ చేసిన చైర్మన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్సీ) చైర్మన్ ఇస్మాయిల్ అలీఖాన్ బుధవారం పదవీ విరమణ చేశారు. దీంతో ఈఆర్సీ మొత్తం ఖాళీ అయింది. ఈఆర్సీ బెంచ్‌లో చైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులు ఉండగా, సభ్యులు ఎల్.మనోహర్‌రెడ్డి 2016 ఆగస్టు 7న, హెచ్.శ్రీనివాసులు 2018 ఏప్రిల్ 7న పదవీ విరమణ చేశారు. వారి స్థానంలో ప్రభుత్వం కొత్త సభ్యులను ఇప్పటివరకు నియమించలేదు. నిబంధనల ప్రకారం చైర్మన్ పదవీ విరమణకు 3 నెలల ముందే కొత్త చైర్మన్ ఎంపిక ప్రక్రియను చేపట్టాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆలస్యం చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం గత నెల 28న ఈఆర్సీ చైర్మన్, ఇద్దరు సభ్యుల ఎంపిక కోసం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా నేతృత్వంలో ఎంపిక కమిటీని ఏర్పాటు చేసింది. ఈఆర్సీ చైర్మన్, సభ్యుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ కమిటీ అదే రోజు నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుల గడువు గురువారంతో ముగియనుండగా, 25వ తేదీ వరకు పొడిగిస్తూ తాజాగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఈఆర్సీ చైర్మన్ పదవి కోసం 8 మంది, సభ్యుల పోస్టు కోసం 10 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారవర్గాలు వెల్లడించాయి. దరఖాస్తు ప్రక్రియ పూర్తి అయిన తర్వాత కొత్త చైర్మన్, సభ్యులను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించే నాటికి మరో నెల రోజులు పట్టవచ్చని ఇంధన శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

ఆన్‌లైన్‌లో జనన, మరణ వివరాల నమోదు

సాక్షి, హైదరాబాద్: జనన, మరణ నమోదు వివరాలను ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. వీటి నమోదు కోసం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక పోర్టల్‌ను కూడా రూపొందించింది. ఇప్పటిదాకా జనన, మరణాల నమోదును స్థానిక సంస్థలు నమోదు చేసేవి. ఆస్పత్రిలో జన్మించగానే ఆ వివరాలను గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలకు ఆయా ఆస్పత్రి యాజమాన్యం పంపుతాయి. అక్కడ నుంచి జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాల్సి ఉంటుంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వీటి నమోదు సక్రమంగానే ఉన్నా గ్రామాల్లో సరిగా జరగకపోవడంతో జనాభా లెక్కింపు సమయంలో ఇబ్బంది తలెత్తుతోంది. ప్రస్తుతం జననాలు 92% ఆస్పత్రిలోనే జరుగుతున్నాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులే నేరుగా జనన నమోదును చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం ebirth.telangana.gov.in పోర్టల్‌ను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది.

వచ్చే 3 రోజులు రాష్ట్రంలో చలిగాలులు

సాక్షి, హైదరాబాద్: రాగల మూడు రోజులు తెలంగాణలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రధానంగా ఉత్తర/ఈశాన్య దిశల నుండి వీస్తున్న గాలుల కారణంగా ఆదిలాబాద్, కొమురం భీం, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో చలిగాలుల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించింది. బుధవారం మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో కనిష్టంగా 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపింది.

రూ.కోటి విదేశీ కరెన్సీ పట్టివేత

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం అర్ధరాత్రి వివిధ దేశాలకు చెందిన కరెన్సీ భారీ మొత్తంలో పట్టుబడింది. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్‌పర్వేజ్ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఈకే 525 విమానంలో దుబాయ్ వెళ్లడానికి డిపార్చుర్‌లోని చెకింగ్‌లోకి వచ్చాడు. సీఐఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ వరుణ్‌కుమార్ చేపట్టిన తనిఖీల్లో అతడి వద్ద 16,500 యూఎస్ డాలర్లు, యూఏఈకి చెందిన 37,950 దరమ్స్, ఖతార్–52,450 రియాళ్లు, ఒమన్–4,265 రియాళ్లు, సౌదీ–2,99,100 రియాళ్లు, కువైట్–2,125 దినార్లు, బహ్రెయిన్–2,325 దినార్లు లభించాయి. వీటి మొత్తం విలువ ఇండియన్ కరెన్సీలో రూ.1,02,53,105 ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఎలాంటి ఆధారాలూ లేకుండా ప్రయాణికుడు వీటిని తరలిస్తుండటంతో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు.

ఫిర్యాదులకు సర్క్యూట్ బెంచ్

28 నుంచి ఫిబ్రవరి 8 వరకు జాతీయ వినియోగదారుల కమిషన్ నేతృత్వంలో ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సంబంధించి జాతీయ వినియోగదారుల కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్న వినియోగదారుల ఫిర్యాదుల అప్పీలు, రివిజన్ పిటిషన్లపై విచారణ జరిపేందుకు జాతీయ వినియోగదారుల వివాదాల, రిడ్రెసల్ కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) హైదరాబాద్‌లో సర్క్యూట్ బెంచ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 8 వరకు ఆదర్శనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో వినియోగదారుల భద్రతా చట్టం, 1986 ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ చేపట్టనుంది. కేసుల పరిష్కారానికి జాతీయ కమిషన్ అధ్యక్షుడు ఆర్.కె.అగర్వాల్ నేతృత్వంలో విచారణ చేపట్టనున్నారు. వినియోగదారుల కేసులకు సంబంధించి నెల రోజుల ముందు నోటీసులు అందుకున్నవారు ఈ సర్క్యూట్ బెంచ్ ముందు హాజరుకావాల్సి ఉంటుంది. కోటి రూపాయలు అంతకు పైబడిన ఫిర్యాదులను కూడా ఈ సర్క్యూట్ బెంచ్ వద్ద నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. రెండు రాష్ట్రాలకు సంబంధించి కొత్త అప్పీళ్లు, రివిజన్ పిటిషన్లను నేరుగా ఈ సమయంలో దాఖలు చేసుకోవచ్చు. వినియోగదారులు తమ ఫిర్యాదుల పరిష్కారాల కోసం ఢిల్లీ వరకు వెళ్లకుండా ఆయా రాష్ట్రాల్లోనే పరిష్కారమయ్యేలా జాతీయ కమిషన్ సర్క్యూట్ బెంచ్‌లను ఏర్పాటు చేస్తోంది. గతంలో జాతీయ కమిషన్ కేసుల విచారం కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, పుణే, కొచ్చిన్, అహ్మదా బాద్, భోపాల్, నాగ్‌పూర్, చండీఘడ్, జైపూర్, లఖ్‌నవ్, కోల్‌కతాల్లో సర్క్యూట్ బెంచ్‌లను ఏర్పాటు చేసింది.

టీడీపీ కథ కంచికే!

▶ మొదటి పేజీ తరువాయి

ఖాయమంటూ 15రోజుల క్రితమే వార్తలు వచ్చాయి. మరో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కూడా చర్చలు జరుగుతున్నాయని, అయితే, ఆయన కొంత ఊగిసలాటలో ఉన్నారని చర్చ జరిగింది. ఆ తర్వాత కూడా టీఆర్ఎస్ నేతల సంప్రదింపులతో మెత్తబడ్డారని తెలుస్తోంది.

చంద్రబాబు ఒత్తిడి తెచ్చినా!

టీఆర్ఎస్‌లో చేరేందుకు మొదట్నుంచీ సిద్ధంగానే ఉన్న సండ్ర మంత్రి పదవి లభిస్తే బాగుంటుందని భావించారు. తనతో పాటు మెచ్చాను కూడా టీఆర్ఎస్‌లోకి తీసుకెళ్లడం ద్వారా కేసీఆర్ నుంచి ఆ మేరకు హామీ తీసుకోవచ్చనుకున్నారు. తన నియోజకవర్గంలో కార్యకర్తలు, నేతలతో సమావేశమై వారిని కూడా పార్టీ మారేందుకు మానసికంగా సిద్ధం చేశారు. కానీ, మెచ్చా మొదట్లో ససేమిరా అన్నారు. తాను ఎట్టి పరిస్థితుల్లో పార్టీలోనే ఉంటానంటూ అమరావతికి వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి వచ్చారు. పార్టీ మారొద్దంటూ మెచ్చాపై చంద్రబాబు ఒత్తిడి తీసుకువచ్చారు. సండ్ర వెళ్లినా టీడీపీలోనే ఉంటే ఆయన స్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యునిగా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో మెచ్చా కొంత మెత్తబడ్డట్టు కనిపించింది. అయితే, టీఆర్ఎస్ నేతల చర్చలతో పాటు నియోజకవర్గ నేతలు కూడా టీఆర్ఎస్‌లోకి వెళ్లాలని, అయితే, ఎవరిపై ఆధారపడకుండా స్వతంత్రంగానే పార్టీలోకి వెళ్లాలని మెచ్చాకు సూచించారు. ఈ నేపథ్యంలో స్థానిక నేతల సూచన, ఖమ్మం జిల్లా టీఆర్ఎస్ ముఖ్య నేతల ఒత్తిడి మేరకు ఆయన కూడా చివరకు ఓకే చెప్పేశారని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన ఉంటుందనే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జరుగుతుండటం గమనార్హం.

8 మంది కాంగ్రెస్ సభ్యులు కూడా..

టీడీపీ శాసనసభా పక్ష విలీనం పూర్తి కాగానే.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై చేరిక వ్యూహాన్ని అమలు చేసేందుకు అధికార పార్టీ అంతా సిద్ధం చేసింది. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ 19 స్థానాలు గెలుచుకుంది. వీరిలో 8మంది ఎమ్మెల్యేలు ఇప్పటికే టీఆర్ఎస్ అధిష్టానంతో సంప్రదింపులు జరుగుపుతున్నారు. అయితే ఒక్కొక్కరు చొప్పున కాకుండా ఒకేసారి కాంగ్రెస్ శాసనసభా పక్షాన్ని విలీనం చేసే దిశగా టీఆర్ఎస్ వ్యూహం రచించింది. కాంగ్రెస్ తరపున గెలిచిన వారిలో 13 మంది ఒకేసారి టీఆర్ఎస్‌లో చేరితే న్యాయపరమైన ఇబ్బందులు ఏమీ ఉండవు. దీంతో ఒకేసారి ఆ మేరకు టీఆర్ఎస్‌లో చేర్చుకునేలా ప్రణాళిక పూర్తవుతోంది. జనవరి 17నుంచి అసెంబ్లీ సమావేశాలు మొదలవుతున్న నేపథ్యంలో ఆలోపే.. టీడీపీ ఎమ్మెల్యేల చేరిక జరగొచ్చని టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. బడ్జెట్ సమావేశాలలోపు కాంగ్రెస్ శాసనసభా పక్షం విలీనం జరగొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

16 ఎంపీ సీట్ల గెలుపు లక్ష్యం

జాతీయ రాజకీయాల్లో గుణాత్మకమార్పు లక్ష్యంగా కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌ను నిర్మించే పనిలో ఉన్నారు. తెలంగాణలోని 17 లోక్‌సభ సీట్లలో మజ్లిస్ ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ మినహా మిగిలిన 16 స్థానాలను గెలుచుకోవాలని టీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకారం ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలలో మాత్రమే టీఆర్ఎస్ వెనుకబడింది. ఖమ్మం లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో ఒక్క స్థానం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో మూడు స్థానాలు మాత్రమే వచ్చాయి. ఈ రెండు లోక్‌సభ సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎనిమిది, టీడీపీ రెండు అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్నాయి. 16 ఎంపీ సీట్లలో గెలుపు లక్ష్యంగా పెట్టుకున్న టీఆర్ఎస్‌కు ఈ రెండు లోక్‌సభ సెగ్మెంట్లలో ఇబ్బందులున్నాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలోని కాంగ్రెస్‌కు చెందిన 8మంది ఎమ్మెల్యేలతో ఇప్పటికే సంప్రదింపులు జరుపుతోంది. లోక్‌సభ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ సభ్యులను చేర్చుకునేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వీరితోపాటు మిగిలిన జిల్లాల్లోని 5గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటే సాంకేతికంగా ఇబ్బందులు ఉండబోవని భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికలలో గెలుపు లక్ష్యంగా వీలైనంత త్వరగా కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేల చేరికను పూర్తి చేసేందుకు టీఆర్ఎస్ అన్ని ఏర్పాట్లు చేసుకుంటోంది.

ఇంజనీరింగ్ సిలబస్‌లో మార్పులు చేయాలి

ఏఐసీటీఈకి లేఖ రాసిన ఏఐఎఫ్ఎస్ఎఫ్‌టీఐ

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కోర్సుల్లో సిలబస్‌పై మార్పులు చేయాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ), తెలంగాణ సీఎం, విద్యా శాఖలకు ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఏఐఎఫ్ఎస్ఎఫ్‌టీఐ) బుధవారం లేఖ రాసింది. ఏఐసీటీఈ ప్రతిపాదించిన నిబంధనల ప్రకారం ఇంజనీరింగ్ కాలేజీల్లో సిలబస్‌ను అమలు చేయాలని లేఖలో కోరింది. అలాగే కోర్సులు, సిలబస్‌లలో కొన్ని మార్పులు చేయాలని సూచించింది. డిప్లొమా, యూజీ, పీజీ కోర్సులలోని సిలబస్‌లో కొన్ని అంశాలను చేర్చాలని తెలిపింది. అందులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్ చైన్, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్, డేటా సైన్సెస్, సైబర్ సెక్యూరిటీ, త్రీడీ యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, ఎయిరోస్పేస్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ టెక్నాలజీ, ఎయిర్ క్రాఫ్ట్ మెయింటేనింగ్ ఇంజనీరింగ్, ఎయిర్‌లైన్ మేనేజ్‌మెంట్, వర్చువల్ రియాలిటీ, ఫిషరీస్ ఇంజనీరింగ్, ఫుట్‌వేర్ టెక్నాలజీ, జియో ఇన్‌ఫ్రామెటిక్స్, మెరైన్ ఇంజనీరింగ్, మెరైన్ టెక్నాలజీ, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, ప్లాస్టిక్ ఇంజనీరింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ గ్రీన్ టెక్నాలజీస్, తదితరాలను చేర్చాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం 2018–19 విద్యాసంవత్సరానికి కోర్సులను ప్రవేశపెట్టడంలో జేఎన్టీయూ హైదరాబాద్, కొన్ని లోకల్ యూనివర్సిటీలు విఫలమయ్యాయి. ఏఐసీటీఈ చేసిన ప్రతిపాదన ప్రకారం 2019–20 విద్యాసంవత్సరానికైనా అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యాశాఖలు కృషి చేయాలని ఏఐఎఫ్ఎస్ఎఫ్‌టీఐ జనరల్ సెక్రటరీ కేవీకే రావు అభిప్రాయపడ్డారు.

ఇంజనీరింగ్ 2.0

▶ మొదటి పేజీ తరువాయి


ఫ్యాకల్టీ నిరంతరం అప్‌గ్రేడ్ అయ్యేలా శిక్షణ, ఒక్కో కాలేజీ కనీసంగా 5 కంపెనీలతో ఒప్పందాలు, ప్రతి కాలేజీలో క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఏర్పాటు, ఇంజనీరింగ్ విద్యపై అవగాహన పెంపొందించడంతోపాటు వారిలో సృజనాత్మక ఆలోచన విధానాన్ని పెంపొందించేలా పరీక్షల్లో సంస్కరణలు అమలు చేయాలని స్పష్టం చేసింది.

ఇనిస్టిట్యూషన్ ఇండస్ట్రీ సెల్

ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి రెండో సెమిస్టర్ నుంచి ఇంజనీరింగ్ పూర్తయ్యేలోగా 600 నుంచి 700 గంటల ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టును కచ్చితంగా చేయాలి. ఇందుకు 14 నుంచి 20 వరకు క్రెడిట్స్‌ను అమలు చేయాలి. కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా కంపెనీ అవసరాలు తెలియడంతోపాటు విద్యార్థుల సామర్థ్యాలను కంపెనీ ప్రత్యక్షంగా తెలుసుకునే వీలు కలుగుతుంది. తద్వారా వారికి తగిన శిక్షణ ఇచ్చి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ఎక్కువ అవకాశాలు కల్పించే వీలు ఏర్పడుతుంది. ఎప్పటికప్పుడు సమన్వయం చేసేందుకు, విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు 'ఇనిస్టిట్యూషన్ ఇండస్ట్రీ సెల్'ను ప్రతి కాలేజీలో కచ్చితంగా ఏర్పాటు చేయాలి. విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చర్యలు చేపట్టాలి.

అధ్యాపకులకు శిక్షణ

అధ్యాపకులు నిరంతరం ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై అప్‌గ్రేడ్ కావాలి. అందుకోసం వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. కొత్తగా నియమించే ఫ్యాకల్టీతోపాటు అప్పటికే ఉన్న ఫ్యాకల్టీకి శిక్షణ ఇవ్వాలి. ఫ్యాకల్టీలో బోధన నైపుణ్యాలు, లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించేలా ఈ కార్యక్రమాలు ఉండాలి. కొత్తగా ఫ్యాకల్టీగా నియమితులయ్యే వారికి ఏడాదిపాటు ప్రొబేషన్ పీరియడ్ అమలు చేయాలి. అధ్యాపకులకు శిక్షణ 450 గంటల నుంచి 480 గంటల వరకు నిర్వహించాలి.



అంతర్గత నాణ్యతకు భరోసా

కాలేజీలో విద్యాబోధనలో నాణ్యత ప్రమాణాల పెంపునకు చేపట్టాల్సిన చర్యలపై ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఎప్పటికప్పుడు పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. కాలేజీకి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు లభించేందుకు అవసరమైన అన్ని చర్యలు ఈ సెల్ ఆధ్వర్యంలో చేపట్టాలి. అలాగే ప్రతి బ్రాంచి నేషనల్ బోర్డు ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టాలి.

కంపెనీలతో ఒప్పందాలు

కాలేజీలు ప్రతి ఇండస్ట్రీ భాగస్వామ్యం ఉండేలా అవగాహన ఒప్పంద విధానాన్ని అమలు చేయాలి. ప్రతి కాలేజీ కనీసంగా ఐదు కంపెనీలతో ఒప్పందాలు కలిగి ఉండాలి. వాటిల్లో తమ కాలేజీ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలి. కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి.

స్పోర్ట్స్ సదుపాయాలు

విద్యార్థుల్లో మానసిక, శారీరక ఎదుగుదలకు ఉపయోగపడే క్రీడలను కచ్చితంగా కరికులంలో అమలు చేయాలి. అందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలి.

పరీక్షల్లో సంస్కరణలు

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పరీక్షల సంస్కరణలు అమలు చేయాలి. అందుకు అనుగుణంగా సిలబస్‌ను మార్చుకోవాలి. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించేలా అవకాశాలు కల్పించాలి. ఇందుకోసం ఓపెన్ బుక్ పరీక్ష విధానం అమల్లోకి తేవాలి. విద్యార్థులు బట్టీపట్టి పరీక్షలు రాయడం కాకుండా విషయం ఆధారితంగా ఆలోచించి పరిష్కారాలు చూపేలా ప్రశ్నల సరళిని అమలు చేయాలి. విద్యార్థుల్లో వృత్తి పరమైన నైపుణ్యాలు పెంపొందించేలా చర్యలు చేపట్టాలి.

రెండు రిజర్వాయర్లకు బ్రేక్

- దేవాదులలోని మల్కాపూర్, పాలమూరులోని లక్ష్మీదేవునిపల్లి ఆపాలని సర్కారు నిర్ణయం
- నిధుల భారం దృష్ట్యా కొద్దికాలం పనులకు బ్రేక్ వేసినట్లు అంచనా
- దేవాదుల మూడో దశ టన్నెల్ తవ్వకపు పనులు మరో ఏజెన్సీకి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టుల్లో భాగంగా చేపడుతున్న రెండు రిజర్వాయర్ల పనులను తాత్కాలికంగా పక్కనపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేవాదులలో భాగంగా నిర్మిస్తున్న మల్కాపూర్, పాలమూరు-రంగారెడ్డిలో భాగంగా నిర్మిస్తున్న లక్ష్మీదేవునిపల్లి రిజర్వాయర్ పనులను ప్రస్తుతం చేపట్టరాదని నీటిపారుదల శాఖకు స్పష్టమైన సంకేతాలు వచ్చినట్లుగా తెలిసింది. ఆయా ప్రాజెక్టుల పరిధిలో ఇతర పనుల పూర్తికి భారీ నిధుల అవసరాలు ఉండటం, ఆ పనులు పూర్తయితే కానీ ఈ రిజర్వాయర్లతో ఉపయోగం లేదని భావించిన ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయించినట్లుగా విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

అంతా సిద్ధం..ఆలోపే నిశ్శబ్దం..

గోదావరి జలాలను వినియోగించుకునేందుకు చేపట్టిన దేవాదుల ప్రాజెక్టులో అదనపు నీటి నిల్వలు పెంచేందుకు కొత్త రిజర్వాయర్ నిర్మాణం చేయాలని సీఎం కేసీఆర్ తొలినుంచీ చెబుతున్నారు. సీఎం సూచనలకు అనుగుణంగా 10.78 టీఎంసీల సామర్థ్యంతో, రూ.3,672 కోట్లతో వరంగల్ జిల్లా ఘనపూర్ మండలం లింగంపల్లి వద్ద దీన్ని నిర్మించాలని నీరుపారుదల శాఖ నిర్ణయించింది. గోదావరికి వరద ఉండే మూడు నెలల కాలంలో ధర్మసాగర్ నుంచి నీటిని రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసేలా దీన్ని డిజైన్ చేసింది. ఈ రిజర్వాయర్‌తో 4,060 ఎకరాల మేర ముంపు ఉంటుందని తేల్చింది. నీటిని ఎత్తిపోసేందుకు 72 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతుందని, ఏటా విద్యుత్ ఖర్చు రూ.67.55 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేసింది. రిజర్వాయర్‌ను రెండున్నరేళ్లలో పూర్తి చేసేలా ఇటీవలి రాష్ట్ర ఎన్నికలకు ముందు ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులకు సిద్ధమైంది. అయితే దేవాదులలోని మూడో ఫేజ్‌లోని మూడో దశ పనుల్లో సొరంగం పనులు ఇంకా ఎక్కడివక్కడే ఉన్నాయి. ఇది పూర్తయితే కానీ 25 టీఎంసీల మేర నీటిని వినియోగించుకునే అవకాశం లేదు. ఇక్కడ 49 కి.మీ. సొరంగం పనుల్లో 42 కి.మీలు పూర్తికాగా మరో 7కి.మీలు పెండింగ్‌లో ఉంది. ఈ పనులను ప్రస్తుత ఏజెన్సీతో పూర్తి చేయడం సాధ్యం కాకపోవడంతో మరో ఏజెన్సీతో పనులు చేయించాలని సీఎం ఆదేశించారు. ఈ పనుల పూర్తికే మరో రెండేళ్లు పట్టనుంది. నిధుల అవసరాలు భారీగా ఉండనున్నాయి. ఈ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం గట్టిగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుపై మరింత ఆర్థిక భారం వేయరాదన్న భావనలో ఉన్న ప్రభుత్వం, మల్కాపూర్ రిజర్వాయర్‌ను కొద్దికాలం పక్కనపెట్టాలని నిర్ణయించినట్లుగా నీటిపారుదల వర్గాలు చెప్పాయి.



లక్ష్మీదేవునిపల్లిపై అదే మౌనం..

ఇక 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ నగరానికి తాగునీరు, పరిశ్రమలకు నీటివసతిని కల్పించే ఉద్దేశంతో రూ.35,200 కోట్ల వ్యయంతో పాలమూరు ప్రాజెక్టును చేపట్టగా ఇందులో నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్, కేపీ లక్ష్మీదేవునిపల్లి వద్ద రిజర్వాయర్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో రంగారెడ్డిలో నిర్మించే కేపీ లక్ష్మీదేవునిపల్లి మినహా ప్రాజెక్టులోని ఐదు రిజర్వాయర్లు, వాటికి అనుసంధానంగా నిర్మించే టన్నెల్, కాల్వల పనులను 18 ప్యాకేజీలుగా విభజించి, మొత్తంగా రూ.30 వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచి రెండున్నరేళ్ల కిందటే పనులు ప్రారంభించారు. అయితే రెండున్నరేళ్లుగా ఉద్దండాపూర్ నుంచి కేపీ లక్ష్మీదేవునిపల్లి అనుసంధాన ప్రక్రియ, రిజర్వాయర్ నిర్మాణంపై స్పష్టత రాలేదు. 2.80 టీఎంసీల సామర్థ్యంతో రూ.915 కోట్లతో దీని అంచనాలు సిద్ధం చేసినా టెండర్లు మాత్రం పిలవలేదు. అయితే ప్రస్తుతానికి పాలమూరు ప్రాజెక్టులో ఉద్దండాపూర్ వరకు పనులను వేగిరం చేయాలని సూచించిన ప్రభుత్వం, ఆ పనులు పూర్తయ్యాకే లక్ష్మీదేవునిపల్లిని చేపట్టాలనే సంకేతాలిచ్చింది. ఎగువ పనులు పూర్తవ్వాలంటే మరో రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. అవి పూర్తయితేకానీ లక్ష్మీదేవునిపల్లి చేపట్టే అవకాశం లేదు.



ఫిబ్రవరి 20 నుంచి ఓపెన్ డిగ్రీ పరీక్షలు

హైదరాబాద్: డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 20 నుంచి నిర్వహించనున్నామని అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు వర్సిటీ పోర్టల్‌లో లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు వారి సంబంధిత అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

డిగ్రీలో డిమాండ్ ఉన్న కోర్సులకే అనుమతులు!

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభించే కోర్సులకే వచ్చే విద్యా సంవత్సరంలో కొత్తగా అనుమతులివ్వాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫుడ్ టెక్నాలజీ వంటి డిమాండ్ ఉన్న కొత్త కోర్సులకు, బీకాం, బీఎస్సీ వంటి కోర్సుల్లో సీట్ల పెంపునకు అనుమతులు ఇచ్చేలా కసరత్తు చేస్తోంది. డిమాండ్ లేని కోర్సులకు అనుమతులివ్వద్దని భావిస్తోంది. దానివల్ల సీట్లు అధికంగా ఉంటున్నాయే తప్ప పెద్దగా ప్రయోజనం ఉండట్లేదని, సీట్లు మిగిలిపోతున్నాయన్న భావనకు వచ్చింది.

50 సీట్లతో బీబీనగర్ ఎయిమ్స్

- మూడు బ్యాచ్‌ల తర్వాతే 100 ఎంబీబీఎస్ సీట్లు
- మౌలిక సదుపాయాలు, నిర్మాణం ఆలస్యమే కారణం
- మూడేళ్లకు అందుబాటులోకి రానున్న ఎయిమ్స్



సాక్షి, హైదరాబాద్: బీబీనగర్ ఎయిమ్స్ తొలుత 50 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభం కానుంది. వాస్తవానికి 100 సీట్లు రావాల్సి ఉన్నా.. మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఎయిమ్స్ పూర్తిస్థాయిలో రూపుదిద్దుకునేందుకు మూడేళ్ల సమయం పడుతుండటంతో తక్కువ సీట్లతోనే ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. మూడు బ్యాచ్‌ల వరకు కూడా 50 ఎంబీబీఎస్ సీట్లే అందుబాటులో ఉండనున్నాయి. ఎయిమ్స్ పూర్తిగా ఉనికిలోకి వచ్చాక 100 ఎంబీబీఎస్ సీట్లకు పెంచుతారు. 2019–20 వైద్య విద్య సంవత్సరానికి ఇప్పటికే ఎయిమ్స్ ఎంబీబీఎస్‌కు నోటిఫికేషన్ జారీ అయిన సంగతి తెలిసిందే. అందుకు ప్రత్యేకంగా దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్ష జరగనుంది. ఎంపికైన విద్యార్థులకు తరగతి గదులు, లైబ్రరీ, హాస్టల్ వసతి ప్రస్తుతమున్న నిమ్స్ భవనాల్లోనే నిర్వహిస్తారు. నిమ్స్ ఆసుపత్రిని ఎయిమ్స్‌కు అప్పగించాక దాని అనుబంధంగానే ఎంబీబీఎస్ విద్యార్థులకు శిక్షణ ఉంటుంది.

సూపర్ స్పెషాలిటీపైనే ప్రధాన దృష్టి..

రూ.1,028 కోట్లతో బీబీనగర్‌లో ఎయిమ్స్‌ను 45 నెలల్లోగా నెలకొల్పాలని కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే. 750 పడకలతో ఆసుపత్రి నెలకొల్పుతారు. రోజుకు 1,500 మంది ఔట్ పేషెంట్లు వచ్చే అవకాశముంది. తాత్కాలికంగా అద్దె భవనాలు, ఇప్పటికే అక్కడున్న నిమ్స్ భవనాల్లో ఎయిమ్స్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. అక్కడ ఏర్పాటు చేసే మెడికల్ కాలేజీలో 100 ఎంబీబీఎస్ సీట్లతో పాటు, 60 బీఎస్సీ నర్సింగ్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. అలాగే 15 నుంచి 20 వరకు సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్ సీట్లు వస్తాయి. ఇక్కడ ప్రధానంగా ఎంబీబీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల కంటే కూడా సూపర్ స్పెషాలిటీ కోర్సుల పైనే ఎయిమ్స్ దృష్టి పెడుతుందంటున్నారు. పైగా మెడికల్ రంగంలో పరిశోధనలు ప్రోత్సహిస్తారు. జాతీయ అంతర్జాతీయ సెమినార్లు, వివిధ దేశాల్లో జరిగే సెమినార్లకు విద్యార్థులు, ప్రొఫెసర్లు వెళ్లేలా ఏర్పాటు చేస్తారు.

స్థానికులకు అవకాశాలు లేనట్టే..

బీబీనగర్ ఎయిమ్స్‌లో అనేక రకాల స్పెషలిస్టు వైద్యులుంటారు. నిపుణులైన ఇతర వైద్య సిబ్బంది ఉంటుంది. కేంద్రం వెల్లడించిన లెక్కల ప్రకారం 3 వేల మంది వైద్యులు, వైద్య సిబ్బంది, ఇతర సిబ్బందిని నియమిస్తారు. ఆ మేరకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. అయితే అన్ని రకాల భర్తీలు కూడా జాతీయ స్థాయిలోనే జరుగుతాయి. ఏవీ కూడా స్థానికులకు ప్రత్యేకంగా కేటాయింపులు ఉండవు. చిన్నపాటి, నాలుగో తరగతి ఉద్యోగుల వరకు మాత్రం స్థానికులు ఉండే అవకాశముంది. కాగా, నిమ్స్ భవనాలను, అక్కడి భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియ మొదలైందని అధికారులు చెబుతున్నారు. వీలైనంత త్వరలో ప్రస్తుత నిమ్స్ భవనంలో ఎయిమ్స్ ఓపీ సేవలు ప్రారంభించాలని రాష్ట్ర సర్కారు కేంద్రానికి విన్నవించింది. కానీ ఇప్పటివరకు కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు.

బీసీలకు అన్యాయం.. ఎన్నికలు ఆపండి

'పంచాయతీ'పై సుప్రీంకోర్టులో బీసీ నేత కృష్ణయ్య, ఎన్సీపీ నేత సామల పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పంచాయతీరాజ్ ఎన్నికల రిజర్వేషన్లలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, వెంటనే పంచాయతీ ఎన్నికలపై స్టే ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య, ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల రవీందర్‌ల తరఫున న్యాయవాది నాగుల శ్రీనివాస్‌యాదవ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో తెలంగాణ న్యాయశాఖ, పంచాయతీరాజ్ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, అర్థ, గణాంక శాఖ, బీసీ సహకార ఆర్థిక సంస్థ, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను 50 శాతంగా ఖరారు చేసేందుకు వీలుగా పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 15న తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు స్పందిస్తూ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జోక్యం చేసుకోలేమని, అయి తే ఆర్డినెన్స్ చట్టబద్ధతను తేలుస్తామని పేర్కొంది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టులో తాజాగా బుధవారం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఆర్డినెన్స్ కారణంగా బీసీ ల రిజర్వేషన్లు 34 శాతం నుంచి 22 శాతానికే పరిమితమవుతున్నాయని, 2018 జూన్ 6న హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను పాటించకుండానే ఎన్నికల కమిషన్ పంచాయ తీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిందని నివేదించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్.. కృష్ణకుమార్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను సంతృప్తి పరచడం లేదని వివరించారు. అందువల్ల పంచాయతీరాజ్ ఎన్నికల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ రద్దు చేయాలని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ జనవరి 1న ఇచ్చిన పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు.



23 నుంచి ఇంటీరియర్ డెకరేషన్‌పై శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 23 నుంచి వచ్చేనెల 12 వరకు ఇంటీరియర్ డెకరేషన్‌పై 21 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గృహవిజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డా.విజయలక్ష్మి తెలిపారు. వనరుల యాజమాన్యం, వినియోగదారుల శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 15 సంవత్సరాలు పైబడిన పదో తరగతి, ఆపైన విద్యార్హతలు కలిగిన యువతులు మాత్రమే ఈ శిక్షణకి అర్హులని పేర్కొన్నారు. సైఫాబాద్‌లోని గృహవిజ్ఞాన కళాశాలలో ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు పదివేల రూపాయల ఫీజుతో కళాశాల నందు లేదా 040–23244058(211) ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

క్యాట్‌లో జేఎన్‌టీయూ విద్యార్థుల ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: క్యాట్–2018 (కామన్ అడ్మిషన్ టెస్ట్) పరీక్షల్లో జేఎన్‌టీయూ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ బ్రాంచ్‌లకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు 90 శాతం పైగా స్కోర్ సాధించారు. ఈఈఈ నుంచి రోహన్ కులకర్ణి –98.98 శాతం, సిద్దార్థ–96.92, ఏకే శిత– 92.44, ఈసీఈ నుంచి సంజయ్‌కుమార్–98.45, కొల్ల నిశాంత్–93.65, సనా ఫర్హానా–92.01, సాయిచరణ్–91.97, సీఎస్‌సీ నుంచి జేఎస్.యువిక–98.32, వరుణ్‌కుమార్ రెడ్డి–97.48 శాతం మార్కులు సాధించారు.

స్కూల్ లీడర్ షిప్ అకాడమీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) స్కూల్ లీడర్ షిప్ అకాడమీ (ఎస్‌ఎల్‌ఏ) ని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో లీడర్ షిప్ పెంపొందించేలా చేయాలని భావిస్తోంది. లీడర్ షిప్ ప్రాక్టీసుకు సంబంధించి ఎస్‌ఎల్‌ఏ కేస్‌స్టడీస్, డాక్యుమెంటేషన్‌ను వివిధ పాఠశాలల నుంచి స్వీకరిస్తుంది. వీటిని ఈ నెల 31 లోగా స్కూల్ లీడర్ షిప్ అకాడమీకి పంపాలని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఈఎంఆర్ఎస్ క్రీడలకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరగనున్న ఈఎంఆర్ఎస్ (ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్)–2019 స్పోర్ట్స్ మీట్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా తెలిపారు. బుధవారం సచివాలయంలో ఈఎంఆర్ఎస్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాట్లపై మీడియాతో మాట్లాడారు. ఈ క్రీడోత్సవాలను తొలిసారిగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 20 రాష్ట్రాల నుంచి 17 ఏళ్లలోపు ఉన్న 1,800 మంది క్రీడాకారులు పాల్గొంటారని, 26 రకాల ఈవెంట్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామని, క్రీడలు ముగిసిన తర్వాత వారికి హైదరాబాద్ పర్యటనకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగని రబీ సాగు

- ఆహారధాన్యాల సాగు కేవలం 9.88 లక్షల ఎకరాలే
- అందులో వరి నాట్లు 4.17 లక్షల ఎకరాలు
- ప్రత్యామ్నాయ పంటలు వేయాలని రైతులకు సూచన

సాక్షి, హైదరాబాద్: రబీ పంటల సాగు విస్తీర్ణం సగానికి కూడా చేరుకోలేదు. ఈ సీజన్లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 33.45 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 13.86 లక్షల (42%) ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. అందులో ఆహార పంటల సాధారణ సాగు విస్తీర్ణం 26.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 9.88 లక్షల (38%) ఎకరాల్లోనే సాగయ్యాయి. ఆహారధాన్యాల్లో కీలకమైన వరి సాగు విస్తీర్ణం 17.62 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 4.17 లక్షల (24%) ఎకరాల్లోనే నాట్లు వేశారు. అలాగే మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 4.15 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.32 లక్షల (57%) ఎకరాల్లో సాగైంది. ఇక నూనెగింజల సాగులో కీలకమైన వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 3.57 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.56 లక్షల (73%) ఎకరాల్లో సాగైంది. ప్రధానంగా వరి నాట్లు పుంజుకోకపోవడంతో వ్యవసాయశాఖ అప్రమత్తమైంది. సాగునీటి వనరులు లేనిచోట వరికి బదులు ప్రత్యామ్నాయ వర్షాధార పంటలు వేయాలని రైతులకు విన్నవించింది. అందుకు సంబంధించిన విత్తనాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇక రబీ సీజన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో రైతులు రికార్డు స్థాయిలో పంటలు సాగు చేశారు. అక్కడ సాధారణ సాగు విస్తీర్ణంతో చూస్తే 27 శాతం అదనంగా సాగవడం గమనార్హం. నాగర్‌కర్నూల్‌లో 85 శాతం, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 77 శాతం, వనపర్తిలో 68 శాతం, నిజామాబాద్‌లో 62 శాతం పంటలు సాగయ్యాయి. అతి తక్కువగా మంచిర్యాల జిల్లాలో 12 శాతం, జగిత్యాలలో 16 శాతం, నల్లగొండలో 19 శాతం, యాదాద్రి భువనగిరిలో 19 శాతం విస్తీర్ణంలో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ నివేదికలో వెల్లడించారు.

18 జిల్లాల్లో వర్షాభావం...

ఇక రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 18 జిల్లాల్లో వర్షాభావం నెలకొని ఉందని వ్యవసాయశాఖ తెలిపింది. దీంతో రబీ పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరోవైపు మొక్కజొన్నపై కత్తెర పురుగు దాడి ఉధృతమైంది. ప్రధానంగా నిజామాబాద్, కామారెడ్డి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, నిర్మల్, కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాల్లో మొక్కజొన్నకు కత్తెర పురుగు సోకిందని వ్యవసాయశాఖ తెలిపింది. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల వ్యవసాయాధికారులను ఆదేశించింది.



టీపీసీసీ కిసాన్‌సెల్ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కిసాన్‌సెల్ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఉన్న అన్వేష్‌రెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఏఐసీసీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కిసాన్ సెల్ చైర్మన్‌గా ఉన్న పార్టీ సీనియర్ నేత ఎం.కోదండరెడ్డిని ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ వైస్‌చైర్మన్‌గా నియమించడంతో ఆయన స్థానంలో అన్వేష్‌రెడ్డిని నియమించారు.

సింగరేణి సేవా సమితి ఉపాధి శిక్షణ

సాక్షి, హైదరాబాద్: సింగరేణి ప్రాంతంలో నిరుద్యోగులకు పెద్దఎత్తున ఉపాధి శిక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో కొత్త కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సింగరేణి సేవా సమితి ఉపాధ్యక్షుడు ఆంథోనిరాజా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల ప్రకారం ఈ ఏడాది ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్న కోర్సుల్లో తమకు ఇష్టమైన వృత్తికి సంబంధించిన శిక్షణలను ఇప్పించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు శిక్షణా సంస్థలతో సంప్రదించి ఆర్మీ, పోలీసు రిక్రూట్‌మెంట్, డ్రైవింగ్, సోలార్ టెక్నాలజీ, కన్‌స్ట్రక్షన్ విభాగాల్లో శిక్షణ అందించనున్నట్లు చెప్పారు.

రైతుబంధు కోసం అప్పు!

- నిధుల్లేక నిలిచిపోయిన చెల్లింపులు
- ఇంకా 4.2 లక్షల మందికి రూ. 500 కోట్లు పెండింగ్



సాక్షి, హైదరాబాద్: రైతుబంధు కింద ఇంకా కొందరు రైతులకు చెల్లించే సొమ్ము కోసం రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖజానాలో అవసరమైన నిధులు లేకపోవడంతో అప్పు చేయడమే శరణ్యమని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఇతరత్రా అవసరాలు సహా రైతుబంధుకూ సర్కారు రుణం వెతుకుతుందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ నెల 11న కొందరు అధికారులు ఢిల్లీ వెళ్లి రుణానికి ప్రయత్నించారని సమాచారం. వాస్తవంగా రబీ సీజన్ రైతుబంధు సొమ్మును ప్రభుత్వం ఎన్నికల నాటి వరకు చాలా మందికి చెల్లించింది. ఆ తర్వాత మరికొందరికి చెల్లించింది. రబీలో ఇప్పటివరకు 50 లక్షల మంది రైతులకు రూ.4,724 కోట్లు అందజేసినట్లు వ్యవసాయ వర్గాలు తెలిపాయి. నేరుగా రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేశారు. అయితే ఖరీఫ్‌లో అందుకోకుండా రబీలో కొత్తగా అర్హులైన రైతులు 2.28 లక్షల మంది, అలాగే ఖరీఫ్‌లో అందుకున్న పాతవారు 1.92 లక్షల మంది మొత్తం 4.2 లక్షల మందికి పెట్టుబడి సొమ్ము అందజేయాల్సి ఉంది. వారికి దాదాపు రూ.500 కోట్లు చెల్లించాల్సి ఉందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. దీంతో రైతుబంధు సొమ్ము రాని అనేక మంది రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీంతో వారికి ఏమి చెప్పాలో అర్థంగాక అధికారులు ఇబ్బంది పడుతున్నారు. త్వరలో ఖాతాలో సొమ్ము వేస్తామని తిరిగి పంపుతున్నారు.

బడ్జెట్‌లో రూ. 15 వేల కోట్లు..

వచ్చే ఖరీఫ్ నుంచి ఎకరాకు రూ.5 వేలు ఇస్తామని సీఎం కేసీఆర్ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అందుకు సంబంధించి అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటివరకు ఎకరాకు రూ.4 వేలు చెల్లించగా, దాన్ని రూ.5 వేలకు పెంచడంతో ఖజానాపై అదనంగా మరో రూ.1000 భారం పడనుంది. ఆ ప్రకారం గతంలో బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయించగా, ఈసారి పెంచినదాని ప్రకారం రూ. 15 వేల కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశారు. ఇందుకు బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించనున్నారు. ఆ మేరకు వ్యవసాయ శాఖ రైతుబంధు కోసం రూ.15 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు తయారు చేస్తోంది.

రైతుబీమా చెల్లింపులు 276 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటివరకు 5,525 రైతు కుటుంబాలకు రైతుబీమా పథకం వర్తింపచేసినట్లు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి వెల్లడించారు. బుధవారం ఆయన ఎల్‌ఐసీ వర్గాలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. రైతుబీమా పథకం అమల్లోకి వచ్చాక రాష్ట్రంలో 5,821 మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందారని వెల్లడించారు. వారిలో 5,525 మంది రైతు కుటుంబాలకు చెందిన నామినీల బ్యాంకు ఖాతాల్లో రూ.5 లక్షల చొప్పున రూ.276.25 కోట్ల పరిహారం జమ చేసినట్లు పార్థసారథి తెలిపారు. మిగిలిన 296 రైతు కుటుంబాలకు త్వరగా బీమా పరిహారం చెల్లించాలని ఆదేశించారు. నామినీ బ్యాంకు ఖాతాలకు సంబంధించి తలెత్తే సమస్యల పరిష్కారానికి త్వరలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. డేటా అప్‌డేట్ చేసే సందర్భంగా ఎడిట్ ఆప్షన్‌ను పొందుపర్చాలని ఎల్‌ఐసీ అధికారులు పార్థసారథిని కోరారు. కొత్త పట్టాదారు పాసు పుస్తకం పొందిన వారి వివరాలను కూడా రైతు బీమా కోసం సేకరించాలన్నారు. 2019–20లో ఈ పథకం అమలుకు అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు డైరెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




సవరణ షెడ్యూల్ పొడిగించాలి: కాంగ్రెస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నందున ప్రభుత్వ యంత్రాంగమంతా ఆ పనిలో ఉందని, ఈ నేపథ్యంలో సాధారణ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 10 వరకు పొడిగించాలని కాంగ్రెస్ కోరింది. ఈ మేరకు టీపీసీసీ ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జి.నిరంజన్ బుధవారం కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25 వరకు మాత్రమే నమోదు, అభ్యంతరాలకు అవకాశం ఉందన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బూత్‌లెవల్ అధికారులు, ఈఆర్‌వోలు, జిల్లా ఎలక్టోరల్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పొడిగించాలని, రాజకీయ పార్టీలు తమ బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించుకునేందుకు ఫిబ్రవరి 1 వరకు అవకాశమివ్వాలని సీఈసీకి విజ్ఞప్తి చేశారు.

అందుకే ఈ రిజర్వేషన్లు: జస్టిస్ ఈశ్వరయ్య



హైదరాబాద్: రాజకీయ లబ్ధికోసమే బీజేపీ ప్రభుత్వం ఓసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును తీసుకొచ్చిందని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఆరోపించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో ఓసీలకు కల్పించిన రిజర్వేషన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. ఓసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు పాస్ చేయడం నిండు దర్బార్‌లో ద్రౌపదీ వస్త్రాపహరణం జరిగినట్లుగా ఉందని ఆరోపించారు. ఆనాడు కౌరవులు మహాసభలో కళ్లు మూసుకుని దీనికి మద్దతు పలికినట్లుగా ఈనాడు లోక్‌సభలో ఎంపీలు ఈ బిల్లుకు మద్దతు తెలిపారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టీపీఎఫ్ అధ్యక్షుడు ఎన్.కృష్ణ, టీపీఎఫ్ ప్రధాన కార్యదర్శి మెంచు రమేశ్, ఉపాధ్యక్షుడు అన్వర్‌ఖాన్, టీవీవీ అధ్యక్షుడు మద్దిలేటి పాల్గొన్నారు.

అడగనివారికి రిజర్వేషన్లా?: ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్: అగ్రకులాల్లో వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించడంపై బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. అడగని వాళ్లకు, అవసరం లేని వారికి రిజర్వేషన్లు కల్పించడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో 9 శాతం జనాభా ఉన్న అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో ఆంతర్యమేంటని నిలదీశారు. బీసీ సంక్షేమ సంఘం నేతృత్వంలో దాదాపు వంద మంది బుధవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రధాన రహదారిపై అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 30 మంది ముఖ్యమంత్రులు అయితే ఒక్కరు కూడా బీసీ కులాలకు చెందిన వారు లేరని కృష్ణయ్య అన్నారు. అన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు కూడా అగ్రకులాలకు చెందిన వారే ఉన్నారు కానీ.. బీసీలు లేరన్నారు. 80 శాతం కీలక పదవులను అనుభవిస్తున్న అగ్రకులాలకు చెందిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో అర్థముందా అని నిలదీశారు. ఇదంతా ఎన్నికల కుట్రలో భాగమేనని ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుడు గుజ్జ కృష్ణ పాల్గొన్నారు.

అక్కడా కోర్టులు ఏర్పాటు చేయాలి: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 21 జిల్లాల్లో జిల్లా కోర్టుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ బుధవారం లేఖ రాశారు. 21 జిల్లాల్లో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కోర్టులతో పాటు ప్రతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కేసుల సత్వర పరిష్కారానికి జిల్లా వినియోగదారుల ఫోరంలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైకోర్టు విభజన నేపథ్యంలో ఇందుకు అవసరమైన చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని పేర్కొన్నారు.

గౌడలకు 'బీసీ' రుణాలు: శ్రీనివాస్‌గౌడ్




సాక్షి, హైదరాబాద్: టీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ నుంచి గౌడ సోదరులకు రుణాలు ఇస్తోందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన గౌడ ఐక్య సాధన సమితి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఉమ్మడి రాష్ట్రంలో గౌడ కుల వృత్తిని పట్టించుకోకుండా హైదరాబాద్‌లో నిషేధించారు. గౌడల గౌరవమైన వృత్తి కల్లుగీత. అందుకే రాష్ట్ర ప్రభుత్వం చెట్టు పన్ను రద్దు చేసింది. గీత కార్మికులకు పెన్షన్, చనిపోయిన వారికి రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తోంది. గీత కార్మికుల కోసం ప్రత్యేకంగా తాటి చెట్లను, ఈత చెట్లను పెంచుతోంది. వృత్తిలో పని చేస్తున్న వారి పిల్లలు విదేశాల్లో చదవుకునేందుకు రూ.20 లక్షలు ఇస్తున్నారు' అని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవి రాజ్యాంగ విరుద్ధం: జి.చెన్నయ్య



సాక్షి, హైదరాబాద్: ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. జనాభాలో 70 శాతానికి పైగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వకుండా, ఈబీసీ రిజర్వేషన్లు కల్పించడంతో తీవ్ర అన్యాయం జరిగినట్లేనని ఆయన బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓట్లు రాబట్టేందుకు బీజేపీ ప్రభుత్వం వేసిన ఎత్తుగడ అని ఆరోపించారు.

'ఆ హామీలకు రూ.2.50 లక్షల కోట్లు'



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సందర్భంగా టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీలు నెరవేరాలంటే రూ.2.50లక్షల కోట్లు అవసరమవుతాయని టీపీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడారు. రైతుబంధుకు రూ.15 వేల కోట్లు, రుణమాఫీకి రూ.24వేల కోట్లు, పింఛన్లకు రూ.25వేల కోట్లు, జీతభత్యాలకు రూ.40వేల కోట్లతో పాటు రూ.2.20 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లించాల్సి ఉందన్నారు. దేశంలోనే ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్పున్న సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అప్పులు ఎలా తీరుస్తారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సుర్జేవాలాతో దాసోజు శ్రవణ్ భేటీ



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అధికార ప్రతినిధిగా కొత్తగా నియమితుడైన దాసోజు శ్రవణ్ ఏఐసీసీ మీడియా విభాగం ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సుర్జేవాలాతో భేటీ అయ్యారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో సుర్జేవాలాను కలసిన శ్రవణ్, తనను ఏఐసీసీ అధికార ప్రతినిధిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ మీడియా, కమ్యూనికేషన్ల విభాగం నిర్వహించాల్సిన పాత్రపై సుర్జేవాలాతో చర్చించినట్టు శ్రవణ్ పేర్కొన్నారు.

ఫార్మసీ కౌన్సిల్‌కు ఐదుగురు సభ్యులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఫార్మసీ కౌన్సిల్‌కు ఐదుగురు సభ్యులను నామినేట్ చేసింది. కౌన్సిల్‌లో సభ్యులుగా ఎ.సంజయ్‌రెడ్డి (హైదరాబాద్) కె.శ్రీనివాస్ (సిరిసిల్ల) ఆర్.శ్రీనివాస్ (వరంగల్) టి.చంద్రశేఖర్ ఆజాద్ (నల్లగొండ) ఎం.వినోద్ కుమార్ (పెద్దపల్లి)లను నామినేట్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పోటీకి 'రైతు సమితి' సభ్యులు అర్హులే

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు రైతు సమన్వయ సమితి సభ్యులు అర్హులేనని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నికల్లో పోటీ చేయకుండా వారిపై అనర్హత విధించబోరాదని తెలిపింది. ఇందుకు సంబంధించి కమిషన్ కార్యదర్శి అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రియమైన మీకు..



కోటీ 10 లక్షల కుటుంబాలకు సీఈఓ లేఖలు

- ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించేందుకు నిర్ణయం
- ఫిబ్రవరి 22న తుది ఓటర్ల జాబితా
- సీఈఓ రజత్‌కుమార్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యకమంలో భాగంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) డాక్టర్ రజత్ కుమార్.. రాష్ట్రంలోని కోటీ 10 లక్షల కుటుంబాలకు లేఖలు రాయనున్నారు. కొత్త ఓటర్ల నమోదు (ఫారం-6), ప్రవాసుల ఓటర్ల నమోదు (ఫారం-6ఏ), చనిపోయిన, శాశ్వతంగా చిరునామా మారిన ఓటర్ల తొలగింపు (ఫారం-7), ఓటర్ల జాబితాలో పేరు సవరణ (ఫారం-8), అదే అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో చిరునామా మార్పు(ఫారం-8ఏ) కోసం ఏం చేయాలి? ఏ ఫారాలు సమర్పించాలి? అన్న అంశాల పట్ల ఈ లేఖల ద్వారా అవగాహన కల్పించనున్నారు. తిరుగు చిరునామా కలిగిన ఓ పోస్టు కార్డును ఈ లేఖకు జత చేసి పంపించనున్నారు. ఓటర్ల జాబితాపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలను ఈ పోస్టు కార్డుపై రాసి పంపించాలని ఆహ్వానించనున్నారు. ఈ విషయాన్ని సీఈఓ రజత్‌కుమార్ వెల్లడించారు. బుధవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఓటర్ల నమోదుపై చైతన్యపరిచేందుకు పౌరులకు బల్క్ ఎస్సెమ్మెస్‌లు పంపించనున్నట్టు చెప్పారు. ''2019 జనవరి 1ని అర్హత తేదీగా చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 వరకు కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు, ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నాం. ఫిబ్రవరి 22న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తాం. ఓటర్ల నమోదు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభమయ్యే వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. లోక్‌సభ ఎన్నికల కోసం మరో ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించని పక్షంలో ఫిబ్రవరి 22న ప్రచురించనున్న తుది ఓటర్ల జాబితా నుంచి ఒక్క ఓటరును కూడా తొలగించడానికి వీలుండదు. అందువల్ల బోగస్, చనిపోయిన, చిరునామా మారిన ఓటర్ల తొలగింపునకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25 వరకు ఉన్న అవకాశాన్ని వినియోగించుకోవాలి'' అని ఆయన సూచించారు. గత నెల 26న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టగా.. కొత్త ఓటర్ల నమోదు కోసం 8,64,128, ప్రవాసుల ఓటర్ల నమోదుకు 1123, ఓట్ల తొలగింపునకు 10,130, ఓటరు పేరు సవరణ కోసం 57,348, ఉన్న నియోజకవర్గం పరిధిలోనే చిరునామా మార్పునకు 22,098 దరఖాస్తులు కలిపి ఇప్పటివరకు మొత్తం 9,54,827 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

95 శాతం ఓట్ల తొలగింపు కరెక్టే...

శాసనసభ ఎన్నికల్లో 22 లక్షల ఓట్లు గల్లంతైనట్లు విమర్శలొచ్చిన నేపథ్యంలో, ఓట్లు గల్లంతైనట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపించామని రజత్‌కుమార్ వెల్లడించారు. 2015లో చేపట్టిన నేషనల్ ఎలక్టోరల్ రోల్ ప్యూరిఫికేషన్ అండ్ అథెంటిఫికేషన్ (ఎన్ఈఆర్‌పీఏపీ) కార్యక్రమం కింద ఆ ఓట్లను తొలగించినట్లు తేలిందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 6,30,652, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో 28,70,048 ఓటర్లు కలిపి మొత్తం 35,00,700 మంది ఓటర్లను ఈ కార్యక్రమం కింద తొలగించారని తెలిపారు. మేడ్చల్ జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని విచారణ జరపగా.. ఇక్కడ తొలగించిన 7.4లక్షల ఓట్లలో 6.8లక్షల ఓట్లను సరిగ్గానే తొలగించారని.. కేవలం 60వేల ఓట్లను మాత్రమే తప్పుగా తొలగించినట్లు నిర్ధారణ జరిగిందని వివరించారు. మేడ్చల్ తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా తొలగించిన ఓట్లపై విచారణ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2015లో ఎన్ఈఆర్‌పీఏపీ కింద ఓట్లు తొలగించిన తర్వాత 2016, 2017, 2018లో ఓటర్ల జాబితా సవరణ నిర్వహించామని, గతేడాది మూడు సార్లు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించినా 2015లో ఓటు కోల్పోయిన వ్యక్తులు మళ్లీ ఓటరుగా నమోదు కాకపోవడం కూడా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోవడానికి ఓ కారణమని రజత్ కుమార్ వివరించారు. 2016లో నిర్వహించిన ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్(ఐఆర్ఈఆర్) కింద రాష్ట్రంలో మరోసారి 24 లక్షల ఓట్లను తొలగించారని, అయితే ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికార పార్టీకి అనుకూలంగా పనిచేశారన్న ఆరోపణలపై జీహెచ్‌ఎంసీ పరిధిలోని ముగ్గురు రిటర్నింగ్ అధికారులకు నోటీసులు జారీ చేశామని, వారిపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ఈ నెలాఖరు వరకు ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు...

రెండు ఉపాధ్యాయ, ఓ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గాలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈనెల 31 వరకు ఆయా నియోజకవర్గాల్లో కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రజత్‌కుమార్ తెలిపారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1,42,958 మంది ఓటర్లు, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్/వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయుల నియోజకవర్గంలో 3,38,44మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు.

కూటమి కూలినట్టేనా?

రాష్ట్రంలో ప్రజా కూటమి కొనసాగింపుపై అనుమానాలు

- ఇప్పటికీ సంయుక్తంగా అసెంబ్లీ ఫలితాలపై సమీక్షించని వైనం
- ఇకముందూ పొత్తు కొనసాగుతుందన్న కుంతియా, ఉత్తమ్
- ఆ దిశగా చర్యలు మాత్రం శూన్యం.. టీడీపీపై కొరవడిన స్పష్టత
- ఫ్రంట్‌లో టీడీపీని కొనసాగించడంపై టీజేఎస్-సీపీఐ అభ్యంతరాలు?
- ఇటు సమీపిస్తున్న పంచాయతీ ఎన్నికలు.. పరస్పర సహకారం మిథ్యే



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా ఫ్రంట్ కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ ఫలితాలు వెలువడి దాదాపు నెల రోజులు కావస్తున్నా నేటికీ ఈ కూటమి సమీక్ష జరగలేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల విశ్లేషణకు ఇంతవరకు భాగస్వామ్య పక్షాలు సమావేశమవ్వలేదు. కనీసం మిత్రపక్షాల నేతలు వ్యక్తిగతంగా కలుసుకుని పరస్పరం అభిప్రాయాలు పంచుకునేందుకు ప్రయత్నించిన దాఖలాలూ లేవు. మరోవైపు పంచాయతీ ఎన్నికలు కూడా సమీపిస్తున్నాయి. అయితే కూటమికి నేతృత్వం వహించిన పార్టీగా కాంగ్రెస్ సొంతంగా కొంత ఆలస్యంగానే ఫలితాలపై సమీక్ష నిర్వహించింది. తమ అంచనాలకు భిన్నంగా టీఆర్‌ఎస్ మెజారిటీ స్థానాల్లో గెలుపొందడంపై స్పష్టమైన కారణాలు, దారితీసిన పరిస్థితులను మాత్రం పూర్తిస్థాయిలో ఇంకా అంచనా వేయలేకపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఫ్రంట్ వల్ల పార్టీకి నష్టం జరిగిందని, ఒంటరిగా పోటీ చేసుంటే మెరుగైన ఫలితాలొచ్చి ఉండేవని కాంగ్రెస్‌లో ఒక వర్గం గట్టిగా వాదిస్తోంది. కూటమిని ఇకముందు కూడా కొనసాగిస్తామని రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా, పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంకేతాలైతే ఇచ్చారు.. కాని ఆ దిశగా ఏ చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో ఈ కూటమి కొనసాగుతుందా లేదా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

ఇకపై ఫ్రంట్‌లో టీడీపీ ఉంటుందా?

కూటమిలో టీడీపీని చేర్చుకోవడం, ఎన్నికల ప్రచారాన్ని ఏపీ సీఎం చంద్రబాబు ముందుండి నడిపించడం ప్రతికూలంగా మారిందని ఇప్పటికే భాగస్వామ్యపక్షాలు విశ్లేషించాయి. ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ మళ్లీ ప్రముఖంగా ముందుకు రావడానికి చంద్రబాబు అనుసరించిన వైఖరే కారణమని ఈ పక్షాలు గట్టిగా నమ్ముతున్నాయి. అయితే ఇకముందు కూటమి కొనసాగుతుందా లేదా అన్న అనుమానాలకు తోడు, టీడీపీ పట్ల ఎలాంటి వైఖరి తీసుకుంటాయనే అంశంపై స్పష్టత లోపించింది. టీడీపీ వల్ల నష్టం జరగలేదని కొందరు కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యలు కూడా చేశారు. అయితే కాంగ్రెస్‌లో అంతర్గతంగా ఒక గ్రూపు టీడీపీని చేర్చుకోవడాన్ని గట్టిగా వ్యతిరేకిస్తోంది. ఇటు టీడీపీని ఫ్రంట్‌లో కొనసాగించడంపై సీపీఐ, టీజేఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశాలున్నాయి. దీంతో ఈ అంశంపై కాంగ్రెస్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'పంచాయతీ'లో సహకారం కరువు..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ఫ్రంట్ మిత్రపక్షాలు పరోక్ష సహకారం కోసం ప్రయత్నించిన దాఖలాలూ లేవు. ఈ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతున్నా గ్రామ స్థాయిల్లో పరస్పరం సహకరించుకుంటే మంచి ఫలితాలు వచ్చే అవకాశమున్నా ఆ దిశగా ఈ పార్టీలు ఏ చర్యా తీసుకోలేదు. కనీసం క్షేత్రస్థాయిలో ఈ పార్టీల మధ్య అవసరమైన మేర అవగాహన కోసం ప్రయత్నాలు కూడా జరగలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మళ్లీ కూటమి కుదురుకోడానికి, పరస్పరం ఇచ్చి పుచ్చుకునే ధోరణికి పంచాయతీ ఎన్నికలు ఒక అవకాశం కాగా దానిని కూడా ఫ్రంట్ వదులుకున్నట్టుగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో మిత్రత్వాన్ని పెంపొందించుకునేందుకు ఈ ఎన్నికల్లో కనీసం సీపీఐ-టీజేఎస్ కూడా సహకరించుకుంటున్న పరిస్థితులు లేవు. దీంతో కూటమి కొనసాగింపు కష్టమేననే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి

రైల్వే బోర్డు చైర్మన్ వినోద్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న అన్నిరకాల అభివృద్ధి ప్రాజెక్టులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని రైల్వే బోర్డు చైర్మన్ వినోద్ కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం న్యూఢిల్లీలో అన్ని జోనల్ జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2018-19 ఏడాదికి గాను లక్ష్యంగా పెట్టుకొని నిర్మిస్తున్న ప్రాజెక్టులు, కొత్త రైల్వేలైన్లు, విద్యుదీకరణ, గేజ్ మార్పిడి, బైపాస్ లైన్లు, యార్డుల పునర్‌నిర్మాణ పనులపై దృష్టి కేంద్రీకరించాలని అధికారులకు సూచించారు. భూసేకరణ సహా క్లిష్టమైన సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారించాలని, మౌలిక సదుపాయాలకు సంబంధించిన టెండర్లపై తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రస్తుత ప్రాజెక్టుల వారీగా నిధుల అవసరాల గురించి ఏకీకృత నివేదికను పంపమని అన్ని జోన్ల అధికారులను ఆదేశించారు. రైల్వేలకు కావాల్సిన సిగ్నలింగ్ కేబుల్స్, ఖాళీ వ్యాగన్స్, ట్రాక్ యంత్రాల సరఫరాపై కూడా ఆయన సమీక్షించారు. జోన్ పనితీరు, సాధించిన విజయాలు గురించి దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ నివేదికను సమర్పించారు. సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ కె.శివ ప్రసాద్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్.మధుసూదన్‌రావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు బీజేపీకి చెంపపెట్టు లాంటిది

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం



బుధవారం మఖ్దూంభవన్‌లో మాట్లాడుతున్న సురవరం. చిత్రంలో చాడ

సాక్షి, హైదరాబాద్: సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను కొనసాగించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు ఆక్షేపణలకు ప్రధాని నరేంద్ర మోదీ, చీఫ్ విజిలెన్స్ కమిషనర్ దేశానికి క్షమాపణ చెప్పి, నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బుధవారం మఖ్దూంభవన్‌లో పార్టీ నేత చాడ వెంకటరెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వివిధ రంగాలకు చెందిన 20 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు రెండ్రోజుల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేశారన్నారు. అయితే ఈ సందర్భంలోనే మోదీ ప్రభుత్వం ఆదరాబాదరాగా పార్లమెంట్‌లో కొన్ని కార్మిక వ్యతిరేక చట్టాలతో సిటిజన్ రిజిస్ట్రేషన్ బిల్లును తీసుకురావడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చట్టాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పరిమితంగా ఉన్న ఉద్యోగ అవకాశాల కోసం వివిధ వర్గాలు పోటీపడుతున్న నేపథ్యంలో అగ్రకుల పేదలను కూడా ఈ యుద్ధంలోకి తెచ్చి పోటీని తీవ్రం చేశారని విమర్శించారు.

ఆ చట్టం రాజ్యాంగ వ్యతిరేకం..

అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లకు చెందిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు (ముస్లింలు మినహాయించి) ఆరేళ్ల పాటు భారత్‌లో నివాసముంటే పౌరసత్వ కల్పనకు తీసుకొచ్చిన చట్టం రాజ్యాంగ, లౌకిక వ్యతిరేకమైనదని సురవరం ధ్వజమెత్తారు. ఎంఐఎం ప్రొటెమ్ స్పీకర్ ఎదుట ప్రమాణం చేయనని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రకటించడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ముస్లింలపై బీజేపీకున్న వ్యతిరేకత ప్రతిబింబించేలా ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలపై సీఎం కేసీఆర్ మౌనం వెనక అర్థమేంటని చాడ ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే అగ్రకులాల పేదలకు 10 శాతం రిజర్వేషన్ల బిల్లును బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు.

సీఎల్పీ నేతగా ఎన్నికయ్యేదెవరో?

- 16 లేదా 17న కాంగ్రెస్ శాసనసభాపక్ష భేటీ!
- కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశం ఈ నెల 16 లేదా 17న జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాలు 17 నుంచి జరగనున్న నేపథ్యంలో సమావేశాల ప్రారంభానికి ముందే సీఎల్పీ సమావేశం నిర్వహిస్తారని చెబుతున్నా.. 17న అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులుగా ప్రమాణం చేసిన అనంతరమే సీఎల్పీ సమావేశం నిర్వహించనున్నట్లు గాంధీభవన్ వర్గాలంటున్నాయి. ఈ సమావేశానికి అధిష్టానం దూతగా కేరళకు చెందిన లోక్‌సభ సభ్యుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ 15న రాత్రి హైదరాబాద్ రానున్నారు. ఈయన సమక్షంలో పార్టీ శాసనసభాపక్ష నేత ఎన్నిక జరగనుంది. దీంతో సీఎల్పీ నేతగా ఎవరిని ఎన్నుకుంటారన్నది పార్టీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. పార్టీ తరఫున గెలిచిన 19 మంది ఎమ్మెల్యేల్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా పనిచేసిన మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సబితా ఇంద్రారెడ్డి, వనమా వెంకటేశ్వరరావు, లోక్‌సభ సభ్యుడిగా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవమున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిలో ఉత్తమ్, భట్టిలను సీఎల్పీ నేతగా నియమించే విషయంలో అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. సీఎల్పీ రేసులో రాజగోపాల్‌రెడ్డి, శ్రీధర్‌బాబుల పేర్లూ ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రాజగోపాల్‌రెడ్డి పేరును అధిష్టానం తీవ్రంగానే పరిశీలిస్తోందని, ఇందుకు తగినట్టు గెలిచిన ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది మద్దతు కూడగట్టుకునే పనిలో రాజగోపాల్‌రెడ్డి కొంత చురుకుగానే ఉన్నారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ప్రభుత్వ విప్‌గా, శాసనసభా వ్యవహారాల మంత్రిగా పనిచేసిన అనుభవమున్న శ్రీధర్‌బాబు కూడా రేసులో ముందున్నట్టు చర్చ జరుగుతోంది. మహిళకు సీఎల్పీ నేతగా అవకాశం ఇవ్వాలనుకుంటే సబితా ఇంద్రారెడ్డిని నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా అసెంబ్లీ సమావేశాలు సమీపిస్తున్న నేపథ్యంలో సీఎల్పీ నేతగా ఎవరిని ఎన్నుకుంటారనేది కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

మార్చినాటికి లక్ష అనుమానమే!

- నెమ్మదిగా సాగుతున్న డబుల్ ఇళ్ల నిర్మాణాలు
- గ్రేటర్ పరిధిలో పూర్తయినవి 628 మాత్రమే
- 9 లక్షలు దాటిన దరఖాస్తులు పార్లమెంటు ఎన్నికల్లోపు పంపిణీపై ఉత్కంఠ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రతిష్టాత్మక పథకం డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్ల నిర్మాణం ఆశించినంత వేగంగా సాగడం లేదు. రెండోసారి ప్రభుత్వం కొలువుదీరాక డబుల్ దరఖాస్తులు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం రద్దుకు ముందు అంటే ఆగస్టుతో పోలిస్తే..డిసెంబరు చివరినాటికి కేవలం 4వేల ఇళ్లు మాత్రమే అదనంగా పూర్తయ్యాయి. తెలంగాణలో 31 జిల్లాల్లో పనులు మొదలైనా..4 జిల్లాల్లో ఒక్క ఇల్లు కూడా పూర్తికాకపోవడం దరఖాస్తుదారుల్లో ఆందోళన పెంచుతోంది. దీంతో 2019 మార్చి ఆఖరునాటికి లక్ష ఇళ్లు పంపిణీ చేయాలనుకున్న లక్ష్యం నెరవేరేలా కనిపించడం లేదు.

పార్లమెంటు ఎన్నికల్లోపు పంపిణీ చేస్తారా?

పార్లమెంటు ఎన్నికల్లోపు వీలైనన్ని ఇళ్లు పూర్తి చేసి పంపిణీ చేస్తారన్న ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో పంపిణీపై ఉత్కంఠ నెలకొంది. వాస్తవానికి వీలైనన్ని ఇళ్లు పూర్తి చేసి పంపిణీ చేసే విషయంపై ఇటీవల సీఎం కేసీఆర్ కూడా వ్యాఖ్యానించారు. డబుల్ ఇళ్ల విషయంలో మేము ఆదరాబాదరాగా వెళ్లాలనుకోవడం లేదని, నాణ్యమైన, మెరుగైన ఇళ్లనే ఇవ్వాలనుకుంటున్నామని పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పూర్తైన ఇళ్లను పంపిణీ చేస్తారన్న ప్రచారాన్ని ప్రభుత్వ వర్గాలు, అధికారులు ఖండించడం లేదు. దీంతోఅనుకున్న మేరకు కాకపోయినా.. ఎన్నోకొన్ని పంపిణీ చేయవచ్చని తెలుస్తోంది.

పోటెత్తుతున్న దరఖాస్తులు

2014, 2018 ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రధాన హామీల్లో ఇది కూడా ఒకటవడంతో దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. రెండోసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డబుల్‌పై పేదలకు ఆశలు పెరిగాయి. అందుకే ఒక్క హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 3 లక్షల దరఖాస్తులు రావడమే స్పందనకు నిదర్శనం. మిగిలిన ఉమ్మడి 8 జిల్లాల్లో దాదాపుగా మరో 6 లక్షల దరఖాస్తులు వచ్చాయని సమాచారం.

ఒక్కటి కూడా పూర్తికానివి నాలుగు జిల్లాలు..

జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, కుమరమ్ భీమ్, వికారాబాద్ జిల్లాల్లో ఇంతవరకూ ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా పూర్తి కాలేదు. ఈ జిల్లాల్లో ప్రతీ జిల్లాకు దాదాపు వెయ్యి నుంచి రెండు వేల ఇళ్లు మంజూరయ్యాయి. ఈ జిల్లాలకు పార్లమెంటు ఎన్నికల్లోపు ఇళ్ల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి. మొత్తం 2 లక్షల ఇళ్లకు టెండర్లు ఖరారు కాగా, కేవలం 17,556 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.

ముందువరుసలో ఉన్నవి

జిల్లా	ఇళ్లు
సిద్దిపేట	4,673
ఖమ్మం	2,113
మహబూబ్‌నగర్	1,603
భద్రాద్రి కొత్తగూడెం	1,245
రాజన్న సిరిసిల్ల	1,110
జనగామ	976
సూర్యాపేట	791

'డబుల్' ఇళ్ల పూర్తి వివరాలు..

మొత్తం అనుమతి వచ్చినవి:	2,61,205
ప్రభుత్వం టెండర్లు పిలిచినవి:	2,37,001
ఖరారైన టెండర్లు:	1,99,702
పనులు మొదలైనవి:	1,76,322
పూర్తయిన ఇళ్ల సంఖ్య:	17,556
గ్రేటర్ పరిధిలో పూర్తయినవి :	628
ఇంతవరకూ అయిన ఖర్చు :	రూ.4,290 కోట్లు

(గతేడాది డిసెంబర్ 31 నాటికి హౌసింగ్ గణాంకాల ప్రకారం)



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగిన బహిరంగ సభకు హాజరైన జనవాహినిలో ఓ భాగం.. అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

అధర్మంపై యుద్ధమిది

ఇచ్ఛాపురంలో పాదయాత్ర ముగింపు సభలో ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

‘మీ అందరికీ నేనొక్కటే చెబుతున్నా.. నేను 3,600 కిలోమీటర్లకు పైగా నడిచా.. దారిపొడవునా ప్రతి పేదవాడి కష్టం చూశా.. ప్రతి పేదవాడి పరిస్థితిని ఎలా మెరుగు పరచాలనే ఆలోచనతోనే ఈ 14 నెలల సమయం గడిచి పోయింది. మామూలుగా ఒక సామెత ఎపుడూ చెబుతూ ఉంటారు. ఆరు నెలలు ఎవరితోనైనా కలిసి ఉంటే వాళ్లు వీళ్లవుతారు.. వీళ్లు వాళ్లవుతారు అని. 14 నెలలు పేదవాడితోనే ఉన్నాను. పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే దాకా పేదవారి కష్టాలు వింటూనే, వారితో నడుస్తూనే, వారికి తోడుగా ఉంటూనే వారికి భరోసా ఇస్తూనే నడిచాను.

గ్రామస్థాయిలో నవరత్నాలను ప్రతి పేదవాడి ఇంటికి చేరుస్తాం. నవరత్నాల్లో ప్రకటించిన పథకాలే కాకుండా రేషన్ బియ్యం కూడా నేరుగా లబ్ధిదారుడి ఇంటికి డోర్ డెలివరీ చేస్తాం. నవరత్నాల్లో పథకాల కోసం లబ్ధిదారులు ఎవరి చుట్టూ తిరగనవసరం లేకుండా, ఎవరికీ లంచం ఇవ్వకుండా నేరుగా ఆ లబ్ధిదారుడి ఇంటికి పథకాలు వచ్చేలా చేస్తామని హామీ ఇస్తున్నా.

చంద్రబాబు ఏదైనా ఇరిగేషన్ ప్రాజెక్టు కానీ, ఏదైనా పని గానీ చేసేటప్పుడు ఆయన ఆలోచించేది కమీషన్లు ఎంతవస్తాయి, డబ్బులు ఎంత దోచుకుందామా అని చూస్తారు. మీ అందరికీ ఒకటే హామీ ఇస్తున్నా. నాకు డబ్బంటే వ్యామోహం లేదు. చంద్రబాబు నాయుడు మాదిరిగా నా ఆలోచనలు ఉండవు. నా ఆలోచన ఒక్కటే. అధికారంలోకి వస్తే 30 సంవత్సరాలు ప్రజలకు మంచి చేయాలని.. 30 ఏళ్ల పాటు పాలించాలని నాకున్న ఆశ. జరిగిన మంచిని చూసి నేను చనిపోయిన తర్వాత నా ఫొటో ప్రజల ఇంట్లో నాన్న ఫొటోతో పాటు ఉండాలన్నది నా ఆశ. మన పార్టీ కో ఆర్డినేటర్లకు చెబుతా ఉన్నా. నవరత్నాలను ప్రతి ఇంటికి చేర్చండి. అప్పడే చంద్రబాబు లంచాలతో సంపాదించిన సొత్తు ఓట్లను కొనుగోలు చేసేందుకు ఎంత వెచ్చించినా కూడా ప్రజలు ఆ జరగబోయే మేలును చూసి చంద్రబాబు వద్ద డబ్బులు తీసుకుంటారు కానీ ఓట్లు మాత్రం వేయరు. నవరత్నాలు అందరికీ కన్పించేలా ప్రతి గ్రామంలోనూ ఫ్లెక్సీలు పెట్టండి.

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

మరో మూడు నెలల్లో జరుగనున్న ఎన్నికల్లో నారాసురుడు ఏపీ సీఎం చంద్రబాబుతో, ఎల్లో మీడియాతో జరిగే యుద్ధంలో రాష్ట్ర ప్రజలందరూ తనకు తోడుగా నిలవాలని, తనను ఆశీర్వదించాలని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మనం చేయబోయే యుద్ధం ఒక్క నారాసురుడితోనే కాదని, ఆయనకు మద్దతిస్తున్న రెండు పత్రికలు, పలు టీవీ చానెళ్లపై కూడా అని జగన్ ప్రజలను అప్రమత్తం చేశారు. చంద్రబాబు మాదిరిగా తనకు డబ్బుపై వ్యామోహం లేదని, అయితే ఒక్కసారి అధికారంలోకి వచ్చాక 30 ఏళ్లపాటు రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి మంచి చేయాలని, 30 ఏళ్ల పాటు పరిపాలించాలనే ఆశతో.. తపన ఉందన్నారు. జిత్తులమారి, మాయావి అయిన చంద్రబాబు అనేక పొత్తులు పెట్టుకుంటారని, ఎన్నికల్లో ఆయన చేయని అన్యాయం అంటూ ఏమీ ఉండదని ప్రజలను హెచ్చరించారు. ప్రజలంతా ఈ యుద్ధంలో తనకు తోడుగా నిలిస్తే ఈ ఎన్నికల్లో జరిగే అన్యాయాలను, మోసాలన్నింటినీ జయిస్తానని ధృఢ విశ్వాసం వ్యక్తం చేశారు. 3 నెలల్లో మంచి రోజులు వస్తాయని, ప్రజావ్యతిరేక చంద్రబాబు పాలనను సాగనంపే సమయం ఆసన్నం అయిందని ధీమా వ్యక్తం చేశారు. 341 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సాగిన ప్రజా సంకల్ప యాత్రను పూర్తి చేసిన అనంతరం చివరి ఘట్టమైన ఇచ్ఛాపురంలో పాత బస్టాండు వద్ద బుధవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ఉత్తేజ పూరితంగా ప్రజలను, పార్టీ శ్రేణులు, అభిమానులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

యుద్ధం బాబుతోనే కాదు.. ఎల్లో మీడియాతో కూడా

‘‘ఎన్నికలకు మరో మూడు నెలల సమయం ఉంది. ఈ మూడు నెలల కాలంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, తోడుగా రమ్మని కోరుతున్నాను. కారణం ఏమిటంటే.. ఎన్నికల్లో జరుగబోయే ఈ యుద్ధం ఒక్క చంద్రబాబునాయుడు వంటి నారా రాక్షసుడితో మాత్రమే కాదు. ఇతనికి తోడుగా ఎల్లో మీడియా ఉంది. వ్యవస్థలను మేనేజ్ చేసే పరిస్థితులు ఉన్నాయి. రెండు పత్రికలు, ఈ పెద్దమనిషికి తోడుగా ఉన్న అనేక చానెళ్లు.. వీటన్నింటితో కూడా యుద్ధం చేస్తున్నాం. ఇవన్నీ కాక ఈ జిత్తుల మారి మాయావి చంద్రబాబు ఎలాంటి పొత్తులైనా పెట్టుకుంటాడు. ఈ పెద్దమనిషి చేయని అన్యాయం, మోసం అంటూ లేదు. మీరు తోడుగా ఉంటే ఈ అన్యాయాలు, మోసాలన్నింటినీ జయిస్తాను. అందుకే నాడు తోడుగా ఉండి, ఆశీర్వదించమని ప్రతి అక్కాచెల్లెమ్మ, ప్రతి అవ్వా తాత, ప్రతి సోదరుడు, ప్రతి స్నేహితుడికి పేరు పేరునా విన్నవించుకుంటున్నా. మూడు నెలల్లో మంచి రోజులు వస్తాయని చెబుతున్నాను.

ఎంత మందికి భరోసా కల్పించామన్నదే ముఖ్యం..

హైదరాబాద్ నుంచి దుబాయ్ ఎంత దూరం ఉందో మీకు తెలుసా? అని ఇవాళ ఎవరో నాన్ను అడిగారు. ఎంత అని అడిగాను. 3 వేల కిలోమీటర్లు అని చెబుతూ.. మీరు 3,648 కి.మీ నడిచారన్నా అని చెప్పారు. అదే మాదిరిగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఎంత దూరం ఉందో మీకు తెలుసా అన్నా? అని కూడా అడిగారు. ఎంత? అని అడిగా.. అక్షరాలా 3,440 కి.మీ అని చెప్పారు. రికార్డులు దాటేసి ఏకంగా అంతకన్నా ఎక్కువ స్థాయిలో నడవగలిగాం అంటే నిజంగా ఇది కేవలం మీ ఆప్యాయతలు, ఆత్మీయతలు, పైనుంచి ఆ దేవుడి ఆశీస్సుల వల్లే జరిగాయని చెప్పటానికి ఏమాత్రం కూడా సంకోచించను. ఇవాళ ఎంతదూరం నడిచామన్నది ముఖ్యం కాదు.. ఎంతమందిని ప్రత్యక్షంగా కలిశాం? ఎంతమందికి మనం భరోసా ఇచ్చామన్నదే నిజంగా ముఖ్యమైన అంశం.

మోసాల్లో చంద్రబాబు పీహెచ్‌డీ..

చంద్రబాబు నాయుడిగారి నాలుగున్నరేళ్ల పాలనలో ఎలాంటి పనులు చేశాడో చూశామన్నా. ఆయన చేసిన పరిపాలన గురించి ప్రజలు చెబుతూ ఉంటే, జరుగుతున్న అన్యాయాలను చూస్తూ ఉన్నప్పుడు నిజంగా ఆందోళన కలుగుతోంది. ఒక వంక రాష్ట్రంలో కరువు ఇంకో వంక తుపాన్‌లు.. ఒక వంక రాష్ట్ర విభజన నష్టం.. ఇంకో వంక చంద్రబాబు నాయుడి గారి దోపిడీతో నష్టపోయిన రాష్ట్రం.. మరోవంక వ్యవసాయం దెబ్బతిని గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతున్న పరిస్థితులు. మరోవంక రుణమాఫీ అంటూ చంద్రబాబు చేసిన మోసం.. ఒక వంక నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగం మరోవంక నిరుద్యోగ భృతి రెండు వేలు ఇస్తా ప్రతి నెలా అని చెబుతూ మోసగించిన చంద్రబాబు నైజం. ఒకవంక 2014 ఎన్నికల్లో చంద్రబాబు గెలవడానికి చేసిన వాగ్దానాలు.. మరోవంక 650 వాగ్దానాలు తన మ్యానిఫెస్టోలో పెట్టి, ప్రతి పేజీ ఒక కులానికి కేటాయించి.. ప్రతి కులాన్ని ఎలా మోసం చేయాలి? అని పీహెచ్‌డీ చేసిన వ్యక్తి మరోవంక. ఆయన చేసిన హామీలు, మోసాలు మరోవంక.. ఇవన్నీ చూస్తూ ఉంటే నిజంగా గుండె మండుతూ ఉంటుంది. పిల్లల్ని అవిటివారిగా మార్చి అడుక్కునే వారికి, రాష్ట్రం కష్టాల్లో ఉందని పదేపదే చెబుతూ విచ్చలవిడిగా దోచుకుంటున్న ఈ చంద్రబాబు గారికి ఏమైనా తేడా ఉందా? అని మీ అందరి తరపున అడుగుతున్నా’’ అని జగన్ పేర్కొన్నారు.

అందరికీ కృతజ్ఞతలు : తలశిల రఘురాం

చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో దిగ్విజయంగా ముగిసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రకు అపూర్వ ఆదరాభిమానాలు తెలిపిన ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృతజ్ఞతలు తెలుపుతోందని ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం ఒక ప్రకటనలతో తెలిపారు. యాత్ర విజయ వంతం కోసం కృషి చేసిన వివిధ జిల్లాల పార్టీ శ్రేణులు, నాయకులు, పాత్రికేయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జగన్ ఇచ్చిన హామీలు అమలు చేసేలా ఆయనను అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు.

మీ అందరి దీవెనలు కావాలి..

ఈవాళ రాష్ట్రంలో పాలన చూడండి. మంచి పాలన ఎక్కడా లేదు. మీడియాను మేనేజ్ చేసుకుని తనకు అనుకూలమైన ఎల్లో మీడియా, రెండు పత్రికలు, అనేక టీవీ చానల్స్‌ను అడ్డంపెట్టుకుని రాష్ట్ర ప్రజలకు ఏమీ చేయక పోయినా చేసినట్టుగా గోబెల్స్ ప్రచారం జరుతోందనే విషయం గమనించమని మిమ్మల్ని కోరుతున్నా. ఇటువంటి పరిస్థితి పోవాలి. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థలోకి నిజాయితీ రావాలి. విశ్వసనీయత అనే పదానికి నిజమైన అర్థం రావాలి. ఎవరైనా రాజకీయ నాయకుడు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకపోతే మేనిఫెస్టోలో పెట్టిన తర్వాత కూడా వాటిని నెరవేర్చకపోతే.. పదవికి తాను రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి రావాలి. అప్పుడే విశ్వసనీయత, నిజాయితీ అనే పదానికి అర్థం కాస్తో కూస్తో వస్తుంది. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చాలంటే జగన్ ఒక్కడి వల్ల అయ్యే పని కాదు. జగన్‌కు మీ అందరి తోడు, దీవెనలు కావాలి’’ అని వైఎస్ జగన్ అన్నారు.

ఆకాశమంత అభిమానం..

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఇచ్ఛాపురం జనసంద్రమైంది. వేలాది మంది ప్రజల అభిమానంతో బహుదా నది ఉప్పొంగింది. అశేష జనప్రవాహంతో రహదారులు కిక్కిరిసిపోయి జాతరను తలపించాయి. యువత కేరింతలు.. అక్కాచెల్లెమ్మల ఆనంద నృత్యాలు.. వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలు.. జై జగన్ నినాదాలతో ఇచ్ఛాపురం యావత్తూ హోరెత్తింది. ప్రజా సంకల్ప యాత్ర ముగింపు రోజైన బుధవారం భావోద్వేగాల మధ్య ప్రజలు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ వెంట అడుగులో అడుగేశారు. ఇరుకు రోడ్లపైనా పరుగులు పెట్టారు. ఇసుకేస్తే రాలనంత మంది ఉన్నా.. వెనుకాడకుండా జగన్ బాటలో నడిచి తమ అభిమానం చాటుకున్నారు. ‘ప్రజా సంకల్పం’ముగింపు సభ నుంచి ‘విజయ సంకల్పానికి’ప్రతినబూనారు.

యుద్ధానికి పోతున్న సైన్యంలా..

ప్రజా సంకల్పయాత్ర ఆఖరి ఘట్టాన్ని చూసేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచే కాకుండా.. వివిధ రాష్ట్రాల నుంచి సైతం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి కదలివచ్చారు. దీంతో దారులన్నీ వేలాది వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ఎటు చూసినా జనం.. జనమే. బుధవారం ఉదయం పాదయాత్ర శిబిరం నుంచి బయటకు వచ్చిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ కొద్దిక్షణాల్లోనే అశేష జనసంద్రంలో కలిసిపోయారు. అంతమందిలో ఆయనెక్కడున్నారో గుర్తించడం చాలా మందికి కష్టమైపోయింది. పాదయాత్ర మొదలైన ఐదు నిమిషాల్లోనే కిలోమీటర్ల కొద్దీ జనం ఆయన వెన్నంటే ముందుకు సాగారు. ‘ఈ దృశ్యాన్ని దూరం నుంచి చూస్తే ఓ సైన్యం యుద్ధానికి పోతున్నట్టుగా ఉంది’అని ఓ వ్యక్తి వ్యాఖ్యానించగా.. ‘అవును ఇది చంద్రబాబు మీదకు సాగే యుద్ధమే. అవినీతిని అంతం చేసే సైన్యమే’అంటూ ఇచ్ఛాపురానికి చెందిన మారం రాజులు అనే వ్యక్తి ఉద్వేగంతో చెప్పాడు. ఇచ్ఛాపురం సభ ఓ చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుందని పలువురు పేర్కొన్నారు. జగన్ ప్రసంగం సాగుతున్నంత సేపూ ప్రజల జగన్ నినాదాలు చేస్తూ, చప్పట్లతో ప్రతిస్పందించారు. నాలుగున్నరేళ్ల చంద్రబాబు పాలనను లక్ష్యంగా చేసుకుని జగన్ నిప్పులుచెరుగుతున్నప్పుడు.. ప్రజలు సైతం ఆవేశంతో ఊగిపోయారు. ‘కాబోయే సీఎం..’అంటూ జేజేలు పలికారు.

పండుగ ముందే వచ్చింది..

ఇచ్ఛాపురం వీధుల్లో ఎక్కడ చూసినా సందడే. ఏ గడపకెళ్లినా ఆనందమే. పాదయాత్ర ముగింపు సన్నివేశాన్ని చూడ్డానికి ఆ ఊరివాళ్లు తమ బంధువులను, స్నేహితులను ఇళ్లకు పిలుచుకున్నారు. ‘వైఎస్ కుటుంబంలో మూడో వ్యక్తి పాదయాత్ర మా ఊరిలో ముగుస్తోంది. మాకిప్పుడే సంక్రాంతి వచ్చినట్టు ఉంది’అని ఏరాసుల రామారావు ఆనందం వ్యక్తం చేశాడు. ‘వైఎస్‌ను, ఆయన కూతురు షర్మిలమ్మను, ఇప్పుడు జగన్‌ను.. ముగ్గుర్నీ కలిశాను. చాలా సంతోషంగా ఉంది’అని పద్మజ తెలిపింది. మరికొందరు పాదయాత్ర ముగింపు సందర్భంగా విజయ సంకేతాలతో ఇళ్ల ముందు రంగవల్లులు దిద్దారు. ‘పండగకు తెచ్చుకున్న దుస్తులు ఇప్పుడే వేసుకున్నాం’అని ఈశ్వరి, కల్పన తెలిపారు.

ఈ బాబును సీఎంగా చూడాలనుందయ్యా..


పాదయాత్ర ముగింపు రోజున కొందరు ఉద్వేగానికి గురయ్యారు. ‘ముగింపు సన్నివేశం చూడ్డానికి వచ్చారా?’అని రామశౌరమ్మ అనే మహిళను అడగ్గా.. ‘కేవలం చూడ్డానికే రాలేదయ్యా... ఈ బాబును సీఎంగా చూడాలనుంది. ఏడాదిగా నడిచాడు బిడ్డ. ఎలా ఉన్నాడో చూద్దామనొచ్చాం. ఈయనొస్తే మాలాంటోళ్లకు మంచి జరుగుతుందయ్యా..’అంటూ ఉద్వేగానికి గురైంది. ‘తెలుగుదేశపోళ్లు ఎన్ని కష్టాలు పెట్టారు ఆ బిడ్డను? కష్టం ఊరికే పోదయ్యా’అని కాల ముత్యాలు, మద్ది ఈశ్వరమ్మ పేర్కొన్నారు. ఈ ఇద్దరూ స్థూపం దగ్గర ఇతర మహిళలతో కలిసి ఆనందంగా నృత్యాలు చేశారు. మరోవైపు ప్రజా సంకల్ప యాత్ర ముగింపు రోజును చిత్రీకరించేందుకు పలు జాతీయ, ప్రాంతీయ చానెళ్లు పోటీపడ్డాయి. ఎవర్ని కదిపినా జగన్ పాదయాత్ర ఓ ప్రభంజనమంటూ వర్ణిస్తుండటంతో జనాభిప్రాయమేంటో అర్థమైందంటూ పలువురు విలేకరులు వ్యాఖ్యానించారు. మరోవైపు వైఎస్ జగన్ కూడా అంత జన ఒత్తిడిలోనూ ప్రతి ఒక్క మీడియా ప్రతినిధితోనూ మాట్లాడి తన మనోగతాన్ని వివరించారు.

341వ రోజు

మొత్తం నడిచిన దూరం: 3,648 కిలో మీటర్లు

341వ రోజు నడిచిన దూరం: 9.1 కిలో మీటర్లు

09-01-2019, బుధవారం, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా



రాజన్న రాజ్యాన్ని తేవాలన్న ప్రజా సంకల్పం..
నాలో వజ్ర సంకల్పంగా మారింది

మన సంకల్పం మంచిదైతే దేవుని దయ కూడా తోడవుతుంది. 14 నెలల కిందట ఇడుపులపాయలో నాన్నగారి పాదాల చెంత ప్రారంభమైన ప్రజా సంకల్ప యాత్ర.. ఇచ్ఛాపురంలో విజయ సంకల్ప స్తూపాన్ని చేరింది. 341 రోజులుగా 13 జిల్లాల్లో.. 3,648 కి.మీ సాగిన యాత్ర.. నేటితో ముగిసింది. నాన్నగారు, సోదరి షర్మిల, నేను.. మా ముగ్గురి పాదయాత్రలు ఇచ్ఛాపురంలోనే ముగియడం చరిత్రాత్మకం. దానికి గుర్తుగా మూడు స్తూపాలుండటం ఓ మధుర జ్ఞాపకం. ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు వేలాది కిలోమీటర్లు పాదయాత్రలు చేయడం.. కోట్లాది మంది ప్రజలను ప్రత్యక్షంగా కలవడం.. ప్రపంచ చరిత్రలో ఎవరికీ దొరకని అదృష్టం. ఇది దైవ నిర్ణయం.. ఇది ప్రజల ఆశీర్వాదం. కోట్లాదిమంది గుండె చప్పుళ్లు వినగలగడం.. నా జీవితానికే గొప్ప అనుభవం. నా ఈ పాదయాత్ర ప్రజల కష్టాలను, కడగండ్లను అతి దగ్గరగా చూడగలిగిన అవకాశం. పరిష్కరించదగిన చిన్న చిన్న సమస్యలు కూడా తీరకపోవడంతో సంవత్సరాల తరబడి వారు చేస్తున్న జీవన పోరాటం.. గుండెను బరువెక్కించింది. అత్యధికశాతం సమస్యలకు పాలకులే కారణమవడం ఆశ్చర్యమేసింది. గుండెను పిండే దయనీయ గాథలెన్నో ఎదురయ్యాయి.

ఉదయగిరిలో అంకమ్మరావు అనే బలహీనవర్గాలకు చెందిన ఇంజనీరింగ్ చదువుతున్న ఓ సోదరుడు.. ఫీజురీయింబర్స్‌కాక, బకాయిలు కట్టడానికి కూలి పనులు చేసే తండ్రి పడుతున్న కష్టాన్ని చూడలేక ఆత్మహత్య చేసుకోవడం మనసును కలచివేసింది. అప్పులు తీర్చడం కోసం కిడ్నీ అమ్ముకున్న ఓ అన్నదాత.. బతుకుదెరువు కోసం గుంటూరు జిల్లాలోని ఓ చిన్న హోటల్లో పనిచేస్తుండటం అత్యంత దయనీయం. కొండకెంగువలో 108 రాక.. దండసి మేరీ అనే ఓ సోదరి ఆటోలో కుదుపులకు రక్తస్రావమై పురిటిలోనే బిడ్డను కోల్పోయిన ఘటన చలింపజేసింది. విజయవాడలో నిండా 30 ఏళ్లు నిండని ఓ ముస్లిం సోదరి.. ఆరోగ్యశ్రీ అందక, ముఖ్యమంత్రి సహాయ నిధి రాక, కిడ్నీ చికిత్స కోసం భర్త నడుపుకుంటున్న ఆటోను కూడా అమ్మేసుకుని.. ఆదుకునేవారి కోసం ఎదురుచూస్తుండటం గుండెను పిండేసింది. రుణమాఫీ మాటలు నమ్మి మోసపోయి.. చేయని పాపానికి లాయర్‌ను పెట్టుకుని కోర్టు మెట్లెక్కిన వెంకటాపురం దళితవాడ డ్వాక్రా అక్కచెల్లెమ్మల కష్టాలు కళ్లారా చూశాను. 90 ఏళ్లు పైబడ్డ పండు ముసలివాళ్లు.. భర్తలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వితంతువులు మొదలుకుని.. వందశాతం వైకల్యంతో మంచానికే పరిమితమైన దివ్యాంగుల వరకు.. దాదాపు 900 మందికి నిర్దాక్షిణ్యంగా పింఛన్‌లు తొలగించిన పాలక నేతల రాక్షసత్వం పొందూరులో నా దృష్టికొచ్చింది. అమ్మణ్ణమ్మ అనే అవ్వ చనిపోయిందని పింఛన్ ఆపితే.. ‘నేను బతికే ఉన్నా’నని కోర్టులో చెప్పుకోవాల్సిరావడం.. భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంల ఉన్న మెట్ట లక్ష్మి అనే సోదరి వితంతువు కాదంటూ పింఛన్ ఆపితే.. ‘నాకు పింఛన్ అవసరం లేదు.. నా భర్తను చూపండి చాలు’ అంటూ న్యాయమూర్తికి మొరపెట్టుకోవడం.. ప్రభుత్వ దార్ష్టీకాలకు పరాకాష్ట. భర్తలుండగనే పిఠాపురంలో తప్పుడు డెత్ సర్టిఫికెట్లు సృష్టించి.. సుమంగళిలను వితంతువులుగా చూపించి.. పింఛన్‌లు మింగేసిన వైనం.. అధికార నేతల దిగజారుడుతనానికో నిదర్శనం. అన్నపూర్ణగా పేరుగాంచిన గోదావరి జిల్లాలోని గొల్లప్రోలు మండలంలోనే.. ఈ పాలనలో ఏకంగా ఏడుగురు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం.. వ్యవసాయ దుస్థితికి అద్దం పట్టింది. ప్రభుత్వ సాయం కరువై.. జీవచ్ఛవాల్లా బతుకుతున్న ప్రకాశం ఫ్లోరైడ్ కథలు.. ఉద్దానం కిడ్నీ వెతలు.. కంటతడి పెట్టించాయి. ముఖ్యమంత్రిగారిచ్చిన తుపాను పరిహారపు చెల్లని చెక్కుల మోసాలు.. వనరులన్నింటినీ దోచేసిన వైనాలు.. జన్మభూమి కమిటీల దుర్మార్గాలు.. వంచిపబడ్డ అన్ని కులాల, వర్గాల, సంఘాల ఆక్రోశాలు.. జీవితాలను ఛిద్రంచేసిన మద్యం కథలు.. వలసల వెతలు.. అభివృద్ధిలేక, సంక్షేమం అందక సంక్షోభంలో కూరుకుపోయిన జన జీవితాలు.. ఒక్కటేమిటి, సమస్తం పాదయాత్రలో సాక్షాత్కరించాయి.

చెప్పుకునే దారిలేక.. మనసు విప్పే మార్గం కనిపించక.. తల్లడిల్లుతున్న కోట్లాదిమంది జనం నా అడుగులో అడుగులేశారు. వారి ప్రేమ, ఆప్యాయతలే నన్ను నడిపించాయి. ఆ ప్రజా సంకల్పమే దేశ రాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికింది. అధికార పార్టీ అవకాశవాద ముసుగు తొలగించింది. కన్ను కుట్టిన పాలక నేతల కుట్రల నుంచి పుట్టుకొచ్చిన హత్యాయత్నం నుంచి.. ప్రజాశీర్వాదమే నన్ను కాపాడింది. ఆ ప్రజల నమ్మకం.. నా బాధ్యతను మరింత పెంచింది. ‘ఎంతకాలం బతికామన్నది కాదు.. ఎంతమంది హృదయాల్లో జీవించామన్నది ముఖ్యం’ అన్న నాన్నగారి మాటలు నా మదిలో మెదలుతున్నాయి. రాజన్న రాజ్యాన్ని తేవాలన్న ప్రజా సంకల్పం.. నాలో వజ్ర సంకల్పంగా మారింది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. నాన్నగారి పాదయాత్ర నుంచి ఆరోగ్యశ్రీ, 108, ఫీజురీయింబర్స్‌వంటి అనేక అద్భుత పథకాలు పుట్టుకొచ్చాయి. మీ పాదయాత్ర నుంచి వచ్చిన ఒక్కటంటే ఒక్క పథకమైనా ఉందా? మీ పాదయాత్ర నాటి హామీలు నెరవేరకపోగా.. ఆ నాటి సమస్యలు మరింత జటిలమయ్యాయని.. మీ వల్లనే మరిన్ని సమస్యలు పుట్టుకొచ్చాయని.. జీవితాలు దుర్భరమయ్యాయని.. ప్రజలు ఆక్రోశిస్తున్నారు.. వారికేం సమాధానం చెబుతారు?

వై.యస్. జగన్.

సాక్షి
గురువారం, జనవరి, 10

సీబీఐకి 'సుప్రీం' కవచం

మూడు నెలలక్రితం హఠాత్తుగా ఓ అర్థరాత్రి సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను సెలవుపై పంపిన ఎన్‌డీఏ ప్రభుత్వ నిర్ణయానికి సర్వోన్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఆయన్ను తిరిగి ఆ పదవిలో కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు వెలువరించింది. అయితే తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ పూర్తయ్యేవరకూ అలోక్ వర్మ ప్రధానమైన విధాన నిర్ణయాలను తీసుకోరాదని స్పష్టం చేసింది. ఆయనపై ఇప్పటికే ప్రధాన విజిలెన్స్ కమిషనర్(సీవీసీ) దర్యాప్తు చేసి సమర్పించిన నివేదిక ప్రభుత్వం దగ్గరుంది. దాన్ని ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేతలతో కూడిన ఎంపిక సంఘం పరిశీలించి వారంలోగా తన నిర్ణయాన్ని ప్రకటించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే అలోక్ పదవీకాలం ఈ నెలాఖరుతో పూర్తవుతుంది. ఇప్పటికే ఆయన వారసుడి ఎంపిక కోసం కేంద్రం 9మందితో ఒక జాబితా రూపొందించింది. అలోక్ విషయంలో తమ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు మౌలికంగా తప్పు బట్టలేదని, కేవలం ఎంపిక సంఘం చేయాల్సిన పనిని ప్రభుత్వమే చేసిందన్నదే దాని అభ్యంతరమని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అంటున్నారు. అందుకు రుజువుగా ప్రధానమైన విధాన నిర్ణయాలు తీసుకోరాదని అలోక్‌పై ఆంక్షలు విధించడాన్ని చూపుతున్నారు. అయితే సెలవుపై పంపడానికి కారణమైన సీవీసీ నివేదికను ఈ విచారణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించింది. దాన్ని చూశాక కూడా అలోక్ వర్మ యధావిధిగా పదవిలో కొనసాగవచ్చునని ధర్మాసనం చెప్పిందంటే ఆ ఆరోపణల్లో అంత పసలేదన్న అభిప్రాయం అందరికీ కలుగుతుంది. సీవీసీ నివేదికపై అభిప్రాయం చెప్పమని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్‌ను సుప్రీంకోర్టు కోరింది. ఆయన అభిప్రాయం వెల్లడయ్యాకే ధర్మాసనం తాజా ఉత్తర్వులిచ్చింది. చివరిగా ఎంపిక సంఘం ఏం తేలుస్తుందన్న సంగతలా ఉంచితే సీబీఐ స్వతంత్రతను కాపాడటానికి సుప్రీంకోర్టు పడుతున్న తపనను ఈ తీర్పు తేటతెల్లం చేస్తోంది. ప్రస్తుతం సీబీఐకి తాత్కాలిక డైరెక్టర్‌గా ఉంటున్న జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావును ధర్మాసనం ఆ బాధ్యతలనుంచి తప్పించింది. ఇంతకూ అలోక్‌తో లడాయికి దిగిన ఆ సంస్థ ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ ఆస్థానా పరిస్థితేమిటో మాత్రం తీర్పు స్పష్టం చేయలేదు. కేంద్రం నిర్ణయాన్ని అలోక్ సవాలు చేశారుగానీ ఆస్థానా మౌనంగా ఉండిపోయారు. కానీ తనకు వ్యతిరేకంగా అలోక్ నమోదు చేయించిన అవినీతి కేసును కొట్టేయాలని ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అదింకా పెండింగ్‌లో ఉంది.

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు ఆ సంస్థను ఎంతగా భ్రష్టు పట్టించిందో ఎవరూ మరిచిపోలేరు. దేశంలోనే ఉన్నతశ్రేణి దర్యాప్తు సంస్థగా పేరు ప్రఖ్యాతులున్న ఆ సంస్థ యూపీఏ ప్రభుత్వ తీరుతో నీరసించింది. ఒక దశలో 'పంజరంలో చిలుక'లా వ్యవహరించవద్దని సీబీఐని సర్వోన్నత న్యాయస్థానం చీవాట్లు పెట్టవలసి వచ్చింది. కానీ దానికి అధిపతులుగా వచ్చినవారిలో మాత్రం ఆ వ్యాఖ్య ఏ మార్పూ తీసుకురాలేదు. ఇవాళ ఎన్‌డీఏ సర్కారు కొత్తగా దాన్ని, మరికొన్ని ఇతర వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని ఆరోపిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను విపక్షంలో ఉండి కూడా కాంగ్రెస్‌తో చీకటి లాలూచీలు నడిపి సీబీఐని చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి ఎలా ప్రయత్నించారో అందరికీ గుర్తుంది. సమస్యంతా ఇలాంటి వారితోనే. అటు కాంగ్రెస్‌కూ, ఇటు చంద్రబాబుకూ సీబీఐ తమ పంజరంలో చిలుకలా ఉండాలి. కానీ వేరేవాళ్ల పంజరంలో ఉండటమే వారికి అభ్యంతరకరం. తమ చరిత్రలు ప్రజలకు తెలుసన్న ఇంగితజ్ఞానం ఈ బాపతు నేతలకు ఉండటం లేదు.


కేంద్రంలోని ఇతర విభాగాల కంటే సీబీఐపైనే ఎక్కువగా ఆరోపణలు వస్తుంటాయి. అది అధికారంలో ఉన్నవారు చెప్పినట్టల్లా ఆడుతోందన్నది వాటిల్లో ప్రధానమైనది. కానీ ఈమధ్య కాలంలో దాని వ్యవహారాలు మరింతగా శ్రుతిమించాయి. అలోక్ వర్మ రాకేష్ ఆస్థానాపై దర్యాప్తు మొదలెట్టారు. ఈ సంగతి తెలిసి ఆస్థానా సైతం అలోక్ వర్మపై ఎదురు దర్యాప్తునకు ఆదేశాలిచ్చి అందరినీ విస్మయంలో పడేశారు. అంతేకాదు...ఇద్దరూ సీవీసీ దగ్గర పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. అలా ఫిర్యాదులు చేసుకున్నప్పుడు దాన్ని ఆసరాగా తీసుకుని సీబీఐ వ్యవహారాలను తన చేతుల్లోకి తీసుకోవాలనుకోవడం కేంద్రం చేసిన తప్పిదం. సంక్షోభం తలెత్తినప్పుడు ఏం చేయాలన్న విషయంలో నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పుడు వాటిని కాదని ఇష్టానుసారం చేయడం సరికాదు. తాము అలోక్, ఆస్థానాలను బదిలీ చేయడం లేదా తొలగించడం వంటివి చేయలేదు గనుకే ఎంపిక సంఘాన్ని సంప్రదించలేదన్న అటార్నీ జనరల్ వాదనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఎంపిక సంఘం ద్వారా సీబీఐ నిర్వహణా బాధ్యతల్ని తీసుకున్న అలోక్‌ను వాటినుంచి తప్పించడమంటే సారాంశంలో ఆయన్ను పంపించడమే అవుతుందని, ఇది ఎంపిక సంఘం పరిధిలోనిదని స్పష్టం చేసింది. రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీయడానికి సీబీఐని, ఇతర వ్యవస్థలనూ ఇష్టానుసారం వినియోగించుకునే దుస్సంప్రదాయాన్ని నిలువరించడానికి తాజా తీర్పు ఎంతోకొంత దోహదపడుతుందనడంలో సందేహం లేదు. ఇకపై ప్రభుత్వాలు సీబీఐ విషయంలో మెలకువతో వ్యవహరిస్తాయి. కానీ డైరెక్టర్లుగా వచ్చేవారు ఈ తీర్పును కవచంలా ఉపయోగించుకుంటారా లేక యధాప్రకారం పాలకుల అభీష్టాన్ని నెరవేర్చే అలవాటును కొనసాగిస్తారా అన్నది చూడాలి. త్రికరణశుద్ధిగా విధులు నిర్వర్తించాలని, తాము నేతృత్వం వహిస్తున్న సంస్థ అత్యుత్తమ ప్రమాణాలను అందుకునేలా తీర్చిదిద్దాలన్న సంకల్పం కొరవడినప్పుడు ఎవరూ ఏం చేయలేరు. సంస్థలో తీసుకునే నిర్ణయాలన్నిటికీ అన్ని స్థాయిల్లోనూ జవాబుదారీతనం ఉండేలా పకడ్బందీ నిబంధనలు రూపొందేవరకూ వ్యక్తుల నిజాయితీపైనే వ్యవస్థల విశ్వసనీయత ఆధారపడక తప్పదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి శు.చవితి ప.2.07 వరకు, తదుపరి పంచమి నక్షత్రం శతభిషం రా.3.04 వరకు, తదుపరి పూర్వాభాద్ర వర్జ్యం ఉ.8.32 నుంచి 10.20 వరకు, దుర్ముహూర్తం ఉ.10.18 నుంచి 11.01 వరకు, తదుపరి ప.2.43 నుంచి 3.25 వరకు అమృతఘడియలు... రా.7.10 నుంచి 8.54 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.38
రాహుకాలం : ప. 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

జనహితం జగన్ 'లాంగ్‌మార్చ్'



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

వర్తమాన కాల పరిస్థితులను గమనిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం దాకా తలపెట్టిన అపూర్వమైన ప్రజాసంకల్ప యాత్ర సరికొత్త చైతన్యాన్ని రగుల్కొల్పింది. సంకల్పయాత్రలో భాగంగా నింగి లోతులు చూశారు, సేద్య ధారలందించే జలనిధుల్ని కొలిచారు. ప్రయాణించిన ప్రతిచోటా మట్టిబెడ్డను కలుసుకున్నారు. రాతిముక్కను కలుసుకున్నప్పుడల్లా దానిలోని రత్న తత్వాన్ని తెలుసుకున్నారు. వేలు, లక్షలాదిమంది సామాన్య ప్రజల గుండెచప్పుళ్లను దగ్గరగా విన్నారు. తన తపస్సు ఫలించి తన సందేశం తెలుగుజాతి గుండెల్లో ఘూర్ణిల్లి, అది కాస్తా జనత పాడుకునే మంత్రంగా మోగాలని ఆశిస్తున్నారు జగన్.

''నాగరికత సృష్టికర్త భూమండలం కాదు, మనిషి మాత్రమే''నని చాటినవారు ప్రపంచ ప్రసిద్ధ చరిత్రకారులు, ప్రపంచ నాగరికతా చరిత్రను సుమారు పదకొండు సంపుటాలలో క్రోడీకరించి దించిన సాధికార చరిత్రకారులు విల్ డూరాంట్, ఏరియల్ డూరాంట్ దంపతులు. ఆ నాగరికతలో అంతర్భాగంగానే సామాజిక పురోగతిలోని ఎగుడుదిగుళ్ల ఫలితంగా తలెత్తిన మానవకల్పిత అసమానతలకు, పరస్పర దోపిడీకి గురైన కారణంగా దగాపడిన దళిత బహుజన బడుగు వర్గాల సమున్నతికి కంకణం కట్టుకున్నవారు లేకపోలేదు. కానీ, ఈ అసహజ సామాజిక పునాదికి మూలాలు కనుగొన్న స్ఫూర్తి ప్రదాతలు అన్ని కాలాలలోనూ ఉన్నారు. ఒడ్డున నిలబడి సము ద్రాన్ని పొగడొచ్చుగానీ దాని లోతు పాతులు తెలుసుకోవడం కష్టం. ఈ పరిస్థితిని ఎక్కువ దూరదృష్టితో అంచనా కట్టినవాడు కవి సినారె. ఆయన మాటల్లోనే:

''ఎన్ని మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలు
నింగి లోతును చూడగోరితే నీటి చుక్కను కలుసుకో!
మనిషి మూలం తెలియగోరితే మట్టిపెడ్డను కలుసుకో!
రత్న తత్వం చూడగోరితే రాతిముక్కను కలుసుకో!
రత్నమై ప్రకాశించాలంటే ముందుగా రాతి తత్వం తెలుసుకో!
కాలగతిలో ఎంత చరిత్ర దాగెనో మౌన వీణను మీటి తెలుసుకో!''

ఆ తవ్వోడలో భాగంగా ఆ తూరుపుకొండల్లోనే ఉదయించిన సూర్యులెందరో, అరచేతిని అడ్డుపెట్టినా ఆ సూర్యకాంతిని ఎవరూ ఆపలేరన్న సందేశమూ ప్రకాశమానంగా, నేటికీ జాలువారు తున్నదీ ఆ సంప్రదాయం నుంచే. అదే స్ఫూర్తితో నేడు జనహితమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, యువనేత, రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడూ, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రజా నాయకుడు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి యుక్త వయసులోనే తన చుట్టూ పాలకులల్లిన ముళ్ల కంచె నుంచి బయటపడి తెలుగు జన మహా సంద్రంలోకి దిగి తన అనుభవ పాఠం నుంచి ప్రజా శ్రేయస్సు కోసం ప్రజా సంకల్ప యాత్ర ద్వారా కొత్త పాఠాలు నేర్చుకోసాగారు. పాలకపక్షాల కుట్రలను, కుహకాలను ఛేదించడం కోసమే జగన్ ఒక్క అడుగుతో ప్రారంభించిన జనహిత యాత్రను ప్రజా సంకల్పయాత్రగా మార్చడంలో భాగంగా నింగి లోతులు చూశారు, సేద్య ధారలందించే జలనిధుల్ని కొలిచారు, మనిషి మూలాలను తెలుసుకునేందుకు ప్రయాణించిన ప్రతిచోటా మట్టిబెడ్డను కలుసుకున్నారు. రాతిముక్కను కలుసుకున్నప్పుడల్లా దానిలోని రత్న తత్వాన్ని తెలుసుకున్నారు, తద్వారా కాలగతిలో దాగిన పేదజీవులు, కష్టజీవులు చిందించి నిర్మించిన చరిత్రనూ ఈ ప్రజా సంకల్ప యాత్రలో తన మౌనవీణను మీటి మరీ తెలుసుకున్నారు. రత్న తత్వాన్ని గ్రహించిన జగన్ ప్రజల కనీస అవసరాలను తీర్చగల 'నవరత్న' పథకాన్ని రూపొందించారు. పాలకులు ఉద్దేశిత లక్ష్యాలను నెరవేర్చనప్పుడు రాజీనామా ఇచ్చి పోవాలన్న నీతిని ప్రజల మనస్సుల్లో నాటగలిగారు.

అంతేగాదు, కేంద్ర, రాష్ట్రాలలోని పాలకాధములు తనను, తన భవిష్యత్తును రాచి రంపాన పెట్టడానికి ఏ నీచానికైనా పాల్పడటానికి సిద్ధమైనప్పుడు అనితర సాధ్యమైన ఆత్మస్థయిర్యంతో హుందాగా ఎదుర్కొంటూ తొట్రుపాటు లేకుండా, నిమిషంపాటు అసహనాన్ని కూడా ప్రదర్శించకుండా అనునిత్యం దుష్టపాలనా శక్తులను ఒక్కుమ్మడిగా ఎదుర్కోగల ధైర్యాన్ని, దిటవునూ తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజలలో

రెండో మాట



పాదుకొల్పుతూ జగన్ చేసిన మహా సాహస శాంతి క్రతువు ప్రపంచ చరిత్రలో మరొక 'లాంగ్‌మార్చ్'గా చెప్పుకోవచ్చు. ఛైర్మన్ మావో సేటుంగ్ నాయకత్వంలో చైనీస్ రెడ్ ఆర్మీ నిర్వహించిన 'లాంగ్ మార్చ్'కి, జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సాగించిన ప్రజా సంకల్పయాత్రకు మధ్య కొన్ని అంశాలలో పోలికలు లేకపోలేదు: 370 రోజులలో చైనీస్ 'లాంగ్ మార్చ్' 9,000 కిలోమీటర్ల (5,600) మైళ్ల పర్యంతం సాగగా, జగన్ ప్రజా సంకల్పయాత్ర 341 రోజుల్లో 3,600 కిలోమీటర్లు (2,237 మైళ్లు) పూర్తి చేసుకుంది. ప్రపంచ చరిత్రలో ఈ రెండూ చరిత్ర సృష్టించిన 'పాదయాత్ర'లే. చైనీస్ రెడ్ ఆర్మీ దేశ విమోచన కోసం గ్రామాలను, పట్టణాలను ప్రజా సహకారంతో విముక్తి గావించుకుంటూ సాగిన విప్లవ ప్రభంజనం కాగా, వైఎస్సార్ సీపీ అధినేత జగన్ సుదీర్ఘ సంకల్పయాత్ర.. పాలకుల అంధ పరిపాలన నుంచి బయటపడి వెలుగు చూడగోరుతున్న గ్రామీణ, పట్టణ, పేద, మధ్యతరగతి వృత్తి జీవులు, రైతాంగ విద్యాధిక యువతతో కూడిన లక్షలు, కోట్లాది తెలుగు ప్రజలలో నవ చైతన్యాన్ని రగుల్కొల్పగలిగిన మహా సంఘటన.

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో పాదయాత్రలకు తొలిరూపం 1935–1936లో నాటి మద్రాసు శాసనసభకు, ముఖ్యమంత్రి రాజగోపాలాచారి మంత్రివర్గానికి రైతాంగ సమస్యలపై బృహత్ మెమొరాండాన్ని సమర్పించడానికి కొమ్మారెడ్డి సత్యనారాయణ, కమ్యూనిస్టు నాయకులు చలసాని వాసుదేవరావు నాయకత్వంలో ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు 1,500 కిలోమీటర్లు సాగిన రైతాంగ పాదయాత్ర. ఆ తరువాతి ఖ్యాతి– ఏపీలో కునారిల్లి పోతున్న కాంగ్రెస్‌ను పునఃప్రతిష్ఠించేందుకు కాంగ్రెస్ నాయకుడు, జనప్రియుడైన రాజశేఖరరెడ్డి తలపెట్టి జయప్రదంగా నిర్వహించిన రాష్ట్రవ్యాపిత పాదయాత్రకు దక్కుతుంది. వైఎస్సార్ పూర్వీకులు కాలానికి ఎదురీతగా నిలిచిన త్యాగధనులు. ఆ వారసత్వాన్ని, స్ఫూర్తినీ నేటితరంలో కొనసాగించిన వారు విజయమ్మ, కూతురు షర్మిల, జగన్‌మోహన్‌రెడ్డి. ఈ ముగ్గురి పాదయాత్రలకు వైఎస్ భారతి అందించిన ప్రోత్సాహం విస్మరించదగినది కాదు.

మన దేశ చరిత్రలో ఆధ్యాత్మిక యాత్రలు, భజన సమాజాల యాత్రలే ఎక్కువ కానీ, నిజ జీవనానికి, ప్రజా సౌభాగ్య రక్షణకు, సమ సమాజ స్పృహతో నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్రలు తక్కువ. దేశ చరిత్రలో రాజకీయ పాదయాత్రలూ లేకపోలేదు. గతంలో మహాత్మా గాంధీ నాయకత్వంలో 1917లోనే బిహార్‌లోని చంపారన్‌లో ఉద్యమించిన దేశ తొలి రైతాంగ పోరాటం. ప్రజా సమస్యలు, వాటికిగల కారణాలను ఏకరువు పెడుతూ సాగిన మహోద్యమమది. ఆ తర్వాత స్వతంత్ర భారతంలో ప్రజాతంత్ర రిపబ్లిక్ రాజ్యాంగాన్ని పాలకులు భ్రష్టుపట్టించి, నిరంకుశ పాలనా శకాన్ని ప్రారంభించడంతో జయప్రకాష్ నారాయణ్, చంద్రశేఖర్ వంటి సర్వోదయ నాయకులు ప్రజలలో చైతన్యం రగిలించడానికి ఎన్నో ఉద్యమాలు, పాదయాత్రలూ నిర్వహించాల్సి వచ్చింది.

సరిగ్గా ఈ స్ఫూర్తినుంచే, వర్తమాన కాల పరిస్థితులను గమనిస్తున్న వైఎస్ జగన్ ఏపీలో ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం దాకా తలపెట్టిన అనుపమానమైన జనహిత, ప్రజాసంకల్ప యాత్ర సరికొత్త చైతన్యాన్ని రగుల్కొల్పింది. అది ఆయనలో తాను గుర్తెరిగిన ప్రజా సమస్యల పరిష్కారం వైపుగా యజ్ఞదీక్షకు బీజాలు నాటింది. నేటి పాలనాధికారపు మంత్రనగరిలో గణతంత్ర రిపబ్లిక్ అవతరణకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు వీలు కల్పించిన రాజ్యాంగమూ, అది నెలకొల్పిన వ్యవస్థలనూ దఫదఫాలుగా నిరంకుశ పాలకులు ఎలా భ్రష్టు పట్టిస్తున్నారో జగన్‌కు తెలిసిపోయింది. చివరికి రాష్ట్ర పాలకులు కూడా కత్తిపోటు రాజకీయాన్ని ఆశ్రయించి న్యాయవ్యవస్థలనూ, నేర విచారణ సంస్థలనూ శాసించే నిరంకుశులుగా మారడమూ, సత్వర న్యాయ విచారణకు, శిక్షా నిర్వహణకు వీలు లేనంతగా పాలకులు అన్య మార్గాలను అనుసరించి 'రూల్ ఆఫ్ లా' నుంచి, తప్పుకోవడానికి ద్వారాలు వెదకడమూ జరుగుతోంది. ఈ దారుణ పరిస్థితి– గత పదిహేనేళ్లలో న్యాయ వ్యవస్థలో పరోక్ష జోక్యానికి స్థానిక పాలకులు పాల్పడిన పరిణామాలను జగన్‌తోపాటు ప్రజలూ, బాధ్యతగల పాత్రికేయులూ నిశితంగానే పరిశీలిస్తున్నారు.

తన ప్రజా సంకల్పయాత్రలో జగన్ వేలు, లక్షలాదిమంది సామాన్య ప్రజల గుండెచప్పుళ్లను దగ్గరగా విన్నారు. ఒక్క ముసలి, ముతకలతోనే కాకుండా, అసంఖ్యాకంగా యువతీ యువకులతో ఎలా ఇంటరాక్ట్ అయ్యాడో, అంతే అసంఖ్యాకంగా వయోజన స్త్రీ పురుషులతో ఆప్యాయంగా మెలిగి వారి మనస్సులను గెలుచుకున్నారు. కుల, మత, వర్గ విచక్షణ లేకుండా చిన్నారులు, చంటిబిడ్డలను సహితం గోముగా, ఆప్యాయంగా ముద్దాడి, దీవించారు. అంతటి యాత్రలకూ అలసటగానీ, విసుగూ, విరామాలుగానీ లేకుండా నిరంతర చైతన్య జ్వాల మధ్య చిరునవ్వుతోనే– జన సమూహాల నుంచి వస్తున్న పలు అర్జీలను, మహజర్లను, జరగాల్సిన పనులపై మెమోరాండాలు, వినతి పత్రాలు అందుకున్నారు. కమ్మరి కొలిమినీ తట్టారు, కుమ్మరి చక్రాన్నీ తిప్పారు. రైతు గుండెకు భరోసా ఇచ్చారు. సహస్ర వృత్తుల సమస్త చిహ్నా లకూ పరిచయమయ్యారు. తన మెడకు పాలక వర్గాలు ఎక్కు పెట్టిన 'కోడికత్తి' వ్యూహాన్ని త్వరలోనే ఛేదించబోతున్నారు జగన్. ఈ దుర్మార్గాన్ని గుర్తు చేసుకోబట్టే 'ఆః' అనే ఆశ్చర్యార్థక కవితలో మహాకవి శ్రీశ్రీ అంతరార్థాన్ని జగన్ బాధతో ఇలా మననం చేసుకోగలిగారు: ***''నిప్పులు చిమ్ముకుంటూ/నింగికి నేనెగిరిపోతే/ నిబిడాశ్చర్యంతో వీరు''*** నోరెళ్లబెడతారు, కుళ్లిపోతారు, కాగా ***''నెత్తురు కక్కుకుంటూ/నేలకు నే రాలిపోతే/ నిర్దాక్షిణ్యంగా వీరే''*** లోలోపల సంతోషిస్తారు అని గుండె భారంతో అనగలిగారు జగన్. అందుకే అతను చిరంజీవి, అతడు జన నేత. తన తపస్సు ఫలించి తన సందేశం తెలుగుజాతి గుండెల్లో ఘూర్ణిల్లి, అది కాస్తా జనత పాడుకునే మంత్రంగా మోగాలని ఆశిస్తున్నారు జగన్. ఆప్తవాక్యంగా చివరికొక్కమాట– జగన్ ప్రవర్తనకు, ఒద్దికకు అచ్చెరువొందిన వైసీపీ అగ్రనేతల్లో ఒకరైన మేకపాటి రాజమోహన్ రెడ్డి అన్నట్టుగా ''నన్ను నడిపించేవాడు నాకన్నా ఉన్నతుడై ఉండాలి'' తథాస్తు!!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కష్టపడాలి



"ఏ రాజకీయ పార్టీ తమ సామాజిక, ఆర్థిక స్థాయిని పెంపొందించడానికి సహాయ పడదని దేశంలోని ముస్లింలందరూ ఇప్పటికైనా గుర్తించాలి. ప్రతి ఒక్కరూ దేశంలోని ముస్లింలను ఓటు బ్యాంకుగానో, హిందుత్వాన్ని రెచ్చగొట్టడానికో మాత్రమే వినియోగించుకుంటున్నారు. తమ సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులు మెరుగుపరచుకోవడానికి వాళ్లే కష్టపడాలి"

– షాహిద్ సిద్ధిఖీ
నయీ దునియా వీక్లీ ఎడిటర్

చీకట్లోంచి..



"నేను దేశం గురించి ఆందోళన చెందుతున్నా. మనమంతా మానసికంగా అనారోగ్యం పాలైపోయాం. తీవ్రమైన ద్వేషం, తీవ్రమైన వ్యతిరేకత, తీవ్రమైన ఆగ్రహం. మనం అంధకార యుగంలో ఉన్నాం. ఈ చీకటి గుప్పిట్లోంచి భారతదేశాన్ని ఎవరైనా కాపాడాల్సి ఉంది"

– ఇరీనా అక్బర్
రచయిత్రి

కొత్త పుస్తకం



"నా కొత్త పుస్తకం 'ఉయ్ ఆర్ డిస్‌ప్లేస్డ్'లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శరణార్థి బాలికల కథలు ఉన్నాయి. భయంకరమైన ప్రయాణాలు, ఆప్తులను కోల్పోయినవారు, ఇంటి మీద బెంగతో ఉన్నవారి జీవితాలను గణాంకాలు, వార్తా కథనాలకు భిన్నంగా ఈ కథలు కళ్లకు కడతాయి"

– మలాలా
ఐక్యరాజ్యసమితి శాంతి దూత

స్త్రీ శక్తి



"రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ అద్భుతమైన ప్రసంగంతో ప్రతిపక్షం నోరు మూతపడిపోయింది. ఆమె చెప్పిన వాస్తవాలకు జవాబివ్వలేక స్త్రీ ద్వేషులుగా వ్యవహరిస్తున్నారు. భారతీయ నారీ శక్తికి వారంతా క్షమాపణ చెప్పాలి"

– అమిత్ షా, బీజేపీ అధినేత

హిజ్రా




"జాతీయ ప్రధాన కార్యదర్శిగా హిజ్రా, జర్నలిస్ట్ అయిన అప్సరా రెడ్డిని నియమించి, హిజ్రాకు పదవిని కట్టబెట్టిన మొట్టమొదటి పార్టీగా కాంగ్రెస్ చరిత్రను సృష్టించింది. దేశంలోని రాజకీయాలు మంచికే అయితే వివక్షకు గురైనవారికి ప్రాధాన్యతనిచ్చి సమాజం మంచి భవిష్యత్‌లోకి పయనించేందుకు దోహదం చేయాలి. అందుకే రాజకీయాలనేవి ఉన్నది. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీతో పోటీపడి భారతీయ జనతా పార్టీ కూడా ఇద్దరు హిజ్రాలను ముఖ్యమైన పదవుల్లో నియమిస్తే నేను ఎంతగానో సంతోషిస్తాను"

– అర్ఫా ఖనుమ్ షెర్వాణీ
సీనియర్ జర్నలిస్ట్

పిన్నల కోసం..

జీవన కాలమ్



గొల్లపూడి మారుతీరావు

నేను విరివిగా సినీమాలు చేస్తున్న రోజుల్లో ఒకసారి మా ఆవిడతో ఊరు వెళ్లడానికి తెల్లవారు జామున మద్రాసు ఎయిర్‌పోర్టులో ఉన్నాను. ఎవరో నా భుజం తట్టారు. తిరిగి చూస్తే ఖాదర్ ఖాన్. మా ఇద్దరికీ మందు పరిచయం లేదు. కానీ ఆయన నా పాత్రలు చాలా చేస్తున్నారని విన్నాను. ఆయన హార్దికంగా పలకరించి 'నేను ఖాదర్ ఖాన్. హిందీలో మీ పాత్రలు చేస్తున్నాను' అన్నారు. నేను పులకించాను. 'మీరు గొప్ప నటులు, నా పాత్రలు చెయ్యడం నాకు గొప్ప' అన్నాను.

అలా ఒక్కసారే నేనూ ఆయనా కలిశాం. ఆయన నాకంటే ఇక్క సంవత్సరం పెద్ద. చాలా రోజులుగా చాలా ఇబ్బందికరమైన రుగ్మతలతో బాధపడుతున్నారు. పిల్లలు కెనడాలో ఉన్నారు. అక్కడే ఏడు నెలలు ఆసుపత్రిలో ఉండి కన్నుమూశారు. మొన్న ఆయన జీవిత దృశ్యాలను చూపుతూ కెనడా ఆసుపత్రి బయట పోర్టికోలో ఒంటి మీద కేవలం ఓవర్‌కోటు ఉన్న నిస్సహాయుడైన ఖాదర్‌ఖాన్‌ని కొడుకులు, సన్నిహితులూ దింపుతున్నారు. ఆయన దిగలేక దిగలేక కాలు నేల మీదకి మోపుతున్నాడు. నాకు చర్రున కళ్లనీళ్లు తిరిగాయి. ఆయన్ని చూసికాదు. ఆయన పిల్లలు తండ్రిని అంత భద్రంగా, పువ్వులాగ చూసుకుంటున్నందుకు. నేనక్కడే ఉంటే ముందుకు ఒంగి ఆ పిల్లలకు పాదాభివందం చేసేవాడిని.

ఓసారి ప్లేన్‌లో అమెరికాలో పనిచేస్తున్న తెలుగు అభిమాని నా పక్కన కూర్చున్నాడు. 'సాయంకాలమైంది' నవల కథ చెప్పాను. అతని తల్లిదండ్రులు ఇండియాలో ఉన్నారు. అతను అమెరికాలో. చాలా సార్లు వచ్చి చూసి పోతూంటాడు. అమెరికా డాలర్లు వస్తూంటాయి. కానీ ఏం లాభం? విమానం దిగే సమయానికి అతని కళ్లనిండా నీళ్లు నిండాయి.

చాలా సంవత్సరాల కిందటి మాట. నా 'సాయంకాలమైంది' నవల చదివి లక్ష్మీకాంత శర్మ అనే ఒక ఐటీ టెక్నోక్రాట్ ఫోన్ చేశారు తన్మయత్వంతో. నా 'సాయంకాలమైంది' నవలని తిరుపతి వెళ్లి కొని తెచ్చుకున్నాడట. వరంగల్లు దగ్గర కాళేశ్వరం అనే గ్రామంలో అతని తండ్రి అర్చకుడు. నవల చదివాక తల్లిదండ్రులతో ఉండాలని విదేశాలలో ఉద్యోగాలు వచ్చినా వదులుకుని ఇండియాలో ఉండిపోయాడు.

మహాభారతంలో ఓ కథ. తపస్సు చేసి అపూర్వ శక్తులు సంపాదించిన ఓ తపస్వి గర్వపడుతూ సభ్య ప్రపంచంలోకి వచ్చాడు. భర్తకి సేవ చేస్తున్న ఓ ఇల్లాలు నవ్వి ఆ మూల దుకాణం నడుపుతున్న వ్యక్తి దగ్గరకు వెళ్లి ఈ అపూర్వ శక్తుల్ని ధిక్కరించే వైభవాన్ని చూసి రమ్మంది. అది ధర్మవ్యాధుడి మాంసం దుకాణం. జంతువుల్ని నరికి, కోసి అమ్ముకుంటున్నాడు. ఇతనికీ, ధర్మానికీ సాపత్యమేమిటి? నిర్ఘాంతపోయాడు తపస్వి. తీరా వ్యాపారం ముగిశాక ధర్మ వ్యాధుడు ఆయన్ని ఇంటికి తీసుకువెళ్లాడు. ఇంట్లో ముదుసలి తల్లిదండ్రులు. వారికి నిష్ఠతో సేవ చేస్తున్నాడు. 'ఇదే నాకు తెలిసిన ధర్మ రహస్యం' అన్నాడు ధర్మవ్యాధుడు.

మతాన్ని పాతగుడ్డల్లో చుట్టి అటక మీద పారేసిన మేధావులున్న ఈ దేశంలో మతం దేవుళ్లు, పురాణాల రూపేణా మోక్షాన్ని 'ఎర'గా చూపిందిగానీ, పరోక్షంగా సామాజిక జీవనానికి బంగారు బాటలు వేసింది. పండరీపురంలో పాండురంగ విఠల్ ప్రాశస్త్యానికీ మూల సూత్రమదే. ఈ మాట నాకు పండరీపురంలో ఓ పేరు, భాషా తెలీని భక్తుడు చెప్పాడు. విఠల్ అంటే మహారాష్ట్ర భాషలో 'ఇటుక' అని అర్థం (ట). పాండురంగడు మహా దైవ భక్తుడు. తల్లిదండ్రుల్ని సేవిస్తున్న కొడుకు. తీరా దేవుడు అతని పిలుపు విని వచ్చాడు. ఆ సమయానికి పాండురంగడి ఒడిలో తల్లదండ్రుల పాదాలున్నాయి. దేవుడు 'నేను వచ్చానయ్యా' అన్నాడు. పాండురంగడు ఆనందించి చుట్టూ చూశాడు. ఓ ఇటుక కనిపించింది. ఆ ఇటుకని దేవుడివేపు గిరాటేసి 'ధన్యుణ్ణి స్వామీ, అమ్మానాన్నకి సేవ చేస్తున్నాను. కాస్సేపాగండి. ఈ ఇటుక మీద విశ్రమించండి. సేవ ముగించుకు వస్తాను' అన్నాడుట. స్వామి ఇటుక మీద కూర్చోలేదు. భక్తుడి తల్లిదండ్రుల సేవ ముగిసే వరకూ ఆ ఇటుక మీద నిలబడే ఉన్నాడట. ఇది కథో, ఇతిహాసమో నాకు తెలీదు. కానీ ఆముష్మికాన్నీ, దేవుడినీ జీవనానికి సంధించిన అపూర్వమైన కాన్సెప్ట్.

తమిళ సినీ రచయిత కన్నదాసన్ ఒక అద్భుతమైన పాట రాశారు. 'జీవితంలో అందరికీ అన్ని విధాలా రుణం తీర్చుకోగలను. కానీ, నేను పోయాక నన్ను శ్మశానానికి మోసుకుపోయే ఆ నలుగురి ఉపకారానికీ ప్రతిక్రియ చెయ్యలేను. వారికి నా ప్రణామాలు' అంటారు.

గొప్ప రచయిత, గొప్ప నటుడి గొప్ప జీవితం ప్రపంచం చప్పట్లని ఓ జీవితకాలం సంపాదించుకుంది. కానీ వృద్ధాప్యంలో కెనడా ఆసుపత్రి ముందు దిగే ఓ నిస్సహాయుడికి ఆసరా ఇచ్చే బిడ్డల చేతులు ఓ సమాజ సంస్కారానికీ, ఓ వ్యవస్థ నివాళికీ–వెరసి అతను సంపాదించుకున్న వరం.

Life is an achievement but old age is a gift.

నిస్సహాయతకు చెయ్యి సాయం సంస్కారం. చెయ్యి యోగం.

పోటెత్తిన జన జాతర... జగన్ యాత్ర

ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల గుండా 350 రోజుల పాటు దాదాపు 3650 కిలోమీటర్ల దూరం వరకూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన జనసంకల్ప యాత్ర మండువేసవిని, కుంభవృష్టిని, తుపానులను, చలిగాలులను ధిక్కరిస్తూ తనకు తానుగా ఒక చరిత్రను సృష్టించుకుంది. ఈ పాదయాత్రకు బలమైన నేపథ్యం ఉంది. విభజనానంతరం ఏపీ అసెం బ్లీలోనూ, బయటా టీడీపీ ప్రభుత్వ దాష్టీకాన్ని, ప్రశ్నించడానికి కూడా అవకాశం ఇవ్వకుండా చంద్రబాబు వ్యవహరించిన తీరును నిశితంగా గమనించిన జగన్ ఇక అధికార పక్షంతో అసెంబ్లీలో పోరాడటం వ్యర్థమని గ్రహించి ప్రజలకు దగ్గరవ్వాలని నిర్ణయించుకున్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం, సాధ్యమైనంతవరకు వాటికి పరిష్కారాలు వెదకటానికి ప్రయత్నించారు. నవరత్నాలను ప్రకటించిన గుంటూరు ప్లీనరీ అనంతరం టీడీపీపై బహుముఖరీతిలో ఒత్తిడి పెంచాలని జగన్ నిర్ణయించారు. తనకు తాను స్వయంగా పాదయాత్రను చేపట్టారు. ప్రతిరోజూ అసెంబ్లీని బహిరంగ సెషన్‌గా మార్చి ప్రజల ముందుకు ప్రభుత్వాన్ని లాగి నేరుగా ప్రశ్నించే ప్రక్రియే పాదయాత్ర.

ఇటీవలికాలంలో ఏ జాతీయ, ప్రాంతీయ రాజకీయ నేతకూ సాధ్యంకాని రీతిలో జనసమీకరణకు పాదయాత్ర పట్టం కట్టింది. ప్రతిరోజూ పాదయాత్ర ఓ కొత్త ప్రారంభమే. కొత్త సమస్యలను పరిష్కరించడమే. ప్రజలనుంచి నిత్యం నేర్చుకుంటూ వాటిని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చడమే. ప్రజలనుంచి తెలుసుకున్న అంశాలను వారి బాధలను నేరుగా తన ప్రచార కార్యక్రమంగా మార్చుకున్నారు జగన్. ప్రజా సంకల్ప యాత్ర అంతిమ ఘట్టంలోకి వచ్చేసరికి భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారానికి స్పష్టమైన



కార్యాచరణ పథకాన్ని రూపొందించుకుంటూ ప్రజల మేనిఫెస్టోను సిద్ధం చేసుకున్నారు. గ్రామ సచివాలయం, గ్రామ స్వరాజ్‌కి సంబంధించిన వినూత్న భావనలు కూడా ఈ పాదయాత్రలోనే జగన్ భావి కార్యాచరణ అమలుకు సన్నద్ధంగా తోడై నిలిచాయి. ఇడుపులపాయలో ప్రారంభించి గుంటూరు జిల్లాకు చేరుకున్న జగన్‌కి జనం ప్రభంజనంలా స్వాగతమిచ్చింది. వైఎస్ జగన్ ప్రజాసంకల్పయాత్రకు కృష్ణా నదిపై, గోదావరి నదిపై నిర్మించిన అతి భారీ వంతెనలు సైతం తలవంచి నమస్కరించడమే కాకుండా ఉత్తర కోస్తా జిల్లాల్లో ప్రజల భాగస్వామ్యంలో కొత్త రికార్డులు నమోదయ్యాయి.

ప్రాణహాని తలపెట్టినా చిరునవ్వే సమాధానం: వైఎస్ జగన్‌కు పెరుగుతున్న ప్రజాదరణను జీర్ణించుకోలేని విచ్ఛిన్నకర శక్తులు ఆయనపై భౌతికంగా దాడి చేసి తుదముట్టించాలని పథకం రచించాయి. విశాఖ విమానాశ్రయంలో వైఎస్ జగన్‌పై కత్తితో దాడిచేసిన శ్రీనివాస్ అధికారం చలాయిస్తున్న కీలక సూత్రధారుల చేతిలో పావు మాత్రమే. కోట్లాది ప్రజలు, దేవుడు, వైఎస్సార్ ఆత్మ ఆశీస్సులతో జగన్ కనీస గాయాలతో ఈ కుట్రనుంచి తప్పించుకున్నారు. తనపై దాడిని పురస్కరించుకుని టీడీపీపై ప్రతీకారం తీర్చుకోవాలని జగన్ భావించి ఉంటే ఏపీ మొత్తం మంటల్లో మండిపోయేది. అలాంటి పరిస్థితి రాకూడదనే ప్రథమ చికిత్స అనంతరం జగన్ హైదరాబాద్ వెళ్లి అక్కడే చికిత్స చేయించుకున్నారు. అటు సీఎం, ఇటు డీజీపీ కలిసి జగన్ అభిమానే దాడి చేశారని వక్రభాష్యాలు చెప్పడం నుంచి.. హైకోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించి జాతీయ దర్యాప్తు సంస్థకు సహకరించవద్దంటూ రాష్ట్ర పోలీసు శాఖను ప్రేరేపించడం దాకా బాబు ప్రజల హృదయాల్లో జగన్‌పై దాడి కేసులో ప్రథమ ముద్దాయిగానే నిలిచిపోయారు. అదే సమయంలో తనపై ప్రభుత్వం, సీఎం, టీడీపీ నేతలూ ఎన్ని వ్యాఖ్యలు చేస్తున్నా కిమ్మనకుండా, తనకు న్యాయస్థానమే న్యాయం చేయాలని కోరిన జగన్ ప్రజల హృదయాలను గెల్చుకున్నారు.

పాదయాత్ర ముగింపునకు సమీపిస్తున్న సందర్భంగా గత కొద్ది రోజులుగా సీనియర్ జర్నలిస్టులకు టీవీ ఇంటర్వ్యూలు ఇస్తూ వస్తున్న వైఎస్ జగన్ ప్రజా సంక్షేమానికి సంబంధించినంతవరకు తన దృష్టినీ, విజన్‌నూ ఏ శక్తీ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. గంటకుపైగా సాగిన ఆ ఇంటర్వ్యూలలో ఎంతో ఆత్మవిశ్వాసంతో, భావ స్పష్టతతో మాట్లాడిన వైఎస్ జగన్ అదే సమయంలో చంద్రబాబుపై ఒక్క తేలికపాటి వ్యాఖ్య కూడా చేయలేదు. ప్రజల సంక్షేమంపైనే తనకు నిబద్ధత ఉందని ఆయన చాటుకున్నారు. రాజీలేని దీక్షతో ప్రజలకు సేవ చేయడం, తన తండ్రిలాగే ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సాధించుకోవడమే తన ఏకైక వాంఛ అని వైఎస్ జగన్ స్పష్టంగా పేర్కొన్నారు. సమకాలీన ప్రపంచం కనీ వినీ ఎరుగని జన ప్రభంజనాన్ని పాదయాత్ర ద్వారా ఆకర్షించిన జగన్ వచ్చే ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించనున్నారని జనవాక్యం.

గౌరవ్

సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ
గురువారం
10-1-2019



చెట్టు నీడ

ప్రధాన ద్వారం



పూర్వం లకుంటికుడు అనే ఒక బౌద్ధ భిక్షువు ఉండేవాడు. అతను చాలా పొట్టివాడు. సకల శాస్త్రాలూ చదివాడు. ధర్మోపదేశం చేయడంలో దిట్ట కావడంతో అతని పేరు దేశంలో మార్మోగిపోయింది. ఆ భిక్షువు జేతవనంలో బుద్ధుని సన్నిధిలో ఉన్నాడని తెలిసి ఒక గ్రామం నుండి ముప్పై మంది భిక్షువులు ఆ వనానికి వచ్చారు. జేతవనం ప్రధాన ద్వారం దగ్గర వారికి ఒక పొట్టి భిక్షువు ఎదురయ్యాడు. 'ఇతను పిల్లవాడైన శ్రమణుడు (అంటే యువ బౌద్ధభిక్షువు) అయి ఉండొచ్చు'అనుకుని అతని చెంగులాగుతూ, వస్త్రాలు పీకుతూ ఆటపట్టించారు. ఆ తరువాత బుద్ధుని దగ్గరకు వచ్చి– ''భంతే! అగ్రభిక్షువు, అమృతస్వరంతో ధర్మం బోధించగల వాడు అయిన పూజ్య లకుంటిక భిక్షువు ఎక్కడ?''అని అడిగారు.

''మీరు ప్రధాన ద్వారం దగ్గర ఆటపట్టించి, హేళన చేసిన వాడే లకుంటికుడు''అని బుద్ధుడు చెప్పాడు.

వారు తమకు తెలియకుండా తాము చేసిన ఆ పిచ్చి పనికి ఎంతగానో బాధపడ్డారు. హేళన చేయడం, కించపరచడం ఎంత దోషాలో వారికి ప్రబోధించాడు బుద్ధుడు. అంతేకాదు, తిట్టడం, దూషించడం, ఆకారాన్ని బట్టి, సామాజిక స్థితిగతులను బట్టి ఇతరులను కించపరచడం, కోపంగా మాట్లాడటం కూడా హింసలో భాగాలేనని బుద్ధుడు వారికి చెప్పాడు. అది మొదలు వారు జీవితాంతం ఎవరినీ నిందించలేదు. ఈసడించలేదు. అందరితోనూ గౌరవ మర్యాదలతో నడుచుకుంటూ మంచి పేరు సంపాదించుకున్నారు.

– డా. బొర్రా గోవర్ధన్

ఆర్మీ డే పరేడ్

దళపతిగా తొలిమహిళ


భావనా కస్తూరి

ఈ నెల పదిహేనో తారీఖున ఢిల్లీలో జరగబోయే 71వ ఆర్మీ డే పరేడ్ ఓ చరిత్ర సృష్టించనుంది. 144 మంది జవాన్లు ఉన్న ఆర్మీ కాంటింజెట్‌కు ఓ మహిళా అధికారి నాయకత్వం వహించనున్నారు. అసలు ఆర్మీ సర్వీసెస్ కార్ప్స్ కాంటింజెంటే ఇరవై మూడేళ్ల తర్వాత ఇప్పుడు ఈ పరేడ్‌లో పాల్గొననుంది. దానిని ఓ మహిళా అధికారి సారథ్యం వహించడం ఆర్మీ చరిత్రలోనే ప్రప్రథమం. ఆ ఆఫీసర్ లెఫ్టినెంట్ భావనా కస్తూరి. 2015 అక్టోబర్‌లో ట్రైనింగ్ అకాడమీలో జాయిన్ అయ్యారు భావన. ''ఈ పరేడ్‌లో పాల్గొనడానికి, లీడ్ చేయడానికి మగవాళ్లు చాలా కష్టపడ్డారు. యేడాది పాటు ప్రాక్టీస్ చేస్తారు. మాది బెంగళూరు సెంటర్. నా రెజిమెంటల్ నుంచి ఇక్కడికి వచ్చా. ఓ ఆరునెలల నుంచి ప్రాక్టీస్ చేస్తున్నాను. నాతో పాటు ఇంకో ఇద్దరు పురుష అధికారులు కాంటిజెంట్ కమాండర్స్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆర్మీ కాంటిజెంట్‌కు సారథ్యం వహించే అవకాశం మహిళా అధికారికి వచ్చింది అంటే ఆర్మీలో మహిళల పట్ల అమోదనీయత వచ్చినట్లే. ఇది శుభ పరిణామం'' అన్నారు భావనా కస్తూరి.

పాశుర ప్రభాతం 26వ రోజు

లోకంలో 'చేసేది నేనే, చేయించేది నేనే' అంటూ భారాన్ని తనపై వేసుకుని జీవితాన్నివ్వడమే కాకుండా జీవించే విధానాన్ని అనుసంధానింపజేసే ఆదర్శ స్వరూపుడు శ్రీమహావిష్ణువు.

మాలే! మణివణ్ణా! మార్గళి నీరాడువాన్
మేలై యార్ శెయ్వనగళ్; వేణ్డువన కేట్టియేల్;
ఇలత్తైయెల్లామ్ నడుఙ్గ మురల్వన
పాలన్న వణ్ణత్తు ఉన్ పాఞ్చజ శన్నియనే
పోల్వన శఙ్గఙ్గళ్, పోయ్‌ప్పాడు డైయనవే,
శాలప్పెరుమ్ పఱైయే, పల్లాణ్డిశైప్పారే,
కోలవిళక్కే, కొడియే, వితానమే
ఆలినిలైయాయ్! అరుళేలో రెమ్బావాయ్!



భావం: అండపిండ బ్రహ్మాండములను ఆక్రమించేవాడు. అఘటిత ఘటనా సమర్థుడై వటపత్రంపై శయనించేవాడు, ఆశ్రిత వ్యామోహుడు, అంతా తానై ఉంటూనే కోరినవారికి అనువైన రూపంలో దర్శనమిచ్చే దేవదేవుడు, శ్రీకృష్ణపరమాత్మా! పూర్వీకుల ఆచరణ ఫలంగా మేమందుకున్నదీ, అత్యంత ఫలప్రదమైనదీ అయిన మార్గశీర్ష వ్రతం చేయ సంకల్పించాం. దానికి కావలసిన పరికరాలూ నీవే ప్రసాదించాలి. అద్భుతనాదం పలికించే పాంచజన్యం లాంటి శంఖం, పర అనే వాద్యం, మంగళ గీతాలు ఆలపించే భాగవతోత్తములూ, దీపములు. ధ్వజములు ఇలా అన్నింటినీ మాపై దయ ఉంచి ప్రసాదించమంటూ గోపికలు అర్థిస్తున్నారు.

అత్తా? అమ్మా?

ఎంతైనా అత్తగారు అత్తగారే.
కోడలు పిల్ల కోడలు పిల్లే.
ఇద్దరూ తల్లీకూతుళ్లలా ఉండడం
సాధ్యమేనా?
సాధ్యమే. అదీ అత్తగారి వల్లనే సాధ్యం.
ఒకింటికి కోడలిగా వెళ్లి..
తర్వాత అత్తయింది కనుక
ఒకప్పటికి అత్త అయ్యే కోడలికి
తనే నేర్పించుకోవాలి.
కొడుక్కి పెళ్లయిపోగానే
అత్తగారైపోయిన 'అమ్మ'లో
అమ్మతనాన్ని ఎవరైనా
అకస్మాత్తుగా ఎత్తుకుపోతారా?
అమ్మ అమ్మే.
అత్తయ్యాక కూడా అమ్మే. అత్తమ్మే.

బార్‌లో అందరూ వెళ్లిపోయారు అతను తప్ప.

మూసేసే టైమ్ అయ్యింది.

లైట్లు కూడా ఆఫ్ చేసేస్తున్నారు.

వెయిటర్‌కు అతడు తెలుసు. రెండు మూడు వారాలకు ఒకసారి వచ్చి సరదాగా ఒక బీర్ తాగేసిపోతుంటాడు. ఈసారి సరదా కోసం వచ్చినట్టు లేదు. చాలా తాగాడు. ఇంటికి వెళ్లకుండా కదలక మెదలక ఉన్నాడు.

వెయిటర్‌కు ఇలాంటి వాళ్లు తెలుసు.

అనునయంగా లేపి, బయటకు తీసుకొచ్చి ఆటో ఎక్కిస్తూ అడిగాడు– 'వైఫ్ ప్రాబ్లమా సార్'.

అతడు ఆటోలో కూలబడ్డాడు.

'అదైనా బాగుండేది. కాని ఇది అమ్మ ప్రాబ్లమ్. మా అమ్మతో ప్రాబ్లమ్' అని, ఎంతిస్తున్నాడో కూడా చూసుకోకుండా టిప్పు కుక్కి కళ్లు మూసుకున్నాడు.

* * *

తెల్లారింది.

తల్లి వెళ్లి మెయిన్ డోర్ తెరిచింది. గుమ్మంలో పాలప్యాకెట్లు పడి ఉన్నాయి. పేపర్ కూడా. వాటిని చూడగానే ఆమెకు కోపం వచ్చింది.

'ఈ పిల్ల ఉదయాన్నే లేచి వీటిని తీయవచ్చు కదా' అనుకుంది.

కొడుక్కి కొత్తగా పెళ్లయ్యిందని కాపురం మొదలయ్యి ఆరు నెలలు అయ్యిందని కోడలు తొందరగా లేవ వలసిన పని లేదని మార్నింగ్ కాఫీ పెట్టి తానే నిద్ర లేపుతానని ఈ తల్లే కొత్తల్లో చెప్పింది. కాని ఇప్పుడు ఎందుకో ఆమెకు కోపం వస్తోంది.

వెళ్లి ముందు వెనుకా చూసుకోకుండా కొడుకు కోడలు ఉండే బెడ్‌రూమ్ తలుపును బాదింది.

'అమ్మాయ్ సరళా. ఇంకా ఏంటా మొద్దు నిద్రలే' అని అరిచింది.

నిద్రలో ఉన్న సరళా ఉలిక్కి పడి లేచింది. రాత్రి తాగి బతుకు జీవుడా అని నిద్రపోయిన కొడుకూ అదిరిపడి లేచాడు.

రోజు మొదలైంది అని ఇద్దరూ అనుకున్నారు.

'వస్తున్నా అత్తయ్యా' కోడలు బయటకు పరిగెత్తింది నైటీ సరి చేసుకుంటూ.

* * *

'అబ్బాయికి బాక్స్ కట్టావా'

'కట్టాను అత్తయ్యా'

'ఏం కట్టావ్?'

'చామగడ్డల పులుసు. పప్పు. అరటి కాయ తాలింపు'...

'నీ తలకాయ తాలింపు చేయకపోయావా. వాడు అరటికాయ తినడని తెలియదా?'

'నాకు మీరు చెప్పలేదు అత్తయ్యా'

'పర్లేదులేమ్మా. తింటాలే'

'నువ్వు నోర్మూయరా... అప్పుడే తందానా అనడం మొదలెట్టావా'

కొడుకూ కోడలూ ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఉక్రోషంగా ఉంది. ఏం చేయాలో తోచనట్టుగా ఉంది. తిరగబడ్డానికి వీలు లేకుండా ఉంది.

ఎదురుగా ఉన్నది శత్రువు కాదు.

సొంత తల్లి. ఆమెకు అత్త.

* * *

సుజాతమ్మకు ఆ వీధిలో చాలా మంచిదని పేరు. ఒకరికి కష్టం వస్తే పరిగెత్తుకొని వస్తుందని పేరు. మంచీ చెడ్డ చెబుతుందని పేరు. అందరి ఇళ్లల్లో తల్లో నాలుక అని పేరు. ఆమెను అభిమానించని ఇల్లు ఆ వీధిలో లేదు. పెళ్లిళ్లలో శుభకార్యాలలో ఆమె పెత్తనమే ఎక్కడైనా. అలాంటిది ఆమె ఇంట్లో కూడా శుభకార్యమే జరిగింది. కొడుకు పెళ్లే జరిగింది. అది శుభప్రదంగా ఉంటుందని తమ ఇళ్లల్లో లాగా చికాకులు చిర్రుబుర్రులతో సాగదని అందరూ అనుకున్నారు. సుజాతమ్మ కోడలిని బాగా చూసుకుంటుందని అనుకున్నారు. భర్త చనిపోయాక ఎన్నో కష్టాలు పడి ఇంటిని నిలబెట్టుకున్న సుజాతమ్మ ఇన్నాళ్లకు ఆడతోడు దొరికి కాసింత తెరిపిన పడుతుందని అనుకున్నారు. ప్రస్తుతం బయట అందరి అభిప్రాయమూ అదే. ఆమె మీద ఎవరికి ఏ చాడీ చెప్పినా నమ్మరు.

కాని ఇంట్లో జరుగుతున్నది వేరు.

సుజాతమ్మ ఇప్పుడు ఒక రాక్షసి.

* * *

'ఏమండీ... ఇలాగైతే నా వల్ల కాదు. నేను మా పుట్టింటికి వెళ్లిపోతాను' అంది సరళ.

'అదేమిటి అలా అంటావు. ఓపిక పట్టు. అంతా సర్దుకుంటుంది' అన్నాడు భార్గవ్ హతాశుడవుతూ.

'సర్దుకునే సూచన కనిపించడం లేదండీ. ఇది ఇంకా పెరిగేలా ఉంది. నేను ఆల్రెడీ మా పెద్దవాళ్లకు ఫోన్ చేశాను. రేపు వస్తారు'

'నిజమా' గుడ్లు తేలేశాడు.

మరునాడు సుజాతమ్మ కూడా గుడ్లు తేలేయక తప్పలేదు.

* * *

'మీరు అమ్మాయిని ఇబ్బంది పెడుతున్నారండీ' కొంచెం మర్యాద పాటిస్తూ అన్నాడు సరళ తండ్రి.

'ఇబ్బందా.. పీక్కు తింటోంది' కోపం పట్టలేక అంది సరళ తల్లి.

'మాకేం కూటికి గతిలేదనుకోవద్దు. విడాకులిప్పించి దర్జాగా ఇంకో పెళ్లి చేస్తాం' సరళ తల్లి కోపంతో బుసలు కొడుతోంది.

సుజాతమ్మ ఒణికిపోయింది.

'సరళంటే నాకు ఇష్టం. నేనేదో చిన్న మాట అంటున్నాను తప్ప ఆ పిల్ల ఇంత బాధ పడుతుందని నాక్కూడా తెలియదు. మా వాడు విడాకులు తీసుకుంటే నాకేం సంతోషం. నాకేం లాభం. అయ్యో.. వద్దే వద్దు' అంది ఎలాగోలా శక్తి తెచ్చుకుని.

'లేదండీ... మీ మైండ్ ఖరాబయ్యింది. మీకు కౌన్సెలింగ్ అవసరం' అని తేల్చాడు అనుభవజ్ఞుడైన సరళ తండ్రి.

వేరే మార్గం లేక తల వొంచుకుని అంగీకరించింది సుజాతమ్మ.

* * *

సుజాతమ్మ కథ ఇది. ఆమెకు యాభై సంవత్సరాలు. పద్దెనిమిదేళ్లకే పెళ్లయ్యింది. ముప్పై ఏళ్లకే భర్త చనిపోయాడు. ఆమెకు పెద్దగా బంధుగణం లేదు. జీవితాన్ని ఎలా గడపాలో తెలియదు. ఒక్కగానొక్క కొడుకు. వాడే లోకంగా బతికింది. వాడి కోసమే జీవించింది. జీవితంలో కొంతమంది మగవాళ్లు ఆమెకు తారసపడ్డారు. కోరుకున్నారు. మరోపెళ్లిని ప్రస్తావించారు. కాని ఆమె కొడుకు కోసం తన సంతోషాలన్నింటినీ త్యాగం చేసింది. వీధిలో వాళ్లే తన బంధువులనుకుంది. కొడుకును ప్రయోజకుణ్ణి చేసింది. అతడికి పెళ్లి చేసింది. కాని పెళ్లయ్యి రెండు మూడు నెలలు గడిచిన తర్వాత కోడలు నచ్చకపోవడం మొదలైంది. ఆమెను తిట్టడం మొదలెట్టింది. బాధ పెట్టడం సూటిపోటి మాటలు అనడం... ఇలా ఎందుకు చేస్తున్నదో ఆమెకే తెలియదు. ఆమె తనను తాను అర్థం చేసుకోవాల్సి ఉంది.

> **మీ కొడుక్కే కాదు ఏ కొడుక్కైనా తల్లంటే ప్రేమ ఇష్టం ఉంటాయి. వాళ్లను ప్రేమించకుండా మానేయరు. కాని కోడలు వచ్చేసరికి మీలాగే చాలామంది అత్తగార్లు ఇన్‌సెక్యూర్ అయ్యి ఇంటిని ఇబ్బందుల్లోకి నెడతారు.**

* * *

'మీ కోడలు మీ కొడుకును మీకు ఎక్కడ కాకుండా చేస్తుందోనని మీ భయం కదా' లేడీ సైకియాట్రిస్ట్ అడిగింది.

సుజాతమ్మ ఏం మాట్లాడలేదు. మౌనంగా తల ఊపింది.

'కొంత కాలం మీరు మీ కోడలిని అభిమానించారు. కాని మీ కొడుకు కోడలు ఏకాంతంగా ఉన్నా, కలిసి సినిమాకు వెళ్లినా, డిన్నర్‌కు వెళ్లినా మీ కొడుకు మిమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నాడేమో, క్రమంగా మిమ్మల్ని వదులుకుంటాడేమో, మీ ప్రాధాన్యం తగ్గిపోతుందేమో అని మీకు అనిపించి ఏం చేయాలో తెలియక మీ కోడలిని బాధ పెట్టడం మొదలెట్టారు' అంది సైకియాట్రిస్ట్.

మళ్లీ అడిగింది–

'మీకు కొడుకు పుట్టినప్పుడు మీ భర్త ఉండగా మీరు వారిద్దరినీ సమానంగా ప్రేమించారా? ఒక్కరినే ప్రేమించారా?'

సుజాతమ్మ తలెత్తి చూసి 'ఇద్దరినీ ప్రేమించాను' అంది.

'మీ కొడుకు కూడా అలాగే చేయగలడు అని మీరు ఎందుకు అనుకోవడం లేదు. మీ కొడుకు మిమ్మల్ని, మీ కోడలిని కూడా ఏక కాలంలో ప్రేమగా చూసుకోవచ్చు కదా. ఎవరూ ఏ ఒక్కరికీ సొంతం కాదు. అందరూ అందరికీ చెందినప్పుడే కుటుంబం నడుస్తుంది. సాధారణంగా ఏమవుతుందంటే మీ కొడుకు స్థానంలో మీకు కూతురు ఉంటే ఆ కూతురు ఏదో ఒకనాటికి అత్తారింటికి వెళ్లిపోతుందని మీరు ప్రిపేర్డ్‌గా ఉండేవారు. కొడుకు అయ్యే సరికి అతనితోనే జీవితాంతం ఉండాలనుకుని, అలా ఉండటానికి ఎక్కడ అడ్డంకులు వస్తాయో అని ఉలిక్కి పడుతున్నారు. మీ కొడుక్కే కాదు ఏ కొడుక్కైనా తల్లంటే ప్రేమ ఇష్టం ఉంటాయి. వాళ్లను ప్రేమించకుండా మానేయరు. కాని కోడలు వచ్చేసరికి మీలాగే చాలా మంది అత్తగార్లు ఇన్‌సెక్యూర్ అయ్యి ఇంటిని ఇబ్బందుల్లోకి నెడతారు. మీ కోడలు మంచి అవగాహన ఉన్న అమ్మాయి. ఆమెను నమ్మండి. మీ అబ్బాయిని నమ్మండి. వారు మిమ్మల్ని బాగా చూసుకుంటారు' అంది లేడీ సైకియాట్రిస్ట్.

సుజాతమ్మకు ఆ కౌన్సెలింగ్ చాలా ఉపయోగపడింది.

ఆమె వెంటనే కోడలిని పిలిచి మనస్ఫూర్తిగా క్షమాపణ కోరింది.

కొద్దిపాటి అవగాహన, అవసరమైన చర్చలు కుటుంబ సభ్యుల మధ్య సాగితే ప్రతి ఇల్లు సౌకర్యవంతమైన అనుబంధాలతో కొనసాగుతుంది.

* * *

నాలుగైదు రోజుల తర్వాత సుజాతమ్మ తెల్లవారుతూనే లేచింది.

గుమ్మంలో పాలప్యాకెట్లు, పేపర్ పడి ఉన్నాయి.

వాటిని చేతిలోకి తీసుకుని కాఫీ పెట్టడానికి వెనుదిరుగుతుండగానే.. కోడలు ఎదురొచ్చింది!

'ఇటివ్వండత్తయ్యా.. కాఫీ పెట్టుకొస్తాను' అంది.

ఆ తర్వాత ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగుతున్న దృశ్యం అప్పుడే నిద్ర లేచి హాల్లోకి వస్తున్న కొడుక్కి కనిపించింది.

– కథనం: **సాక్షి ఫ్యామిలీ**

ఇన్‌పుట్స్: **పద్మ పాల్వాయి,** సైకియాట్రిస్ట్

మార్గళి మేళవింపు

సరిగమల తాలింపు

చెన్నైవాసులకు ఈ 'మార్గళి' సంగీత మాసం. ఈ ముప్పై రోజులూ నగరమంతా సంగీతంతో 'ఘుమఘుమ'లాడుతుంది. సభలన్నీ సంప్రదాయ నృత్యాలతో ఇంద్రసభను మించిపోతాయి. పట్టుచీరలు, బంగారు నగలు, పరిమళాలు వెదజల్లే కుసుమాలు, నుదుటన రూపాయ బిళ్లంత బొట్లు.. చూడ్డానికి రెండు కళ్లు కాదు కదా, శివుడి మూడు కళ్లు, సాక్షాత్తూ ఇంద్రుడి సహస్రాక్షులు కూడా సరిపోవు అన్నట్లు ఉంటుంది ఈ నాలుగు వారాలూ చెన్నై.






మార్గళి ఉత్సవాల్లో ఇటు సంగీతం... అటు సాపాటు

ధనుర్మాసంలో చెన్నైలో జరిగే ఉత్సవాలే మార్గళి. ఈసారి మార్గళి డిసెంబర్ 16న మొదలైంది. జనవరి 14 వరకు జరుగుతుంది. మన పుష్య మాసాన్నే తమిళులు మార్గళి అంటారు. అతిథులకు ఆతిథ్యం ఇచ్చే మాసం ఇది. దేశంలోని కళాకారులందరూ వలస పక్షుల్లా ఇక్కడకు వచ్చి ఏదో ఒక సభలో తమ సంగీత పరిజ్ఞానాన్ని అందరితో పంచుకుంటారు. అందుకే చెన్నైకిది మ్యూజిక్ సీజన్ కూడా.

చెన్నైలోని నారద గాన సభ, కృష్ణ సభ, వాణి మహల్ అన్నీ ఈ నాలుగు వారాలూ కిటకిటలాడతాయి. మహిళలు కంచిపట్టు చీరలు, యువతులు కుర్తీ పైజమాలు, వృద్ధులు పంచెలతో భోజనాల దగ్గర సహపంక్తిలో కూర్చొని విందు ఆరగిస్తారు. అరటి ఆకులలో వడ్డించిన అన్నం, ఇడ్లె సాపాడు, సాంబారు అన్నం, పాయసం రకరకాల స్వీట్లు తింటూ కనిపిస్తారు. కొందరు మద్రాసు ఫిల్టర్ కాఫీ ఘుమఘుమలను ఆఘ్రాణిస్తారు. చెన్నై నగరంలో మొత్తం యాభై ప్రదేశాలలో ఈ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలకు వచ్చేందుకు పదకొండు నెలల పాటు డబ్బులు దాచుకుంటామని చెబుతారు ఇక్కడకు వచ్చే సంగీతాభిమానులు. ''హోటల్స్‌కి వెళ్లి భోజనం చేస్తే, పొట్ట బరువుగా అనిపిస్తుంది, కానీ ఇక్కడి ఆహారం మాత్రం చాలా తేలికగా ఉంటుంది'' అంటారు వాళ్లు నవ్వుతూ. అందుకే, ఒకప్పుడు తన క్యాంటీన్‌లో కేవలం కాఫీ, బజ్జీలు మాత్రమే అమ్మే బాలాజీ పట్టప్ప.. కాలగమనంలో తన మెనూ మార్చుకోవలసి వచ్చింది. 'పట్టప్ప' క్యాంటీన్ యజమాని బాలాజీ పట్టప్ప. అతి ప్రాచీనమైన మద్రాసు మ్యూజిక్ అకాడెమీలో ఈ క్యాంటీన్ తన సేవలను అందిస్తోంది. కొత్తగా కీర వడ, కుళంబు, కూటులతో పాటు పుచ్చకాయ రసం (సాంబారు), వెజిటబుల్ పాయసం కూడా చేర్చారు. ఈ కొత్త రుచులకు చాలామంది ఆకర్షితులవుతున్నారు. అయితే రానురాను ఈ సభలలో సంగీతం కంటే రుచులకే ఎక్కువ ప్రాధాన్యత పెరుగుతోందని కొంతమంది సంగీత ప్రియులు వాపోతున్నారు. ఒక దశాబ్ది కాలంగా ఈ మార్గళి ఉత్సవాలకు క్రమం తప్పకుండా హాజరవుతున్న సినీ నేపథ్య గాయకుడు ఉన్నికృష్ణన్ కూడా ఈ విషయంలో కొద్దిగా అసంతృప్తితో ఉన్నారు. ''ఆహారం మీద ధ్యాస ఉంటే, సంగీత కచేరీలను శ్రద్ధగా వినలేకపోతారు'' అంటారు ఆయన. అయితే, ''ఈ కచేరీలకు వస్తే, వండుకోవడానికి కుదరదు. కచేరీకి కచేరీకి మధ్యలో ఏదో కొద్దిగా తినడానికి ఏమైనా ఉండడం మంచిదే కదా'' అంటున్నారు ఉమా శ్రీనివాసన్ (పట్టప్ప కుమార్తె).


పట్టప్ప

ముందు కనువిందు..!

ట్రిప్లికేన్‌లోని పార్థసారథి స్వామి సభ నిత్యం సంగీత ఆస్వాదకులతో నిండిపోతుంది. ఉద్యోగస్తులు, విద్యార్థులు అందరూ ఈ సభలకు హాజరవుతుంటారు. వీరు కూడా అక్కడకు రాగానే మొదట మెనూలో ఏముందో చదువుతారు. బొప్పాయి వేపుడు, చిలగడదుంపల వడ, బాదం బొబ్బట్లు, పల్లీ పుడ్డింగ్ వంటి వాటిని అక్కడ అందరికీ సుపరిచితులైన మౌంట్‌బాటెన్ మణి అయ్యర్ తయారు చేయిస్తుంటారు. అయ్యర్ 1960 నుంచి ఈ వ్యాపారంలో ఉన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం లార్డ్ మౌంట్‌బాటెన్ మద్రాసు వచ్చారు. గిండీ నుంచి పాలన చేసేవారు. ఆ సమయంలో మా నాన్నగారి వయసు 17. ఆయన వారికి స్వచ్ఛమైన దక్షిణ భారత భోజనం అందించేవారు. అందులో బాదం హల్వా, బంగాళదుంపల వేపుడు, సాంబారు అన్నం, పాల పాయసం ఉండేవి. నాన్నగారు తయారుచేసిన రుచికరమైన ఆహారానికి సంబర పడిన మౌంట్ బాటెన్ పేరుమీదుగా మా నాన్నగారు తన వ్యాపారం ఆ పేరుతోనే ప్రారంభించారు.


ఉన్నికృష్ణన్

మౌంట్ బాటెన్ మణి అయ్యర్ క్యాంటీన్ రుచుల గురించి అందరికీ తెలియడంతో, అందుకు భిన్నంగా పట్టప్ప పురాతన సంప్రదాయ వంటలైన క్షీరాన్నం, అక్కడర వడిసల్ (పాలు, పంచదారలతో చేసేది), బూడిద గుమ్మడి కాయ రైతా, రసవాంగీ (వంకాయ గ్రేవీ), మూర్ కూటు (మజ్జిగ గ్రేవీ), సెన్నై సోదీ (కంద కూర) వంటకాలను తయారుచేయడం ప్రారంభించారు. ఈ వంటకాలకు మంచి ఆదరణ వచ్చింది. ఈ వంటకాలను వేరే చోట తినగలం, కాని క్షీరాన్నం మాత్రం ఇంకెక్కడా దొరకదు' అంటారు అక్కడ భోజనం చేసినవారంతా.

మార్గళి క్యాంటీన్‌లలో పదిహేను రోజులు ముందుగానే మెనూ సిద్ధం చేస్తారు. ప్రసిద్ధులైన వారి కచేరీలు ఉంటే, ఆరోజు మెనూ కూడా చాలా ప్రసిద్ధంగా, ఎక్కువ వంటకాలతో రూపొందిస్తారు. యువతకు ఆకర్షణీయంగా, వృద్ధులకు తేలికగా అరిగే వంటకాలతో ఉంటుంది మెనూ.

ఒకప్పుడు సభకు వచ్చేవారి టికెట్ చూసి మాత్రమే భోజనాలకు అనుమతించేవారు. కానీ ఇప్పుడు కచేరీలకు రాకపోయినా, క్యాంటీన్‌కి వచ్చి భోజనం చేయవచ్చు. ''వండిన వంట కంటే తక్కువ మంది వచ్చినా, ఎక్కువ మంది వచ్చినా ఏమీ చేయలేమని, ఉదయం 7.30 నుంచి వంట ప్రారంభమవుతుందని'' చెబుతారు పట్టప్ప. మలేసియాలో నివసించే ఉమా బాలన్ అనే సంగీతాభిమాని ప్రతి సంవత్సరం ఈ కచేరీల కోసం మద్రాసు వస్తారు. భోజనాల దగ్గర వారు ప్రేమగా నెయ్యి వడ్డించడం దగ్గర నుంచి అన్నీ ఆవిడ మనసుని హత్తుకున్నాయట. సంగీత సాహిత్య సమలంకృతే అనడానికి బదులు సంగీత ఆహార సమలంకృతే అనాలేమో ఈ మార్గళి మాసాన్ని.

– జయంతి

స్త్రీలోక సంచారం


● ఇంట్లోనుంచి వచ్చేసింది : అల్‌ఖునన్

☛ గృహహింసను తట్టుకోలేక కువైట్‌లోని తన ఇంటి నుంచి పారిపోయి శనివారం నాడు థాయ్‌లాండ్‌కు శరణార్థిగా వచ్చిన 18 ఏళ్ల యువతి రహఫ్ ముహమ్మద్ అల్‌ఖునన్ పాస్‌పోర్ట్‌ను థాయ్ రాజధాని బ్యాంకాక్‌లోని సౌదీ అరేబియా రాయబార కార్యాలయ అధికారులు స్వాధీనం చేసుకోవడంతో ఇప్పుడా యువతి.. కువైట్–సౌదీ అరేబియా–థాయ్.. ఈ మూడు దేశాలతో పాటు, ఐక్యరాజ్యసమితి తక్షణం పరిష్కరించవలసిన ఒక సమస్యగా పరిణమించారు! రిటన్ టికెట్ లేకపోవడం వల్ల ఆమెను అనుమానించవలసి వచ్చిందని థాయ్ అధికారులు, ఆమె భద్రతను పర్యవేక్షించడానికి తప్ప ఆమె పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకునే ఉద్దేశం తమకు లేదని సౌదీ రాయబార అధికారులు, ఇప్పటికిప్పుడే ఆ యువతి మాటల్ని విశ్వసించి ఏ నిర్ణయమూ తీసుకోలేమని ఐరాస అధికారులు విడివిడి ప్రకటనలు విడుదల చేయగా, కువైట్‌లోని ఆమె కుటుంబం నుంచి ఇంతవరకు ఎటువంటి సమాచారమూ లేదు. పద్దెనిమిదేళ్ల ఆ యువతి ప్రస్తుతం టూరిస్టుగా బ్యాంకాక్‌లోని ఒక హోటల్ గదిలో ఉన్నారు. సౌదీ అధికారులు తనను థాయ్‌లాండ్‌లో నిర్బంధించారని శనివారం రాత్రి ఆమె ట్విట్టర్‌లో పోస్ట్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

☛ అమెరికన్ మహిళల ఓటు హక్కు సాధన ఉద్యమ చరిత్రలో గుర్తుంచుకోదగిన రోజు ఇది. మహిళలకు ఓటు హక్కును కల్పించాలని డిమాండ్ చేస్తూ 'సైలెంట్ సెంటినల్స్' (నిశ్శబ్ద సైనికులు) అనే పేరుతో కొంతమంది మహిళలు 1917 జనవరి 10న వైట్ హౌస్ ఎదుట ప్రదర్శన జరిపారు. అమెరికా అధ్యక్షుడిగా ఉడ్రోవిల్సన్ పాలన మొదలైన రోజును వారు తమ ప్రదర్శనకు ఎంపిక చేసుకోవడం విశేషం అయింది. ఆ క్రితం రోజే సైలెంట్ సెంటినల్స్ ఉడ్రో విల్సన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఓటు హక్కు కల్పించాలని కోరినప్పుడు.. 'ప్రజామోదం పొందాక తప్పనిసరిగా కల్పించడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. హామీని నెరవేర్చేవరకు తమ ఉద్యమం ఆగదని వారు ఆయనకు స్పష్టం చేసిన అనంతరం రెండో రోజు నుంచే వారానికి ఆరు రోజులు చొప్పున 1919 జూన్ 4 వరకు దేశమంతటా ప్రదర్శనలు జరిపారు. ఈ రెండున్నరేళ్ల ప్రదర్శనల కాలంలో అమెరికన్ ప్రభుత్వం సైలెంట్ సెంటినల్స్ పట్ల సున్నితంగా వ్యవహరించింది. ట్రాఫిక్‌కు తీవ్రమైన అంతరాయం కలిగించిన కొన్ని సందర్భాలతో మాత్రం అరెస్టులు చేసినప్పటికీ వెంటనే విడుదల చేసింది. చివరికి 19వ రాజ్యాంగ సవరణతో (1920 ఆగస్టు 18) మహిళలకు ఓటు హక్కు కల్పించింది. 'సైలెంట్ సెంటినల్స్' ను నడిపించిన మహిళ ఆలిస్ పాల్. ఆమె మహిళా హక్కుల కార్యకర్త. అమెరికన్ మహిళల ఓటు హక్కు సాధనలో ఆలిస్ పాల్ స్థానం, ప్రస్థానం చరిత్రాత్మకమైనవి.




● మిస్టర్ ప్రెసిడెంట్ బయటికి రా : 10 జనవరి 1917

సాక్షి ఫ్యామిలీ సినిమా

నల్లగొండ ॥ గురువారం
10-1-2019

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! అసలు ప్రేమ కోసం ప్రాణాలే వదిలేస్తుంటారు కొందరు? అంతగా ప్రేమించుకున్నవాళ్లు కూడా ఒక్కోసారి విడిపోతుంటారు. అలా విడిపోని లైఫ్ పార్ట్‌నర్‌ని ఎలా వెతికి పట్టుకోవాలి సార్?

– ప్రతుల్య

వెతికితే దొరకరు!

'మరి ఏం చేస్తే దొరుకుతారు సార్?

గుళ్లూ గోపురాలూ చుట్టి రావాలా సార్?

మోకాళ్ల మీద థౌజండ్ గుడి మెట్లు ఎక్కాలా సార్??

పస్తులుండాలా సార్??

ప్రేయర్లు చెయ్యాలా సార్???

మౌనవ్రతం చెయ్యాలా సార్???

అరచేతిలో కర్పూరం వెలిగించుకోవాలా సార్????

ఫారెస్ట్‌కి వెళ్లి తపస్సు చెయ్యాలా సార్?????

వెతికితే... దొరకదు అంటున్నారు...?!

మరి ఏం చెయ్యాలి సార్?'

ఏం చెయ్యకూడదు నీలూ!!

'తిని తొంగుంటే ప్రాణాలే విడిచేసేంత గాఢంగా ప్రేమించే క్యాండిడేట్ ఎలా దొరుకుతారు సార్?'

అలాంటి ప్రేమికులు వెతికితే దొరకరు. అలాంటి ప్రేమ వెతికితే దొరుకుతుంది.

'అలాంటి ప్రేమను ఎలా వెతుకుతారు సార్?'

మన ప్రేమ అంత గొప్పదైనప్పుడు అలాంటి ప్రేమే ఆకర్షితమవుతుంది.

'అంటే మన లవ్ గ్రేట్ అయితే... అది మ్యాగ్నెట్‌లా అలాంటి లవ్‌ని ఆకర్షిస్తుందన్నమాట ప్రతుల్య!'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళ పరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

ఎవరి టైమ్ వాళ్లకు వస్తుంది

"నేను ఇండస్ట్రీకి వచ్చి 32 ఏళ్లవుతోంది. ఇప్పుడు కూడా సోలో హీరో అయితేనే చేస్తా అనడం కరెక్ట్ కాదు. ఒక స్టేజ్‌కి వచ్చిన తర్వాత హీరోనా, మల్టీస్టారర్ మూవీనా అనే ఆలోచన కలగడం లేదు. ఫలానా పాత్రే కావాలనే కోరికలు నాకు లేవు. పాత్రల గురించి మనం ఎవర్నీ అడగకూడదు. సోలో హీరోగా చేయమని డైరెక్టర్లు కథలు తీసుకొస్తే చేస్తా" అన్నారు వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, వరుణ్ తేజ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'ఎఫ్ 2'. 'ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' అన్నది ఉపశీర్షిక. 'దిల్' రాజు నిర్మించిన ఈ సినిమా ఈ12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వెంకటేశ్ చెప్పిన విశేషాలు.



వెంకటేశ్

● మంచి ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం 'ఎఫ్ 2'. ఫ్రస్ట్రేషన్‌లోనూ కామెడీ ఉంటుంది. ఈ చిత్రం టీజర్, ట్రైలర్‌లో నేను చెప్పిన డైలాగులకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి చాలా మంచి స్పందన వస్తోంది. 'దృశ్యం, గురు' వంటి సీరియస్ సినిమాలు చేశాక కొంచెం ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ చేయాలనుకుంటున్నప్పుడు అనిల్ 'ఎఫ్ 2' కథ చెప్పాడు. సంక్రాంతికి రియల్ ఫెస్టివల్ ఫిల్మ్ 'ఎఫ్ 2'.

● అనిల్ వెరీ పాజిటివ్.. సిన్సియర్. తను రచయిత కూడా కావడంతో మంచి డైలాగులు రాశాడు. వరుణ్ తేజ్ వెరీ నైస్, సింపుల్ పర్సన్. ఏ ఇమేజ్‌లో ఇరుక్కోకుండా కొత్తగా చేయాలనుకుంటాడు. ఎవర్నీ అనుకరించకుండా తన స్టైల్‌లో చేశాడు.

ఇమేజ్ చట్రం అంటే ఏంటో నాకు తెలియదు. మన నుంచి ఫ్యాన్స్, ప్రేక్షకులు ఓ ఇమేజ్‌ని ఆశిస్తారు. కానీ, ఓ ఇమేజ్ రావాలనే కోరిక నాకు లేదు. సినిమా బాగుండాలి. నిర్మాత, సినిమా కొనేవాళ్లు నష్టపోకూడదని ఆలోచిస్తా. కానీ, బయట నాపై చూపించే ఇమేజ్‌ని నేను కంట్రోల్ చేయలేను. క్రమశిక్షణ, కష్టపడే తత్వం నా కంట్రోల్‌లో ఉంటాయి. అవి నాన్నగారి (రామానాయుడు) నుంచే నేర్చుకున్నా.

● కుటుంబ కథా చిత్రాల్లో నేను బాగా ఒదిగిపోవడంతో పాటు మంచి ఎమోషన్స్‌ని పండిస్తానని ప్రేక్షకులు అంటుంటారు. దానికి కారణం.. నా స్కూల్, కాలేజ్ డేస్‌లో ఫ్రెండ్స్, బంధువుల ఇళ్లకు వెళ్లేవాణ్ని. అక్కడ వారి ఎమోషన్స్, బిహేవియర్‌లను పరిశీలించేవాణ్ణి. మాది పెద్ద కుటుంబం.. మంచి సర్కిల్ ఉంది. పైగా స్కూల్‌డేస్ నుంచే ఆధ్యాత్మికం గురించి తెలుసుకోవడం వల్లేనేమో అనుకుంటున్నా.

● 'గురు' సినిమా తర్వాత చాలా కథలు విన్నా కుదరలేదు. వైవిధ్యమైన సినిమా చేయాలనుకోవడం వల్లే గ్యాప్ వచ్చింది. పైగా యంగ్‌స్టర్స్ చేస్తున్న కథలతో నేను సినిమాలు చేయలేను (నవ్వుతూ). నేను, రానా ఓ సినిమా చేయాలనుకున్నాం. అప్పుడు తను 'బాహుబలి'తో బిజీ అయిపోయాడు.

● యాక్టింగ్ అనేది సహజంగా అందరిలోనూ ఉంటుంది. కొందరు చేసే కొద్దీ నేర్చుకుంటుంటారు. ఇండస్ట్రీలో ఓపికగా ఉంటే ఎవరి టైమ్ వారికి కచ్చితంగా వస్తుంది. మంచి కథలు ఎంచుకుంటూ సిన్సియర్‌గా కష్టపడుతుండాలి. హిట్ ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలియదు. అయితే మన ఆలోచనా విధానం పాజిటివ్‌గా ఉండాలి. అదే నిజమైన సక్సెస్.

● రియల్ లైఫ్‌లో నేను ఫ్రస్ట్రేషన్‌కి దూరంగా ఉంటా. ప్రతిరోజూ ప్రకృతితో సావాసం చేస్తా. అప్పుడే దాని ప్రాముఖ్యత మనకి తెలుస్తుంది. నేను రోజూ సూర్యోదయం చూస్తా. ఫ్యామిలీ, ఫ్రెండ్స్... అందరూ అశాశ్వతం. ప్రకృతే శాశ్వతం. దాన్ని మనం అర్థం చేసుకుంటే సమస్యలు రావు.

● చాలెంజింగ్ రోల్స్ అంటే బాగా ఇష్టం. అందుకు టైమ్ రావాలి. అమితాబ్‌గారు ఎన్ని పాత్రలు చేసినా 'బ్లాక్' సినిమాలోని పాత్ర సూపర్బ్. నేను 'రోజా' సినిమా చేయలేకపోయా. కానీ ఆ తర్వాత 'సుందరకాండ' వంటి మంచి మూవీ చేశా. 'రోజా' సినిమా చేసుంటే హిందీలోనూ ఎక్కడికో వెళ్లిపోయేవాణ్ణి. నాకు 'బాహుబలి'లాంటి సినిమా చేయాలనుంది. అయితే ఆ పాత్ర మనకి రావాలి. నాకు రాలేదే అని ఎప్పుడూ బాధపడకూడదు.

● బాబీ దర్శకత్వంలో చేస్తున్న 'వెంకీ మామ' సినిమా కథ చాలా బాగుంటుంది. నా కోసం త్రివిక్రమ్ శ్రీనివాస్, అనిల్ రావిపూడి కథలు తయారు చేస్తున్నారు.

రికార్డ్ బ్రేక్!



ప్రభాస్

ప్రభాస్ 'సాహో' ఓ రికార్డ్ బ్రేక్ చేసింది. ఇంకా సినిమానే రిలీజ్ కాలేదు అప్పుడే రికార్డ్ బ్రేకా అనుకుంటున్నారా? ఈ చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ సూపర్‌వైజర్‌గా చేస్తున్న కమల్ కణ్ణన్ అలానే అన్నారు. ఇంతకీ విషయం ఏంటంటే.. ఇప్పటివరకూ ఏ సినిమాకీ చేయనటువంటి విజువల్ ఎఫెక్ట్స్ సీన్స్‌ని ఈ సినిమాకి చేస్తున్నామని కమల్ పేర్కొన్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై ప్రభాస్ హీరోగా సుజిత్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్‌లు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రూపొందుతున్న 'సాహో' చిత్రం ఈ ఏడాది పంద్రాగస్టుకు విడుదల కానుంది. 'సాహో' విజువల్ ఎఫెక్ట్స్ గురించి పేర్కొన్న కమల్ కన్నన్ ప్రభాస్ 20వ సినిమా గురించి కూడా ఓ హింట్ ఇచ్చారు. ''ప్రభాస్ 'జాన్' క్లైమాక్స్ గురించి 2019 ఆరంభంలో చెప్పి తీరాల్సిందే'' అన్నారు కమల్. ఈ చిత్రం తొలి షెడ్యూల్ ఇటీవల పూర్తయింది. అంటే.. ముందు క్లైమాక్స్ చిత్రీకరించి ఉంటారేమో. ఆ సంగతలా ఉంచితే.. ఇక్కడ కమల్ కన్నన్ 'జాన్' అన్నారు కాబట్టి ప్రభాస్ 20వ సినిమాకి ఆ టైటిల్‌నే ఫిక్స్ చేశారనుకోవచ్చా? కాలమే చెప్పాలి. ఈ చిత్రానికి కె. రాధాకృష్ణ కుమార్ దర్శకుడు. యూవీ క్రియేషన్స్, గోపీకృష్ణా మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



సోనాక్షీ సిన్హా

అబ్బే అదేం లేదు


.. అంటున్నారు బాలీవుడ్ బొద్దుగుమ్మ సోనాక్షి సిన్హా. ఇంతకీ ఏ వార్తను ఇలా కొట్టిపారేస్తున్నారంటే.. బాలీవుడ్ యంగ్ హీరో జహీర్ ఇక్బాల్‌తో తాను లవ్‌లో ఉన్నాననే విషయాన్ని. 2018 సోనాక్షికి వృత్తి రీత్యా సరిగ్గా కలసి రాలేదు. వ్యక్తిగతంగా మాత్రం ఈ యంగ్ హీరోతో ప్రేమలో ఉన్నారంటూ బాలీవుడ్ మీడియా కథనాలు రాసుకొచ్చింది. ఇంతకీ జహీర్ ఇక్బాల్ ఎవరంటే.. త్వరలోనే బాలీవుడ్‌కు పరిచయం కానున్న హీరో. సల్మాన్ ఖాన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'నోట్‌బుక్' అనే సినిమా ద్వారా బాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వనున్నారు. జహీర్, సోనాక్షీ కలవడానికి కారణం కూడా సల్మాన్‌ఖానే అని టాక్. రీసెంట్‌గా జరిగిన సల్మాన్ బర్త్‌డే సెలబ్రేషన్స్‌లో జహీర్‌తో కలసి పార్టీకు కూడా హాజరు అయ్యారట సోనాక్షి. అయితే ఈ వార్తలను సోనాక్షి కొట్టిపారేశారు. 'మేం రిలేషన్‌లో లేము. మా ఇద్దరి మధ్యలో రొమాన్స్ ఏం లేదు' అని సమాధానమిచ్చారు. మరి ఏమీ లేకుండా కలిసి ఎందుకు తిరుగుతున్నట్లబ్బా? అని కొందరి సందేహం. ఆ సంగతలా ఉంచి, సినిమాల విషయానికి వస్తే సోనాక్షి ' కళంక్' అనే పీరియాడికల్ చిత్రంలో నటించారు. జహీర్ 'నోట్‌బుక్' చిత్రం మార్చిలో విడుదల కానుంది.



ప్రవీణ, వెంకటేశ్

అర్హత లేదా?

గతేడాది రిలీజైన 'కేరాఫ్ కంచరపాలెం' ఆడియన్స్‌కు ఎంతగా నచ్చిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. 2018లో వచ్చిన ఉత్తమ చిత్రమంటూ పొగడ్తల వర్షాలు కురిపించారు. రానా సమర్పించిన ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు మహా వెంకటేశ్ డైరెక్ట్ చేయగా, తెలుగు మూలాలున్న అమెరికన్ డాక్టర్ పరుచూరి ప్రవీణ నిర్మించారు. ఈ ఏడాది నేషనల్ అవార్డ్స్ లిస్ట్‌లో 'కేరాఫ్ కంచెరపాలెం' సెలెక్ట్ కాలేదు. కారణం నిర్మాత అమెరికన్ కావడమే. ఈ విషయాన్ని ట్వీటర్‌లో పేర్కొన్నారు ప్రవీణా పరుచూరి. ''సారీ వెంకటేశ్ మహా. కేవలం నా వల్ల నీ కష్టాన్ని, శ్రమని నేషనల్ అవార్డ్ వాళ్లు అనర్హంగా భావించారు. నా వల్లే నువ్వోడిపోయావ్. నేనే నిన్ను ఓడిపోయేలా చేశాను'' అని తన బాధను వ్యక్తపరిచారు. దీనికి దర్శకుడు వెంకటేశ్ మహా సమాధానమిస్తూ – ''అది మీ తప్పు కాదు. ఇంకా ఆ పాత రూల్స్‌తోనే నడుస్తున్న మన దేశానిది. ఒక ఇండియన్ డైరెక్టర్, ఇండియన్ యాక్టర్స్‌తో ఇండియా వాళ్ల కోసం తీసిన సినిమా ఇండియన్ నేషనల్ అవార్డ్స్‌కు అర్హత సాధించకపోవడమేంటో నాకు అర్థం కావడం లేదు. మార్పుకు సమయం ఆసన్నమైంది'' అని పేర్కొన్నారు.



రాకేశ్ రోషన్

బాగానే ఉన్నాను

గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న దర్శక–నిర్మాత రాకేశ్ రోషన్ మంగళవారం దానికి సంబంధిత ఆపరేషన్ చేయించుకున్నారు. ఆపరేషన్ సక్రమంగానే జరిగినట్టు రాకేశ్ రోషన్ టీమ్ పేర్కొంది. ''ఆపరేషన్ బాగా జరిగింది. ప్రస్తుతానికి నా ఆరోగ్యం బాగానే ఉంది. దేవుడున్నాడు. శుక్రవారం లేదా శనివారం ఇంటికి కూడా వెళ్లిపోతాను'' అని రాకేశ్ పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 10-1-2019



ఎందుకు పుట్టడం లేదు?

సమాజం స్పీడ్ పెరిగింది.
పట్టుకుందామంటే అందడం లేదు.
మనసు గర్భం స్ట్రెస్‌తో
కుంగిపోతోంది.
గుండె గర్భం బాధ్యతలతో
బరువెక్కింది.
అందుకేనేమో చిలకా గోరింకల్లాంటి
జంటలు కూడా తల్లిదండ్రులు
కాలేకపోతున్నాయి.
తప్పు ఎక్కడుంది?
ఒక్కోసారి శరీరంలో ఉండవచ్చు.
కానీ... చాలాసార్లు
అజ్ఞానంలో ఉంటుంది.
దాన్ని తొలగించడం కోసమే...
చదవండి... తెలుసుకోండి... కనండి

ఇటీవల కాలంలో భారతదేశంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నాయి. వీళ్ల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. దీనికి అనేక కారణాలున్నాయి. పైచదువులు, మంచి ఉద్యోగాలు అంటూ ఆధునిక యువత కెరియర్ కోసం ఎక్కువ కాలం కేటాయించడం, పెద్ద పెద్ద లక్ష్యాలను ఏర్పరచుకోవడం, వాటిని నెరవేర్చుకోవడం కోసం ఎదురుచూస్తూ ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, ఉద్యోగాల్లో ఒత్తిడి, ఆధునిక ఆహార అలవాట్లు, క్రమంగా లేని పనివేళలు, శారీరక శ్రమ ఎక్కువగా లేకపోవడం, అధిక బరువు, మద్యపానం, పొగతాగడం, డ్రగ్స్ వంటి అనారోగ్యకర అలవాట్లు, వ్యసనాలు వంటివి సంతాన లేమికి సామాజికంగా ఉన్న అవరోధాలు. దీనికి తోడు ఒక ఇంట్లో భార్యాభర్తా ఇద్దరూ పనిచేస్తుంటే వారి పనివేళలు వేరువేరుగా ఉండటం, ఒక వేళ కలిసే సందర్భాల్లో వారిద్దరూ అలసిపోయి ఉండటం వంటివి కూడా ఇటీవలి ఆధునిక ఉద్యోగాల కారణంగా చోటు చేసుకుంటున్న మరో సామాజికమైన సమస్య.

ఇవిగాక ఆరోగ్యరీత్యా చూసుకుంటే వ్యక్తుల్లో, ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా వచ్చే ఇన్ఫెక్షన్లు, మానసిక ఒత్తిడులు, హార్మోన్లలో అసమతుల్యత ఏర్పడటం వంటివి మరికొన్ని. ఇక ప్రత్యేకంగా మహిళల్లోనే వచ్చే సమస్యలు కూడా సంతానలేమికి ఎంతో దోహదం చేస్తున్నాయి. ఉదాహరణకు అండం తయారీలో, ఫలదీకరణలో, పిండం ఇంప్లాంటేషన్‌లో ఇబ్బందుల వంటివి మహిళలకు ప్రత్యేకంగా వచ్చే సమస్యల్లో కొన్ని. ఇక మగవారిలోనైతే... శుక్రకణాల సంఖ్య, కదలిక, నాణ్యత తగ్గడం సంతానం కలగడానికి అవరోధంగా నిలుస్తున్నాయి. డాక్టర్ సలహా, ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇష్టం వచ్చినట్లుగా కొన్ని మందులు వాడటం కూడా సంతానలేమికి ఒక కారణంగా కొంతవరకు చెప్పవచ్చు.

సంతానలేమి సమస్య ఉందని నిర్ధారణ ఎలా?

సాధారణంగా ఆరోగ్యంగా ఉన్న భార్యాభర్తలు వివాహం అయ్యాక ఎలాంటి కుటుంబనియంత్రణ పద్ధతులను పాటించకుండా, అన్యోన్యంగా కలిసి ఉంటూ ఏడాది పాటు గర్భధారణ కోసం ప్రయత్నించినా గర్భం రాకపోతే అప్పుడు ఆ దంపతులకు సంతానలేమి సమస్య ఉండే అవకాశాలు ఉండవచ్చు. ఇలాంటి సమస్యను ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు.

ఇక రెండో రకమైన సంతానలేమి కూడా కొందరిలో కనిపిస్తుంటుంది. మొదటిసారి గర్భం దాల్చిన తర్వాత, రెండోసారి గర్భధారణ జరగాలని కోరుకున్నప్పుడు ఏడాదిపాటు ప్రయత్నించినా గర్భం దాల్చకపోతే దాన్ని సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు.

జంటలోని స్త్రీ, పురుషులిద్దరిలోనూ ఎలాంటి సమస్యలు లేకపోయినా 100 జంటల్లో 80 శాతం మందికి పెళ్లయిన ఏడాదికి గర్భం వస్తుంది. మిగతా 10 శాతం మంది జంటల్లోనూ రెండు సంవత్సరాల్లో గర్భం వస్తుంది. మిగతా వారిలో 5 శాతం మందికి సంతానలేమి చికిత్స అవసరం. మిగతా 5% మందికి మాత్రం అడ్వాన్స్‌డ్ చికిత్సలు అవసరమవుతాయి.

సంతానలేమి చికిత్సకు ఎవరు అర్హులు ?

మహిళకు ప్రతినెలా నెలసరి సక్రమంగా వస్తూ, రెండేళ్ల పాటు ప్రయత్నించాక కూడా గర్భం రానివారికీ, ఆ మహిళ 30 ఏళ్ల వయసుకు చేరుకుంటున్నప్పుడు... ఆ దంపతులు డాక్టర్‌ను సంప్రదించి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకోవడం మంచిది. అలాగే 30 ఏళ్లు దాటిన మహిళలైతే అప్పటికే ఏడాదిగా సంతానం కోసం ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోతే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇక 33 ఏళ్లు దాటిన మహిళలైతే ఆరు నెలలు ప్రయత్నించినా గర్భం రాకపోతే డాక్టర్‌ను వెంటనే కలవాలి. అయితే తక్కువ వయసున్న మహిళలు ఏడాది లేదా ఆర్నెల్లు ప్రయత్నించినా గర్భం రాలేదని ఆందోళన చెందడం సరికాదు. మరో ఏడాది భార్యాభర్తలిద్దరూ అన్యోన్యంగా గడిపి అప్పటికీ గర్భం రాకపోతే అప్పుడు డాక్టర్‌ను కలవండి.

గర్భం ఎలా వస్తుంది?

గర్భధారణకు మహిళ, పురుషుడు ఈ ఇద్దరూ అన్ని విధాలా ఆరోగ్యంగా ఉండాలి. పురుషుడిలో వీర్యకణాల సంఖ్య సంతానం కలగడానికి అనువుగా ఉండాలి. సాధారణంగా ఒకసారి పురుషుడి వీర్యం విడుదలైతే అందులో కనీసం 20 – 60 లక్షల వీర్యకణాలు ఉండి, అందులో 40% నుంచి 50% మంచి కదలిక ఉండి, వాటి నాణ్యత బాగుంటే సంతానం వచ్చే అవకాశాలు ఎక్కువ.

ఇక మహిళల విషయానికి వస్తే వారిలో మెదడు నుంచి ఎఫ్‌ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ప్రోలాక్టిన్, టీఎస్‌హెచ్ వంటి హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి నెల నెలా అండాశయాల మీద ప్రభావం చూపి, ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్ హార్మోన్లు విడదలయ్యేలా చేస్తాయి. ఈ హార్మోన్లు నెలానెలా అండం తయారీకీ, విడుదల కావడానికి దోహదపడతాయి. అలా అండం విడుదలైనప్పుడు స్త్రీ,పురుషుల కలయిక సంభవిస్తే అప్పుడు వీర్యకణాలు యోని నుంచి గర్భాశయ ముఖద్వారం (సర్విక్స్) ద్వారా లోపలి వైపునకు ఈదుకుంటూ పోతాయి. ఈలోపు గర్భాశయంలోని అండాశయం నుంచి విడుదలైన అండం ఫెలోపియన్ ట్యూబ్స్‌లోకి ప్రవేశించి అక్కడ ఉంటుంది. ఇది నెలసరికీ, నెలసరికీ దాదాపు మధ్యగా ఉండే కాలంలో జరిగే ప్రక్రియ.

ఈ సమయంలో స్త్రీ, పురుషుల కలయిక జరిగితే ఈదుకుంటూపోయే వీర్యకణాలు అక్కడి అండంలోకి ప్రవేశించడం జరిగితే, ఆ ప్రక్రియను ఫలదీకరణ (ఫెర్టిలైజేషన్) అంటారు. క్రమం తప్పకుండా రుతుక్రమం వచ్చే మహిళల్లో రుతుక్రమం వచ్చిన రోజు నుంచి 11వ రోజు మొదలుకొని 16వ రోజు వరకు ఏదో ఒక సమయంలో అండం సంపూర్ణంగా సంసిద్ధమై ఉంటుంది. అప్పుడు దంపతులు తప్పక కలవడం అవసరం. ఇలా ఫలదీకరణ జరగడం వల్ల అండం పిండంగా మారుతుంది. ఇలా ఫలదీకరణ జరిగాక ఆ పిండం గర్భాశయంలో ప్రోజెస్టెరాన్ హార్మోన్ వల్ల మందంగా తయారై ఉన్న ఎండోమెట్రియమ్ అనే పొరలో ఒదిగిపోయి (ఇంప్లాంటేషన్), శిశువుగా పెరుగుతుంది.

ఇంత సంక్లిష్టంగా ఉండే ఈ ప్రక్రియలో ఎక్కడ లోపం ఏర్పడ్డా, గర్భధారణ ప్రక్రియ జరగక సంతాన లేమి సమస్య వస్తుంది.

పిల్లలు కలిగేందుకు వయసు పరిమితి ఇలా:

మహిళలు 21 సంవత్సరాల వయసులో శారీరకంగానూ, మానసికంగానూ దృఢంగా, ఆరోగ్యంగా ఉంటారు. సాధారణంగా ఆ సమయంలో గర్భం ధరించడానికి వారి శరీరం సంసిద్ధంగా ఉంటుంది. కాబట్టి మహిళలు తమకు కనీసం 21 ఏళ్ల వయసు వచ్చాకే గర్భం ధరించడానికి ప్రయత్నించడం మంచిది. మహిళల్లోని అండాశయంలో పరిపక్వత చెందని అండాలు రజస్వల అయ్యే నాటికి నాలుగు లక్షలు ఉంటాయి. వీటిలో ప్రతి నెలా కొన్ని నశించిపోతూ, ఒక్కొక్క అండమే పెరిగి విడుదల అవుతుంటుంది. ఒక్కొక్కరి శరీర తత్వాన్ని బట్టి 30 ఏళ్ల వయసు దాటే కొద్దీ ఆ అండాల సంఖ్య క్రమంగా తగ్గడం మొదలవుతుంది. 35 ఏళ్ల వయసు దాటేసరికి అండాల సంఖ్య, నాణ్యత బాగా తగ్గడం మొదలవుతుంది. దాంతో సంతానలేమి సమస్య పెరుగుతుంది.

సమస్యను కనుగొనడం ఎలా?

అండం విడుదల అవుతోందా లేదా అని తెలుసుకోడానికి 11వ రోజు నుంచి 18వ రోజు వరకు ఫాలిక్యులార్ స్టడీస్, ట్రాన్స్‌వెజైనల్ స్కానింగ్ వంటి పరీక్షలు చేయించుకోవాలి. దీని కంటే ముందు పీరియడ్ వచ్చిన మూడో రోజు బేసల్ పెల్విస్ స్కాన్ చేయించుకోవడం వల్ల అండాశయాలు ఎలా ఉన్నాయి, వాటిలో చిన్న అండాల సంఖ్య (ఒవేరియన్ రిజర్వ్) ఎలా ఉంది, పీసీఓడీ ఉందా ఇంకా వేరే సిస్టులు ఏమైనా ఉన్నాయా, గర్భాశయంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అనేది తెలుసుకోవచ్చు. అలాగే అండం విడుదల కాకపోవడానికి హార్మోన్ల సమస్య ఏమైనా ఉందేమో తెలుసుకోడానికి ఎఫ్‌ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ప్రోలాక్టిన్, టీఎస్‌హెచ్, ఈస్ట్రోజెన్ వంటి రక్తపరీక్షలు చేయడం అవసరమవుతుంది. అండాల నాణ్యత, వాటి సంఖ్య తెలుసుకోవడానికి కొందరిలో సీరమ్ ఏఎమ్‌హెచ్ అనే పరీక్ష చేయించడం జరుగుతుంది.

చికిత్స : అండం సరిగా పెరగనప్పుడు, అండం పెరగడానికి క్లొమిఫిన్, లెట్రోజ్ వంటి కొన్ని రకాల మాత్రలు..., వాటి మోతాదులను క్రమంగా పెంచుకుంటూ వాడాల్సి ఉంటుంది. అలా జరగనప్పుడు గొనాడోట్రోపిన్ హార్మోన్ ఇంజెక్షన్ ఇవ్వడం జరుగుతుంది. అండాశయాలలో పీసీఓడీ కారణంగా అండాలు పెరగకపోతే ఆ సందర్భంలో లాపరోస్కోప్ అనే చిన్న ఆపరేషన్ ద్వారా, పీసీఓడీలోని నీటి తిత్తుల్లో కొన్నింటిని కాల్చడం జరుగుతుంది. దీన్నే ఒవేరియన్ డ్రిల్లింగ్ అంటారు. దాంతో కొంతమేరకు హార్మోన్లలో వచ్చిన తేడా తగ్గిపోయి, మళ్లీ మందుల వల్ల అండం విడుదల అయ్యే అవకాశాలు పెరుగుతాయి.

అలాగే అండాశయంలో సిస్టులు (నీటితిత్తులు), ఎండోమెట్రియాసిస్ వంటి సమస్యలను కూడా లాపరోస్కోపిక్ ప్రక్రియ ద్వారా తొలగించి, ఆ తర్వాత గర్భం వచ్చేందుకు అవసరమైన చికిత్స తీసుకోవచ్చు. వయసు పెరిగే కొద్దీ అండాలు తగ్గిపోయి, మందులు ఇచ్చినప్పటికీ అండాల సంఖ్య పెరగనప్పుడు, ఎవరైనా దాత నుంచి స్వీకరించి అండాన్ని తీసుకుని దాన్ని ఉపయోగించాల్సి ఉంటుంది. (ఇలా సేకరించిన అండాన్ని డోనార్ ఊసైట్ అంటారు).

థైరాయిడ్ సమస్య ఉన్నప్పుడు, మొదట దాన్ని తగ్గించే మందులు వాడాలి. అప్పుడు ఆ కారణంగా వచ్చిన హార్మోన్ల అసమతౌల్యత తగ్గి, గర్భధారణకు అవకాశాలు మెరుగుపడతాయి.

(మరికొన్ని లోపాలు, వాటి పరిష్కారాల గురించి తదుపరి వారం)...



డా॥ వేనాటి శోభ
బర్త్‌రైట్ బై రెయిన్‌బో
హైదర్‌నగర్

సంతానలేమికి కారణాలు



మొదటే చెప్పినట్లు సంతానలేమికి అటు పురుషుల్లోనూ, ఇటు మహిళల్లోనూ కారణాలు ఉంటాయి. అయితే ఇక్కడ మహిళల్లో కనిపించే సమస్యలను చూద్దాం.

అండం విడుదలలో లోపాలు : సంతానం కలగకపోవడానికి మహిళల్లో అండం విడుదలలో లోపాలు 30, 40 శాతం వరకు కారణమవుతున్నాయి. మళ్లీ అందుకు తగిన కారణాలూ ఉన్నాయి.

- టెన్షన్ లేదా స్ట్రెస్ కారణంగా మెదడు నుంచి విడుదల కావాల్సిన హార్మోన్లు సరిగా విడుదల కాకపోవడం, ఒకవేళ విడుదలైనా అవి సరిగా పనిచేయకపోవడం వల్ల అండాశయం నుంచి అండం విడుదల కాదు.
- కొందరిలో అధిక బరువు కూడ అండం విడుదల లోపాలకు కారణమవుతుంటుంది.
- అలాగే ఎక్కువగా డైటింగ్, వ్యాయామాలు చేసి, ఉన్నట్లుండి బరువు తగ్గడం, మరీ నాజూగ్గా ఉండటం వల్ల కూడా హార్మోన్లు క్రమం తప్పుతాయి. అలాగే ఈ క్రమంలో కొందరికి పోషకాహార లోపం వంటి సమస్య కలిగి ఇది కూడా అండం విడుదలకు ఒక అవరోధంగా మారుతుంది.
- థైరాయిడ్ సమస్య అండం విడుదల కాకుండా ఉండేందుకు కలిగే సమస్యల్లో ముఖ్యమైనదీ, కీలకమైనది.
- **పాలిసిస్టిక్ ఓవరీస్ :** ఈ సమస్య కారణంగా కొందరి అండాశయాల్లో చిన్న చిన్న నీటి బుడగలు చోటుచేసుకుంటాయి. వారి వారి శరీర తత్వాన్ని బట్టి వాటి వల్ల కొందరిలో హార్మోన్ల అసమతౌల్యత ఏర్పడవచ్చు. దాంతో వారిలో అండం సక్రమంగా విడుదలకాకపోవచ్చు.
- ఇక గుండె, మూత్రపిండాల వంటి దీర్ఘకాలిక జబ్బులు ఉన్న కొందరిలోనూ అండం సక్రమంగా విడుదల కాకపోడానికి అవకాశం ఉంటుంది.
- వయసు పెరిగే కొద్దీ అండాలు తగ్గిపోవడం వల్ల కూడా కొందరిలో అండం విడుదల కాదు.

తప్పు మహిళదా... పురుషుడిదా?



సాధారణంగా మన సమాజంలో మహిళ గర్భం దాల్చకపోతే ఆమెనే తప్పుబడుతుంటారు. లోపం ఆమెలోనే ఉందని గుడ్డిగా తీర్మానిస్తుంటారు. అయితే గర్భధారణ జరగకపోవడానికి లోపాలు 40% మహిళల్లో ఉంటే, మరో 40% శాతం పురుషుల్లోనూ ఉండవచ్చు. ఇద్దరిలోనూ లోపాలున్న కేసులు 10% ఉంటాయి. అయితే ఎంతకూ కారణాలు తెలియని కేసులు మరో 10% ఉంటాయి. అందుకే ఒక జంటకు సంతానం కలగకపోతే ఎవరినెవరూ నిందించుకోకుండా, శాస్త్రీయ పద్ధతుల్లో అవసరమైన పరీక్షలన్నీ క్రమంగా చేయించుకోవాలి. ఇటీవలి వైద్యశాస్త్ర పురోగతి వల్ల ఎవరిలో లోపాలున్నప్పటికీ, వాటిని అధిగమించుకునేందుకు అవసరమైన ప్రక్రియలు అందుబాటులో ఉన్నాయి. అందుకే ఎవరినెవరూ నిందించుకోకుండా, పరస్పరం సహకరించుకుంటూ అదే అన్యోన్యతను కొనసాగించుకునే దంపతులకు ఈ కాలంలో సంతానభాగ్యం కలగడం అంత పెద్ద సమస్యేమీ కాబోదని దంపతులిద్దరూ గుర్తించాలి. వారితో పాటు వారి తరఫు బంధువులందరికీ ఈ విషయంలో అవగాహన అవసరమని చాలా రకాల సామాజిక పరిశీలనలూ తెలుపుతున్నాయి. అందుకే సంతానలేమి ఉన్న దంపతుల్లో కేవలం వారు మాత్రమే కాకుండా, అందరూ ఈ విషయంలో అవగాహన పెంపొందించుకోవడం అవసరం.

పరి పరిశోధన

పంటలు.. ఇబ్బడి ముబ్బడి!



పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్టుగా అత్యధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు ఒక కొత్త మార్గం కనుక్కున్నారు. కిరణజన్య సంయోగ క్రియ వ్యవస్థలో ఉన్న లోపాన్ని సరిచేయడం ద్వారా మొక్కలు అతి తక్కువ కాలంలో ఎక్కువ కాపునిచ్చేలా చేయవచ్చునని దీనిద్వారా పంట దిగుబడులు కనీసం 40 శాతం వరకూ పెరుగుతాయని పాల్ సౌత్ అనే శాస్త్రవేత్త తెలిపారు. సూర్యుడి నుంచి వచ్చే వెలుతురు శక్తిగా మార్చుకునే ప్రక్రియకు కిరణ జన్య సంయోగ క్రియ అంటారన్నది తెలిసిందే. అయితే యుగాలుగా ఈ ప్రక్రియ పూర్తి సామర్థ్యంతో పనిచేయడం లేదు. ఒక దశలో కార్బన్‌డయాక్సైడ్ కణాలను లాక్కునేందుకు రుబిస్‌కో అనే ఎంజైమ్ ఉపయోగపడుతూంటుంది.అయితే కొన్నిసార్లు ఈ ఎంజైమ్ కార్బన్‌డయాక్సైడ్‌కు బదులుగా ఆక్సిజన్‌ను లాగేసుకుంటుంది. దీని ప్రభావం దిగుబడులపై ఉంటుంది. సౌత్ తన బృందంతో కలిసి చేసిన పరిశోధనల్లో ఈ ఎంజైమ్‌ను నియంత్రించేందుకు ఒక పద్ధతిని తెలుసుకోగలిగారు. ఈ పద్ధతితో సాగైన పొగాకు పంట తక్కువ కాలంలోనే 40 శాతం వరకూ ఎక్కువ దిగుబడిని ఇచ్చింది. సోయా, వరి, బంగాళాదుంప, టమోటా వంటి పంటల్లోనూ ఈ పద్ధతిని పరీక్షించేందుకు ప్రస్తుతం ఏర్పాట్లు జరుగుతున్నాయని.. ఆ తరువాత విస్తృత వినియోగానికి అందుబాటులోకి తెస్తామని సౌత్ తెలిపారు.

* * *

ఈసీజీకి కృత్రిమ మేధ హంగు!



ఈసీజీ గురించి మీరు వినే ఉంటారు. గుండె పనితీరును అంచనా వేసేందుకు అందుబాటులో ఉన్న ఈ పురాతన పద్ధతిని పూర్తిగా మార్చేశారు మేయో క్లినిక్ శాస్త్రవేత్తలు. గుండె విద్యుత్ సంకేతాలను గుర్తించడానికి పరిమితం కాకుండా గుండెజబ్బులను చాలా తొందరగా గుర్తించడం ఈ కొత్త పద్ధతి ప్రత్యేకత. ఖరీదైన పరీక్షల ద్వారా మాత్రమే నిర్ధారించే వీలున్న లెఫ్ట్ వెంట్రిక్యులర్ డిస్‌ఫంక్షన్‌ను ఈ కొత్త పద్ధతి ద్వారా గుర్తించవచ్చు. ఎటువంటి సంకేతాలు కూడా చూపకపోవడం ఈ లెఫ్ట్ వెంట్రిక్యులర్ డిస్‌ఫంక్షన్.. రక్త పరీక్షల ద్వారా గుర్తించేందుకు అవకాశమున్నా ఫలితాలు ఎప్పుడూ ఒకేలా లేకపోవడం నేపథ్యంలో ఈ కొత్త ఈసీజీ పద్ధతి అందుబాటులోకి వచ్చింది. కృత్రిమ మేధ పద్ధతులను ఉపయోగించడం ద్వారా ఈ కొత్త ఈసీజీ పద్ధతి గుండెజబ్బు అవకాశాలను అంచనా వేస్తుందని చవకగా కేవలం పది సెకన్లలో అయిపోవడం మరో లాభమని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త పాల్ ఫ్రెడ్‌మ్యాన్ తెలిపారు. దాదాపు ఆరు లక్షల మంది ఈసీజీ వివరాల ఆధారంగా పనిచేసే ఈ కృత్రిమ మేధ వ్యవస్థను ఇప్పటికే 50 వేల మందిపై విజయవంతంగా పరీక్షించి చూశారు కూడా. అతిసున్నితమైన అంశాలను పసిగట్టడం ద్వారా గుండెజబ్బులను చాలాముందుగా గుర్తించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు.

ముగ్గు-ముచ్చట



21 చుక్కలు
11 వచ్చేవరకు
సరి చుక్క

ఐశ్వర్య లక్ష్మి
కడప, వైయస్ఆర్ జిల్లా



మంగిపూడి శకుంతల
హైదరాబాద్

21 చుక్కలు
1 వచ్చేవరకు నిలువు చుక్క



17 చుక్కలు
1 చుక్క వదిలి
1 వచ్చువరకు

పద్మ దేవి
భీమవరం, ప గో జిల్లా

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
గురువారం
10-1-2019



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్.. దేశంలో ఉన్నత విద్యా సంస్థలను ప్రపంచ శ్రేణి ఇన్‌స్టిట్యూట్‌లుగా తీర్చిదిద్దేందుకు.. కేంద్ర ప్రభుత్వం గతేడాది అమల్లోకి తెచ్చిన కొత్త పథకం! 2020 నాటికి ప్రభుత్వ రంగం నుంచి పది... ప్రైవేటు రంగం నుంచి పది మొత్తం 20 ఇన్‌స్టిట్యూట్‌లను.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌గా గుర్తించాలనే లక్ష్యం! ఇలా గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లకు.. పలు రకాల ప్రోత్సాహకాలతోపాటు, కోర్సులు, కరిక్యులం, ఫీజుల పరంగా స్వయం ప్రతిపత్తి లభిస్తుంది. గతేడాది ఆరు విద్యాసంస్థలు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదా పొందాయి! తాజాగా మరో 24 ఇన్‌స్టిట్యూట్‌ల పేర్లను నిపుణుల కమిటీ సిఫార్సు చేసిన నేపథ్యంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదాతో ప్రయోజనాలు.. ఇన్‌స్టిట్యూట్‌లు అనుసరించాల్సిన ప్రమాణాల గురించి తెలుసుకుందాం..

- మరో 24 ఇన్‌స్టిట్యూట్‌లను సిఫార్సు చేసిన నిపుణుల కమిటీ
- ఉన్నత విద్యా సంస్థలను అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యం
- ఎంపికైన ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లకు ఆకర్షణీయ ఆర్థిక ప్రయోజనాలు
- కోర్సులు, ఫీజులు, కరిక్యులం పరంగా స్వయం ప్రతిపత్తికి ఆస్కారం

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్..
ప్రపంచ శ్రేణికి ఎదిగేలా!

మన దేశంలో ఎన్నో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీలు ఉన్నాయి. కానీ.. వీటిలో ఐఐఎస్సీ, ఐఐఎంలు, ఐఐటీలు మినహా.. మిగతా ఇన్‌స్టిట్యూట్‌లు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను అందుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాంతో కేంద్ర ప్రభుత్వం కేవలం ఐఐఎం, ఐఐటీలే కాకుండా.. ఇతర ఇన్‌స్టిట్యూట్‌లు కూడా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందేలా తీర్చిదిద్దాలని భావించింది. దీనికి అనుగుణంగా 2020 నాటికి ప్రభుత్వ రంగం నుంచి 10, ప్రైవేటు రంగం నుంచి పది మొత్తం 20 ఇన్‌స్టిట్యూట్‌లను, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌గా తీర్చిదిద్దాలని నిర్దిష్ట ప్రణాళిక రూపొందించింది.

యూజీసీ మార్గనిర్దేశకాలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ విధి విధానాలు, సదరు ఇన్‌స్టిట్యూట్‌లను ఎంపిక చేసే బాధ్యతను యూజీసీకి అప్పగించింది. దీంతో యూజీసీ డిక్లరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాజ్ వరల్డ్ క్లాస్ ఇన్‌స్టిట్యూషన్స్ గైడ్‌లైన్స్-2016 పేరుతో మార్గదర్శకాలు రూపొందించింది. మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎన్.గోపాలస్వామి నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో సాధికార నిపుణుల కమిటీని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నియమించింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదా కోసం దరఖాస్తు చేసుకున్న యూనివర్సిటీలు అందించిన సమాచారాన్ని పరిశీలించి.. వాటి అర్హతపై తుది నిర్ణయానికి వచ్చి.. ఆ నిర్ణయం ఆధారంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదాకు అర్హమైన ఇన్‌స్టిట్యూట్‌ల జాబితాను యూజీసీ, ఎంహెచ్ఆర్‌డీలకు అందిస్తుంది.

ఇప్పటికే ఆరింటికి 'ఎమినెన్స్' హోదా

ఈ పథకం ద్వారా గతేడాది ప్రభుత్వ రంగం నుంచి మూడు, ప్రైవేటు రంగం నుంచి మూడు మొత్తం ఆరు విద్యా సంస్థలకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదా లభించింది. వీటిలో ఐఐఎస్సీ-బెంగళూరు, ఐఐటీ-ముంబై, ఐఐటీ-ఢిల్లీ ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లు కాగా, జియో ఇన్‌స్టిట్యూట్, బిట్స్-పిలానీ, మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లు ప్రైవేటు విభాగం నుంచి 'ఎమినెన్స్' హోదా పొందాయి.

మరో 24 ఇన్‌స్టిట్యూట్స్ పేర్లు సిఫార్సు

ఇన్‌స్టిట్యూట్‌లకు ఎమినెన్స్ హోదాల అంశంపై ఏర్పాటైన గోపాలస్వామి కమిటీ తాజాగా.. మరో 24 ఇన్‌స్టిట్యూట్‌లను (12 ప్రభుత్వ, 12 ప్రైవేటు) 'ఎమినెన్స్' హోదాకు సిఫార్సు చేసింది. వీటికి యూజీసీ నుంచి కూడా ఆమోదం లభిస్తే.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ సంఖ్య 30కు చేరుకోనుంది. గోపాలస్వామి కమిటీ తాజాగా సిఫార్సు చేసిన 24 ఇన్‌స్టిట్యూట్‌లలో తెలుగు రాష్ట్రాల నుంచి మూడు ఇన్‌స్టిట్యూట్‌లు (ఆంధ్రా యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, క్రియా యూనివర్సిటీ) ఉండటం విశేషం.

'ఎమినెన్స్' హోదా.. ప్రయోజనాలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదా పొందిన ఇన్‌స్టిట్యూట్‌లకు భారీ స్థాయిలో ప్రయోజనాలు లభించనున్నాయి. పూర్తి స్వయం ప్రతిపత్తి లభిస్తుంది. ఫీజుల నిర్ణయం నుంచి ఫ్యాకల్టీ నియామకాల వరకు.. సదరు ఇన్‌స్టిట్యూట్‌లు స్వయం ప్రతిపత్తితో వ్యవహరించే వీలు కలుగుతుంది.

ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లకు.. భారీ ప్రోత్సాహకాలు

ఎమినెన్స్ హోదా పొందిన ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని ఎంహెచ్ఆర్‌డీ నిర్ణయించింది. ఎమినెన్స్ హోదా పొందిన ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లకు, అదేవిధంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన డీమ్డ్ టు బి యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్‌లకు అయిదేళ్ల వ్యవధిలో రూ.వెయ్యి కోట్లు లేదా సదరు ఇన్‌స్టిట్యూట్ అందించిన ప్రణాళికలు, భవిష్యత్తు లక్ష్యాల ఆధారంగా వాటిని చేరుకునేందుకు అవసరమయ్యే ఖర్చులో 50 నుంచి 75 శాతానికి సమానమయ్యే మొత్తానికి నిధులు మంజూరు చేస్తుంది. వీటిని ఆర్థిక సంవత్సరం ప్రాతిపదికగా.. ఏటా విడతల వారీగా విడుదల చేస్తుంది. అప్పటికే విడుదల చేసిన నిధులు.. ఇన్‌స్టిట్యూట్ ప్రణాళికలను చేరే క్రమంలో అవి సదరు ఆర్థిక సంవత్సరంలో చూపిన ప్రగతి ఆధారంగా మలి విడత నిధుల మంజూరుపై నిపుణుల కమిటీ నిర్ణయం తీసుకుంటుంది.

పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదా పొందిన ఇస్టిట్యూట్‌లకు పూర్తి స్థాయిలో స్వయం ప్రతిపత్తి లభిస్తుంది. విద్యార్థులకు ఫీజులను తమ విచక్షణ మేరకు నిర్ణయించొచ్చు. కరిక్యులం రూపకల్పన, కోర్సు స్వరూపం, డిగ్రీ వ్యవధిని నిర్ణయించే విషయంలోనూ పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. అయితే ఆయా విద్యాసంస్థలు ఎప్పటికప్పుడు తమ నిర్ణయాలను హెచ్ఆర్‌డీ శాఖకు తెలియజేయాల్సి ఉంటుంది. అన్నిటికంటే ముఖ్యంగా తమ ఇన్‌స్టిట్యూట్‌లో అకడమిక్ నైపుణ్యాల పెంపు పరంగా విదేశీ యూనివర్సిటీలతో ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్ నిర్వహించుకునేందుకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. ఆ దేశాలు విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొన్న నిషేధిత దేశాల జాబితాలో ఉండకూడదు.

ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ, స్టూడెంట్

ఎమినెన్స్ హోదా పొందిన ఇన్‌స్టిట్యూట్‌లు ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ నియామకం, ఇంటర్నేషనల్ స్టూడెంట్ అడ్మిషన్స్ విషయంలో తమ స్వీయ విచక్షణ మేరకు వ్యవహరించే వీలుంది. ఒక కోర్సు లేదా ఇన్‌స్టిట్యూట్‌లోని మొత్తం విద్యార్థుల సంఖ్యకు అదనంగా 30 శాతం మేరకు ఇంటర్నేషనల్ స్టూడెంట్స్‌ను చేర్చుకోవచ్చు.



ప్రయోజనాలు.. ముఖ్యాంశాలు

- పూర్తిగా స్వేచ్ఛగా వ్యవహరించే వెసులుబాటు.
- ఫ్యాకల్టీ నియామకం, వేతనాల నిర్ణయంలో స్వతంత్రత. ఫలితంగా నిపుణులైన ఫ్యాకల్టీని నియమించుకునే అవకాశం. ఫ్యాకల్టీ కొరత సమస్యకు పరిష్కారం.
- తొలుత 1:20, తర్వాత 1:10 మేరకు పేర్కొన్న ఫ్యాకల్టీ-స్టూడెంట్ నిష్పత్తి. ఫలితంగా విద్యార్థులకు మెరుగైన బోధన, నైపుణ్యాలు లభించే అవకాశం.
- కార్పస్ ఫండ్ కేటాయింపు ఫలితంగా రీసెర్చ్ యాక్టివిటీస్ పెరిగే అవకాశం.
- విదేశీ వర్సిటీలతో జాయింట్ ఎక్స్ఛేంజ్ ఫలితంగా అంతర్జాతీయంగా తాజా పరిణామాలపై విద్యార్థులకు అవగాహన లభించే అవకాశం.

ఈ ప్రమాణాలు తప్పనిసరి

- అత్యున్నత స్థాయిలో బోధన, పరిశోధన కార్యకలాపాలు నిర్వహిస్తుండాలి.
- మల్టీ డిసిప్లినరీ కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- రెగ్యులర్ ప్రోగ్రామ్స్‌కు సమానంగా ఇంటర్ డిసిప్లినరీ కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- విదేశీ ఫ్యాకల్టీ లేదా విదేశీ యూనివర్సిటీల అర్హతలున్న వారు ఫ్యాకల్టీగా ఉండాలి.
- సదరు యూనివర్సిటీల్లో స్వదేశీ విద్యార్థులతోపాటు, విదేశీ విద్యార్థుల నిష్పత్తి కూడా బాగుండాలి.
- ఇన్‌స్టిట్యూట్ ప్రపంచ శ్రేణి ఇన్‌స్టిట్యూట్‌గా ఎంపికైన తర్వాత మూడేళ్ల వ్యవధిలో ఫ్యాకల్టీ-స్టూడెంట్ నిష్పత్తి 1:10గా ఉండాలి. దరఖాస్తు సమయంలో 1:20గా ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఇతర మౌలిక సదుపాయాలు, లేబొరేటరీ పరంగా అత్యున్నత ప్రమాణాలు, పరికరాలు కలిగుండాలి.
- వరల్డ్ క్లాస్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తింపు పొందిన 15 ఏళ్ల కాలంలో కనీసం 20 వేల మంది విద్యార్థులు చదువుతుండాలి.
- మొదటి పదేళ్ల వ్యవధిలో వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్-500 జాబితాలో నిలవాలి. తర్వాత కాలంలో టాప్-100 జాబితాలో నిలిచేలా నాణ్యత పాటించాలి.
- సదరు ఇన్‌స్టిట్యూట్ ఎంహెచ్ఆర్‌డీ ర్యాంకింగ్స్‌లో టాప్-25 జాబితాలో ఉండాలి.

ఎమినెన్స్ హోదాకు.. దరఖాస్తు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదా పొందేందుకు విద్యా సంస్థలు ముందుగా యూజీసీకి దరఖాస్తు చేసుకోవాలి. వీటిని ఎంపవర్డ్ ఎక్స్‌పర్ట్ కమిటీ పరిశీలిస్తుంది. దరఖాస్తు చేసుకునే ఇన్‌స్టిట్యూట్‌లు పలు ప్రామాణికాలు పాటించాలి.

అవి..

- 15 ఏళ్ల వ్యవధికి దీర్ఘకాలిక ప్రణాళిక.
- సమీప భవిష్యత్తు (అయిదేళ్ల వ్యవధి)లో అనుసరించనున్న విధానాలు.
- ఇన్‌స్టిట్యూట్ యాజమాన్య వ్యవస్థ వివరాలు.
- ప్రస్తుత ఆర్థిక సామర్థ్యం.
- మౌలిక సదుపాయాల వివరాలు.
- స్టూడెంట్ అడ్మిషన్ పాలసీ.
- రీసెర్చ్ ప్లాన్.
- ప్రైవేటు సెక్టార్, విదేశీ వర్సిటీలు, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌తో కలిసి చేయనున్న పరిశోధనలపై నెట్‌వర్క్ ప్లాన్.

ప్రవేశాలు

కాకతీయ వర్సిటీలో బీఎడ్ ప్రోగ్రామ్

వరంగల్‌లోని కాకతీయ విశ్వ విద్యాలయ దూరవిద్యా విభాగం 2018-19కి గాను బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్-దూర విద్య విధానం (బీఎడ్-డీఎం) ప్రోగ్రాములో చేరేందుకు ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** జనవరి 31, 2019 నాటికి రెండేళ్ల రెగ్యులర్ సర్వీస్ ఉండాలి. బీఏ/బీకాం/ బీఎస్సీ ఉత్తీర్ణత సాధించి, తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ/ఎయిడెడ్/ఎంపీపీ/ జడ్‌పీపీ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పనిచేస్తూ ఉండాలి.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ద్వారా.
- **ప్రవేశ పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 18, 2019.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు ఫీజు:** రూ.800.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 25, 2019.
- **ఆలస్య రుసుం రూ.200తో దరఖాస్తు తేదీలు:** జనవరి 26, 2019 నుంచి ఫిబ్రవరి 2, 2019 వరకు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్: http://sdlceku.co.in**



ఇండియన్ ఎయిర్‌ఫోర్స్..
ఎయిర్‌మెన్ కొలువుల పిలుపు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు ఇంటర్/డిప్లొమా పూర్తిచేసిన అవివాహిత పురుష అభ్యర్థులకు సువర్ణావకాశం. ఎయిర్‌మెన్ హోదాలో గ్రూప్-ఎక్స్ ట్రేడ్, గ్రూప్-వై ట్రేడ్ ఉద్యోగాల భర్తీకి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎంపికైన ఉద్యోగార్థులు ఆయా విభాగాల్లో కెరీర్ ప్రారంభించి మాస్టర్ వారంట్ ఆఫీసర్(ఎండబ్ల్యూవో) ర్యాంకు పొందేందుకు వీలుంది. సర్వీసులో చేరిన అనంతరం నిర్దేశిత పరీక్షల్లో ప్రతిభ కనబరిస్తే కమిషన్డ్ ఆఫీసర్ అవకాశం అందుకోవచ్చు. ఎయిర్‌ఫోర్స్‌లో క్షేత్ర స్థాయి సాంకేతిక విధులు నిర్వర్తిండచానికి గ్రూప్-ఎక్స్ ట్రేడ్ పోస్టులు, పాలన సంబంధిత పనుల్లో పాలు పంచుకునే సిబ్బందిని గ్రూప్-వై పోస్టులుగా పరిగణిస్తారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో వీరి పాత్ర కీలకమైంది.

అర్హతలు

గ్రూప్-ఎక్స్ పోస్టులు

- మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో కలిపి కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ చదివిన విద్యార్థులు అర్హులు. ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. (లేదా)
- 50 శాతం మార్కులతో మూడేళ్ల ఏదైనా ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు. ఇంగ్లిష్ సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు పొంది ఉండాలి. డిప్లొమాలో ఇంగ్లిష్ సబ్జెక్టు లేకపోతే ఇంటర్ లేదా పదోతరగతి ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి.

గ్రూప్-వై ట్రేడ్

- కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన వారు అర్హులు. ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి.

గ్రూప్-వై మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్

- ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో 50శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన వారు అర్హులు. ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- గ్రూప్-ఎక్స్, గ్రూప్-వై రెండు ఉద్యోగాలకూ అర్హులైన విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపునకు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా రెండూ గ్రూపులకు దరఖాస్తు చేసుకొని ఒకే పరీక్ష రాసే అవకాశముంది. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఈ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

వయసు

1999, జనవరి 19-2003, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి. ఎత్తు కనీసం 152.5 సెం.మీ. ఉండాలి. ఊపిరి పీల్చితే ఛాతీ కనీసం 5 సెం.మీ. పెరగాలి. నిర్దేశిత వైద్య ప్రమాణాలు ఉండాలి.

ఎంపిక విధానం

- రెండు దశల్లో పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొదట దశలో ఆన్‌లైన్ టెస్టు నిర్వహిస్తారు.
- గ్రూప్ఎక్స్ పోస్టులకు గంట వ్యవధితో ఇంగ్లిష్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ పేపర్లతో కూడిన టెస్టు ఉంటుంది. 10+2 సీబీఎస్ఈ సిలబస్‌తో పేపర్‌ను సిద్ధం చేస్తారు.
- గ్రూప్ వై ట్రేడ్ పోస్టులకు 45 నిమిషాల వ్యవధితో ఇంగ్లిష్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ సెక్షన్లతో కూడిన పేపర్ ఉంటుంది.
- రెండు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలో ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలడుగుతారు. పరీక్ష వ్యవధి 85 నిమిషాలు.



వెబ్‌సైట్లో

అభ్యర్థులు **https://airmenselection.cdac.in** వెబ్‌సైట్‌లో సబ్జెక్టుల పూర్తి సిలబస్, మోడల్ పేపర్లను చూడొచ్చు. వెబ్‌సైట్‌లో మాక్ టెస్టు, సిలబస్, మోడల్ ప్రశ్నపత్రాలు అందుబాటులో ఉన్నాయి.

- **గమనిక:** రుణాత్మక మార్కులు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు. తప్పు సమాధానం గుర్తిస్తే 0.25 మార్కు కోత విధిస్తారు.

రెండో దశలో

తొలిదశ పరీక్షకు సంబంధించిన హాల్‌టిక్కెట్‌ను మార్చిలో జారీ చేస్తారు. పరీక్ష జరిగిన 25 రోజుల తర్వాత ఫలితాలను వెబ్‌సైట్లో ఉంచుతారు. ఇందులో ఎంపికైన వారికి మరో హాల్‌టిక్కెట్ ఇస్తారు. అందులో పేర్కొన్న సమాచారం మేరకు నిర్దేశిత ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్‌కు సర్టిఫికెట్లతో వెళ్లాలి. వీటి పరిశీలన అనంతరం రెండో దశలో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్(పీఎఫ్‌టీ) ఉంటుంది. ఇందులో మొదట 1.6 కిలోమీటర్ల దూరాన్ని ఆరున్నర నిమిషాల్లో పూర్తిచేయాలి. అలాగే నిర్ణీత కాల వ్యవధిలో 10 పుషప్స్, 10 సిటప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి.


అడాప్టబిలిటీ టెస్ట్

పీఎఫ్‌టీలో అర్హత సాధించినవారికి అడాప్టబిలిటీ టెస్ట్ 1 నిర్వహిస్తారు. ఇది ఆబ్జెక్టివ్ తరహా రాత పరీక్ష. ఎయిర్‌ఫోర్స్‌లో చేరే అభ్యర్థులు పనిలో భాగంగా వివిధ ప్రాంతాల్లో, వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. దీనికి అభ్యర్థులు సంసిద్ధంగా ఉన్నారా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు అడాప్టబిలిటీ టెస్ట్ 1 నిర్వహిస్తారు. ఈ దశనూ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి అడాప్టబిలిటీ టెస్ట్ 2 నిర్వహిస్తారు. అభ్యర్థులు ఇండియన్ ఎయిర్‌ఫోర్సు పని వాతావరణానికి అలవాటు పడగలరా, క్రమశిక్షణ గల మిలటరీ జీవన విధానానికి సర్దుకునేతత్వం ఉన్నదా? అనే విషయాన్ని పరిశీలిస్తారు. ఈ దశ దాటిన వారిని వైద్య పరీక్షల కోసం ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్‌లోనే మెడికల్ అపాయింట్‌మెంట్ లెటర్ జారీ చేస్తారు. తుదిగా వైద్య పరీక్షలు నిర్వహించి శిక్షణ కోసం ఎంపిక చేస్తారు.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2019, జనవరి 21.
- **దరఖాస్తు రుసుం:** రూ.250.
- **పరీక్ష తేదీలు:** 2019, మార్చి 14-17.
- **వెబ్‌సైట్:** **https://airmenselection.cdac.in, www.careerindianairforce.cdac.in**

విద్య వీక్లీ టెస్ట్‌తో ప్రిపరేషన్‌కు పదును!



పోటీ, అకడమిక్ పరీక్షల అభ్యర్థుల కోసం ప్రతిరోజూ 'విద్య'లో స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్లను అందిస్తున్న విషయం తెలిసిందే. ఇకపై అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను సమీక్షించుకునేందుకు వీలుగా సాక్షి విద్య.. ప్రతి వారం ఆన్‌లైన్‌లో గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహించనుంది. 'విద్య'లో ప్రచురించిన సబ్జెక్టుల్లోంచి రూపొందించిన ఈ టెస్టులు రాయడం ద్వారా అభ్యర్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని తెలుసుకోవచ్చు. తద్వారా పరీక్షలకు మరింత సన్నద్ధమవడానికి అవకాశం ఉంటుంది. అభ్యర్థులు **www.sakshieducation.com** ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఫలితాలతోపాటు రాష్ట్ర స్థాయి ర్యాంకులను ప్రతి సోమవారం ప్రకటిస్తారు. టాప్ ర్యాంకులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తారు.



ప్రజ్నేశ్ గుణేశ్వరన్ శుభారంభం

ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ శుభారంభం చేశాడు. మెల్‌బోర్న్‌లో బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రజ్నేశ్ 6–4, 6–4తో విక్టర్ గాలోవిక్ (క్రొయేషియా)పై గెలుపొందాడు. 88 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రజ్నేశ్ ఆరు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. రెండో రౌండ్‌లో ఎన్రిక్ లోపెజ్ పెరెజ్ (స్పెయిన్)తో ప్రజ్నేశ్ తలపడతాడు.

కోహ్లి ప్రశంసలే పది వేలు!

ఆస్ట్రేలియా గడ్డపై భారత్ టెస్టు సిరీస్ విజయం... ఎన్నో ఏళ్లుగా సాధ్యం కాని ఈ కల ఇప్పుడే నెరవేరింది. కొత్త చరిత్రలో భాగమైన ప్రతీ ఒక్క ఆటగాడు తాము సాధించిన ఘనత పట్ల గర్వపడుతున్నారు. టీమిండియా జట్టు సభ్యుడిగా మన తెలుగువాడు గాదె హనుమ విహారి కూడా విజయానందంలో ఉన్నాడు. ఈ సిరీస్‌లో మూడు టెస్టులు ఆడిన అతను జట్టు అవసరాలకు అనుగుణంగా కీలక ప్రదర్శన చేశాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో శుభారంభం తర్వాత తాజా పర్యటన అతని కెరీర్‌కు కొత్త ఊపును తెచ్చింది. టెస్టు జట్టులో రెగ్యులర్ సభ్యుడిగా అతని స్థానాన్ని దాదాపు ఖాయం చేసింది. మున్ముందు మరిన్ని గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న విహారి... ఆస్ట్రేలియా సిరీస్ గురించి తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నాడు.





ఐపీఎల్ తర్వాత పెళ్లి...

నా కాబోయే భార్య ప్రీతికి క్రికెట్ గురించి పెద్దగా అవగాహన లేదు కాబట్టి కంగ్రాట్స్‌తో సరి పెట్టేసింది తప్ప నా ఆట, ప్రదర్శనపై మేమెప్పుడూ చర్చించుకోలేదు. ఐపీఎల్ ముగిసిన వెంటనే మేం పెళ్లి చేసుకోబోతున్నాం.

ఓపెనింగ్‌ను సవాల్‌గా స్వీకరించా

- మరిన్ని పరుగులు సాధించాల్సింది
- గొప్ప విజయంలో భాగం కావడం గర్వకారణం
- 'సాక్షి'తో హనుమ విహారి

సాక్షి, హైదరాబాద్

ఓపెనర్‌గా అవకాశం రావడాన్ని సవాల్‌గానే స్వీకరించాను గానీ, ఆందోళన చెందలేదని భారత క్రికెటర్ హనుమ విహారి అన్నాడు. మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్టులో ఓపెనింగ్ చేసిన విహారి, తొలి టెస్టు ఆడుతున్న మయాంక్‌తో కలిసి జట్టు భారీ స్కోరుకు పునాది వేశాడు. బ్యాటింగ్‌లో తాను మరిన్ని పరుగులు సాధిస్తే బాగుండేదన్న ఈ ఆంధ్ర క్రికెటర్... సిరీస్ గెలుపు మాత్రం చిరస్మరణీయంగా నిలిచిపోతుందని వ్యాఖ్యానించాడు. ఈ పర్యటనకు సంబంధించి అతను చెప్పిన విశేషాలు విహారి మాటల్లోనే...

ఆస్ట్రేలియాలో సిరీస్ విజయంపై...

ఒక్క మాటలో చెప్పాలంటే గర్వంగా అనిపిస్తోంది. సిరీస్ గెలుచుకున్న క్షణాలు నిజంగా అద్భుతం. ఆఖరి మ్యాచ్ ఫలితం నాలుగో రోజే దాదాపుగా ఖాయమైపోయింది కాబట్టి ఒక్కసారిగా భావోద్వేగానికి గురి కాలేదు. పైగా మెల్‌బోర్న్ టెస్టు గెలిచిన తర్వాత సిరీస్ సాధించగలమనే నమ్మకం మరింత పెరిగింది. 'డ్రా' కూడా సరిపోతుందని అందరికీ తెలుసు. కాబట్టి ఉత్సాహంగానే బరిలోకి దిగాం. మొత్తంగా ఇంతటి చారిత్రక ఘట్టంలో నేను కూడా భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. గతంలో అండర్–19 స్థాయిలో ఆస్ట్రేలియాలో ఆడాను తప్ప సీనియర్ క్రికెటర్‌గా కాదు. ఇప్పుడు నా తొలి ఆసీస్ టూర్‌లోనే టీమిండియా గొప్ప ఘనత సాధించడం నిజంగా చిరస్మరణీయం.

సొంత బ్యాటింగ్ ప్రదర్శనపై...

కొంత నిరుత్సాహపడిన మాట వాస్తవం. అయితే ప్రతీది భారీ స్కోరు కోణంలోనే చూడలేం. మనం జట్టుకు ఏ రకంగా ఉపయోగపడ్డాం, విజయంలో మన భాగస్వామ్యం ఏమిటనేది కూడా కీలకం. అలా చూస్తే నేను టీమ్ అవసరాలకు అనుగుణంగా ఆడి నా పాత్రను పోషించాను. నిజానికి మంచి ఆరంభాలు లభించినా వాటిని పెద్ద స్కోర్లుగా మలచలేకపోయాను. అయితే సిడ్నీ టెస్టులో మంచి స్కోరు చేసే అవకాశం దురదృష్టవశాత్తూ పోయింది. నేను మంచి జోరు మీదున్నప్పుడు అనూహ్యంగా ఔట్ కావడం తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇప్పుడు నేను అంపైర్ నిర్ణయాన్ని తప్పుపట్టను కానీ అలా జరగడం నా బ్యాడ్‌లక్ అంతే (రీప్లేలో విహారి నాటౌట్‌గా తేలింది). మున్ముందు మాత్రం కచ్చితంగా భారీ స్కోర్లు సాధిస్తాను.

ఓపెనింగ్‌కు సాహసించడంపై...

ఓపెనర్‌గా వెళ్లటానికి ఆందోళన చెందలేదు. ఆత్మ విశ్వాసంతోనే మైదానంలో అడుగు పెట్టాం. అటువైపు మయాంక్‌కు అదే తొలి టెస్టు కూడా. 'ఎ' జట్టు తరఫున కలిసి ఆడాం కాబట్టి మా మధ్య మంచి సమన్వయం ఉంది. టీమ్ మేనేజ్‌మెంట్‌కు నా డిఫెన్స్‌పై నమ్మకం కలిగింది. అందుకే నన్ను పంపించారు. ఆస్ట్రేలియాలాంటి కీలక సిరీస్‌లో టెస్టు మ్యాచ్ తుది జట్టులో అవకాశం లభించడమే గొప్ప. అలాంటి స్థితిలో నేను ఏ స్థానంలో ఆడాలనేదాని గురించి ఆలోచించడం అనవసరం. ఎక్కడ ఆడినా అదో మంచి అవకాశంగా భావించి సత్తా చాటడమే. తొలి రెండు టెస్టులలో మన జట్టుకు మంచి ఆరంభాలు లభించలేదు. ఈ నేపథ్యంలో దానిని సవాల్‌గా తీసుకొని సాధ్యమైనంత ఎక్కువ సేపు క్రీజ్‌లో ఉండి ప్రధాన పేసర్లను నిరోధించేందుకు ప్రయత్నించా. ఆ సమయంలో నేను ఎదుర్కొన్న 66 బంతులు సెంచరీతో సమానమని కోహ్లి చేసిన ప్రశంసను ఎలా మరచిపోగలను!

బౌలింగ్ గురించి...

సిరీస్‌లో ఐదు ఇన్నింగ్స్‌లలోనూ కలిపి 35 ఓవర్లు బౌలింగ్ చేశాను. బ్యాటింగ్‌తో పాటు నేను అదనంగా జట్టుకు ఉపయోగపడితే మంచిదే కదా. అందుకే బౌలింగ్‌పై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాను. ప్రతీ రోజు బౌలింగ్‌ను కూడా మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నా. పెర్త్ టెస్టులో కీలక సమయంలో రెండు ప్రధాన వికెట్లు దక్కడం నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. మూడో టెస్టు తర్వాత 'విహారి చాలా చక్కగా బౌలింగ్ చేశాడు. అతని ఆఫ్ స్పిన్ వల్ల జట్టులో అశ్విన్ లేని లోటు కనిపించలేదు. అతనికి ఎప్పుడు బంతినిచ్చినా వికెట్ తీసేలా కనిపించాడు' అని కెప్టెన్ నా గురించి వ్యాఖ్యానించడం కూడా నాకు మరింత ఆనందాన్నివ్వడంతో పాటు బాధ్యతనూ పెంచింది.

వన్డే జట్టులో అవకాశాలపై...

దాని గురించి అతిగా ఆశ పడటం లేదు. అండర్–19 వరల్డ్ కప్ గెలిచి వచ్చాక నేను పెట్టుకున్న కొన్ని ఆశలు తలకిందులయ్యాయి కాబట్టి ఎక్కువగా ఆలోచించడం లేదు. ఇటీవల స్వదేశంలో విండీస్‌తో, ఆ తర్వాత అడిలైడ్ టెస్టులో చాన్స్ రానప్పుడు కొంత బాధ పడినా... సెలక్షన్ విషయంలో మనం చేసేదేం ఉండదు. వచ్చిన అవకాశాలను బాగా ఉపయోగించుకోవడమే. అదే విధంగా ఐపీఎల్‌లో కూడా కొంత విరామం తర్వాత (2015లో ఆఖరిసారి) తిరిగొస్తున్నాను. అయితే 21 ఏళ్ల వయసులో ఉన్నప్పటితో పోలిస్తే నా ఆలోచనా ధోరణి మారింది. ఆత్మ విశ్వాసం కూడా పెరిగింది. నేను ఇప్పుడు మూడు ఫార్మాట్‌లకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నా ఆటను మార్చుకోగలను. ఇటీవల దానిని చేసి చూపించాను కూడా. పైగా ఇప్పుడు భారత జట్టు సభ్యుడనే గుర్తింపుతో మ్యాచ్‌లు ఆడబోతున్నాను కాబట్టి ఏం చేయాలో నాకు తెలుసు.

307 పరుగుల తేడాతో నెగ్గిన ఆంధ్ర

- ఆరు వికెట్లతో అదరగొట్టిన శశికాంత్
- మధ్యప్రదేశ్ 35కే ఆలౌట్

ఇండోర్: తొలి ఇన్నింగ్స్‌లో గిరినాథ్ రెడ్డి (6/29) హడలెత్తించగా... రెండో ఇన్నింగ్స్‌లో ఆ బాధ్యతను కోడిరామకృష్ణ వెంకట (కేవీ) శశికాంత్ (6/18) తీసుకున్నాడు. ఫలితంగా 2018–19 రంజీ ట్రోఫీ సీజన్‌ను ఆంధ్ర జట్టు ఘనవిజయంతో ముగించింది. గ్రూప్ 'బి' టాపర్ మధ్యప్రదేశ్‌తో వారి గడ్డపైనే జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర 307 పరుగుల ఆధిక్యంతో జయభేరి మోగించింది. బౌలర్ల విజృంభణ కారణంగా మూడు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్ ఫలితంతో ఆంధ్రకు ఆరు పాయింట్లు లభించాయి. ఓవరాల్‌గా తొమ్మిది జట్లున్న గ్రూప్ 'బి'లో నిర్ణీత ఎనిమిది మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర ఒక విజయం, రెండు పరాజయాలు, ఐదు 'డ్రా'లతో మొత్తం 17 పాయింట్లు సాధించి ఐదో స్థానంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 198/7తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 301 పరుగులవద్ద ఆలౌటైంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కరణ్ షిండే (215 బంతుల్లో 103 నాటౌట్; 16 ఫోర్లు) అజేయ సెంచరీ సాధించి ఆంధ్రను ఆదుకున్నాడు. కరణ్ షిండే తొమ్మిదో వికెట్‌కు మనీశ్ (67 బంతుల్లో 21; 2 ఫోర్లు)తో 53 పరుగులు... పదో వికెట్‌కు విజయ్ కుమార్ (27 బంతుల్లో 10; 2 ఫోర్లు)తో 50 పరుగులు జోడించడం విశేషం. మధ్యప్రదేశ్ బౌలర్లలో ఈశ్వర్ పాండేకు మూడు వికెట్లు దక్కగా... గౌరవ్ యాదవ్, కుల్‌దీప్ సేన్, శుభం శర్మలకు రెండేసి వికెట్లు లభించాయి. 343 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మధ్యప్రదేశ్‌ను ఆంధ్ర పేస్ బౌలర్లు శశికాంత్, విజయ్ కుమార్ నిప్పులు చెరిగే బంతులతో వణికించారు. దాంతో మధ్యప్రదేశ్ 16.5 ఓవర్లలో కేవలం 35 పరుగులకే కుప్పకూలి దారుణంగా ఓడిపోయింది. శశికాంత్ 8 ఓవర్లలో 4 మెయిడిన్‌లు వేసి 18 పరుగులిచ్చి 6 వికెట్లు తీయగా... విజయ్‌కుమార్ 8.5 ఓవర్లలో 3 మెయిడిన్‌లు వేసి 17 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. మధ్యప్రదేశ్ నుంచి చివరి బ్యాట్స్‌మన్ గౌరవ్ యాదవ్ గాయం కారణంగా బరిలోకి దిగలేదు. శశికాంత్, విజయ్ ధాటికి మధ్యప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో ఐదుగురు ఖాతా తెరవలేదు. ఆర్యమాన్ బిర్లా (12; 2 ఫోర్లు), యశ్ దూబే (16; 3 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు.



శశికాంత్

సంక్షిప్త స్కోర్లు

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: 132 ; **మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్:** 91 ; **ఆంధ్ర రెండో ఇన్నింగ్స్:** 301 (జ్ఞానేశ్వర్ 43, ప్రశాంత్ 44, కరణ్ షిండే 103 నాటౌట్; ఈశ్వర్ పాండే 3/55); **మధ్యప్రదేశ్ రెండో ఇన్నింగ్స్:** 35 (16.5 ఓవర్లలో) (శశికాంత్ 6/18, విజయ్ కుమార్ 3/17).

భారత్ సత్తాకు పరీక్ష

- ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో నేడు యూఏఈతో 'ఢీ'
- రాత్రి గం. 9.30 నుంచి స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం



అబుదాబి: తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను 4–1తో చిత్తుగా ఓడించిన భారత ఫుట్‌బాల్ జట్టుకు ఆసియా కప్‌లో నేడు అసలు పరీక్ష ఎదురుకానుంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా గురువారం ఆతిథ్య యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో భారత్ ఆడనుంది. యూఏఈ మాత్రం థాయ్‌లాండ్‌లా బలహీన జట్టేమీ కాదు. ర్యాంకింగ్స్‌లో కానీ, ఆటతీరులోగానీ భారత్ కంటే మెరుగ్గా ఉంది. అయితే బోణీ కొట్టిన ఆత్మ విశ్వాసంతో ఉన్న భారత్ కనీసం ఈ మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్నా గ్రూప్ 'ఎ' నుంచి నాకౌట్‌కు చేరే అవకాశాలున్నాయి. భారత కెప్టెన్ సునీల్ ఛెత్రి సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. తన అనుభవంతో యూఏఈ మ్యాచ్‌లోనూ జట్టును ముందుండి నడిపిస్తే సానుకూల ఫలితం సాధించొచ్చు. మరోవైపు ప్రపంచ 79వ ర్యాంకర్ యూఏఈ తొలి మ్యాచ్‌లో బహ్రెయిన్‌తో అతికష్టంమీద 'డ్రా' చేసుకుంది. దీంతో ఆతిథ్య జట్టు ఈ మ్యాచ్‌లో విజయంపై కన్నేసింది. యూఏఈలో మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ హమది, అహ్మద్ ఖలీల్ కీలక ప్లేయర్లు. ఖలీల్ తొలి మ్యాచ్‌లో జట్టుకు కీలక గోల్ తెచ్చిపెట్టాడు. వీళ్లిద్దరిపై భారత డిఫెండర్లు దృష్టి పెట్టాలి. ఇప్పటివరకు భారత్, యూఏఈ ముఖాముఖిగా 13 సార్లు తలపడ్డాయి. రెండు మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా... ఎనిమిదింటిలో యూఏఈ విజయం సాధించింది. మరో మూడు మ్యాచ్‌లు 'డ్రా' అయ్యాయి.

టీవీ 'షో'లో మహిళలపై అసభ్య వ్యాఖ్యలు

హార్దిక్ పాండ్యా, రాహుల్‌లకు బోర్డు షోకాజ్ నోటీసులు

సిడ్నీ/న్యూఢిల్లీ: టెలివిజన్ 'షో'లో మహిళల్ని కించపరిచేలా అసభ్యకర వ్యాఖ్యలు చేసిన భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్‌లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 24 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వాలని ఆ నోటీసుల్లో బోర్డు పేర్కొంది. ప్రముఖ షో అయిన 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో వ్యాఖ్యాత కరణ్ జోహార్‌తో కలిసి ఈ ఇద్దరు క్రికెటర్లు పాల్గొన్నారు. ఇది ఇటీవలే ప్రసారమైంది. అందులో 25 ఏళ్ల ఆల్‌రౌండర్ పాండ్యా మాట్లాడుతూ 'అమ్మాయిల విషయంలో నేనేమీ బుద్ధిమంతుడ్ని కాదు. వాళ్లను అదోటైపుగా చూస్తా. క్లబ్‌లలో వారి ఒంపుసొంపులపై కైపుగా కన్నేస్తా. ఎవరైనా అమ్మాయిని శారీరకంగా కలిస్తే 'ఆజ్ మై కర్ కే ఆయా' (నేను ఈ రోజు ...ఆ పని చేసొచ్చా) అని తల్లిదండ్రులతో చెప్పేస్తా' అని వ్యాఖ్యానించాడు. 18 ఏళ్ల వయసప్పుడే తన ప్యాంట్ జేబులో కండోమ్ లభించడాన్ని వాళ్ల అమ్మ తండ్రి దృష్టికి తీసుకెళ్లిందని, మొదట మందలించినా... తర్వాత 'పర్లేదు...రక్షణ కవచం వాడావు' అని తండ్రి తనతో అన్నట్లు షోలో రాహుల్ చెప్పుకొచ్చాడు. కాంట్రాక్టు క్రికెటర్లయి ఉండి ఇలా అశ్లీల రీతిలో విచ్చలవిడితనంతో వ్యాఖ్యానించిన సదరు క్రికెటర్లకు పరిపాలక కమిటీ (సీఓఏ) చీఫ్ వినోద్ రాయ్ నోటీసులు పంపారు. ఈ నోటీసులు రాగానే పాండ్యా ట్విట్టర్ వేదికగా మహిళలను క్షమాపణలు కోరాడు. 'ఆ ఊపులో చెప్పేశాను. ఉద్దేశపూర్వకంగా చేసినవి కాదు. ఈ వ్యాఖ్యలు ఎవరినైనా బాధించివుంటే క్షమించాలి' అని అన్నాడు. అయితే మరో క్రికెటర్ రాహుల్ మాత్రం ఇంకా స్పందించలేదు.



హైదరాబాద్ ఓటమి

బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్‌కు 3–4తో ఢిల్లీ డాషర్స్ చేతిలో ఓటమి ఎదురైంది. పురుషుల సింగిల్స్ తొలి మ్యాచ్‌లో ప్రణయ్ (ఢిల్లీ) 15–10, 9–15, 15–12తో రాహుల్ యాదవ్‌పై గెలుపొందగా, డాషర్స్ 'ట్రంప్' అయిన పురుషుల డబుల్స్‌లో చయ్ బియావో–జొంగ్జిత్ ద్వయం 8–15, 15–9, 15–8తో అరుణ్–ఇసారా (హైదరాబాద్) జంటపై నెగ్గింది. దీంతో ఢిల్లీ 3–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తర్వాత మహిళల సింగిల్స్‌ను హంటర్స్ 'ట్రంప్' మ్యాచ్‌గా ఎంచుకోగా సింధు 15–11, 15–9తో కొసెట్స్‌కయా (ఢిల్లీ)పై విజయం సాధించింది. రెండో పురుషుల సింగిల్స్‌లో సుగియార్తో (ఢిల్లీ) 15–6, 15–11తో గాల్జాను ఓడించడంతో 4–2తో డాషర్స్ విజయం ఖాయమైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో కిమ్ స రంగ్–ఇయోమ్ (హైదరాబాద్) జంట 15–7, 15–12తో వాంగ్ సిజి– చియా సిన్ లీ జోడీపై గెలిచింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో అవధ్ వారియర్స్ 5–0తో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌పై జయభేరి మోగించింది. 25 పాయింట్లతో అగ్రస్థానాన్ని ఖాయం చేసుకుంది. నేడు జరిగే మ్యాచ్‌లో బెంగళూరు రాప్టర్స్‌తో చెన్నై స్మాషర్స్ ఆడుతుంది.

ధోని, ధావన్ సాధన



సిడ్నీ: ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్ కోసం ఆస్ట్రేలియా చేరిన టీమిండియా క్రికెటర్లు మహేంద్ర సింగ్ ధోని, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, కేదార్ జాదవ్ బుధవారం సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ)లోని నెట్స్‌లో సాధన చేశారు. బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ సమక్షంలో ధోని ఇండోర్ నెట్స్‌లో గడపగా... రాయుడు, ధావన్ పూర్తిగా కుడి, ఎడమ త్రో డౌన్స్‌ను ఎదుర్కొన్నారు. జాదవ్ రెండు నెట్స్‌లోనూ పాల్గొన్నాడు. ప్రాక్టీస్ ఐచ్ఛికం కావడంతో టెస్టు సిరీస్ నెగ్గిన మిగతా జట్టు సభ్యులెవరూ రాలేదు.

హాకీ కోచ్ హరేంద్ర సింగ్‌పై వేటు



న్యూఢిల్లీ: భారత సీనియర్ పురుషుల హాకీ జట్టు చీఫ్ కోచ్ పదవి నుంచి హరేంద్ర సింగ్‌ను తప్పించారు. సొంతగడ్డపై జరిగిన ప్రపంచ కప్‌లో భారత జట్టు సెమీఫైనల్ చేరడంలో విఫలం కావడమే అందుకు కారణం. హరేంద్ర స్థానంలో కొత్త కోచ్ ఎంపిక కోసం హాకీ ఇండియా దరఖాస్తులు కూడా కోరింది. వరల్డ్ కప్‌లో గ్రూప్ దశలో టాపర్‌గా నిలిచిన భారత్... క్వార్టర్స్‌లో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. మ్యాచ్‌లో పరాజయం అనంతరం మేం 13 మందితో తలపడ్డామంటూ రిఫరీలకు వ్యతిరేకంగా హరేంద్ర చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. 2018 మే నుంచి హరేంద్ర కోచ్‌గా వ్యవహరించారు. గత పాతికేళ్లలో హాకీ సమాఖ్య తప్పించిన 25వ కోచ్ హరేంద్ర కావడం విశేషం. అయితే హరేంద్రను గతంలో పని చేసిన విధంగా జూనియర్ హాకీ జట్టు బాధ్యతలు అప్పగించారు.

శ్రీజ-నిఖత్ జంటకు స్వర్ణం



సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో ఆకుల శ్రీజ–నిఖత్ బాను (తెలంగాణ) జంట స్వర్ణంతో మెరిసింది. బుధవారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో శ్రీజ–నిఖత్ ద్వయం 11–2, 11–8, 8–11, 11–7తో అనన్య బసక్–సృష్టి (మహారాష్ట్ర) జోడీపై గెలిచింది. సెమీఫైనల్లో శ్రీజ–నిఖత్ జంట 7–11, 11–7, 15–13, 13–11తో అహిక–ప్రాప్తి సేన్ (పశ్చిమ బెంగాల్) జోడీని ఓడించింది.

ఇన్‌ఫార్మర్ నెపంతో
గిరిజనుడి హత్య

పర్ణశాల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ గిరిజనుడిని హత్య చేశారు. జిల్లాలోని అంతాగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కామత గ్రామానికి మంగళవారం రాత్రి సాయుధులై వచ్చిన మావోయిస్టులు హుపెండి సురేష్‌ను మాట్లాడే పనుందని తీసుకెళ్లారు. అనంతరం అతన్ని దారుణంగా హత్య చేసి గ్రామ శివారులో పడేశారు. పోలీసులకు సహకరిస్తూ మావోయిస్టు ఉద్యమానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందుకే ప్రజాకోర్టులో శిక్షించినట్లు సురేష్ మృతదేహం వద్ద కరపత్రాలు వదిలారు. అలాగే జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో ఆదివాసీ యువకులు పాల్గొన వద్దని పరిసర ప్రాంతాల్లో బ్యానర్లు కట్టారు. ఘటన స్థలాన్ని ఓఎస్డీ పీపులేష్ కుమార్ బుధవారం పరిశీలించారు.

జగిత్యాలలో భారీ చోరీ

- రెండు మొబైల్‌ఫోన్ షాపుల్లో
- రూ.35 లక్షలు విలువైన ఫోన్లు..
- రూ.1.50 లక్షల నగదు చోరీ

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రమైన జగిత్యాలలో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. అంగడిబజార్‌లోని భవాని సెల్‌పాయింట్, శ్రీనివాస థియేటర్ సమీపంలోని లాట్ మొబైల్ షాపులో మంగళవారం అర్ధరాత్రి చొరబడ్డారు. షట్టర్స్ తాళాలు పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.35 లక్షల విలువైన సెల్‌ఫోన్లతో పాటు రూ.1.50 లక్షల నగదును అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. సీసీ పుటేజీలను పరిశీలించారు. నిందితులు రాత్రి 2.26 గంటల సమయంలో బొలెరో వాహనంలో వచ్చినట్లు తేలింది. ముందుగా భవానీ సెల్ పాయింట్‌లోకి వెళ్లినట్లు.. అక్కడి నుంచి శ్రీనివాస థియేటర్ సమీపంలోని లాట్ మొబైల్ షోరూంలోకి ప్రవేశించినట్లు గుర్తించారు. ఎస్పీ సింధూశర్మ దొంగతనం జరిగిన రెండు మొబైల్ షాపులను పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ పివి.మురళీధర్, డీఎస్పీ మురళీధర్ వేలిముద్రల టీంలను రప్పించారు. పట్టణ సీఐ ప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ సీఐ సర్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. నిందితులు దొంగతనం అనంతరం కరీంనగర్ వైపు వెళ్లినట్లు సీసీ పుటేజీల్లో రికార్డు అయింది. దీనికి అనుగుణంగా పోలీసులు విచారణ వేగవంతం చేశారు.

డార్ఫ్.. నిను మరవం

సాక్షి, ఆసిఫాబాద్: అడవి బిడ్డల ఆచార సంప్రదాయాలు, వారి జీవన విధానంతో పాటు మారుతున్న కాలంలో ఉనికి కోసం వారు చేస్తున్న పోరాటాలను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయులు లండన్ ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ వోన్ ఫ్యూరర్ హైమన్ డార్ఫ్, ఆయన భార్య బెట్టి ఎలిజబెత్. ఈ దంపతులు భౌతికంగా దూరమైనా వారు గిరిజనులకు చేసిన సేవలకు గుర్తుగా ఏటా జనవరి 11న వారి వర్ధంతిని ఏజెన్సీలో ఉత్సవంలా నిర్వహిస్తున్నారు. ఈసారి వేడుకల కోసం కుమురం భీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆదివాసీలపై అధ్యయనం

ఆస్ట్రియా రాజధాని వియన్నాలో 1909లో జన్మించిన హైమన్ డార్ఫ్, లండన్‌లోని లండన్ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్‌లో విద్య నభ్యసించారు. తనకు ఇష్టమైన ఆంత్రోపాలజీలో (మానవ వనరుల శాస్త్రం) డాక్టరేట్ చేశారు. భారత్‌లోని నాగా, గోండు, కోయ, కొండ రెడ్లు, చెంచు తదితర తెగల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు భారతదేశంలో పర్యటించాడు. 1942 నుంచి 1945 మధ్య హైదరాబాద్ సంస్థానంలోని ఆదిలాబాద్‌లోని గిరిజన తెగలపై అధ్యయనం చేయడం కోసం జైనూర్ మండలం మార్లవాయిలో తన భార్యతో కలిసి నివాసం ఏర్పరుచుకున్నారు.

గిరిజనులతో మమేకం


డార్ఫ్ దంపతులు గిరిజనులతో మమేకమై వారి ఆచార వ్యవహారాలు, వారి సమస్యలను ప్రపంచానికి తెలియజేశాడు. గిరిజనులపై పరిశోధనకు ఆయన భార్య ఎలిజబెత్ కూడా ఎంతగానో సాయపడేదని స్థానిక గిరిజనులు చెబుతుంటారు. గిరిజనుల ఆహార అలవాట్లు, ఆరోగ్యం, పండగలు, నృత్యాలు, కర్మ కాండలు, పెళ్లిళ్లు, విడాకులు, వ్యవసాయం, భాష, యాస, నడవడి, సాగుచేసే విధానాలపై హైమన్‌డార్ఫ్ రాసిన పుస్తకాలు ప్రపంచఖ్యాతి గడించాయి. 1979లో రెండోసారి భారత్‌కు వచ్చినప్పుడు లండన్‌కు చెందిన మైఖేల్ యార్క్‌తో పలు డాక్యుమెంటరీలు తెరకెక్కించారు. డార్ఫ్ అప్పట్లో తీసిన ఫొటోలు ఇప్పటికీ గిరిజనులపై పరిశోధన చేసే వారికి ఉపయోగపడుతున్నాయి.

నిజాంను ఒప్పించి భూ పట్టాలు పంపిణీ

ఆదివాసీలు భూమిపై హక్కులేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన హైమన్ డార్ఫ్ వారికి భూములపై యాజమాన్య హక్కులు కల్పించేందుకు నిజాంతో చర్చలు జరిపారు. అప్పటికే అటవీ భూములను సాగు చేసుకుంటున్న స్థానికులకు ఒక్కొక్కరికి దాదాపు 15 ఎకరాలు ఇప్పించేందుకు కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగానే సుమారు 12వేల గిరిజన కుటుంబాలకు భూ పట్టాలు వచ్చాయి. నిజాం ప్రభుత్వం ఆయనను కొంత కాలం గిరిజన అభివృద్ధి సలహాదారుగా నియమించింది. ఆదివాసీల హక్కుల రక్షణ కోసం హైమన్ అనేక సూచనలు చేశారు. ఆయన నివాసం ఉన్న మార్లవాయిలో ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పి అనేక మంది గిరిజనులను చదువు వైపు నడిచేలా ప్రోత్సహించారు.

గిరిజనుల గుండెల్లో విదేశీయుడు

- ‘ఆదివాసీ’ని ప్రపంచానికి చాటిచెప్పిన శాస్త్రవేత్త
- జైనూర్ మండలం మార్లవాయిలో నివాసం
- రేపు ఆయన 32వ వర్ధంతి





కొడుకు పేరు లచ్చుపటేల్

హైమన్ డార్ఫ్ దంపతులు మార్లవాయిలో ఉన్నప్పుడు ఆ గ్రామ పెద్ద లచ్చుపటేల్ మరణించాడు. ఆ మరుసటి రోజే డార్ఫ్ భార్య ఎలిజబెత్ ఓ బాబుకు జన్మనిచ్చింది. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం ఊరిలో ఎవరైనా చనిపోయిన మరుసటి రోజులోనే ఎవరైనా పుడితే, వారే మళ్లీ పుట్టారని నమ్ముతారు. ఇందుకు గుర్తుగా చనిపోయిన వారి పేరు పెడతారు. ఆ సాంప్రదాయం ప్రకారం డార్ఫ్ దంపతులు తమ కొడుకు పేరు లచ్చుపటేల్ అని నామకరణం చేశాడు.

డార్ఫ్ రచనలు

- ద చెంచుస్ (1943)
- ద రెడ్డీస్ ఆఫ్ బైసన్ హిల్స్ (1945)
- ద రాజ్ గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్ (1945)
- ద షెర్పాస్ ఆఫ్ నేపాల్ (1964)
- ద కొన్యాక్ నాగస్ (1969)
- ద ట్రైబ్స్ ఆఫ్ ఇండియా: స్ట్రగుల్ ఫర్ సర్వైవర్ (1982)

ఇక్కడే సమాధి కట్టండి

మరణానంతరం దంపతులిద్దరి సమాధులు ఇక్కడే ఏర్పాటు చేయాలని డార్ఫ్ స్థానికులను కోరారు. ఎలిజబెత్ 1987లో మరణించారు. ఆమె చనిపోయిన తర్వాత డార్ఫ్, ఆయన కొడుకు లచ్చుపటేల్ (నికోలస్) ఎలిజబెత్ చితాభస్మాన్ని లండన్ నుంచి మార్లవాయికి తీసుకొచ్చి సమాధి కట్టించారు. 1995లో హైమన్‌డార్ఫ్ కూడా చనిపోగా.. 2012లో లండన్ నుంచి ఆయన చితాభస్మాన్ని మార్లవాయిలో ఎలిజబెత్ సమాధి పక్కనే మరో సమాధి కట్టించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 11న డార్ఫ్ దంపతుల వర్ధంతిని ఆదివాసీలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

నా పుట్టినరోజు కానుకగా కంటి ఆస్పత్రి

ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: తన పుట్టినరోజు జూన్ 3 నాటికి సిద్దిపేట జిల్లా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిని కానుకగా ఇస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన నాగులబండ సమీపంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి భవన నిర్మాణ పనులు, త్రీ స్టార్ టూరిజం హోటల్ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అత్యాధునిక సదుపాయాలతో సిద్దిపేట ప్రాంతంలో తొలిసారి త్రీ స్టార్ హోటల్ నిర్మాణం జరగడం గొప్ప విషయమన్నారు. రెండు ఎకరాల్లో చేపడుతున్న నిర్మాణ పనులను గురించి తెలుసుకుని క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, టూరిజం శాఖ ఏఈ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

మల్లారం గుట్టల్లో భారీ పేలుడు

ఒక వ్యక్తి దుర్మరణం

చిన్నకోడూరు (సిద్దిపేట): సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం మల్లారం గుట్టల్లో జరిగిన బ్లాస్టింగ్ ధాటికి ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. జిలెటిన్ స్టిక్స్‌ను నిల్వ ఉంచిన గదిని తెరవగానే జరిగిన పేలుడు ధాటికి మృతుడి శరీరం ముక్కలు ముక్కలుగా ఎగిరి పడింది. దాదాపు ఐదు గంటల పాటు జరిగిన పేలుళ్ల ప్రభావం కారణంగా ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, ఇతర ఉన్నతాధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అయితే పేలుళ్లు ఆగకపోవడంతో వారంతా దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మందపల్లి గ్రామానికి చెందిన జిందం రాజయ్య(45) అనే వ్యక్తి సిద్దిపేట పట్టణంలో నివాసం ఉంటూ మల్లారం వద్ద జిలిటిన్ స్టిక్స్ అమ్మే వ్యాపారి వద్ద పని చేస్తున్నాడు. గత పదిహేనేళ్లుగా రాజయ్య ఈ వ్యాపారంలో కూలీగా పని చేస్తున్నాడు. మల్లారం శివారులోని గుట్టల్లో బ్లాస్టింగ్‌కు వాడే జిలిటెన్ స్టిక్స్‌ను నిల్వ చేయడానికి వ్యాపారి ఒక గదిని నిర్మించుకున్నారు. తమకు వచ్చిన ఆర్డర్ల మేరకు గదిలో నిల్వ చేసిన పేలుడు పదార్థాలను తరలిస్తుంటారు. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రాజయ్య ఇదే పనిపై ఆటోలో పేలుడు పదార్థాలను తీసుకొచ్చేందుకు గదికి వెళ్లాడు. అయితే గది తలుపులు తెరవగానే ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడుతో రాజయ్య మృతి చెందగా అతని మృతదేహం ముక్కలై చెల్లాచెదురుగా పడిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేలుళ్లు కొనసాగడంతో పోలీసులు దగ్గరకు వెళ్లలేకపోయారు. మృతుడు రాజయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఇద్దరు అటవీ అధికారుల అరెస్టు

సాక్షి, హైదరాబాద్: కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఇటీవల వెలుగు చూసిన ఓ వేట ఉదంతం కేసులో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎంఏ రషీద్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వసంత్‌లను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నీల్గాయి వేట కేసులో ప్రమేయంతో పాటు పెంబిలోని స్థానిక వేటగాళ్లతో కుమ్మక్కయ్యారని వీరిపై ఆరోపణలున్నాయి. అటవీశాఖ ఫిర్యాదుపై స్పందించి పోలీసులు ఈ విధంగా ఆ శాఖ అధికారులనే అరెస్ట్ చేయడం ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడిన పెంబి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరెస్టు కాకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ ఇద్దరు అధికారుల అక్రమాలపై విచారణ జరిపాక అరెస్టు చేశారని కవ్వాల్ టైగర్ రిజర్వ్ సీఎఫ్, ఎఫ్‌డీ సి.శరవణన్ తెలిపారు.

వామ్మో..చిరుతలు

- ఎల్లారెడ్డిపేట అడవుల్లో మూడు చిరుతలున్నట్లు గుర్తింపు
- వరుస దాడులతో గూడేల్లో ఆందోళన

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట అటవీ ప్రాంతంలో చిరుతపులుల సంచారం గిరిజన గూడేల్లో దడ పుట్టిస్తున్నాయి. మంగళవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఇళ్లకు బయలు దేరిన గిరిజన రైతులకు ఒకేసారి మూడు చిరుతపులులు కనిపించడంతో భయాందోళన చెందారు. అల్మాస్‌పూర్, గుంటపల్లి చెరువుతండా ప్రాంతాల్లో గిరిజనులకు వ్యవసాయ భూములు ఉన్నాయి. రబీ పంటలు సాగు చేసిన గిరిజన రైతులు భూక్య సురేశ్, గుగులోతు రామ్‌జీ, మాలోతు గణేశ్ మంగళవారం సాయంత్రం పనులు ముగించుకుని గూడేలకు బయలుదేరారు. కొద్దిదూరం వచ్చాక చిరుతలు అరవడంతో ఆ శబ్దం వినిపించింది. కొద్దిగా ముందుకువెళ్లి చూడగా దూరంగా మూడు చిరుతలు కనిపించాయి. వాటిని చూసిన గిరిజనులు భయంతో ఇళ్ల వైపు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. రాత్రిపూట తండాల్లో పొద్దుపోయే వరకు అందరు ఒకేచోట ఉండి చిరుతల నుంచి రక్షించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట అడవుల్లో చిరుత పులులు సంచరిస్తున్నాయని, పశువుల కాపరులు, రైతులు, గిరిజనులు అటవీప్రాంతాల్లోకి వెళ్లవద్దని, గూడేల్లో అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు కోరుతున్నారు. తాము కూడా తగు చర్యలు చేపట్టామన్నారు.

పెద్దాస్పత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం

- ఖమ్మంలో ఆరుబయటే ప్రాణాలు విడిచిన రోగి
- అధికారుల విచారణ



ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంతో ఓ రోగి ప్రాణాలు కోల్పోయాడు. నగరంలోని రేవతి సెంటర్‌కు చెందిన ఎల్.గణేశ్ (45) అనారోగ్యానికి గురికావడంతో అతడి భార్య రమ మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చింది. క్యాజువాలిటీలో వైద్యులు పరీక్షలు నిర్వహించగా.. అతడికి క్షయ ఉన్నట్లు గుర్తించి, వెంటనే టీబీ వార్డుకు తరలించి చికిత్స ప్రారంభించారు. బుధవారం టీబీ వైద్యుడు వచ్చి పరీక్ష చేసి అతడిని కొన్ని పరీక్షల కోసం క్యాజువాలిటీకి తీసుకెళ్లాలని సూచించారు. దాంతో అక్కడి సిబ్బంది వీల్‌చైర్‌లో గణేశ్‌ను తీసుకెళ్లారు. అయితే మార్గమధ్యలో మాతా శిశు సంరక్షణ కేంద్రం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో గణేశ్ పడి ఉండటాన్ని కొందరు రోగులు, బంధువులు గమనించారు. వెంటనే వారంతా ఏకమై రోగిని అక్కడ పడేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో గణేశ్ కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోయినప్పటికీ, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అక్కడి రోగులు, వారి బంధువులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తమకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నా.. ఇక్కడ మాత్రం అవి సామాన్యుడికి అందే పరిస్థితులు కనిపించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఎంఓ కృప ఉషశ్రీ,, ఔట్‌పోస్ట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రోగులు, వారి బంధువులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అక్కడి నుంచి రోగిని వెంటనే క్యాజువాలిటీకి తరలించగా అప్పటికే అతడు మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఆర్‌ఎంఓ కృప ఉషశ్రీని వివరణ కోరగా.. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. రోగిని కొట్టడం వల్లే చనిపోయాడనే విషయంలో వాస్తవం లేదన్నారు. సేవల్లో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించమని, పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సి ఉందని పేర్కొన్నారు.


బాలుడి కడుపులో నుంచి రాళ్లు బయటకు తీసిన డాక్టర్ శంకర్

బాలుడి కడుపులో 400 రాళ్లు

- శస్త్రచికిత్స చేసి తొలగించిన వైద్యుడు
- చిన్నారికి తప్పిన ప్రాణాపాయం

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలిసీ.. తెలియక ఓ చిన్నారి మింగిన రాళ్లు ప్రాణం మీదికి రాగా.. వైద్యుడు ఆపరేషన్ చేసి కడుపులోని నాలుగు వందల రాళ్లను బయటకు తీశారు. ప్రస్తుతం ఆ చిన్నారి కోలుకుంటున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన ఆఫ్రాన్ (5) ఆడుకుంటూ కొద్ది రోజులుగా రాళ్లు మింగుతున్నాడు. ఇటీవల కడుపు ఉబ్బిపోయి బాధపడుతుండటంతో తండ్రి ఫయాద్ ముస్తాబాద్‌లోని పీపుల్స్ హాస్పిటల్‌లో చూపించాడు. డాక్టర్ చింతోజు శంకర్ బాలుడిని పరీక్షించి కడుపులో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం రాత్రి ఆపరేషన్ చేశారు. చిన్నారి పెద్దపేగులో చిక్కుకుపోయిన 400 రాళ్లను బయటకు తీశారు. ఒకదశలో అపస్మారక స్థితికి చేరిన ఆఫ్రాన్ ఆపరేషన్ తర్వాత కోలుకుంటున్నాడు. సకాలంలో ఆపరేషన్ చేయడంతో బాలుడి ప్రాణాలకు ముప్పు తప్పిందని వైద్యుడు శంకర్ పేర్కొన్నారు.

పేదల కోటాకు 'పెద్దల' ఆమోదం

124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు రాజ్యసభలోనూ పచ్చజెండా

- అనుకూలంగా 165, వ్యతిరేకంగా 7 ఓట్లు
- ఎగువసభలోనూ అభ్యంతరాలు లేవనెత్తిన విపక్షాలు
- రాష్ట్రపతి సంతకంతో బిల్లుకు చట్టరూపం

న్యూఢిల్లీ: అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్లు కల్పించే బిల్లు చట్టరూపం దాల్చేందుకు మరింత చేరువైంది. 124వ రాజ్యాంగ సవరణ పేరిట తెచ్చిన ఈ బిల్లుకు బుధవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో 165 మంది సభ్యులు అనుకూలంగా, ఏడుగురు వ్యతిరేకంగా ఓటేశారు. మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లు 323–3 తేడాతో నెగ్గిన సంగతి తెలిసిందే. రెండు రోజుల వ్యవధిలో రెండు సభల్లో ఆమోదం పొందిన ఈ బిల్లు తదుపరి దశలో రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారుతుంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ, సున్నితమైన రిజర్వేషన్ల అంశంలో ప్రతిపక్షాలు సహకరించడంతో ఈ బిల్లు పార్లమెంట్ అడ్డంకిని అధిగమించింది. లోక్‌సభలో మాదిరిగానే రాజ్యసభలోనూ బిల్లుపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన విపక్షాలు అంతిమంగా అనుకూలంగానే ఓటేశాయి. ప్రతిపక్షాలు సూచించిన పలు సవరణలు వీగిపోయాయి. బిల్లు రాజ్యాంగబద్ధతపై సందేహాలు వ్యక్తం చేసిన విపక్షాలు..ఈ చట్టం అమలులో సంక్లిష్టతలు తప్పవని ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. జనసంఖ్యకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించకుండానే కేంద్రం హడావుడిగా ఈ తతంగాన్ని ముగించిందని ఎండగట్టాయి. బిల్లుపై ఓటింగ్ మొదలయ్యాక సభ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), సీపీఐలు వాకౌట్ చేశాయి.

సెలక్ట్ కమిటీ పంపాలని విపక్షం డిమాండ్

సామాజిక న్యాయ మంత్రి థావర్‌చంద్ గహ్లోత్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టగా,రాత్రి 11 గంటల వరకు సుదీర్ఘ చర్చ జరిగింది. అంతకుముందు, ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని విపక్షాలు పట్టుపట్టడంతో కొంతసేపు రభస చోటుచేసుకుంది. కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి వెళ్లారు. బిల్లు ఆమోదం పొందకుండా కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్ గోయల్ ఆరోపించారు. బిల్లుకు కాంగ్రెస్ అనుకూలంగానే ఉందని, కానీ దాన్ని ప్రవేశపెట్టిన విధానంలోనే అభ్యంతరాలున్నాయని కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ శర్మ అన్నారు. బిల్లును హడావుడిగా తీసుకురావాల్సిన


బుధవారం రాజ్యసభలో ఆందోళన చేస్తున్న విపక్ష పార్టీల సభ్యులు

అవసరం ఏముందని కాంగ్రెస్ మరో సభ్యుడు మధుసూదన్ మిస్త్రీ ప్రశ్నించారు. బిల్లు ఉద్దేశాల్ని అందులో పేర్కొనలేదని, నిబంధన ఉల్లంఘన జరిగిందని ఆరోపించారు. బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని, తాను ప్రతిపాదించిన సవరణల్ని పరిశీలించాలని డీఎంకే ఎంపీ కనిమొళి డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌ను కోరారు. కాంగ్రెస్ ఎంపీలతో పాటు సీపీఐ సభ్యుడు రాజా ఆమెకు మద్దతుగా నిలిచారు.

'నోట్లరద్దు' మాదిరే అవుతుంది: సిబల్

సభ తిరిగి ప్రారంభమయ్యాక మొదలైన చర్చలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కపిల్ సిబల్ మాట్లాడుతూ.. అగ్రవర్ణాల కోటా బిల్లును కేంద్రం శ్రద్ధ పెట్టకుండా తీసుకొచ్చిందని, న్యాయపర అడ్డంకులు తప్పవని అన్నారు. ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తరువాత కూడా నోట్లరద్దు మాదిరిగా అమలులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అగ్రవర్ణ పేదలకు సంబంధించిన కచ్చితమైన సమాచారం ప్రభుత్వం వద్ద లేకపోవడమే ఇందుకు కారణమని చెప్పారు. 'బిల్లును ఉన్న పళంగా హడావుడిగా తీసుకురావాల్సిన అవసరం ఏముంది? అన్ని ఒక్కరోజులోనే చేయాలనుకోవడం సబబేనా? ఎలాంటి సమాచారం లేకుండానే బిల్లును తీసుకొచ్చారు. కోటా పారామితుల్ని నిర్ధారించే ముందు ఏదైనా నివేదిక రూపొందించారో? లేదో? చెప్పండి. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేముందు సెలక్ట్ కమిటీకి పంపి సభ్యుల సూచనలు, అభిప్రాయాలు తీసుకోవాల్సింది' అని సిబల్ అన్నారు. బిల్లును రూపొందించే ముందు వేర్వేరు కులాలు, వర్గాలకు చెందిన జనసంఖ్య సమాచారాన్ని కేంద్రం సేకరించిందా? అని ప్రశ్నించారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న మండల్ కమిషన్ సిఫార్సును సుప్రీంకోర్టు కొట్టేసిన సంగతిని ప్రస్తావించారు. తాజా బిల్లులో రాజ్యాంగ సంబంధ సంక్లిష్ట విషయాలున్నాయని, శ్రద్ధపెట్టకుండా రూపొందించి, సెలక్ట్ కమిటీకి పంపకుండా నేరుగా పార్లమెంట్ ముందుకు తెచ్చారని ఆరోపించారు.

చిరస్మరణీయ రోజు: గహ్లోత్

జనరల్ కేటగిరిలో పేదలందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా తాజా బిల్లు గొప్ప ముందడుగు అని కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి థావర్ చంద్ గహ్లోత్ అన్నారు.

ఇది సామాజిక న్యాయ విజయం: మోదీ

కోటా బిల్లును పార్లమెంటు ఆమోదించడం సామాజిక న్యాయ విజయమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం అభివర్ణించారు. దేశం మార్పువైపు పయనిస్తున్న తరుణంలో ఈ బిల్లు వల్ల యువత ఆ మార్పులో భాగమై అభివృద్ధికి దోహదపడగలరని అన్నారు. ఈ బిల్లుకు ఇంతటి మద్దతు లభించడం తనకు ఆనందం కలిగించిందని ట్వీట్టర్‌లో చెప్పారు. ఈ బిల్లును ఆమోదించడం ద్వారా రాజ్యాంగ నిర్మాతలకు, స్వాతంత్ర్య సమరయోధులకు పార్లమెంటు నివాళి అర్పించిందన్నారు. హడావుడిగా ఈ బిల్లును తీసుకురాలేదని, కోటా ప్రయోజనాలు అందకుండా దూరంగా ఉన్న పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తాము రూపొందించామని చెప్పారు. కోట్లాది మంది పేదలకు లబ్ధి చేకూర్చే ఈ బిల్లు ఆమోదం పొందిన రోజు చిరస్మరణీయంగా నిలిచిపోతుందని ఆయన అన్నారు.

50 శాతం దాటకూడదని రాజ్యాంగంలో లేదు: ప్రసాద్



వెనుకపడిన వర్గాల(బీసీ) రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలపై తాజాగా రాజ్యసభలో ప్రవేశపెట్టిన ఈబీసీ బిల్లు ఎలాంటి ప్రభావం చూపదని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. 124వ రాజ్యాంగ సవరణ ప్రకారం తీసుకొస్తున్న ఈ చట్టం కేంద్రం, రాష్ట్రాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బిల్లుపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ..'రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని భారత రాజ్యాంగంలో ఎక్కడా లేదు. దీన్ని సుప్రీంకోర్టు మాత్రమే చెప్పింది. తాజాగా ఈబీసీ బిల్లులో భాగంగా మేం ప్రాథమిక హక్కుల్లోని రెండు ఆర్టికల్స్‌ను సవరిస్తున్నాం. రాజ్యాంగంలోని 15వ ఆర్టికల్‌కు ఆర్థికంగా వెనుకపడిన వర్గాలను నిర్వచించేలా ఓ క్లాజ్‌ను జత చేస్తున్నాం. అలాగే ఆర్టికల్ 16లో ఎస్సీ,ఎస్టీలతో పాటు వీరికి రిజర్వేషన్ కల్పించేలా ఆరో క్లాజును చేరుస్తున్నాం. తద్వారా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల్లో ఈబీసీలకు అవకాశం లభిస్తుంది. ఈబీసీ రిజర్వేషన్ బిల్లు ప్రత్యేకత ఏంటంటే ఎస్సీ,ఎస్టీ, బీసీలకు అమలవుతున్న రిజర్వేషన్‌పై దీని ప్రభావం ఏమాత్రం ఉండదు' అని ప్రసాద్ వెల్లడించారు. రాష్ట్రాలకు ముందుగా తెలియజేయకుండా ఈ బిల్లును లోక్‌సభలో ఎందుకు ప్రవేశపెట్టారన్న డీఎంకే ఎంపీ కనిమొళి ప్రశ్నకు స్పందిస్తూ.. ఆర్టికల్ 368 కింద రాజ్యాంగాన్ని సవరించేటప్పుడు బిల్లు రాష్ట్ర విధానసభకు వెళ్లాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

ఈ కోటా ముందున్న సవాళ్లు ఏంటి?

ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల పేదలకు(ఈబీసీ) పది శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టమయ్యాక న్యాయ సమీక్షకు నిలవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోటా అమలును అడ్డుకునేందుకు ఈ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రిజర్వేషన్లపై గతంలో విధించిన 50% పరిమితిని తొలగించేందుకు సుప్రీంకోర్టు అంగీకరిస్తే అన్ని రాష్ట్రాలూ తమ పరిధిలోని రిజర్వేషన్లను, తమ రాజకీయ ప్రయోజనాల కోసం భారీగా పెంచుకోవడానికి సిద్ధమవుతాయి. ఒకవేళ కోటాల గరిష్ట పరిమితి 50 శాతం మించడాన్ని సుప్రీం తిరస్కరిస్తే అగ్రవర్ణ పేదల కోటాను అమలు చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీల కోటాను తగ్గించాల్సిన పరిస్థితి ఉంటుంది. అప్పుడు ఈ 10% ఈబీసీ కోటాను ప్రస్తుతమున్న 50 శాతంలోనే చేర్చాల్సి ఉంటుంది. దాన్ని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తాయి.

అగ్రకులాలన్నింటికీ మేలు జరిగేనా?

పది శాతం కోటాను అగ్రవర్ణాలకు చెందిన వారు సమర్థిస్తారు. ఈ కొత్త కోటా అగ్ర కులాల ప్రజలను కాషాయ పక్షం వైపు మళ్లేలా చేయవచ్చు. అయితే, దీని వల్ల బీజేపీకి ఏ స్థాయిలో రాజకీయ ప్రయోజనం చేకూరుతుందో చెప్పలేం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రస్తుతమున్న 50 శాతానికి అదనంగానే ఈబీసీ పది శాతం కోటా ఉంటుందని కేంద్రం చెబుతున్నా.. కోటా గరిష్ట పరిమితిని పెంచడానికి సుప్రీం నిరాకరిస్తే తమ కోటా వాటా తగ్గిపోతుందని వారు ఆందోళన చెందే అవకాశం ఉంటుంది.

ఆర్థిక ప్రాతిపదికను రాజ్యాంగం ఆమోదిస్తుందా?

ఎంతో కాలంగా సాంఘికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా (ఈ మూడు విధాలా) అన్యాయానికి గురైన వర్గాలకు మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వాలని రాజ్యాంగం, న్యాయస్థానాలు చెబుతున్నాయి. పేదరికం అనేది సామాజిక, వ్యవస్థాపరమైన అణచివేత కిందకు రాదని కూడా రాజ్యాంగం ప్రకటిస్తోంది. కొన్ని వర్గాల ప్రజలకు కోటా అమలుకు రాజ్యాంగంలో మార్పులు చేయడానికి ప్రభుత్వానికి అధికారం ఉంది. కాని చట్ట సవరణ ద్వారా రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చడానికి అధికారం లేదు. రాజ్యాంగంలో సమానత్వ సూత్రం అమలుకు రిజర్వ్‌డ్ సీట్లు, ఓపెన్ కేటగిరీ సీట్లు చెరి సగం ఉండేలా కోటా పరిమితిని 50 శాతంగా సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఈ సమానత్వం



కాపాడే ఏర్పాటును రాజ్యాంగంలోని మౌలిక సూత్రంగా పరిగణిస్తున్నారు. 50 శాతానికి పైన అదనంగా పది శాతం కోటా ఇవ్వడం అంటే సమానత్వ సూత్రాన్ని ఉల్లంఘించడంగా పలువురు భావిస్తున్నారు. ఈ కారణంగా ఈబీసీ కోటా చట్ట రూపంలోకి వచ్చి అమలు జరిగితే దానిపై కోర్టుల్లో వివాదాలు తలెత్తే అవకాశాలున్నాయి. ఈబీసీ కోటా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో జనరల్ కేటగిరీలోని పేద వర్గాలను ఎంత వరకు ప్రభావితం చేస్తుందో వేచిచూడాలి.


ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో దక్షిణకొరియా రాయబార కార్యాలయం వద్ద అప్రమత్తంగా అగ్నిమాపక సిబ్బంది. 10 దేశాలకు చెందిన రాయబార కార్యాలయాలకు గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పద ప్యాకెట్లు పంపిన ఘటన బుధవారం మెల్‌బోర్న్‌లో సంచలనమైంది.

నాగేశ్వరరావు చేసిన బదిలీలన్నీ రద్దు


ఆలోక్ వర్మ

న్యూఢిల్లీ: గత 77 రోజులుగా సీబీఐ డైరెక్టర్(ఇన్‌చార్జ్)గా ఉన్న ఎం.నాగేశ్వరరావు హయాంలో జరిగిన అన్ని బదిలీలను రద్దుచేస్తూ సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మ నిర్ణయం తీసుకున్నారు. ఆలోక్ వర్మ, స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాలు ఒకరిపై మరొకరి ప్రత్యారోపణల నేపథ్యంలో వీరిద్దరినీ కేంద్రప్రభుత్వం బలవంతపు సెలవుపై పంపి నాగేశ్వరరావును అక్టోబర్ 23న సీబీఐకి కొత్త డైరెక్టర్(ఇన్‌చార్జ్)గా నియమించడం తెల్సిందే. సీబీఐ డైరెక్టర్ హోదాలో నాగేశ్వరరావు.. భారీస్థాయిలో ఉన్నతాధికారుల బదిలీలు చేపట్టారు. ఆస్థానా అవినీతి ఆరోపణల కేసును దర్యాప్తుచేస్తున్న డీఎస్పీ ఏకే బస్సీ, డీఐజీ ఎంకే సిన్హా, జాయింట్ డైరెక్టర్ ఏకే శర్మ సహా ముఖ్యమైన ఉన్నతాధికారులను నాగేశ్వరరావు బదిలీ చేశారు. అయితే, ప్రభుత్వ ఆదేశాలను కొట్టివేస్తూ ఆలోక్ వర్మను సుప్రీంకోర్టు.. మళ్లీ సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తూ తీర్పుచెప్పడం తెల్సిందే. దీంతో బుధవారం సీబీఐ డైరెక్టర్ హోదాలో విధులకు హాజరైన ఆలోక్ వర్మ.. నాగేశ్వరరావు చేసిన బదిలీలను రద్దుచేశారు.

'సీబీఐ చీఫ్' కమిటీలో జస్టిస్ సిక్రీ

న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను ఆ స్థానంలో కొనసాగించాలా? వద్దా? అనే విషయంపై నిర్ణయం తీసుకునే అత్యున్నత స్థాయి కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ తప్పుకున్నారు. తన స్థానంలో సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీని ప్రతిపాదించారు. ఆలోక్ వర్మ కేసులో తీర్పును వెలువరించే బెంచ్‌లో సీజేఐ కూడా భాగమై ఉన్న కారణంగా కమిటీ నుంచి ఆయన తప్పుకున్నట్లు తెలుస్తోంది. ప్రధాని నేతృత్వంలోని ఈ అత్యున్నత కమిటీ ఆలోక్‌పై నిర్ణయం తీసుకోనుంది.

బీజేపీలో చేరిన తృణమూల్ ఎంపీ



న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌమిత్రా ఖాన్ బుధవారం బీజేపీలో చేరారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాతో సమావేశమైన తరువాత ఆయన కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లో ప్రజాస్వామ్యం లేదని, పోలీసు రాజ్యం నడుస్తోందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రధాని మోదీ మార్పు తెస్తారని విశ్వసిస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం విష్ణుపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సౌమిత్రా ఖాన్ పార్టీని వీడడాన్ని తృణమూల్ తక్కువచేసి చూపే ప్రయత్నం చేసింది. ఆయన్ని ఇది వరకే పార్టీ నుంచి బహిష్కరించినట్లు ప్రకటించింది. సౌమిత్రా ఖాన్ చాన్నాళ్లుగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ దక్కదన్న సంగతి ఆయనకు కూడా తెలుసని వెల్లడించింది. తాజా పరిణామంపై బీజేపీ స్పందిస్తూ.. బెంగాల్‌లో తృణమూల్ పతనం ప్రారంభమైందని పేర్కొంది.

బీజేపీ, కాంగ్రెస్‌కు సమదూరం: నవీన్

భువనేశ్వర్: లోక్‌సభ ఎన్నికలకు ముందు విపక్షాలు ప్రతిపాదిస్తున్న మహాకూటమిలో చేరబోమని బీజేడీ అధ్యక్షుడు, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు సమాన దూరం పాటిస్తామని బుధవారం తేల్చిచెప్పారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఏకం కావాలని బీజేపీయేతర పక్షాలు ప్రయత్నిస్తున్న సమయంలో నవీన్ పట్నాయక్ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. మహాకూటమిలో చేరికపై నిర్ణయానికి కొంత సమయం కావాలని ఆయన ఢిల్లీలో చెప్పిన మరుసటి రోజే ఈ విధంగా స్పందించడం గమనార్హం. బీజేడీకి కాంగ్రెస్‌తో రహస్య అవగాహన ఉందని బీజేపీ ఆరోపించగా, బీజేడీ ఎప్పటికీ బీజేపీ పక్షమేనని కాంగ్రెస్ పేర్కొంది.

31 నుంచి బడ్జెట్ సమావేశాలు

- ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్



సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు 2019, జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకూ జరగనున్నాయి. హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం నాడిక్కడ సమావేశమైన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశాల్లో భాగంగా ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఈసారి పార్లమెంటు సమావేశాల సందర్భంగా సభలో ప్రవేశపెట్టాల్సిన బిల్లులు సహా పలు కీలక అంశాలను కేబినెట్ కమిటీ చర్చించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ మంగళవారం ఆమోదించిన పౌరసత్వ బిల్లు–2019ను బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాజ్యసభ ముందుకు తీసుకొచ్చే అవకాశముందని వెల్లడించాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ నెల 31న ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం మధ్యంతర బడ్జెట్‌పై 2–3 రోజుల పాటు పార్లమెంటులో చర్చ సాగనుంది. అయితే కొన్ని కారణాల రీత్యా ఈసారి ఆర్థిక సర్వేను పార్లమెంటులో ప్రవేశపెట్టడం లేదు. కాగా, ఆర్డినెన్సుల జారీకి అనుకూలంగా రాష్ట్రపతి పార్లమెంటును స్వల్ప కాలం మాత్రమే ప్రోరోగ్ చేసే అవకాశముందని తెలుస్తోంది. మరోవైపు ప్రస్తుతం పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందని ట్రిపుల్ తలాక్, మెడికల్ కౌన్సిల్, కంపెనీ వ్యవహారాల ఆర్డినెన్సులను మరోసారి జారీచేస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

'మోదీని అడుగుపెట్టనివ్వం'

గువహటి: పౌరసత్వ (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించడంపై అస్సాంలో ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. అనేక చోట్ల ప్రజలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, కళాకారులు, సాహితీవేత్తలు, మేధావులు రోడ్లపైకి వచ్చి తమ నిరసన తెలిపారు. సంకీర్ణ ప్రభుత్వంలో భాగంగా ఉన్న అస్సాం గణపరిషత్ (ఏజీపీ)కి చెందిన మంత్రులు బుధవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రభుత్వం నుంచి ఏజీపీ రెండ్రోజుల క్రితమే బయటకు రావడం తెలిసిందే. బుధవారం పలుచోట్ల ఆందోళనకారులు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి సోనోవాల్ తదితరుల దిష్టిబొమ్మలను కాల్చారు. సచివాలయాన్ని ముట్టడించారు. మోదీ, ఇతర కేంద్ర మంత్రులను అస్సాంలో అడుగుపెట్టనివ్వబోమనీ, అలాగే ముఖ్యమంత్రి, ఇతర బీజేపీ ఎమ్మెల్యేలు ఎంపీలు రాష్ట్రంలో ఎక్కడా సభలు, ర్యాలీలు నిర్వహించకుండా అడ్డుకుంటామని కృషక్ ముక్తి సంగ్రామ సమితి అధ్యక్షుడు అఖిల్ గొగోయ్ ప్రకటించారు. 70 సంస్థలు సచివాలయం వద్ద ఆందోళనలు చేశాయి.

'కశ్మీరీ' సివిల్స్ టాపర్ రాజీనామా

- కశ్మీర్ కేడర్ ఐఏఎస్ షా ఫజల్ సంచలన నిర్ణయం



శ్రీనగర్: జమ్మూ, కశ్మీర్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి షా ఫజల్ బుధవారం తన ఉద్యోగానికి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2009లో జరిగిన సివిల్ సర్వీస్ పరీక్షలో ఆయన మొదటి ర్యాంకు సాధించారు. ఫస్ట్ ర్యాంకు సాధించిన మొదటి కశ్మీరీగా ఆయన చరిత్ర సృష్టించారు. ఐఏఎస్ అధికారి అయినప్పటి నుంచి ప్రజల్లో ఉంటూ.. ప్రజల సమస్యలపై నిత్యం స్పందించే వారు. కశ్మీర్‌లో జరుగుతున్న నిరంతర హత్యలకు నిరసనగా తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. హత్యలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు తీసుకో వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజీనామాకు గల కారణాలను తన ఫేస్‌బుక్ పేజీలో రాశారు. కొన్ని హిందుత్వ శక్తుల చేతుల్లో 20 కోట్ల భారతీయ ముస్లింలు వివక్షకు గురవుతున్నారని,వారిని పక్కకు పెడుతున్నారని తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో జరుగుతున్న అత్యాచారాలపై స్పందిస్తూ.. ఫజల్ ఆరు నెలల కింద ఓ ట్వీట్ చేశారు. వెంటనే ఆయనపై జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ తర్వాత శిక్షణ కోసం విదేశాలకు వెళ్లి ఇటీవలే వచ్చిన ఫజల్.. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం పేరు ప్రస్తావించకుండా.. కేంద్రంపై పలు విమర్శలు చేశారు. 'ఆర్‌బీఐ, సీబీఐ, ఎన్‌ఐఏ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేస్తూ రాజ్యాంగం ప్రసాదించిన గొప్ప కట్టడాన్ని కూలదోయాలని చూస్తున్నారని, దీన్ని ఆపాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. ఫజల్ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలో చేరతారని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బారాముల్లా నుంచి పోటీ చేస్తారని భావిస్తున్నారు.

స్తంభించిన ప్రజా రవాణా

- రైళ్లు, బస్సులను అడ్డుకున్న ఆందోళనకారులు
- ముగిసిన భారత్ బంద్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 10 కార్మిక సంఘాలు ప్రకటించిన రెండ్రోజుల భారత్ బంద్ బుధవారంతో ముగిసింది. బంద్ సందర్భంగా కేరళ, పశ్చిమబెంగాల్‌లో ఆందోళనకారులు పలుచోట్ల రైళ్లను అడ్డుకోగా, బ్యాంకింగ్, బీమా కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోయాయి. చాలా చోట్ల రవాణా, విద్యుత్ సరఫరా, మైనింగ్ కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. బెంగాల్‌లోని హౌరా జిల్లాలో ఆందోళనకారులు ఓ బస్సుపై రాళ్లవర్షం కురిపించారు. కేరళలోని తిరువనంతపురంలో ఎస్బీఐ ట్రెజరీ శాఖపై దాడిచేశారు. తిరువనంతపురం–హైదరాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్, వేనాడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆందోళనకారులు తిరువనంతపురంలో అడ్డుకున్నారు. బంద్ నేపథ్యంలో కేరళలో వాణిజ్య సముదాయాలు, షాపులు రెండో రోజూ మూతపడ్డాయి. తమిళనాట కొన్ని ప్రాంతాల్లో ఆందోళనకారులు రైళ్లను అడ్డుకోగా, తెలంగాణలోని కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కార్యకలాపాలు స్తంభించాయి. అయితే సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు.

ఆగిపోయిన 20 వేల కోట్ల లావాదేవీలు

గోవాలో ప్రైవేటు బస్సులు, ట్యాక్సీల యాజమాన్యాలు బంద్‌లో పాల్గొనడంతో పలువురు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ముంబైలో అక్కడి రోడ్డు రవాణా సంస్థ 'బెస్ట్' జీతాల పెంపు సహా పలు డిమాండ్లతో నిరవధిక బంద్‌కు దిగడంతో లక్షలాది మంది ప్రయాణికులు రోడ్లపై పడిగాపులు కాశారు. అలాగే బెంగళూరులో రద్దీగా ఉండే మెజిస్టిక్ బస్టాండ్‌లోనూ వామపక్ష ట్రేడ్ యూనియన్లు బస్సుల రాకపోకల్ని అడ్డుకున్నాయి. ఈ బంద్‌లో ఆల్‌ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లా యీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఈఎఫ్ఐ) పాల్గొనడంతో రూ.20,000 కోట్ల విలువైన చెక్కుల లావాదేవీలు నిలిచిపోయాయి. అయితే ప్రభుత్వ రంగ ఎస్బీఐతో పాటు ప్రైవేటు బ్యాంకుల కార్యకలాపాలు ఎలాంటి ఇబ్బంది కలగలేదు.

రైతులు, యువత ఫ్రంట్‌ఫుట్ ఆడాలి

రాజస్తాన్‌లో క్రికెట్ పరిభాషలో రాహుల్



జైపూర్‌లో రాహుల్‌కు సత్కారం

జైపూర్: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ క్రికెట్ పరిభాషను రాజకీయాలకు అనువర్తింపజేశారు. 'రైతులు, యువత ఏ మాత్రం భయం లేకుండా ఫ్రంట్‌ఫుట్ బ్యాటింగ్ చేయాలి' అని అన్నారు. 'మనం ఆడితే ఫ్రంట్‌ఫుట్ ఆడతాం, సిక్స్' కొడతాం అని పేర్కొన్నారు. ఆయన బుధవారం రాజస్తాన్‌లో ప్రసంగిస్తూ 'దేశంలోని రైతులు, యువత ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. పిచ్‌పై ఫ్రంట్‌ఫుట్ వచ్చి ఆడాలి. ఐదేళ్లుగా ప్రధాని మోదీ బ్యాక్‌ఫుట్ వేసి ఆడుతున్నారు' అని పేర్కొన్నారు. గత నాలుగున్నరేళ్లలో మోదీ ప్రభుత్వం రైతు రుణాలను మాఫీ చేయలేక పోయిందన్నారు. 'రైతులకు సాయం చేస్తాననీ, యువతకు ఉద్యోగాలిస్తాననీ మోదీ మాట ఇస్తారు. కానీ ఆయనెప్పుడు బ్యాక్‌ఫుటే ఆడతారు (వెనకడుగు వేస్తారు)' అని రాహుల్ అన్నారు.

'మిషెల్ మామ'తో బంధమేంటి?

- కాంగ్రెస్ వివరించాలి
- రఫేల్ డీల్‌లో డసో ప్రత్యర్థి కంపెనీ తరఫున మిషెల్ లాబీయింగ్
- ప్రధాని నరేంద్రమోదీ




షోలాపూర్‌లో గవర్నర్ విద్యాసాగర్ సమక్షంలో మోదీకి ఖడ్గాన్ని బహూకరిస్తున్న ఫడ్నవిస్

షోలాపూర్: రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు అంశంలో తమపై ఆరోపణలు చేసేలా కాంగ్రెస్‌ను ప్రేరేపిస్తున్నది ఏంటో ఆ పార్టీ చెప్పాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డిమాండ్ చేశారు. ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని మోదీ ఉటంకిస్తూ, అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో మధ్యవర్తిగా ఉండి అరెస్టయిన క్రిస్టియన్ మిషెల్.. యూపీఏ కాలం నాటి రఫేల్ ఒప్పందంలో డసో ఏవియేషన్ ప్రత్యర్థిగా ఉన్న మరో కంపెనీ యూరోఫైటర్ తరఫున లాబీయింగ్ చేశాడనీ, కంపెనీకి, ప్రభుత్వ పెద్దలకు నడుమ కూడా మధ్యవర్తిగా వ్యవహరించాడని ఆరోపించారు. ఈ విషయం నిజమో కాదో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందన్నారు. 'రఫేల్ అంశంలో కాంగ్రెస్‌లోని ఏ నేతతో మిషెల్‌కు సంబంధాలున్నాయో ఆ పార్టీ చెప్పాలి. ఖర్చు పెట్టిన ప్రతీ పైసాకు లెక్క చూపాలి' అని డిమాండ్ చేశారు. ఉన్నత కులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును లోక్‌సభ సజావుగా ఆమోదించడమే.. తమపై అబద్ధాలు వ్యాప్తి చేస్తున్న వారికి గట్టి సమాధానమని మోదీ అన్నారు. దళితులు, గిరిజనులు తదితరుల హక్కులపై ఈ బిల్లు ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ఆయన బుధవారం పర్యటించి పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. 'గత ప్రభుత్వాల కాలంలో మధ్యవర్తుల వ్యవస్థ పాలనలో భాగంగా ఉండేది. ఆ ప్రభుత్వాలు పేదల హక్కులను హరించాయి. దేశ భద్రతతోనూ ఆటలాడుకున్నాయి'అని మోదీ అన్నారు. అలాగే బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌ల నుంచి వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇచ్చేందుకు తెచ్చిన బిల్లుపై మోదీ మాట్లాడుతూ, దీని కారణంగా అస్సాం లేదా ఇతర ఈశాన్య రాష్ట్రాల ప్రజల హక్కులకు భంగం కలగదన్నారు.

నన్నెవరూ కొనలేరు, భయపెట్టలేరు..

అవినీతిని శుభ్రం చేసేందుకు తాను నడుం బిగించాననీ, వెనక్కు తగ్గకుండా పనిచేసుకుపోతానని మోదీ వివరించారు. 'మోదీని ఎవరూ కొనలేరు, భయపెట్టలేరు. ఈ కాపలాదారుడు నిద్రపోడు. తప్పుచేసే వాళ్లను చీకట్లోనూ పట్టుకోగలడు. వాళ్లు నన్ను దుర్భాషలాడటం ఆపకపోవచ్చు. కానీ అవినీతిని అంతం చేయాలన్న నా పనిని నేను విడిచిపెట్టను' అని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిన ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తున్నామన్నారు.

రాహుల్ వర్సెస్ మోదీ



జైపూర్: 'మహిళ' కేంద్రంగా బుధవారం ప్రధాని మోదీ, కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ మధ్య వేర్వేరు వేదికలపై మాటల యుద్ధం చోటు చేసుకుంది. రాజస్తాన్‌లోని ఒక ర్యాలీలో రాహుల్ ప్రధానిని ఉద్దేశిస్తూ '56 అంగుళాల ఛాతీ కలిగిన మన దేశ చౌకీదార్ పార్లమెంటు నుంచి పారిపోయారు. రఫేల్‌కు సంబంధించి నేనడిగిన చిన్న ప్రశ్నకు బదులివ్వలేక ఒక మహిళ అయిన రక్షణ మంత్రి సీతారామన్‌జీకి ఆ బాధ్యత అప్పగించి తప్పించుకున్నారు' అని అన్నారు.

మహిళను అవమానించారు

ఆగ్రా: జైపూర్‌లో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రాలో ప్రధాని మోదీ స్పందించారు. ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ.. 'వారు ఒక మహిళను, దేశ రక్షణమంత్రిని అవమానించే స్థాయికి దిగజారారు. ఇది దేశ మహిళలను, మహిళాశక్తిని అవమానించడమే. అందుకు వారు శిక్ష అనుభవించక తప్పదు' అని కాంగ్రెస్ అధినేతపై విరుచు కుపడ్డారు. కాగా, రాహుల్ వ్యాఖ్యలపై వివరణ కోరుతూ నోటీసు పంపించినట్లు జాతీయ మహిళా కమిషన్ వెల్లడించింది.

సాక్షి బిజినెస్

గురువారం 10-1-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30)

దేశీ సూచీలు		
సెన్సెక్స్	232 ▲	36,213
నిఫ్టీ	53 ▲	10,855

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	6,963	▲ 66
డోజోన్స్	23,925	▲ 137
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,907	▲ 45
డాక్స్	10,893	▲ 89
షాంఘై	2,544	▲ 17
నికాయ్	20,427	▲ 223

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	69.65	71.04
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	88.75	91.25
€	యూరో	ఎస్‌బీఐ	79.85	82.05
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.06	51.08
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.03	53.07
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.04	20.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	09.25	10.95

'వాలెట్ల'కు మార్చి గండం!

మొబైల్ వాలెట్ల కేవైసీ ధ్రువీకరణకు ఫిబ్రవరి డెడ్‌లైన్

- గడువులోగా ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలు తక్కువే
- ఆధార్ చెల్లుబాటుపై సుప్రీం తీర్పుతో మరిన్ని కష్టాలు...
- దీంతో 95 శాతం వాలెట్లు మూతబడే పరిస్థితి



న్యూఢిల్లీ: డిజిటల్ విప్లవంతో కుప్పతెప్పలుగా పుట్టుకొచ్చిన మొబైల్ వాలెట్ సంస్థలకు ప్రస్తుతం కేవైసీ నిబంధనలు సంకటంగా మారాయి. ఈ ఏడాది ఫిబ్రవరి ఆఖరు నాటికి కస్టమర్లందరి వివరాల (కేవైసీ) ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్న రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలను అమలు చేయడానికి వాలెట్ సంస్థలు పరుగులు తీస్తున్నాయి. కానీ, నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. మరో పక్క, ప్రైవేటు సంస్థలు కస్టమర్ల నుంచి ఈ–కేవైసీ కోసం ఆధార్‌ను తీసుకోవడానికి వీల్లేదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వాలెట్ సంస్థలకు మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టింది. డెడ్‌లైన్ ముగియడానికి ఇంకా కొన్ని వారాల వ్యవధి మాత్రమే మిగిలి ఉండగా.. ఇప్పటిదాకా చాలా మటుకు సంస్థలు కేవలం కొద్ది మంది కస్టమర్ల కేవైసీ మాత్రమే పూర్తి చేయగలిగాయి. దీంతో దాదాపు 95 శాతం మొబైల్ వాలెట్లు మార్చి తర్వాత కార్యకలాపాలు నిలిపివేయాల్సిన పరిస్థితి తలెత్తవచ్చని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

మొబైల్ వాలెట్ సంస్థలన్నీ కూడా కచ్చితంగా కేవైసీ ధ్రువీకరణ జరపాల్సిందేనంటూ 2017లో రిజర్వ్ బ్యాంక్ ఆదేశించింది. దీంతో వనరులున్న సంస్థలు ఆధార్ ఆధారంగా ఎలక్ట్రానిక్ రూపంలో కేవైసీ వెరిఫికేషన్ జరిపాయి. పేమెంట్స్ బ్యాంకింగ్ లైసెన్స్ కూడా పొందిన పేటీఎం.. బయోమెట్రిక్ డాంగిల్స్, ఫీల్డ్ ఏజెంట్లను ఉపయోగించి కేవైసీ ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు కొత్త బ్యాంకు ఖాతాలు కూడా తెరిచింది. ఈ విధంగా పేటీఎం తమ యూజర్లలో దాదాపు 70 శాతం మందికి పూర్తి స్థాయిలో కేవైసీ నిబంధనలు అమలు చేయగలిగినట్లు కంపెనీ అధికారి ఒకరు తెలిపారు. కానీ మిగతా కంపెనీలు నానాతంటాలు పడుతున్నాయి. ప్రాథమిక స్థాయి ధ్రువీకరణ మాత్రమే పూర్తి చేయగలిగామని, బయోమెట్రిక్స్ లేకపోవడంతో పూర్తి వెరిఫికేషన్ చేయలేకపోతున్నామని మరో వాలెట్ సంస్థ అధికారి వివరించారు. పేపర్ రూపంలో డాక్యుమెంట్స్‌ను సేకరించి, వెరిఫికేషన్ చేయాలంటే ఖర్చులు భారీగా పెరిగిపోయి, లాభదాయకత సమస్యలు ఉంటున్నాయని వాపోయారు. మరోవైపు, సుప్రీం తీర్పు కారణంగా ఇప్పటికే ఆధార్ ఆధారిత ఈకేవైసీ పూర్తి చేసిన కస్టమర్ల డేటా అంతా కూడా మార్చి తర్వాత తమ సర్వర్ల నుంచి తొలగించనుండటంతో ఆయా యూజర్లు కూడా మళ్లీ ప్రత్యేకంగా ఇతరత్రా ధృవీకరణ పత్రాలతో కేవైసీ పూర్తి చేయాల్సిన అవసరం రావొచ్చని కూడా వాలెట్ సంస్థల వర్గాలు తెలిపాయి.

పార్లమెంటు వైపు చూపు..

ప్రస్తుత పరిస్థితుల్లో ఆధార్ చట్ట సవరణకి పార్లమెంటు ఆమోదముద్ర వేస్తే కాస్తంత గట్టెక్కగలమని వాలెట్ సంస్థలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ కోసం కస్టమర్లు స్వచ్ఛందంగా ఆధార్‌ని ఇచ్చేలా చట్ట సవరణ ప్రతిపాదనలు ఉన్నాయి. సౌకర్యంపరంగా.. కస్టమర్లు ఆధార్ వెరిఫికేషన్ వైపు మొగ్గ చూపే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అటు ఆర్‌బీఐ నుంచి కూడా కొంత భరోసా లభిస్తే గట్టెక్కుతామని అంటున్నాయి.

సుప్రీం కోర్టు తీర్పు ప్రభావం..

ప్రైవేట్ కంపెనీలు తమ కస్టమర్ల ధృవీకరణ కోసం ఆధార్ ఆధారిత ఎలక్ట్రానిక్ కేవైసీ వెరిఫికేషన్ (ఈకేవైసీ) ప్రక్రియను అమలు చేయడానికి లేదంటూ సుప్రీం కోర్టు గతేడాది తీర్పునివ్వడంతో మొబైల్ వాలెట్ సంస్థలకు తాజా సమస్యలు వచ్చి పడ్డాయి. 'ఈకేవైసీ లేదు. సులభతరమైన ప్రత్యామ్నాయ కేవైసీ విధానాల గురించి ఆర్‌బీఐ ఇప్పటి వరకూ ఏ విషయమూ స్పష్టంగా చెప్పలేదు. మరోవైపు, డెడ్‌లైన్ చూస్తే ఇంకా కొన్ని వారాలే మిగిలి ఉంది. ప్రస్తుత స్థాయిని బట్టి చూస్తే.. ఆలోగా వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయగలిగే పరిస్థితి కనిపించడం లేదు' అని ఒక వాలెట్ సంస్థ సీనియర్ అధికారి తెలిపారు. ప్రైవేట్ కంపెనీలకు ఈ–కేవైసీ అందుబాటులో లేకపోవడంతో.. వీడియో ఆధారిత వెరిఫికేషన్, ఎక్స్ఎంఎల్ ఆధారిత కేవైసీ వంటి ప్రత్యామ్నాయ విధానాలనైనా అనుమతించాలన్న డిమాండ్లు ఉన్నాయి. అయితే, వీటికి రిజర్వ్ బ్యాంక్ నుంచి అధికారికంగా ఆమోదముద్ర లేదు.

స్టాండెలోన్ వాలెట్లపైనే ప్రభావం ఎక్కువ..

దేశీయంగా నాలుగేళ్ల క్రితం పెద్దయెత్తున వాలెట్ కంపెనీలు వచ్చినప్పటికీ.. ప్రస్తుతం కొన్ని మాత్రమే మిగిలాయి. మొబిక్విక్, ఫోన్‌పే, అమెజాన్‌పే వంటి సంస్థలు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లేదా టెక్నాలజీ ఆధారిత ఆర్థిక సేవలు అందించే ఇతరత్రా ఫిన్‌టెక్ కార్యకలాపాల్లోకి మళ్లాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి సంస్థలకు మాత్రమే మనుగడ ఉండవచ్చని, స్టాండెలోన్ వాలెట్లపై మాత్రం తీవ్ర ప్రతికూల ప్రభావం పడగలదని కన్సల్టెన్సీ సంస్థ ఎర్నెస్ట్ అండ్ యంగ్ వర్గాలు తెలిపాయి.

యాపిల్ టిమ్ వేతనం @ రూ. 110 కోట్లు



వాషింగ్టన్: టెక్ దిగ్గజం యాపిల్ అమ్మకాలు భారీగా పెరిగిన నేపథ్యంలో సంస్థ సీఈవో టిమ్ కుక్ జీతభత్యాలు గతేడాది ఏకంగా 22 శాతం పెరిగాయి. 2018లో ఆయన ఏకంగా 15.7 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 110 కోట్లు) ప్యాకేజీ అందుకున్నారు. ఇందులో 3 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 21 కోట్లు) మూల వేతనం కాగా, 12 మిలియన్ డాలర్ల (దాదాపు 84 కోట్లు) బోనస్, 6,80,000 డాలర్లు ఇతరత్రా భత్యాల కింద చెల్లించినట్లు యాపిల్ పేర్కొంది. 2018లో యాపిల్ ఉత్పత్తుల విక్రయాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో దానికి అనుగుణంగా టిమ్ జీతభత్యాలు పెంచినట్లు సంస్థ వివరించింది. 2011లో సీఈవోగా బాధ్యతలు చేపట్టిన టిమ్.. 2016లో 8.7 మిలియన్ డాలర్లు, 2017లో 12.8 మిలియన్ డాలర్లు వేతనంగా అందుకున్నారు.

యస్ బ్యాంక్ చీఫ్ పదవికి షార్ట్‌లిస్ట్ సిద్ధం



ముంబై: ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ ఎండీ, సీఈవో రాణా కపూర్ ఈ నెలాఖరులో తప్పుకోనున్న నేపథ్యంలో ఆయన స్థానంలో నియమించే అవకాశం ఉన్న అభ్యర్థుల జాబితా సిద్ధమైంది. బుధవారం జరిగిన బోర్డు సమావేశంలో అభ్యర్థుల పేర్లను ఖరారు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు బ్యాంక్ తెలియజేసింది. కొత్త సీఈవో, ఎండీ నియామకానికి గురువారం ఆర్‌బీఐ ఆమోదం కోరనున్నట్లు వివరించింది. అయితే, షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల పేర్లను మాత్రం వెల్లడించలేదు. రాణా సారథ్యంలో యస్ బ్యాంక్ నిబంధనలు ఉల్లంఘించిందంటూ ఆయన్ను మరో దఫా ఎండీ, సీఈవోగా కొనసాగించడానికి రిజర్వ్ బ్యాంక్ నిరాకరించిన సంగతి తెలిసిందే. దీంతో జనవరి 31తో ఆయన తప్పుకోవాల్సి వస్తోంది.

ఇండస్ఇండ్ బ్యాంక్‌ను... వీడని ఐఎల్‌ఎఫ్ఎస్ కష్టాలు

- క్యూ3లోనూ లాభంపై ప్రభావం
- మిశ్రమంగా రుణనాణ్యత



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని ఇండస్ఇండ్ బ్యాంక్‌ను ఐఎల్అండ్ఎఫ్ఎస్ రుణ కష్టాలు ఇంకా వీడలేదు. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో బ్యాంక్ రూ.985 కోట్ల నికర లాభం సాధించింది. గతేడాది ఇదే క్వార్టర్లో రూ.936 కోట్ల లాభంతో పోలిస్తే 5 శాతం వృద్ధి చెందింది. సాధారణంగా ఈ బ్యాంక్ ప్రతి క్వార్టర్‌లోనూ 20–25 శాతం వృద్ధిని సాధించేది. గత రెండు క్వార్టర్లలో నికర లాభం వృద్ధి తగ్గుతూ వస్తోంది. ఐఎల్అండ్ఎఫ్ఎస్‌కు ఈ బ్యాంక్ రూ.3,000 కోట్ల మేర రుణాలివ్వడమే దీనికి ప్రధాన కారణం.

అది మినహాయిస్తే, మామూలుగానే....

గత క్యూ3లో రూ.5,474 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో 32 శాతం వృద్ధితో రూ.7,232 కోట్లకు పెరిగిందని బ్యాంక్ ఎండీ, సీఈఓ రమేశ్ సోబ్తి పేర్కొన్నారు. ఐఎల్అండ్ఎఫ్ఎస్ రుణ కష్టాలను మినహాయిస్తే, తమ వ్యాపారం మామూలుగానే ఉందని వివరించారు. ఈ క్యూ3లో నికర వడ్డీ ఆదాయం 21 శాతం పెరిగిందని రమేశ్ సోబ్తి చెప్పారు. కార్పొరేట్, వాహన రుణాల జోరుతో రుణ వృద్ధి 35 శాతానికి ఎగసిందని పేర్కొన్నారు.

మిశ్రమంగా మొండి బకాయిలు..

స్థూల మొండిబకాయిలు 1.16% నుంచి 1.13%కి తగ్గాయని రమేశ్ సోబ్తి వెల్లడించారు. అయితే నికర మొండి బకాయిలు మాత్రం 0.46% నుంచి 0.59%కి పెరిగాయన్నారు. అంతకు ముందటి క్వార్టర్‌తో పోల్చితే స్థూల మొండి బకాయిలు 10% ఎగసి రూ.1,968 కోట్లకు చేరాయని, నికర మొండి బకాయిలు 31 శాతం పెరిగి రూ.1,029 కోట్లకు చేరాయని వివరించారు. కేటాయింపులు 157 శాతం పెరిగి రూ.607 కోట్లకు పెరిగాయని, సీక్వెన్షియల్‌గా చూస్తే, ఈ వృద్ధి 3% అని వివరించారు.

తగ్గిన నికర వడ్డీ మార్జిన్...

నికర వడ్డీ మార్జిన్ మాత్రం తగ్గిందని రమేశ్ సోబ్తి తెలిపారు. గత క్యూ3లో 3.99 శాతంగా ఉన్న నికర వడ్డీ మార్జిన్ ఈ క్యూ3లో 3.83 శాతంగా ఉందని, ఈ క్యూ2లో 3.84 శాతమని పేర్కొన్నారు. ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్ కంపెనీలకు ఇచ్చిన రుణాల కోసం ఈ క్యూ3లో రూ.255 కోట్లు కేటాయింపులు జరిపామని పేర్కొన్నారు. క్యూ2లో రూ.275 కోట్లు కేటాయింపులతో కలుపుకొని మొత్తం మీద ఈ గ్రూప్ కంపెనీలకు ఇచ్చిన రుణాలకు రూ.600 కోట్ల మేర కేటాయింపులు జరిపామని వివరించారు.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్ 1.4 శాతం లాభపడి రూ.1,601 వద్ద ముగిసింది.

ఎలక్ట్రిక్ వాహనం కొంటే... పార్కింగ్ ఉచితం!

- రోడ్‌ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా తక్కువే
- ప్రభుత్వానికి ప్యానెల్ సిఫారసులు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి ముందుకొచ్చే వారికి ఎన్నో ప్రోత్సాహకాలు, రాయితీలు లభించనున్నాయి. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచే దిశగా ప్రభుత్వం నియమించిన కేబినెట్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ సిన్హా ఆధ్వర్యంలోని ప్యానెల్ పలు కీలక సిఫారసులు చేసింది. తయారీదారులు కూడా పెద్ద ఎత్తున రాయితీలు ఇవ్వాలన్నది ప్రతిపాదన. ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని తక్కువ ఉండేలా చూడాలని, అలాగే, జీఎస్టీ రేటు కూడా తక్కువ ఉండాలని సిఫారసు చేసింది. దీంతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీని భారీగా పెంచొచ్చని పేర్కొంది. ఇక కొనుగోలుదారులను ఆకర్షించేందుకు... తక్కువ రిజిస్ట్రేషన్ చార్జీలు, రోడ్ ట్యాక్స్ తక్కువగా విధించడం వంటి సిఫారసుల్లో ఉన్నాయి. ప్రధాన మంత్రి అధ్యక్షతన గల అత్యున్నత స్థాయి కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకోనుందని, అనంతరం రెవెన్యూ, భారీ పరిశ్రమలు, ఉపరితల రవాణా శాఖలు తదుపరి చర్యల కోసం ఆదేశాలు జారీ చేయనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. రెండు డజన్లకు పైగా అధికారులు కలసి ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన ఈ విధానానికి తుదిరూపం ఇచ్చినట్టు చెప్పాయి. గత నెలలో ఈ ప్యానెల్ సమావేశం జరిగిందని, ఈ మెగా ప్రణాళికను తీసుకొచ్చే విషయంలో నీతి ఆయోగ్ మోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్నట్టు తెలిపాయి. అంతర్జాతీయంగా రవాణా విషయంలో భారత్‌ను కీలక స్థానంలో నిలబెట్టాలంటే అందుకు అవసరమైన విధానాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని... దేశంలో పెద్ద ఎత్తున ఎలక్ట్రిక్ వాహనాలు, అన్ని విడిభాగాలు ఇక్కడే తయారు చేయడం ద్వారానే ఇది సాధ్యమన్నది ప్రభుత్వం యోచనగా ఆ వర్గాలు తెలిపాయి. ఎలక్ట్రిక్ వాహనాలకు స్థిరమైన విధానాన్ని అమలు చేయనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ గతేడాది సెప్టెంబర్ లోనే ప్రకటించారు. బ్యాటరీల నుంచి స్మార్ట్ చార్జింగ్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ వరకు పెట్టుబడులను పెంచాలనుకుంటున్నట్టు చెప్పారు.

ఐటీ మినహాయింపు పరిమితి రెట్టింపు చేయాలి

- రూ. 5 లక్షలకు చేర్చాలి...
- సెక్షన్ 80సీ డిడక్షన్ పరిమితి పెంచాలి
- కేంద్రానికి సీఐఐ వినతి



న్యూఢిల్లీ: వచ్చే నెల 1న కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో వ్యక్తిగత ఆదాయాలపై పన్ను మినహాయింపుల పరిమితిని పెంచాలంటూ కేంద్రాన్ని పరిశ్రమ వర్గాలు కోరాయి. ఐటీ మినహాయింపును రెట్టింపు స్థాయికి రూ.5 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశాయి. అలాగే పొదుపును ప్రోత్సహించే దిశగా సెక్షన్ 80సి కింద డిడక్షన్ పరిమితిని కూడా ప్రస్తుతమున్న రూ. 1.5 లక్షల నుంచి రూ. 2.5 లక్షలకు పెంచాలని కోరాయి. ఆర్థిక శాఖకు సమర్పించిన ప్రి–బడ్జెట్ కోర్కెల చిట్టాలో పరిశ్రమల సమాఖ్య సీఐఐ ఈ మేరకు విజ్ఞప్తులు చేసింది. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి 1న కేంద్రం మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. కొత్తగా ఏర్పడే ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది.

కార్పొరేట్ ట్యాక్స్ 25 శాతానికి తగ్గించాలి..

ప్రస్తుతం రూ. 2.5 లక్షల దాకా వ్యక్తిగత ఆదాయంపై పన్ను మినహాయింపులు ఉంటున్నాయి. రూ. 2.5–5 లక్షల దాకా ఆదాయంపై 5 శాతం, రూ. 5–10 లక్షల దాకా 20 శాతం, రూ. 10 లక్షలు దాటితే 30 శాతం మేర పన్ను రేటు వర్తిస్తోంది. కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయంపై పన్ను మినహాయింపుల పరిమితిని రూ. 5 లక్షలకు పెంచాలని సీఐఐ కోరింది. ఇక రూ. 5–10 లక్షల శ్లాబ్‌లో రేటును 10 శాతానికి, రూ. 10–20 లక్షల ఆదాయంపై పన్నును 20 శాతానికి తగ్గించాలని కూడా సిఫార్సు చేసింది. రూ. 20 లక్షలు పైగా ఆదాయం ఉన్న వారిపై 25 శాతం పన్ను రేటు విధించాలని కోరింది. వైద్య వ్యయాలు, రవాణా అలవెన్సులకు కూడా మినహాయింపులు ఇవ్వాలని పేర్కొంది. మరోవైపు కార్పొరేట్ ట్యాక్స్‌ను కూడా టర్నోవర్‌తో సంబంధం లేకుండా 25 శాతానికి తగ్గించాలని, ఆ తర్వాత క్రమానుగతంగా దీన్ని 18 శాతం స్థాయికి తేవాలని విజ్ఞప్తి చేసింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద డిడక్షన్ పరిమితిని ప్రస్తుతమున్న రూ. 1.5 లక్షల నుంచి రూ. 2.5 లక్షలకు పెంచితే పొదుపు చేసేందుకు మరింత అవకాశం కల్పించినట్లవుతుందని సీఐఐ తెలిపింది. రూ. 40,000 స్టాండర్డ్ డిడక్షన్‌తో పాటు వైద్య చికిత్స వ్యయాలు, రవాణా అలవెన్సులకు మినహాయింపులు పునరుద్ధరించాలని కోరింది. స్వల్పకాలిక క్యాపిటల్ గెయిన్స్‌తో దీర్ఘకాలిక మూలధన నష్టాలను సెటాఫ్ చేసుకునేందుకు అనుమతించాలని పేర్కొంది.

విమాన ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ ఉచిత ప్రయాణ బీమా



న్యూఢిల్లీ: ఐఆర్‌సీటీసీ పోర్టల్ ద్వారా విమాన టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులు ఇకపై రూ. 50 లక్షల దాకా ప్రమాద బీమా సదుపాయాన్ని ఉచితంగా పొందవచ్చు. దేశ, విదేశీ ఫ్లయిట్స్‌లో ఏ తరగతికి చెందిన టికెట్లు బుక్ చేసుకున్న వారైనా దీన్ని పొందవచ్చని ఐఆర్‌సీటీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదవశాత్తు శాశ్వత అంగవైకల్యం, మరణం సంభవించిన పక్షంలో ఈ బీమా కవరేజీ వర్తిస్తుందని పేర్కొంది. ఇన్సూరెన్స్ సేవల కోసం భారతి ఆక్సా జనరల్ ఇన్సూరెన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. పాలసీ ప్రీమియంను ఐఆర్‌సీటీసీనే భరిస్తుంది.

భారత్ వృద్ధి తీరు భేష్!

- ఆర్థిక దిగ్గజాల విశ్లేషణ
- 2018–19లో వృద్ధి 7.3%గా ప్రపంచ బ్యాంక్ అంచనా
- మూడవ అతిపెద్ద వినిమయ మార్కెట్‌గా భారత్: డబ్ల్యూఈఎఫ్
- వృద్ధికి ప్రభుత్వ చర్యలు దోహదం: పీడబ్ల్యూసీ– ఫిక్కీ సర్వే



వాషింగ్టన్/ముంబై: భారత్ ఆర్థిక వ్యవస్థపై సానుకూల అంచనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018–19)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 7.3 శాతంగా ఉంటుందని తన తాజా నివేదికలో ప్రపంచబ్యాంక్ పేర్కొంది. ఇక వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ఒక నివేదిక విడుదల చేస్తూ, భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద వినిమయ మార్కెట్‌గా అవతరించబోతోందని పేర్కొంది. మరోవైపు పీడబ్ల్యూసీ– ఫిక్కీ సర్వే వచ్చే 12 నెలల్లో భారత్ వృద్ధి రేటు 7%పైనే ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వ చర్యలు వృద్ధికి దోహదపడతాయని భారత్ కార్పొరేట్ భావిస్తున్నట్లు ఈ సర్వే తెలిపింది. ఆయా సంస్థల నివేదికల్లోని ముఖ్యాంశాలపై దృష్టి సారిస్తే...

వినియోగం, పెట్టుబడుల దన్ను: ప్రపంచబ్యాంక్

భారత్ 2018–19 ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం వృద్ధి సాధిస్తుందని ప్రపంచబ్యాంక్ తన తాజా "2019 గ్లోబల్ ఎకనమిక్ ప్రాస్పెక్ట్స్" నివేదికలో పేర్కొంది. అటు తర్వాత వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లో 7.5 శాతం చొప్పున వృద్ధి నమోదవుతుందని అంచనావేసింది. దేశంలో పటిష్ట వినియోగం, పెట్టుబడుల ధోరణి ఈ స్థాయి వృద్ధి రేటుకు దోహదపడే అంశాలుగా వివరించింది. ఈ స్థాయి వృద్ధితో ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలుస్తుందని పేర్కొంది. ఇక చైనా వృద్ధి రేటు 2018లో 6.5% అయితే 2019, 2020ల్లో 6.2%కి పడిపోతుందని విశ్లేషించింది. 2021లో మరింతగా 6%కి పడిపోతుందని పేర్కొంది. భారత్ వృద్ధి ధోరణి ప్రోత్సాహకరమైన రీతిలో కొనసాగుతోందని, ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే పరిస్థితి సానుకూలంగా ఉందని వరల్డ్ బ్యాంక్ ప్రాస్పెక్ట్స్ గ్రూప్ డైరెక్టర్ ఐహాన్ కోష్ పేర్కొన్నారు. ఆర్థిక సంక్షోభ పరిస్థితుల అవకాశాలను తట్టుకోవడానికి తగిన వ్యూహాలతో అభివృద్ధి చెందుతున్న దేశాలు సిద్ధంగా ఉండాలని ప్రపంచబ్యాంక్ సూచించడం గమనార్హం.


ప్రభుత్వ చర్యల సత్ఫలితాలు: సర్వే

కేంద్రం తీసుకుంటున్న పలు విధానపరమైన చర్యలు ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయని పీడబ్ల్యూసీ–ఫిక్కీ సర్వే ఒకటి పేర్కొంది. వచ్చే 12 నెలల కాలంలో దేశం 7 శాతానికి పైగా వృద్ధి సాధిస్తుందని భారత్ కార్పొరేట్ రంగం భావిస్తున్నట్లు వివరించింది. దేశీయంగా పటిష్ట డిమాండ్ ఇందుకు ప్రధాన కారణమని విశ్లేషించింది. ఎగుమతుల మార్కెట్‌పై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందనీ, వృద్ధిలో ఈ విభాగం కూడా కీలక పాత్ర పోషించనుందని పేర్కొంది. 2018 జూలై–అక్టోబర్ మధ్య చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, ఫైనాన్షియల్ అధికారులు, భారత తయారీ రంగం వ్యూహాత్మక విభాగాల చీఫ్‌లతో ఇంటర్వ్యూల ద్వారా తాజా సర్వే రూపకల్పన జరిగింది. మౌలిక రంగం అభివృద్ధితో ప్రభుత్వ రంగం పటిష్ఠంగా ఉందని, వ్యాపార పరిస్థితులు మెరుగుపడ్డాయని, నియంత్రణా వ్యవస్థల పనితీరు సమర్థవంతంగా ఉందని పేర్కొన్న సర్వే, దీనితోపాటు పలు రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) మార్గాలను సరళీకరణ వృద్ధికి దోహదపడే అంశాలని విశ్లేషించింది. మౌలిక రంగంలో పెట్టుబడులు మరిన్ని పెరగాలని సూచించింది.

2030 నాటికి 6 ట్రిలియన్ డాలర్లకు వినియోగం: డబ్ల్యూఈఎఫ్

అమెరికా, చైనాల తర్వాత భారత్ మూడవ అతిపెద్ద వినిమయ దేశంగా అవతరించనుందని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) తన తాజా నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం భారత్ వినియోగం 1.5 ట్రిలియన్ డాలర్లు. 2030 నాటికి ఈ విలువ 6 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతున్న అంచనాలను వెలువరించింది. ప్రస్తుతం భారత్ వ్యయాలకు సంబంధించి ప్రపంచంలో ఆరవ దేశంగా కొనసాగుతోంది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువలో దేశీయ ప్రైవేట్ వినియోగం 60 శాతంగా ఉంది. నైపుణ్యం మెరుగుదల, భవిష్యత్తులో ఉపాధి కల్పన, గ్రామీణ భారతంలో సామాజిక–ఆర్థిక పురోగతి, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై భారత్ తక్షణం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కూడా డబ్ల్యూఈఎఫ్ తన తాజా నివేదికలో వివరించింది. భారత్‌లోని 30 పట్టణాలు, నగరాల్లోని 5,100 కుటుంబాల అభిప్రాయాల ఆధారంగా తాజా సర్వే రూపొందింది. అలాగే దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో దాదాపు 40 ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ ఆర్థిక సంవత్సరంసహా వచ్చే రెండేళ్లలో భారత్ వృద్ధి రేటు 7% పైన ఉంటుందనేది ఫోరమ్ అంచనా.

ఎంజీ మోటార్ నుంచి 'ఎస్‌యూవీ హెక్టర్'..!



న్యూఢిల్లీ: చైనాకు చెందిన ఎస్ఏఐసీ మోటార్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు భారత అనుబంధ సంస్థ అయిన ఎంజీ మోటార్ ఇండియా త్వరలోనే స్పోర్ట్–యుటిలిటీ వెహికల్ (ఎస్‌యూవీ)ను విడుదలచేయనుంది. 'హెక్టర్' పేరుతో ఈఏడాది మధ్యనాటికి కారు విడుదలకానున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ చబా మాట్లాడుతూ... 'ఎస్‌యూవీ విభాగం ఇప్పుడు భారత్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. ఇక్కడి వినియోగదారుల ప్రాధాన్యతలకు అనుగుణంగా భారీస్థాయిలో ఈ కారును ఇంజనీరింగ్ చేయగలిగాం. ఈ ఎస్‌యూవీ పూర్తిగా కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ఉంటుందని భావిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. ఈ కారు ఉత్పత్తి నిమిత్తం గుజరాత్‌లోని హాలోల్ ప్లాంట్‌లో రూ.2,000 కోట్లను పెట్టుబడి పెట్టిన ఈ కంపెనీ.. వచ్చే ఐదేళ్లలో రూ.5,000 కోట్లకు పెట్టుబడిని పెంచనున్నట్లు తెలిపింది.

హీరో ఎలక్ట్రానిక్స్ నుంచి ఏఐ ఉత్పత్తులు

న్యూఢిల్లీ: హీరో గ్రూప్‌నకు చెందిన ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ వెంచర్ హీరో ఎలక్ట్రానిక్స్ కంపెనీ వినియోగదారుల ఉత్పత్తుల సెగ్మెంట్లోకి ప్రవేశిస్తోంది. రానున్న ఐదేళ్లలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో పనిచేసే ఉత్పత్తులను పదింటిని అందించనున్నామని హీరో ఎలక్ట్రానిక్స్ వ్యవస్థాపక డైరెక్టర్ ఉజ్వల్ ముంజాల్ పేర్కొన్నారు. హోమ్ ఆటోమేషన్, వాహన, ఆరోగ్య, వినోద రంగాలకు సంబంధించి ఈ ఉత్పత్తులుంటాయని... క్వాల్‌కామ్, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. లాస్‌వేగాస్ కన్సూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో ఈ కంపెనీ తన ఉత్పత్తులను ప్రదర్శిస్తోంది.

Hero Electronix

36,000 పాయింట్ల పైకి సెన్సెక్స్

- లాభాల్లో ప్రపంచ మార్కెట్లు
- క్యూ3 ఫలితాలపై ఆశావహ అంచనాలు
- 36,000 పాయింట్ల పైకి సెన్సెక్స్
- 232 పాయింట్లు పెరిగి 36,213వద్ద ముగింపు
- 53 పాయింట్లు ఎగసి 10,855 వద్దకు నిఫ్టీ



సానుకూల అంతర్జాతీయ సంకేతాల కారణంగా బుధవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. వరుసగా నాలుగో రోజూ స్టాక్ సూచీలు లాభపడ్డాయి. వాణిజ్య ఉద్రిక్తతలను నివారించే ఒప్పందం అమెరికా–చైనాల మధ్య కుదరనున్నదన్న వార్తల కారణంగా ప్రపంచ మార్కెట్లు పెరగడం సానుకూల ప్రభావం చూపించింది. కంపెనీల మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాలతో కొనుగోళ్లు జోరుగా సాగడం కలసివచ్చింది. బీఎస్ఈ సెన్సెక్స్ మళ్లీ 36,000 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా కీలకమైన 10,850 పాయింట్ల ఎగువన ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 232 పాయింట్లు పెరిగి 36,213 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 53 పాయింట్లు పెరిగి 10.855 పాయింట్ల వద్ద స్థిర పడ్డాయి. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 699 పాయింట్లు ఎగసింది.

ఇంట్రాడే నష్టం నుంచి 350 పాయింట్లు పైకి.... సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. కొనుగోళ్ల జోరుతో లాభాలు మరింతగా పెరిగాయి. భారత జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతంగా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతంగా ఉండగలదన్న ప్రపంచ బ్యాంక్ అంచనాలు సానుకూల ప్రభావం చూపించాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి పెద్ద కంపెనీల క్యూ3 ఫలితాలు వెల్లడి కానుండటంతో మార్కెట్లో అప్రమత్తత చోటు చేసుకోవడం, రూపాయి పతనం కావడంతో మధ్యాహ్నం తర్వాత ఈ లాభాలన్నీ హరించుకుపోయాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,833
ఎన్ఎస్ఈ	29,800
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	1,17,442
ఎఫ్ఐఐ	276
డీఐఐ	440

ఎన్ఎమ్డీసీ షేర్ బైబ్యాక్ ధర రూ.98

రికార్డ్ డేట్ ఈ నెల 18

బజాజ్ కార్ప్ డివిడెండ్ ఒక్కో షేర్‌కు రూ.14

9% పెరిగిన నికర లాభం

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
AXISBANK	671.2	3.12
ITC	291.5	2.55
TATAMOTORS	183.55	2
UPL	765	1.7
HDFC	1,991.30	1.65
EICHERMOT	20,345.00	1.5
IBULHSGFIN	824.2	1.43
INDUSINDBK	1,599.70	1.39
BHARTIARTL	333.2	1.2
DRREDDY	2,597.90	1.07

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
HINDPETRO	238.15	-3.95
GAIL	341	-3.84
BPCL	340	-3.4
YESBANK	186.55	-3.02
ULTRACEMCO	3,810.10	-2.71
TATASTEEL	479.2	-2.47
INFRATEL	291.25	-2.25
HEROMOTOCO	2,925.00	-1.53
IOC	132	-1.49
ONGC	145.35	-1.42

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల దిగుమతులపై ఆంక్షలు

న్యూఢిల్లీ: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్)లో నమోదు కాని ఎలక్ట్రానిక్స్, ఐటీ ఉత్పత్తుల దిగుమతులను కేంద్రం నిషేధించింది. ఇలాంటి వాటిని దిగుమతి చేసుకున్న పక్షంలో సదరు దిగుమతి దారు వాటిని మళ్లీ ఎగుమతి చేయాల్సి వస్తుందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్టీ) ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఒకవేళ అలా చేయని పక్షంలో కస్టమ్స్ విభాగమే ఆయా ఉత్పత్తులను స్క్రాప్ కింద తొలగిస్తుందని తెలిపింది.

యాత్ర ఆన్‌లైన్ చేతికి కార్పొరేట్ ట్రావెల్ వ్యాపారం

దక్షిణాదిన మరింత పటిష్టంగా 'యాత్ర'



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ట్రావెల్ కంపెనీ యాత్ర ఆన్‌లైన్ ఇన్‌కార్పొ.... చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న పీఎల్ వరల్డ్‌వేస్ కంపెనీకి చెందిన కార్పొరేట్ ట్రావెల్ వ్యాపారాన్ని కొనుగోలు చేసింది. ఈ డీల్‌కు సంబంధించిన ఆర్థిక వివరాలను యాత్ర కంపెనీ వెల్లడించలేదు. ఈ డీల్ కారణంగా దక్షిణ భారతదేశంలో తమ స్థానం మరింత పటిష్టమవుతుందని యాత్ర పేర్కొంది. ప్రస్తుతం 700గా ఉన్న కార్పొరేట్ క్లయింట్ల సంఖ్య అదనంగా మరో వందకు పైగా పెరుగుతుందని వివరించింది.

కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌తో రెప్కో హోమ్ ఒప్పందం



హైదరాబాద్: కోటక్ మహీంద్రా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, రెప్కో హోమ్ ఫైనాన్స్‌ల మధ్య కార్పొరేట్ ఏజెన్సీ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా కోటక్ మహీంద్రా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆరోగ్య, సాధారణ బీమా పాలసీలను రెప్కో హోమ్ ఫైనాన్స్ విక్రయిస్తుంది. రెప్కో హోమ్ ఫైనాన్స్‌కు పటిష్టమైన నెట్‌వర్క్ ఉందని, ఫలితంగా ఈ ఒప్పందం వల్ల ఇరు సంస్థలకు ప్రయోజనం కలుగుతుందని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎమ్‌డీ, సీఈఓ మహేశ్ బాలసుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. పెరుగుతున్న ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా సేవలందించడానికి సిద్ధంగా ఉన్నామని, దీంట్లో భాగంగానే కోటక్ మహీంద్రా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నామని రెప్కో హోమ్ ఫైనాన్స్ కంపెనీ సెక్రటరీ కె. ప్రభు వివరించారు.

ఔషధాలను విక్రయిస్తున్నందుకు స్నాప్‌డీల్‌పై విచారణ



బెంగళూరు: ఆన్‌లైన్‌లో నియంత్రిత ఔషధాలను చట్ట విరుద్ధంగా విక్రయిస్తున్నందుకు ప్రముఖ ఈ కామర్స్ సంస్థ స్నాప్‌డీల్‌కు వ్యతిరేకంగా చట్టపరమైన విచారణ చర్యలు చేపట్టేందుకు కర్ణాటక ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ''షెడ్యూల్డ్ హెచ్ డ్రగ్ 'సుహాగ్రా 100' ప్రదర్శన, విక్రయం, పంపిణీ చేస్తున్నందుకు గాను స్నాప్‌డీల్, ఆ సంస్థ సీఈవో కార్‌బాహల్, సీవోవో రోహిత్‌కుమార్ బన్సాల్‌కు వ్యతిరేకంగా విచారణ చర్యలు తీసుకునేందుకు బెళగావికి చెందిన అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్‌ను అనుమతిస్తూ డిసెంబర్ 21న ఆదేశాఉలు ఇవ్వడం జరిగింది. ఈ ఔషధాన్ని ఓవర్ ద కౌంటర్ విక్రయించకూడదు. ఇది ఔషధ, సౌందర్య ఉత్పత్తుల నిబంధనలకు వ్యతిరేకం''అని కర్ణాటక డ్రగ్ కంట్రోలర్ అమరేష్ తుంబగి బుధవారం మీడియాకు తెలిపారు. లుధినాయాకు చెందిన హెర్బల్ హెల్త్‌కేర్ కంపెనీ యజమాని, ఉద్యోగులకు వ్యతిరేకంగా కూడా విచారణ చర్యలు చేపట్టినట్టు చెప్పారు. లైంగిక ఉద్దీపనానికి వినియోగించే సుహాగ్ర ఔషధాన్ని వైద్యుల సిఫారసు లెటర్ లేకుండా విక్రయించకూడదని స్పష్టం చేశారు.

చట్టానికి సహకరిస్తాం: స్నాప్‌డీల్

ఈ విషయానికి సంబంధించి తమకు ఎటువంటి సమాచారం లేదని, విచారణ అధికారులకు సహకారం అందిస్తామని స్నాప్‌డీల్ ప్రకటన జారీ చేసింది.

దుబాయ్‌లో ఓయో సేవలు

న్యూఢిల్లీ: ఆతిథ్య సేవల సంస్థ ఓయో దుబాయ్‌లోకి ప్రవేశించింది. అంతర్జాతీయ విస్తరణలో భాగంగా 'ఓయో హోమ్' పేరిట ఆదేశంలో బుధవారం గృహ నిర్వహణ సేవలను ప్రారంభించింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ రితేశ్ అగర్వాల్ మాట్లాడుతూ.. 'దుబాయ్‌లో 40 గృహాలతో సేవలను ప్రారంభించాం. వచ్చే6 నెలల్లో ఈ సంఖ్యను 200లకు చేర్చాలని లక్ష్యాన్ని నిర్ధేశించుకున్నాం. ఇక భారత్‌లో ఓయో హోమ్ సేవ శరవేగంగా వృద్ధి చెందుతోంది. 25 నగరాల్లో 3,000 పూర్తి నివాస వసతులను నిర్వహిస్తున్నాం'అన్నారు.

సైనికులకు వడ్డీ రాయితీలు

పీఎన్‌బీ నుంచి రక్షక్ ప్లస్ ప్యాకేజీ



న్యూఢిల్లీ: భారత జవాన్ల కోసం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) తక్కువ వడ్డీకే వివిధ రుణాలను అందిస్తోంది. ఈ మేరకు రక్షక్ ప్లస్ ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్యాకేజీలో భాగంగా గృహ, వ్యక్తిగత, విద్యా, కార్ల రుణాలపై సైనికులకు వడ్డీ రాయితీలను ఆఫర్ చేస్తోంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న, రిటైరైన సైనికులకు కూడా ఈ వడ్డీ రాయితీలు వర్తిస్తాయని పీఎన్‌బీ పేర్కొంది. ఆర్మీ గ్రూప్ ఇన్సూరెన్స్ ఫండ్ నుంచి గృహ రుణం తీసుకున్న సైనికులు తమ సర్వీస్ నుంచి రిటైరైనప్పటికీ, ఆ గృహ రుణాన్ని కొనసాగించే వీలు ఉంటుందని, ఇలాంటి అనేక ఫీచర్లు లభిస్తాయని పీఎన్‌బీ పేర్కొంది. ఈ రక్షక్ ప్లస్ ప్యాకేజీకి సంబంధించి ప్రత్యేకమైన పోర్టల్‌ను, మొబైల్ యాప్‌ను త్వరలోనే అందుబాటులోకి తేనున్నామని వివరించింది.

బ్యాంకింగ్‌పై బంద్ ప్రభావం పాక్షికం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందంటూ ట్రేడ్ యూనియన్లు తలపెట్టిన రెండు రోజుల బంద్ బుధవారం కూడా కొనసాగింది. ప్రభుత్వ రంగ బ్యాంకులకు (పీఎస్‌యూ) చెందిన ఒక వర్గం ఉద్యోగులు కూడా ఇందులో పాల్గొనడంతో బ్యాంకింగ్ సేవలపై పాక్షిక ప్రభావం పడింది. ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఈఎఫ్ఐ) బలంగా ఉన్న చోట్ల ఈ ప్రభావం ఎక్కువగా కనిపించింది. అయితే, ప్రభుత్వ రంగంలోని ఎస్‌బీఐతో పాటు ప్రైవేట్ బ్యాంకుల కార్యకలాపాలు యథాప్రకారం కొనసాగాయి. నగదు లావాదేవీలు, చెక్కుల క్లియరెన్స్, రెమిటెన్సులు, విదేశీ మారక లావాదేవీలు మొదలైన వాటిపై ప్రభావం పడినట్లు ఏఐబీఈఏ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం తెలిపారు. మంగళవారం బంద్ కారణంగా రూ. 20,000 కోట్ల విలువ చేసే చెక్కుల క్లియరింగ్ జరగలేదని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పది ట్రేడ్ యూనియన్లు మంగళ, బుధవారాల్లో బంద్ నిర్వహించాయి. ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేశారు.

దాతృత్వ సంస్థలు, ప్రభుత్వాలకూ గోల్డ్ డిపాజిట్ స్కీమ్

ముంబై: పసిడి డిపాజిట్ స్కీమ్‌లో ఆర్‌బీఐ కీలక మార్పులు చేసింది. దీనిప్రకారం ఇకపై దాతృత్వం సంస్థలు, ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఈ పథకాన్ని వినియోగించుకోగలుగుతాయి. ఈ మేరకు ఆర్‌బీఐ ఒక ప్రకటన చేసింది. ప్రస్తుతం ఈ స్కీమ్ వ్యక్తులు, జాయింట్ డిపాజిట్లకు మాత్రమే అందుబాటులో ఉంది. దేశంలో గృహాలు, సంస్థల వద్ద అవసరానికి మించి ఉన్న పసిడిని మార్కెట్‌లోకి తీసుకురావడం, పసిడి దిగుమతులను తగ్గించి దేశాన్ని కరెంట్ అకౌంట్ లోటు తీవ్రత నుంచి తప్పించడం ఉద్దేశ్యంగా 2015లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. నిర్దిష్ట కాలపరిమితుల్లో పసిడి డిపాజిట్ల ఆ మేరకు విలువపై 2.25 నుంచి 2.50 శాతం శ్రేణిలో వడ్డీ పొందే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తోంది.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	377.3	378.75
ASIAN PAINT	1402	1401.25
AXIS BANK L	670.1	650.9
BAJAJ AUTO	2696.9	2694.85
BAJAJ FINSE	6399.1	6443.05
BAJAJ FINAN	2524.35	2537.05
BHARTI AIRT	334.5	329.25
BHARAT PETR	340.05	351.95
CIPLA LTD	510.1	513.65
COAL INDIA	232.65	233.3
EICHER MOTO	20291.05	20044.65
GAIL (INDIA	341.35	354.6
GRASIM INDU	835.3	836.6
HCL TECHNOL	938.4	945.15
HDFC LTD	1994.95	1958.95
HDFC BANK L	2116.8	2103
HERO MOTOCO	2937.45	2970.3
HINDALCO I	205.7	206.5
HPL	239	247.95
HUL	1785	1770.85
INDIABULLS	821.75	812.55
ICICI BANK	382.25	380.15
INDUSIND BA	1601.75	1577.75
BHARTI INFR	290.35	297.95
INFOSYS LIM	676.1	670.05
INDIAN OIL	132	134
ITC LTD	290.4	284.25
JSW STEEL L	290.75	293.9
KOTAK MAHIN	1238.25	1228.9
LARSEN & TO	1386.05	1382.2
MAHINDRA &M	726.3	723.4
MARUTI SUZU	7492.9	7439.5
NTPC LTD	146.55	146.95
OIL AND NAT	145.3	147.45
POWER GRID	197.6	197.35
RIL	1110.75	1104.65
STATE BANK	305.3	305.3
SUN PHARMAC	448.75	448.05
TATA MOTORS	183.05	179.95
TATA STEEL	479.2	491.35
TCS	1886.95	1893.55
TECH MAHIND	693.7	689.85
TITAN COMPA	952.95	946.15
ULTRATECH C	3817.25	3916.3
UPL LIMITED	764.8	752.2
VEDANTA LIM	194.75	195.65
WIPRO LTD	329	325.55
YES BANK LI	186.45	192.35
ZEE ENTERTA	451.25	451.65

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDIA L	1299.6	1299.4
ADITYA BIRL	96.4	97.35
ACC LIMITED	1454.15	1480.4
AMBUJA CEME	212.85	218.7
ASHOK LEYLA	94.45	93.05
BANDHAN BAN	455.4	477.05
BANK OF BAR	122.95	123.85
BHARAT ELEC	92.35	90.85
BHEL	70.25	71.35
BIOCON LIMI	631.85	629.15
BOSCH LIMIT	19476.35	19300.6
BRITANNIA I	3092.65	3089.55
CADILA HEAL	347.7	349.25
COLGATE PAL	1303.55	1310.75
CONTAINER C	684.45	680.4
DABUR INDIA	421.5	416.4
DLF LIMITED	182.1	181.5
AVENUE SUPE	1595.75	1572.4
GENERAL INS	262.9	264.3
GODREJ CONS	773.9	779.45
HAVELLS IND	681.75	669.7
HDFC STAND	396	394.7
HINDUSTAN Z	275.45	274.3
ICICI LOMBA	864.2	864.2
ICICI PRU L	336.75	324.45
VODAFONE ID	36.95	36.95
INTERGLOBE	1104.85	1110.3
L&T FINANCE	144.65	148.3
LIC HOUSING	476.15	480.9
LUPIN LIMIT	838.15	841.7
MARICO LIMI	383.75	381.85
UNITED SPIR	594.15	600.3
MOTHERSON S	161.95	158.25
MRF LTD	66070.35	66439.9
NHPC LTD	25.95	26
THE NEW IND	177.8	178.75
NMDC LTD.	91.25	94.95
ORACLE FIN	3599.1	3581.6
OIL INDIA L	175.8	176.45
PIRAMAL ENT	2341.9	2308.55
PETRONET LN	214.4	220.05
P&G HYGIENE	9982.45	9978.45
PIDILITE IN	1098.1	1102.9
STEEL AUTHO	52.25	54.35
SBI LIFE IN	642.95	612.5
SHREE CEMEN	16345.4	16753.85
SIEMENS LTD	1053.55	1052.3
SHRIRAM TRA	1209.95	1192.75
SUN TV NETW	588.9	599.85

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	6.72	7.07
Alphageo	453	473.6
Alu Flouride	120.6	122.65
Amar Raja Bat	744	738.55
And Bank	30.1	30.25
And Cemen	5.85	5.9
And Paper	462.95	453.8
And Petro	68.65	72.15
Anjani Portl	126.55	131.9
Aries Agro Ltd	101	103.05
Aurobindo Ph	756.25	746.35
Avantel Soft	232.55	231.4
Avanti Feeds	379.35	382.85
BN Rathi Sec	27	27.25
Bakelite	23.2	22.2
Balaji Amin	446.75	450.45
Bambino Agro	194	193
Bartronics	7.25	7.48
Bhagira Chem	423.5	425.05
Bhagya Nag	34.35	33.7
Bhaskar Agro	24.35	23.2
Brilliant Sec	1.09	1.14
CIL Securi	16.25	17.9
Color Chip	19.85	18.95
Cont Coffee	267.85	271.85
CoroFert	456.5	453.35
Cosboard Ind	14.97	15.27
Country Club	7.65	7.49
Cubex Tub	15.14	15.01
Cybermate	2.29	2.19
DR Reddy	2600	2570.35
Danlaw Tec	98.7	102.05
DecCement	397	402.15
Divi's Lab	1474.25	1458.7
Divya Granit	86	85
Dolphin Medi	0.74	0.73
Dredgin Corp	451.3	452.95
Empee Sugars	1.37	1.37
Everest Org	115.5	115
Fortune Info	37.5	39.8
Four Soft	43	41.9
Fourth Gen	2.08	1.99
GMR Ferro	1.32	1.38
GMR Infra	16.8	16.05
GVK Power	7.81	7.76
Galada Tele	2.63	2.63
Gati Corpn	83.3	84.15
Gayatri Proj	176	177.05
Gayatri Sugrs	2.9	2.83
Gennex Lab	3.7	3.66
GodavDru	22.95	23.35
Goldstn Tele	233.05	238.45
Goldstone Tech	15.9	16.45
Granules (I)	91	89.25
HBL Nife Pow	28.4	27.95
HYDIndus	1986	1996.3
Heritage Food	525.9	527.15
IDL Industrs	277.15	290
IVRCL Infras	1.02	1.01
Incap	39	39.05
IndoNationl	728.45	719
Infotech En	604	605.55
Invinex Lab	42.15	44.05
JSTL	38	37.7
KCP LTD	89.3	90.45
KNR Constructio	215.25	215.6
Kabsons Indu	6.37	6.37
KakatiCem	196.5	197.45
Kallam Spg	18.45	18.45
Kernex Micro	23.5	23.75
Krebs Bio	111.25	111.95
LGS Global	2.75	2.69
LancoIndus	181.95	181
Lokesh Mach	45.6	45.25
Lotus Choc	24.95	24.5
MIC Elec	1.22	1.28
Madhucon Proje	7	6.92
Maytas Infra	14.9	14.75
Medinova Dia	18	17.15
Mold-tek	45.05	44.05
Moldtek Plastic	264	260.15
Moschip Semi	23.45	23.35
NCCBlue Wat	4.54	4.33
NCLInd	136	136
NETTLINX	51.95	51.8
NMDC Ltd	91.4	94.95
NagarAgrich	27.9	28
NagarAgrite	4.81	5.06
NagarConst	90.55	88.85
Natco Pharma	684.75	693.65
Nava Bh Ventur	116.2	117.8
Neha Inter	4.15	4.31
Neocure Ther	2.5	2.51
Neuland Lab	504	482.4
Nihar Info Glo	13.54	14.25
Nile	383	375
Northgate Tech	0.87	0.91
Oil Country	15.6	15.85
Ortin Lab	15.4	15.15
Padmalaya Tele	2.28	2.4
Panyam Cemen	13.77	13.62
Peeti Securt	4.89	4.88
PennInd	42.3	37.55
PennProf	3.6	3.6
Pitti Lamin	64.8	65.65
Pokarna	156.5	157.55
Prajay Engs	8.71	8.8
PremiExpl	238.4	240.95
Prism Cement	86.1	86.9
Raasi Refrac	12.07	11.5
Ragsan Petro	58.9	56.1
Rain Industries	115.85	119.6
Raj Packagin	26.5	27.05
Ram Informat	39.35	40
RavilGr	14.5	15.25
Reg.Ceramic	3.9	3.72
Restile Cer	3.9	4
Roopa Indus	10.65	11.21
Sagar Cem	671	665
Samkrg Pist	189.5	189.7
Sampre Nutri	40.45	39.95
SangInd	60.3	60.4
Satvah. Ispat	9.63	9.98
Saven Techno	28.2	27.35
Sibar Auto	33.2	34.9
Softsol	37.25	39.2
South Bio Tech	2	2.04
SrRayAlk	35.7	34.25
Srinivasa Ship	47	46
Starchik Sp	23.65	22.55
Sujana Metal	0.39	0.38
Sujana Towers	1.15	1.1
Sujana Univers	0.34	0.34
Surana Tele	4.75	4.7
Suryachakra Pow	0.35	0.36
Suryava Spin	4.97	4.74
SuvarCem	60.7	63
Suven Pharma	226.15	229.5
TCI Finance	14.85	15.2
Taj Gvk Hotel	181	172.8
Tanla Solutions	30.45	30.85
Trans Biotek	3.88	3.7
Transport Co	284.3	282.75
Trendy Knit	0.19	0.19
Usher Agro	2.2	2.25
V&K Soft	4.05	4.1
VBC Ferro	39	40.5
VST Indus	3190	3152.05
Vamshi Rubb	32.9	33.5
Viceroy Hotels	4.62	4.67
VijayGrowth	8.58	9.03
VijayTextil	44.95	44.2
Vimta Labs	289	291.45
Virat Crane	36	33.55
Virinchi Con	81.5	82.25
VisakaInd	426	429.05
Vision Tech	1.26	1.32
Vista Pharma	26.95	28.35
Vivimed Labs	34.6	34.55
Vjil Consult	44	44.1
ZenoTech Lab	36	35.7

నేటి బోర్డ్ మీటింగ్స్

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్), బంధన్ బ్యాంక్, గోవా కార్బన్

బులియన్ రూ.లలో

హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	32,040	▲ 150
బంగారం (22 క్యారెట్లు)	30,510	▲ 140
వెండి (కిలో)	42,500	▲ 400
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	32,550	▲ 50
బంగారం (22 క్యారెట్లు)	30,140	▲ 110
వెండి (కిలో)	40,100	▲ 100

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు	మంగళవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	51.92	$49.78
బ్రెంట్	61.01	$58.72

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 10-01-2019

వరంగల్	455-00
నమక్కల్	445-00
09-01-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	453-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	5.15

జైల్లో జట్టుకట్టి పథకం వేసి..

- చైన్‌స్నాచింగ్ ముఠా గుట్టురట్టు
- సూత్రధారి హైదరాబాద్‌వాసి ప్రణీత్ చౌదరి
- అతడికి నోయిడా జైల్లో పరిచయమైన యూపీ స్నాచర్లు
- డిసెంబర్ ఆఖరి వారంలో రెండు రోజుల్లోనే 11 స్నాచింగ్స్
- ముగ్గురు నిందితుల్ని అరెస్టు చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు



బుధవారం నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంజనీ కుమార్

సాక్షి, హైదరాబాద్: రాజధానిలో గతేడాది డిసెంబర్ ఆఖరివారంలో వరుస గొలుసు చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్రముఠా గుట్టును హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులతోపాటుగా హైదరాబాద్ వాసి చింతమల్ల ప్రణీత్ చౌదరిలు ముఠాగా ఏర్పడి ఈ వరుస గొలుసు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నారు. ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లి డిపోర్టేషన్‌పై తిరిగి వచ్చి నేర జీవితాన్ని ఎంచుకున్న ప్రణీత్ చౌదరే ఈ ముఠాకు సూత్రధారిగా తేల్చారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఈ ముఠా ఆట కట్టించడమే కాకుండా వారినుంచి మొత్తం సొత్తును రికవరీ చేసుకున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ చెప్పారు. తన కార్యాలయంలో ఈ ముఠాకు సంబంధించి పూర్తి వివరాలను బుధవారం ఆయన మీడియాకు వెల్లడించారు. వనస్థలిపురం ప్రాంతానికి చెందిన ప్రణీత్ ఇంజనీరింగ్ చదువు మధ్యలోనే ఆపి బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివేందుకు లండన్‌కు వెళ్లాడు. ముందస్తు సమాచారం లేకుండా భారత్‌కు వచ్చి వెళ్లడంతో ప్రణీత్‌ను అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు డిపోర్టేషన్ పద్ధతిలో తిప్పిపంపేశారు. అప్పట్నుంచి నేరజీవితం ప్రారంభించిన ప్రణీత్ తన వద్ద ఉన్న అమెరికా డాలర్లు మార్పిడి చేసుకోవచ్చంటూ ఆశ చూపించి చాలామందిని మోసం చేశాడు. 2014–15 ఏడాదిలో సరూర్‌నగర్, ఉప్పల్‌తోపాటు నోయిడాలోను పలు నేరాలు చేసి అక్కడి పోలీసులకు చిక్కాడు. 2015లో ప్రణీత్‌పై గ్యాంగ్‌స్టర్ యాక్ట్ ప్రయోగించడంతో రెండున్నరేళ్ల పాటు నోయిడా సెంట్రల్ జైలులో ఉన్నాడు. ఇదే జైలులో స్నాచింగ్స్, దోపిడీ నేరాలతో జైలు శిక్ష అనుభవిస్తున్న యూపీకి చెందిన ఛోకా, మోను వాల్మీకితో ప్రణీత్ చౌదరికి పరిచయమేర్పడింది. జైలు నుంచి బయటకు వచ్చాక అంతర్రాష్ట్ర ముఠాగా ఏర్పడి గొలుసు చోరీలు చేయాలని పథకం వేశారు.

ముందు రెక్కీ...ఆపై చోరీలు

ఎల్బీనగర్ జోన్‌పై ప్రణీత్‌కు మంచి పట్టుండటంతో ప్రధాన రహదారికి ఆనుకుని ఏయే చోట్ల స్నాచింగ్ చేయాలి? ఏ రూట్‌లో పారిపోవాలి అన్న విషయాలు ముందే ఆలోచించి పెట్టుకున్నాడు. గత నెల 24న ఛోకా, మోనులను హైదరాబాద్ రప్పించి కాచిగూడలోని లాడ్జిలో బస ఏర్పాటు చేశాడు. చోరీలు చేసేందుకు ఓఎల్‌ఎక్స్‌లో మలక్‌పేటకు చెందిన సోఫియాన్ నుంచి కేటీఎం బైక్‌ను అద్దెకు తీసుకున్నారు. వీరిద్దరూ దీనిపై, ప్రణీత్ పల్సర్ బైక్‌పై తిరుగుతూ గతనెల 24, 25 తేదీల్లో రెక్కీలు నిర్వహించారు. 26 సాయంత్రం ప్రణీత్ లాడ్జిలోనే ఉండిపోగా.. ఛోకా, మోనులిద్దరూ సాయంత్రం 4.40 నుంచి రాత్రి 8.55 మధ్య మీర్‌పేట, వనస్థలిపురం, ఎల్బీనగర్, హయత్‌నగర్‌ల్లో 5 గొలుసు చోరీలకు పాల్పడ్డారు. ఆ రాత్రి లాడ్జిలో ఉండి మరుసటి రోజు ఉదయం 7 నుంచి 7.40 వరకు చైతన్యపురి, వనస్థలిపురం, హయత్‌నగర్‌ల్లో 5 స్నాచింగ్స్ చేసి తిరిగి లాడ్జికి వెళ్లిపోయారు. అదేరోజు వాహనాన్ని భవానీనగర్ ఠాణా పరిధిలో వదిలేసి ముగ్గురూ కలిసి ఉత్తరాదికి పారిపోయారు.

దారి చూపిన గూగుల్ పే

ఈ కేసులన్నీ రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో జరిగినప్పటికీ హైదరాబాద్ పోలీసులూ అప్రమత్తమయ్యారు. రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్ పోలీసులు సీసీ కెమెరాల్లో రికార్డయిన ఫీడ్‌తో పాటు ఇతర ఆధారాలను పరిశీలించారు. స్నాచర్లు ఉత్తరాదికి చెందిన వారుగా తేలడంతో తమ పరిధిల్లోని లాడ్జీల్లో ఆరా తీయగా... కాచిగూడలోని ఓ లాడ్జీలో వీరి వివరాలు దొరికాయి. లాడ్జి యజమానికి డబ్బు చెల్లించేందుకు ప్రణీత్ తన గూగుల్ పే యాప్‌ను వాడటంతో అడ్డంగా దొరికిపోయాడు. దుండగుల కోసం ఉత్తరాదిలో గాలించిన పోలీసులకు నిరాశే ఎదురైంది. అయితే మళ్లీ నేరాలు చేసేందుకు వీరు నగరానికి రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. భవానీనగర్ పరిధిలో ఇద్దరు స్నాచర్లు పల్సర్‌పై తిరుగుతూ పోలీసులకు చిక్కడంతో వారిద్వారా లాడ్జిలో ఉన్న ప్రణీత్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి బంగారాన్ని రికవరీ చేశారు. వాహనాలతో పాటుగా చోరీ ప్రయత్నంలో ఎవరైనా అడ్డుకుంటే అంతం చేయడానికి ఉంచుకున్న ఓ కత్తినీ ఛోకా నుంచి స్వాధీనం చేసుకున్నారు. వీరికి బైక్ అద్దెకు ఇచ్చిన సోఫియాన్ పైనా విచారణకు నిర్ణయించారు. వీరిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని అధికారులు యోచిస్తున్నారు. తదుపరి చర్యల నిమిత్తం స్నాచర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు రాచకొండ అధికారులకు అప్పగించారు.

ప్రముఖ రిసార్ట్ సీఎండీ అరెస్టు

రూ.13.81 కోట్ల జీఎస్టీ ఎగ్గొట్టిన వైనం

సాక్షి, హైదరాబాద్: వస్తుసేవల పన్ను (జీఎస్టీ) అధికారుల వలలో మరో భారీ చేప పడింది. రిసార్ట్‌లో వివిధ రకాల సేవలు ఉపయోగించుకునే సందర్శకులు, అతిథుల నుంచి జీఎస్టీ వసూలు చేసి, ప్రభుత్వానికి ఆ పన్నులు కట్టకుండా ఎగ్గొట్టిన ఓ ప్రముఖ రిసార్ట్ సీఎండీని అరెస్టు చేసి ఈ నెల 18 వరకు రిమాండ్‌కు తరలించారు. దారి మళ్లిస్తున్న రూ.13.81 కోట్ల పన్నులో రూ.2.27 కోట్లను రికవరీ చేశారు. అంతేకాకుండా రిసార్ట్‌కు చెందిన 5 బ్యాంకు ఖాతాలను జీఎస్టీ అధికారులు అటాచ్ చేశారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ శివార్లలో పేరొందిన రిసార్ట్‌కు వెళ్లే సందర్శకులు, అతిథుల నుంచి పెద్ద ఎత్తున జీఎస్టీ వసూలు చేస్తున్నారు. ఆ పన్నును 2017, జూలై నుంచి సదరు రిసార్ట్ యజమాని ప్రభుత్వానికి చెల్లించడం లేదు. అప్పటి నుంచి ఎలాంటి రిటర్నులు ఫైల్ చేయకుండా పన్ను మొత్తాన్ని దారి మళ్లిస్తున్నారు. జీఎస్టీ నిబంధనల ప్రకారం 3 నెలల పాటు వరుసగా పన్ను చెల్లించని మొత్తం రూ.5 కోట్లు దాటితే నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. కేసు నమోదు చేసి విచారణ జరిపిన అనంతరం సదరు సంస్థ యజమానిని అరెస్టు చేయవచ్చు. దీంతో ఆ రిసార్ట్ సీఎండీని జీఎస్టీ అధికారులు విచారించగా పన్ను ఎగవేస్తున్నట్టు అంగీకరించడంతో అతడిని అరెస్టు చేశారు.

‘ఆమె’కు మరింత భరోసా!

ప్రతి కార్యాలయంలో ‘షీ బాక్సుల’ ఏర్పాటుకు నిర్ణయం

- పనిచేసేచోట లైంగిక వేధింపులకు ఇక చెల్లు
- వెబ్‌సైట్, యాప్ ద్వారా ఆన్‌లైన్ ఫిర్యాదులు తీసుకునేలా చర్యలు
- ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించేలా ప్రత్యేక విభాగం
- నెలాఖరు నుంచి అందుబాటులోకి తేనున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ



సాక్షి, హైదరాబాద్: మహిళలు పనిచేసేచోట మరింత భద్రత కల్పించేలా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముందడుగు వేసింది. ‘సెక్సువల్ హరాస్‌మెంట్ ఆఫ్ వుమెన్ ఎట్ వర్క్‌ప్లేస్’చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఉపక్రమించింది. ఇప్పటివరకు ఈ చట్టం కింద ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉండగా, ఇకపై ఆన్‌లైన్ ద్వారా వినతులు స్వీకరించే వ్యవస్థను అందుబాటులోకి తెస్తోంది. మాన్యువల్ పద్ధతిలో ఫిర్యాదు చేయడంలో ఉన్న ఇబ్బందుల వల్ల ఎక్కువ మంది మహిళలు ఫిర్యాదు చేసేందుకు ముందుకొచ్చేవారు కాదు. ఫిర్యాదు చేయకుండా వేధింపులను సహిస్తూ వస్తున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో ఈ పరిస్థితిని అధిగమిస్తూ ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచేలా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కొత్త ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. ప్రతి కార్యాలయంలో షీ బాక్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటిని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలే నిర్వహించనున్నాయి. ఈ పెట్టె ద్వారా వచ్చే ఫిర్యాదులను క్రమం తప్పకుండా పరిశీలించి పరిష్కరించేలా జిల్లా, డివిజన్ స్థాయిల్లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనుంది. షీ బాక్స్‌లతోపాటు ఆన్‌లైన్ పద్ధతిలో ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేకంగా వెబ్‌పేజీని తెరిచేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రయత్నాలు వేగవంతం చేసింది. అదేవిధంగా ఈ చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేకంగా యాప్‌ను సైతం అందుబాటులోకి తేనుంది. ఇప్పటికే వెబ్‌పేజీ, యాప్‌ల రూపకల్పన పూర్తయింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వచ్చే నెలలో ప్రారంభించేలా ఆ శాఖ సన్నాహాలు చేస్తోంది.

నిర్వహణకు ప్రత్యేక విభాగం

ప్రభుత్వ కార్యాలయాల్లో షీ బాక్స్‌లతోపాటు వెబ్‌పేజీ, యాప్ నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో మహిళా శక్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఈ విభాగంలో ఒక మహిళా సంక్షేమాధికారి, ఇద్దరు సమన్వయకర్తలుంటారు. ఇప్పటివరకు గృహహింస చట్టం సెల్ పర్యవేక్షిస్తున్న సోషల్ కౌన్సిలర్, లీగల్ కౌన్సిలర్లను కోఆర్డినేటర్లుగా నియమించేందుకు ఆ శాఖ నిర్ణయించింది. డీవీ సెల్‌ను సఖి కేంద్రాల్లో విలీనం చేయడంతో అక్కడి సిబ్బందిని మహిళా శక్తి కేంద్రాల్లో కొనసాగించేందుకు ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ఈ కోఆర్డినేటర్లు మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులను గోప్యంగా ఉంచుతూ బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు చట్టపరమైన చర్యలకు సహకరిస్తారు. అదేవిధంగా న్యాయపరమైన సాయం అందిస్తూ చట్టం పట్ల అవగాహన కల్పించి చైతన్యపరుస్తారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక విభాగాలతో పాటు డివిజన్ స్థాయిలోనూ ప్రత్యేకంగా కమిటీలు పనిచేస్తాయి.

ముందు నీ స్థానం ఏంటో తెలుసుకో

ఏపీ సీఎంకు ఎంపీ వినోద్‌కుమార్ హితవు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న ఏపీ సీఎం చంద్రబాబు ముందు ఏపీలో ఆయన స్థానమేంటో తెలుసుకుంటే మంచిదని టీఆర్‌ఎస్ ఎంపీ బి.వినోద్‌కుమార్ హితవు పలికారు. మోదీకి వ్యతిరేకంగా అప్పటికే ఉన్న కూటమిలో చంద్రబాబు చేరారే తప్ప ఆయన సొంతంగా కూటమి ఏర్పాటు చేసిందేమీ లేదని పేర్కొన్నారు. గతంలో ఎన్టీఆర్ ఏర్పాటు చేసిన నేషనల్ ఫ్రంట్‌కు విలువ ఉండేదని, ఇప్పుడు కూటమి పేరుతో చంద్రబాబు చేస్తున్న హడావుడికి అర్థం లేదని విమర్శించారు. అప్పటికే కాంగ్రెస్ కూటమిలో ఉన్న ముఖ్యమంత్రులు, ఇతర పార్టీల నేతలతో చంద్రబాబు తరచూ ఢిల్లీలో సమావేశమవుతూ కూటమిని తానే నడిపిస్తున్నానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల పరిధి 50 శాతానికి మించరాదన్న సుప్రీం కోర్టు తీర్పును కూడా సవరించాల్సిన అవసరం ఉందని వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఏర్పాటయ్యాక రాష్ట్రంలో గిరిజనులు, బీసీ, మైనారిటీల శాతం పెరిగిందన్నారు. అందుకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి బిల్లులు కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్రాలు పంపిన ప్రతిపాదనలను కూడా కేంద్రం ఆమోదించాల్సిన అవసరం ఉందన్నారు.

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు

- ఆర్థిక వెనుకబాటు పాలకుల వైఫల్యమే
- అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ బిల్లుపై చర్చలో ఎంపీ బండ ప్రకాశ్ ముదిరాజ్

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసే అధికారాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలని టీఆర్‌ఎస్ ఎంపీ బండ ప్రకాశ్ ముదిరాజ్ కేంద్రాన్ని కోరారు. అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు కల్పించనున్న రాజ్యాంగ సవరణ బిల్లుపై రాజ్యసభలో బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చేయూత ఇచ్చేందుకు ఉద్దేశించిన బిల్లు ఇదని తెలిపారు. గతంలో వెనుకబాటుతనం అనేది సామాజిక అంశాల్లో విన్నామని తొలిసారి ఆర్థికపరమైన వెనుకబాటుతనం అంశాన్ని వింటున్నామని చెప్పారు. 70 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో కూడా ఆర్థికంగా వెనుకబాటుతనం ఉందని ఈ బిల్లు తెచ్చామంటే అన్నేళ్లపాటు ఈ దేశాన్ని పాలించిన పాలకుల వైఫల్యమేనన్నారు. ముస్లింలకు 12% రిజర్వేషన్లు ఇవ్వాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానించి కేంద్రానికి పంపితే సానుకూలంగా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చాక ముస్లింల జనాభా 12 శాతంగా, ఎస్టీల జనాభా 10 శాతంగా ఉందని, జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించి పార్లమెంటును స్తంభింపజేసినా కేంద్రం స్పందించలేదన్నారు. తెలంగాణ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు ఆయా రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

స్థానిక సంస్థల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు

తెలంగాణలో స్థానిక సంస్థల్లో 50% మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఈబీసీ స్కాలర్ షిప్ అందిస్తున్నామని ముదిరాజ్ తెలిపారు. విదేశాల్లో చదువుకుంటే 20 లక్షల ఫెలోషిప్ అందిస్తున్నామని, గురుకుల పాఠశాలల్లో కూడా ఈబీసీలకు సీటు ఇస్తున్నామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో కూడా రిజర్వేషన్ పాటిస్తోందన్నారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచేందుకు వీలుగా 50 శాతానికి పైగా రిజర్వేషన్లు ఉండేలా తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎస్టీలకు 80 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఈబీసీ రిజర్వేషన్ల అమలులో సామాజిక రిజర్వేషన్లకు అన్యాయం జరగకుండా జాగ్రత్త పడాలని కోరారు.

ఇప్పుడే ఇవ్వలేం

- చెన్నైకి తాగునీటి సరఫరాపై తేల్చిచెప్పిన తెలుగు రాష్ట్రాలు
- కండలేరు నుంచి మార్చిలో ఒక టీఎంసీని విడుదల చేస్తాం



సాక్షి, హైదరాబాద్: చెన్నైకి తాగునీటి కోసం ఇప్పటికిప్పుడు కృష్ణా జలాలను విడుదల చేయలేమని తెలుగు రాష్ట్రాలు తేల్చిచెప్పాయి. చెన్నైకి తాగునీటి సరఫరాకు తక్షణమే రెండు టీఎంసీలను విడుదల చేయాలన్న తమిళనాడు ప్రభుత్వ ప్రతిపాదనను తోసిపుచ్చాయి. కండలేరు రిజర్వాయర్ నుంచి మార్చిలో అప్పటి నీటి లభ్యత ఆధారంగా ఒక టీఎంసీని విడుదల చేస్తామని స్పష్టం చేశాయి. చెన్నైకి తాగునీటి సరాఫరాపై కృష్ణా బోర్డు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ హైదరాబాద్‌లో బుధవారం సమావేశమైంది. బోర్డు చైర్మన్ ఆర్కే జైన్, సభ్య కార్యదర్శి ఎ.పరమేశం, తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్, ఏపీ నుంచి తెలుగుగంగ సీఈ మురళీనాథ్ రెడ్డి, తమిళనాడు జలవనరుల శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఏప్రిల్ 18, 1983 నాటి ఒప్పందం మేరకు..చెన్నైకి తాగునీటి అవసరాల కోసం 15 టీఎంసీలను విడుదల చేయాలని తమిళనాడు అధికారులు వివరించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చెన్నైలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయని..తక్షణమే రెండు టీఎంసీలను విడుదల చేయాలని కోరారు. మహారాష్ట్ర, కర్ణాటకలు వారి వాటా కింద విడుదల చేయాల్సిన పది టీఎంసీలను దిగువకు విడుదల చేయడం లేదని..ఈ నేపథ్యంలో చెన్నైకి 15 టీఎంసీలను ఎలా విడుదల చేస్తామని తెలుగు రాష్ట్రాలు ప్రశ్నించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాటా కింద విడుదల చేయాల్సిన ఐదు టీఎంసీల్లో ఆంధ్రప్రదేశ్ వాటా కింద 3.3, తెలంగాణ వాటా కింద 1.7 టీఎంసీలు విడుదల చేయాలని.. అందులో రెండు రాష్ట్రాలు కలిసి రెండు టీఎంసీలను విడుదల చేయాలని తమిళనాడు కోరింది. ఈ ఏడాది కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో నీటి లభ్యత పూర్తిగా తగ్గిపోయిందని..ఆ మేరకు నీటిని విడుదల చేయలేమని తెలుగు రాష్ట్రాలు తేల్చిచెప్పాయి. మార్చిలో నీటి లభ్యత ఆధారంగా కండలేరు రిజర్వాయర్ నుంచి ఒక టీఎంసీని విడుదల చేయడానికి మాత్రం అంగీకరించాయి.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792